# భారత రాజకీయ ప్రక్రియ

## (రాజనీతి శాస్త్రం)

## బి. ఎ. ద్వితీయ సంవత్సరం

## సెమిష్టర్ –4


**రచయితలు**

**శ్రీ రాయిడి శేషయ్య**
హెచ్.ఒ.డి.(రిటైర్డ్ ),
రాజనీతి శాస్త్రవిభాగం,
వి.ఆర్.ఎస్. అండ్ వై.ఆర్.ఎన్.కళాశాల,
చీరాల.

**డా. కె.రఘునాథ్**
సమన్వయకర్త,
బిఅంబేద్కర్ విశ్వవిద్యాలయం .అర్ .,
పిసిద్ధార్థ కళాశాల .బి ., విజయవాడ.

**శ్రీమతి మెహరున్నీసా బేగం**
అధ్యాపకులు

**శ్రీ టి. భక్తవత్సలం**
ఉపన్యాసకులు,
రాజనీతి శాస్త్రవిభాగం,
టి.జె.పి యస్. కళాశాల,
గుంటూరు.

**శ్రీ పసుమర్తి అప్పారావు**
అధ్యాపకులు,
టి.జె.పి.ఎస్. కళాశాల,
గుంటూరు.

**డా.కె. వి.ఆర్. శ్రీనివాస్**
రాజనీతి శాస్త్రము మరియు
ప్రభుత్వ పాలనా శాస్త్రవిభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

**సంపాదకులు**

**ఆచార్య బి. దోసగిరిరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఎ.యం.యస్.యన్. పి.జి. సెంటర్, కాకినాడ.

**సంచాలకులు**

**డా. నాగరాజు బట్టు**
*ఎం .ఏ.బీ.ఎంహెచ్..ఆర్.ఎం.,ఎం.ఎస్. సి.(సైకాలజీ), ఎల్ .,ఎం.ఎల్.ఎం.ఏ.(సోషియాలజీ), ఎంఇ.. డీ., ఎం.ఫీల్., పిహెచ్.డి.*
దూర విద్యాకేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
నాగార్జున నగర్ – 522 510, గుంటూరు.

**Ph : 0863 - 2346208, 2346222, 2346259 ( Study Material)**
**e-mail : anucdedirector@gmail.com**

# బి. ఎ. ద్వితీయ సంవత్సరం, సెమిష్టర్ – 4
# రాజనీతి శాస్త్రం : భారత రాజకీయ ప్రక్రియ

**తొలి ప్రచురణ : 2023**

**కాపీల సంఖ్య :**

**© ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం**

ఈ పాఠ్య పుస్తకం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని దూర విద్యాకేంద్రం నందు ద్వితీయ సంవత్సరం బి. ఎ. విద్యనభ్యసించున్న విద్యార్థుల కొరకు ప్రత్యేకంగాను మరియు పరిమిత పంపిణికై ఉద్దేశించి ముద్రించబడినది.

**ప్రచురణ కర్త :**
**డా. నాగరాజు బట్టు,**
**సంచాలకులు,**
**దూర విద్యాకేంద్రం,**
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.**

**ప్రచురించినది :**

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు,పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే 'A' గ్రేడ్ ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికిసంతోషిస్తునా .ప్రస్తుతం గుంటూరు , ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలలకు డిప్లమో, డిగ్రీ , పీజీ స్థాయి విద్యా బోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003 –2004 లో దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్లి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక గల గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బీ.కాం., బి. ఎస్ సి. , పీజీ స్థాయిలో ఎం.కామ్., ఎం.ఎస్ సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బీ.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అని సర్టిఫికెట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీవిద్యార్థులు, ఉపాధ్యాయులు, నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి మున్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవన యాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగ అవకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో–ఆర్డినేటర్లకు, అకాడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్**

**ఉపకులపతి**

**ఆచార్యనాగార్జునవిశ్వవిద్యాలయం.**

**B.A. POLITICAL SCIENCE**

**SECOND YEAR**

**FOURTH SEMESTER**

**(Under CBCS w.e.f 2020-21)**

405POL21 -**Course-4 : INDIAN POLITICAL PROCESS**

**Learning Outcomes:**

On successful completion of the course the students will be able to :

- Know and understand the federal system of the country and some of the vital contemporary emerging issues.
- Evaluate the electoral system of the country and to identify the areas of electoral reforms.
- Know the constitutional base and functioning of local governments with special emphasis on $73^{rd}$& $74^{th}$ Constitutional Amendment Acts.
- Understand the dynamics of Indian politics, challenges faced and gain a sensitive comprehension to the contributing factors.
- Apply the knowledge and critically comprehend the functioning of some of the regulatory and governance institutions.
- Propose theoretical outline alternate models

| **UNIT-I :** | **FEDERAL PROCESSES** |
|---|---|
| | 1. Features of Indian Federal System- Centre-State Relations-Legislative, Administrative and Financial |
| | 2. Emerging Trends in Centre-State Relations-Restructuring Centre-State Relations-Recommendations of Sarkaria Commission, M.M.Punchi Commission |

| **UNIT-II :** | **ELECTORAL PROCESSES** |
|---|---|
| | 1. The Election Commission of India, Powers and Functions. |
| | 2. Issues of Electoral Reforms, Voting Behaviour-Determinants and |

| | |
|---|---|
| | Problems of Defections. |

| UNIT-III : | GROSSROOT DEMOCRACY-DECENTRALISATION |
|---|---|
| | 1. Panchayat Raj system-Local and Urban Governments-Structure, Powers and Functions. |
| | 2. Democratic Decentralization-Rural Development and Poverty alleviation with reference to $73^{rd}$ and $74^{th}$ Constitutional Amendment Acts, Challenges and Prospects. |

| UNIT-IV : | SOCIAL DYNAMICS AND EMERGING CHALLENGES TO INDIAN POLITICAL SYSTEM |
|---|---|
| | 1. Role of Caste, Religion, Language and Regionalism in India. |
| | |

| UNIT-V : | REGULATORY AND GOVERNANCE INSTITUTIONS |
|---|---|
| | 1. NITI Ayog, Finance Commission, Comptroller and Auditor General of India. |
| | 2. Central Vigilance Commission, Central Information Commission, Lokpal and Lokayukta. |

**REFERENCE BOOKS:**


| | | |
|---|---|---|
| ➢ M.V.Pylee | : | *Indian Constitution*<br>*Constitutional Government in India* |
| ➢ D.D.Basu | : | *An Introduction to the Constitution of India* |
| ➢ Rajni Kothari | : | *Politics in India, Caste in Indian Politics* |
| ➢ PeuGhosh | : | *Indian Government and Politics* |
| ➢ Prof.Lalaiah, P.Venkataramana, K.SaiBaba&K.Mallesam, Prof.V.RaveendraSastry (ed) | : | *Indian Government-Politics* |
| ➢ M.R.Biju | : | *Democratic Political Process* |
| ➢ J.K.Chopra (ed) | : | *Local Self-Government and Municipal Administration* |
| ➢ Susan Bayly | : | *Caste, Society and Politics in India (From the Eighteenth Century to the Modern Age)* |
| ➢ SubharataDutta | : | *Democratic Decentralisation and Grossroot Leadership in India* |
| ➢ H.V.Hande | : | *Dr.B.R.Ambedkar& The Making of the Indian Constitution* |
| ➢ S.K.Sharma&UshaSarma | : | *Politics and Administration in India- A Retrospective Survey* |
| ➢ Hari Prasad Chhetri | : | *Panchayatraj System and Development Planning* |
| ➢ B.C.Fadia | : | *Indian Government and Politics* |
| ➢ UpendraBaxi&Biku Parekh | : | *Crisis and Change in Contemporary India* |
| ➢ M.Lakshmikant | : | *Indian Polity,Governance in India* |
| ➢ N.G.Jayal (ed) | : | *Democracy in India* |
| ➢ Peter Ronald deSouza&E. Sridharan | : | *India's Political Parties* |
| ➢ O.P.Tiwari | : | *Federalism and Centre-State Relations in India* |
| ➢ AthulKohli (ed) | : | *The Success of India's Democracy* |
| ➢ C.B.Raju | : | *Social Justice and the Constitution of India* |
| ➢ V.K.Garg | : | *Caste and Reservation in India* |

| | | |
|---|---|---|
| ➢ U.Baxi | : | *The Indian Supreme Court and Politics*<br>*Parliamentary Procedure, Law Privilege, Practice &Precedents* |
| ➢ VishnooBhagwan&VidyaBhushan | : | *Indian Administration* |
| ➢ S.H.Patil | : | *The Constitution, Government and Politics in India* |

***ANNEXURE***

**CO-CURRICULAR ACTIVITIES**

| |
|---|
| • All Co-curricular activities recommended at Course – I & III |
| • A Field Visit to a Court / District Jail / Local Government Office to observe the structure and functioning |
| • Viva voce interviews. |
| • Computerised adaptive testing, literature surveys and evaluations. |
| • Encouragement to students to contribute articles to the magazines and seminars |

**MODEL QUESTION PAPER** **(405POL21)**

# B. A. Degree Examination

**Second Year – Fourth Semester**

**Part – II : Political Science**

**Paper – IV : INDIAN POLITICAL PROCESS**

**Time : Three hours** **Maximum Marks : 70**

## Section – A

**Answer any FIVE questions.** **(5 x 4 = 20 Marks)**

1) M.M. Punchi commission.

M. M. పంచి కమిషన్.

2) Explain the structure of Urban Government.

పట్టణ ప్రభుత్వ నిర్మాణము వివరింపుము.

3) Parliamentary Government.

పార్లమెంటరీ ప్రభుత్వం.

4) Explain the role of caste in India.

భారత్ దేశంలో కులము యొక్క పాత్రను వివరింపుము.

5) Explain the NITI AYOG.

నీతి ఆయోగ్ ను వివరింపుము.

6) Explain the recommendations of Sarkaria commission.

సర్కారియా కమిషన్ సిఫారసులను వివరించండి.

7) Explain the Central Information Commission.

కేంద్ర సమాచార కమిషన్ గురించి వివరింపుము.

8) Write about the 73rd Constitution Amendment.

73 వ రాజ్యాంగ సవరణ గురించి వ్రాయండి.

9) CVC – (Central Vigilance Commission).
కేంద్ర నిఘా విభాగం.

10) Finance Commission.
ఆర్థిక సంఘం.

**Section – B** **(5 x 10 = 50 Marks)**

**Answer any FIVE of the following.**

11) Explain the features of Indian Federal system.
భారత సమాఖ్య వ్యవస్థ లక్షణాలను వివరింపుము.

12) Explain Centre – State relations.
కేంద్ర రాష్ట్ర సంబంధాలను వివరింపుము.

13) Analyse the functions of Election Commission.
ఎన్నికల సంఘం విధులను విశ్లే షించుము. .

14) Write about electoral reforms in India.
భారత దేశములో ఎన్నికల సంస్కరణలు గురించి వ్రాయండి.

15) Explain the powers and functions in local government.
స్థానిక ప్రభుత్వాల యొక్క అధికారాలు, విధులను వివరింపుము.

16) What are the determinant factors of voting behavior?
ఓటింగ్ యొక్క ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలు ఏవి?

17) Explain the role of language and regionalism in India.
భారత దేశములో భాష మరియు ప్రాంతీయ వాదం పాత్రను గురించి వివరింపుము.

18) Analyse political reservation system in India.
భారత దేశములో రాజకీయ రిజర్వేషన్ వ్యవస్థను విశ్లే షించుము. .

19) Explain the powers and functions of the Comptroller and Auditor General of India.
భారత కాంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ యొక్క అధికారాలు, విధులు వివరింపుము.

20) Write about the Lokpal and Lokayukta.
లోక్ పాల్ మరియు లోకాయుక్త గురించి వ్రాయుము.

-----------------

# విషయ సూచిక


| పాఠం సంఖ్య | పాఠం పేరు | పేజి సంఖ్య నుండి | వరకు |
|---|---|---|---|
| 1 | సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాలు | 1.1 – | 1.7 |
| 2 | కేంద్ర రాష్ట్ర సంబంధాలు (శాసన, కార్యని ర్వాహక మరియు ఆర్థిక) | 2.1 – | 2.13 |
| 3 | కేంద్ర రాష్ట్ర సంబంధాలు | 3.1 – | 3.24 |
| 4 | ఎన్నికల సంఘము | 4.1 – | 4.4 |
| 5 | ఎన్నికల ధోరణులు – వోటింగ్ ప్రవర్తన | 5.1 – | 5.10 |
| 6 | పంచాయతీరాజ్ వ్యవస్థ | 6.1 – | 6.23 |
| 7 | పట్టణ స్థానిక సంస్థలు | 7.1 – | 7.26 |
| 8 | భారత రాజకీయాలపై భాష, మత , కుల మరియు ప్రాంతీయవాద ప్రభావం | 8.1 – | 8.7 |
| 9 | ఆర్థిక సంఘము | 9.1 – | 9.5 |
| 10 | కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ | 10.1 – | 10.5 |
| 11 | కేంద్రీయ సత్కరత ఆయోగ్ (కేంద్ర నిఘా కమిషన్) (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్) | 11. 1 – | 11.9 |
| 12 | లోక్ పాల్, లోకాయుక్త | 12. 1 – | 12.8 |

పాఠం -1

# సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాలు

## 1.0. లక్ష్యం :

సమాఖ్య, ఏకకేంద్ర తరహా ప్రభుత్వాలను వివరించుట; వీటి మధ్యగల తేడాలను విశదపరచటం; పై రెండు ప్రభుత్వాలలోగల ప్రయోజనాలను లోపాలను విశదీకరించటం.

## 1.1 విషయక్రమం :


1.2 సమాఖ్య ప్రభుత్వము

1.3 సమాఖ్య ప్రభుత్వ నిర్వచనాలు

1.4 సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు

1.5 సమాఖ్య ప్రభుత్వ ప్రయోజనాలు

1.6 సమాఖ్య ప్రభుత్వ లోపాలు

1.7 ఏకకేంద్ర ప్రభుత్వము - అర్థము

1.8 ఏక కేంద్ర ప్రభుత్వ నిర్వచనాలు

1.9 ఏక కేంద్ర ప్రభుత్వ లక్షణాలు

1.10 ఏక కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు

1.11 ఏక కేంద్ర ప్రభుత్వ లోపాలు

1.12 సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మధ్యగల తేడాలు

1.13 సారాంశము


## 1.2 సమాఖ్య ప్రభుత్వము

" ఒక రాజ్యంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు కొన్ని రాష్ట్ర లేక ప్రాంతీయ ప్రభుత్వములను నెలకొల్పి కేంద్ర, రాష్ట్రాల మధ్య రాజ్యాంగబద్ధంగా అధికార విభజన చేయబడితే దానిని సమాఖ్య రాజ్యం అనవచ్చును." సమాఖ్య అనే పదానికి సమానమైన ఆంగ్లపదం "ఫెడరల్". ఈ ఆంగ్ల పదము 'ఫొడస్' అనే లాటిన్ పదం నుండి గ్రహించబడింది. ఫొడస్ అనగా ఒడంబడిక లేక ఒప్పందము అని అర్థము. ఆర్థికంగా, సైనికంగా బలహీనంగా ఉన్న కొన్ని ఇరుగు , పొరుగు రాజ్యాలు తమ ప్రగతికి, సార్వభౌమాధికారాన్ని వదలుకొని ఒక నూతన రాజ్యంలో శాశ్వత భాగాలుగా ఉండటానికి ఒప్పందం కుదుర్చు కోవడం ద్వారా సమాఖ్య రాజ్యం ఏర్పడుతుంది.

## 1.3. నిర్వచనాలు :

1. హామిల్టన్ : "కొన్ని రాజ్యాల కలయిక వలన ఏర్పడిన కొత్త రాజ్యమే సమాఖ్య రాజ్యము"

2. A.V. డైసీ : "ప్రాంతీయ ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య అధికార విభజన ఫలితంగా వాటి వాటి పరిధులలో నిర్ణయాలు తీసుకొని, ఆయా ప్రభుత్వాలు స్వతంత్రంగా వ్యవహరించు విధానమే సమాఖ్య."

సమాఖ్య రాజ్యాలకు ఉదాహరణ : అమెరికా, స్విట్జర్‌లాండ్, ఇండియా, కెనడా, ఆస్ట్రేలియా మొదలగునవి ముఖ్య సమాఖ్య రాజ్యాలు.

## 1.4. సమాఖ్య లక్షణాలు

**1. 4. 1. రెండు స్థాయిలలో ప్రభుత్వాలు :** ఫెడరల్ విధానంలో రెండు స్థాయిలలో అనగా కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వాలు నెలకొల్పబడుతాయి. ఉదా: అమెరికాలో వాషింగ్టన్ రాజధానిగా ఒక కేంద్ర ప్రభుత్వము, 50 రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పబడ్డాయి.

**1.4. 2. అధికార విభజన :** కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన జరగటం సమాఖ్య రాజ్య ప్రధాన లక్షణము. సమాఖ్య రాజ్యంలోని రాజ్యాంగమే ఈ అధికార విభజన చేస్తోంది. సాధారణంగా జాతీయ ప్రాముఖ్యత కల్గిన దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, కరెన్సీ, రైల్వేలు, తంతితపాల మొదలైనవి కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడతాయి. స్థానిక ప్రాముఖ్యతకల స్థానిక స్వపరిపాలన, వ్యవసాయము, ఆరోగ్యము, విద్య, శాంతిభద్రత మొదలైనవి రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వబడతాయి.

**1.4. 3. లిఖిత రాజ్యాంగము :** సమాఖ్య రాజ్యము తప్పనిసరిగా లిఖిత రాజ్యాంగాన్ని కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్రాల మధ్యగల అధికార విభజనను స్పష్టం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్మాణం, వాటి విధులు వివరించటానికి ఈ లిఖిత రాజ్యాంగము చాలా అవసరము.

**1.4. 4. పరుష రాజ్యాంగము :** సమాఖ్య రాజ్యము పరుష రాజ్యాంగాన్ని కలిగి ఉండాలి. అనగా రాజ్యాంగ సవరణ పద్ధతి కష్టతరంగా ఉండాలి. రాజ్యాంగ సవరణ పద్ధతి సులభంగా ఉంటే కేంద్రం తన ఇష్టానుసారం రాజ్యాంగాన్ని సవరించి రాష్ట్రాల హక్కులను హరించే అవకాశం ఉంటుంది.

**1.4. 5. ఉన్నత న్యాయస్థానము :** సమాఖ్య రాజ్యము స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ఒక ఉన్నత న్యాయస్థానాన్ని లేక సుప్రీమ్ కోర్టును కల్గి ఉండాలి. స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన న్యాయస్థానము కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటి వాటి పరిధులలో పని చేసేటట్లు చూస్తుంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య లేక రాష్ట్రాల మధ్య ఏర్పడే వివాదాలను పరిష్కరిస్తుంది.

**1.4. 6. ద్వంద్వ పౌరసత్వము :** సమాఖ్య రాజ్యాలలోని పౌరులు రెండు పౌరసత్వాలను కలిగి ఉంటారు. ప్రతి పౌరుడు తాను నివసిస్తున్న రాష్ట్రపౌరసత్వము మరియు జాతీయ, లేక దేశ పౌరసత్వాలను కలిగి ఉంటాడు. అమెరికా, స్విట్జర్లాండ్‌లలోని పౌరులు ద్వంద్వ పౌరసత్వాన్ని కలిగి ఉన్నారు.

**1.4. 7. ద్వంద్వ న్యాయశాఖ :** సమాఖ్య రాజ్యము ఒక జాతీయ రాజ్యాంగంతోపాటు రాష్ట్ర రాజ్యాంగాన్ని కూడా కలిగి ఉంటుంది. అనగా సమాఖ్య రాజ్యములోని ప్రతిరాష్ట్రం ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని కల్గి ఉంటుంది. ఉదా: అమెరికాలో అమెరికా రాజ్యాంగంతోపాటు 50 రాష్ట్ర రాజ్యాంగాలు కూడా ఉన్నాయి.

**1.4. 8. పార్లమెంటులోని ఎగువసభలో రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యము :** పార్లమెంటులోని ఎగువ సభలో సమాన సంఖ్యలో రాష్ట్రాలు ప్రాతినిధ్యాన్ని కలిగి ఉండడం సమాఖ్య రాజ్య మరో లక్షణం. ఉదా: అమెరికా కాంగ్రెస్‌లో (పార్లమెంటులోని) ఎగువసభను సెనెట్ అంటారు. ఈ సభకు అమెరికాలోని ప్రతిరాష్ట్రము ఇద్దరు సభ్యులను ఎన్నుకొంటుంది. దీనిని బట్టి సెనేట్‌లో మొత్తం సభ్యుల సంఖ్య - 50 × 2 = 100.

## 1.5. సమాఖ్య ప్రభుత్వ ప్రయోజనాలు

**1.5. 1. జాతీయ సమైక్యత, రాష్ట్రాలహక్కుల సమన్వయము :** A.V డైసీ అభిప్రాయంలో సమాఖ్య రాజ్యము జాతీయసమైక్యతను, రాష్ట్రాలహక్కులను సమన్వయపరుస్తుంది. రాష్ట్రాలు ఒకవైపు తమకు రాజ్యాంగబద్ధముగా లభించిన అధికారాలను అనుభవిస్తూ మరొక వైపు జాతీయ సమైక్యతకు కృషి చేస్తాయి. ప్రతి రాష్ట్రం సమాఖ్య రాజ్యంలో భాగమే.

1.5. 2. పెద్ద రాజ్యాలకు ప్రయోజనకారి : సమాఖ్య విధానము అమెరికా, ఇండియా వంటి పెద్ద రాజ్యాలకు ప్రయోజనం. వివిధ భాషలు, మతాలు, ఆచారాలు కలిగిన ప్రజల మధ్య సహజీవనం పెంపొందించటానికి సమాఖ్య విధానం తోడ్పడుతుంది. K.C వేర్ దృష్టిలో, "భిన్నత్వంలో ఏకత్వానికి, ఏకత్వంలో భిన్నత్వానికి చిహ్నంగా నిలబడేదే సమాఖ్య విధానము".

1.5. 3. ప్రాంతీయ అవసరాల పరితృప్తి : సమాఖ్య రాజ్యంలో ప్రాంతీయ అవసరాలు త్వరితంగా తీర్చబడతాయి. ఈ విధానంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలలో రాష్ట్రప్రభుత్వాలు పనిచేయటం వలన ప్రాంతీయ అవసరాలు వెనువెంటనే పరిష్కరించబడేందుకు అవకాశం ఉంటుంది.

1.5. 4. ప్రపంచ రాజ్య ఆశయం : ప్రపంచ రాజ్యాన్ని లేక ప్రపంచ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే, వేల్స్ వంటి రచయితల ఆశయం నెరవేరడానికి సమాఖ్య విధానాన్ని నాందిగా పేర్కొనవచ్చును.

1.5. 5. నూతనప్రయోగాలు చేపట్టడానికి అవకాశం : పరిపాలన, శాసన, ఆర్థిక విషయాలలో నూతన ప్రయోజనాలను చేపట్టడానికి సమాఖ్య విధానము అనువైంది. ఒక రాష్ట్రంలో ప్రవేశపెట్టబడిన నూతన ప్రయోగం సత్ఫలితాలను ఇస్తే దాన్ని దేశమంతటికి విస్తరింప చేయవచ్చు. ఉదా: ఇండియాలో పంచాయితీరాజ్ వ్యవస్థను మొదట రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రవేశపెట్టి తర్వాత దానిని అన్ని రాష్ట్రాలకు వ్యాప్తి చేయడం జరిగింది. ఒక రాష్ట్రంలో క్రొత్తగా ప్రవేశపెట్టబడిన ప్రయోగము విఫలమైతే అంతటితో దానికి స్వస్తి పలకవచ్చు.

1.5.6. నిరంకుశత్వ నిరోధము : సమాఖ్య విధానము కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని నిరోధించ గలుగుతుంది. ఈ విధానంలోని అధికార విభజన కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని పరిమితం చేస్తుంది.

1.5. 7. కేంద్ర ప్రభుత్వ భారం తగ్గింపు : సమాఖ్య విధానంలోని రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా కొన్ని అధికారాలు ఇవ్వబడుట వలన కేంద్ర ప్రభుత్వ బరువు బాధ్యతలు తగ్గుతాయి. కొన్ని సమస్యలపై కేంద్రం తన దృష్టిని సారించకుండా ఉండేందుకు వీలౌతుంది.

1.5. 8. స్వపరిపాలనకు ప్రోత్సాహం : సమాఖ్య రాజ్యంలో అనేక రాష్ట్రప్రభుత్వాలు నెలకొల్పబడతాయి. దేశంలో వివిధ ప్రభుత్వాలు ఉండటంవలన స్వపరిపాలనకు ప్రోత్సాహం ఉంటుంది. ఒక రాష్ట్రపాలనా విధానంలో ఆ రాష్ట్రంలోని వారే పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.

1.5. 9. బలహీనరాజ్యాలకు ప్రయోజనకారి : రాజకీయంగా, ఆర్థికంగా బలహీనంగా ఉన్న రాజ్యాలకు సమాఖ్య విధానము ప్రయోజనకారి. అటువంటి రాజ్యాలు సమాఖ్యలో భాగాన్ని పొంది తన సమస్యలను పరిష్కరించుకోవచ్చు. ఉదా : 1976 లో సిక్కిం అనే రాజ్యం స్వచ్ఛందంగా భారత సమాఖ్యలో చేరి ఇండియాలో 22 వ రాష్ట్రంగా పరిగణించబడుతున్నది.

## 1.6. సమాఖ్య ప్రభుత్వ లోపాలు

1.6. 1. వివాదాలు : సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లేక రాష్ట్రాల మధ్య వివాదాల ఏర్పడవచ్చు. ఉదా: అమెరికాలో అబ్రహాంలింకన్ దేశాధ్యక్షుడుగా ఉన్నప్పుడు (1860-65) బానిసత్వ నిర్మూలన విషయమై ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య పెద్ద అంతర్యుద్ధం జరిగింది. నేడు ఇండియాలో వివిధ రాష్ట్రాల మధ్య నదీజలాల వివాదాలు, సరిహద్దు వివాదాలు కలవు.

1.6. 2.అధిక వ్యయం : సమాఖ్య విధానంలో ఒక కేంద్ర ప్రభుత్వంతో పాటు అనేక రాష్ట్రప్రభుత్వాలు పనిచేస్తుంటాయి. ఈ విధానంలో అనేక ప్రభుత్వాలు పనిచేయవలసి ఉన్నందువల్ల పాలనా సంబంధమైన వ్యయం చాలా ఎక్కువగా ఉంటుంది.

1.6. 3. జాప్యం : సమాఖ్య విధానంలో నిర్ణయాలు తీసుకోవడంలోను రాజ్యాంగ సవరణ విషయంలోను జాప్యం ఉంటుంది. వివిధ పాలనా విషయాలలో కేంద్రం రాష్ట్రాలను, రాష్ట్రాలు కేంద్రాన్ని సంప్రదించవలసి ఉండటమే ఇందుకు కారణము.

**1.6. 4. పరిపాలనా సమైక్యత ఉండదు :** సమాఖ్య విధానంలో పాలనా సమైక్యత, శాసన సమైక్యత ఉండవు. ఉదా: ఇండియాలోని గుజరాత్ రాష్ట్రంలో మద్యపాన నిషేదం అమలులో ఉంటే దాని పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలో అమలులో లేదు. అలాగే ఇండియాలో వివిధ రాష్ట్రాల ఉద్యోగుల వేతనాలలో, పదవీ విరమణ, వయసులో తేడా కలదు.

**1.6. 5. వేర్పాటు ధోరణి :** సమాఖ్య రాజ్యంలోని కొన్ని రాష్ట్రాలు ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తిని కోరుతూ వేర్పటు ధోరణిని ప్రదర్శించే అవకాశం ఉంది. ఉదా : ఇండియాలో పంజాబ్ రాష్ట్రంలోని ఉగ్రవాదులు 1980 నుంచి తమ రాష్ట్రాన్ని ప్రత్యేక ఖలిస్థాన్‌గా ఏర్పాటు చేయాలని ఆందోళన జరుపుతున్నారు.

**1.6. 6. ప్రాంతీయ సంకుచితత్వము :** సమాఖ్య రాజ్యంలోని రాష్ట్రాలు కొన్ని సందర్భాలలో ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించే అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ సమస్యలను నిర్లక్ష్యం చేసి తమ రాష్ట్ర లేక ప్రాంతీయ సమస్యలకు అధిక ప్రాధాన్యమిస్తాయి.

**1.6. 7. సమాఖ్య రాజ్య నిర్మాణము కష్టము :** సమాఖ్య రాజ్య నిర్మాణము వ్యయ ప్రయాసలతో కూడుకున్నది. ఇందులో కేంద్రంతో పాటు అనేక రాష్ట్ర ప్రభుత్వాలను నెలకొల్పవలసి ఉన్నందువల్ల దాని నిర్మాణం కష్టం. సమాఖ్య రాజ్యానికి రాజ్యాంగాన్ని తయారు చేసే రాజ్యాంగ నిర్మాతల పనికూడా చాలా క్లిష్టంగా ఉంటుంది.

**1.6. 8. బలహీన కేంద్ర ప్రభుత్వము :** ఈ విధానంలో కేంద్రము బలహీనంగా ఉంటుంది. పూర్తి అధికారాలన్నింటిని అది చెలాయించలేదు. రాజ్యాంగ బద్ధంగా కొన్ని అధికారాలను రాష్ట్రాలకు బదలాయించడం వలన కేంద్రం బలహీనమవుతుంది.

## 1.7. ఏక కేంద్ర రాజ్యము (లేక) యూనిటరీ రాజ్యము

ఏక కేంద్ర రాజ్యంలో రాజ్యాధికారమంతా ఒకే ప్రభుత్వం చెలాయిస్తుంది. అనగా ఏక కేంద్ర రాజ్యంలో రాజ్యానికంతా ఒకే ప్రభుత్వం నెలకొల్పబడి ఉంటుంది.

జపాన్, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ మొదలయినవి ప్రముఖ ఏక కేంద్ర రాజ్యాలు.

## 1.8. నిర్వచనాలు

1. డైసీ : "ఒకే కేంద్ర ప్రభుత్వం చేత సర్వోన్నత శాసనాధికారములు చెలాయించబడే ప్రభుత్వ విధానమే ఏకకేంద్ర రాజ్యము".
2. విల్లోబి : "ఏక కేంద్ర విధానంలో సర్వాధికారాలు కేంద్ర ప్రభుత్వానికే చెందుతాయి తరువాత కేంద్ర ప్రభుత్వమే అధికారాలను తన ఇష్టం వచ్చినట్లు ప్రాంతీయ ప్రభుత్వాలకు అప్పచెబుతుంది."

## 1.9. ఏకకేంద్ర ప్రభుత్వ లక్షణాలు

1.9. 1. ఏక కేంద్ర రాజ్యంలో ఒకే కేంద్ర ప్రభుత్వం నెలకొల్పబడి ఉంటుంది. అది ప్రభుత్వాధికారాలన్నింటిని నిరాటంకంగా చెలాయిస్తుంది.

1.9. 2. ఏక కేంద్ర విధానంలో రాష్ట్రాలుండవు. ఐతే పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని స్థానిక ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అటువంటి స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ బద్ధమైన అధికారాలుండవు. కేంద్ర ప్రభుత్వం దత్తము చేసిన అధికారాలను మాత్రమే అది చెలాయిస్తుంది. ఈ స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయుటానికి లేక రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి పూర్తి అధికారాలుంటాయి.

1.9. 3. ఏకకేంద్ర రాజ్యాంగం లిఖితం కావచ్చు లేదా అలిఖితం కావచ్చు. ఉదా : ఏక కేంద్ర రాజ్యాలైన ఫ్రాన్స్ లిఖిత రాజ్యాంగాన్ని, ఇంగ్లాండ్ అలిఖిత రాజ్యాంగాన్ని కల్గి యున్నాయి.

1.9.4. ఏక కేంద్ర రాజ్యాంగం పరుషంగా ఉండవచ్చు, లేదా సరళంగా ఉండవచ్చు. ఉదా: ఏక కేంద్ర రాజ్యాలైన ఐర్లండ్ పరుష రాజ్యాంగాన్ని, ఇంగ్లండ్ సరళ రాజ్యాంగాన్ని కలిగి యున్నాయి.

1.9.5. ఏక కేంద్ర రాజ్యములో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఉన్నత న్యాయస్థానం ఉండాలనే నియమం లేదు. ఉదా : ఇంగ్లండ్‌లో పార్లమెంటు లోని ఎగువసభయైన ప్రభువుల సభ (లార్డ్స్ సభ) దేశానికంతటికి అత్యున్నత న్యాయస్థానంగా పనిచేస్తుంది. అంతేకాని అమెరికా, ఇండియాలో వలె సుప్రీంకోర్టు లేదు.

1.9.6. ఏక కేంద్ర రాజ్యాలలో పౌరులకు ఒకే పౌరసత్వముంటుంది.

## 1.10. ఏక కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు

1.10.1. పరిపాలనా సమైక్యత : ఏక కేంద్ర ప్రభుత్వంలో ఒకే కేంద్ర ప్రభుత్వం మొత్తం దేశాన్ని పరిపాలిస్తుంది. అందువలన దేశమంతటికి ఒకే పాలనా విధానం అమలులో ఉంటుంది. ఒకే శాసనం దేశ వ్యాప్తంగా ఒకే విధంగా అమలు చేయబడుతుంది.

1.10.2. శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వం : ఏక కేంద్ర విధానంలో అన్ని అధికారాలు ఒకే కేంద్రం ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించబడటం వలన అది అతి శక్తివంతంగా ఉంటుంది. దేశంలో అంతరంగిక శాంతిభద్రతలు కాపాడటంలో, విదేశీ దండయాత్రలను ఎదుర్కొనడంలో సమర్ధవంతంగా పనిచేసి దేశాన్ని ఒక తాటిపైన నడిపించగలుగుతుంది.

1.10.3. వివాదాలకు చోటు లేదు : ఏక కేంద్ర విధానంలో రాజ్యానికంతటికి ఒకే ప్రభుత్వం ఉంటుంది. అధికార విభజన అనే ప్రసక్తి ఈ రాజ్యంలో లేదు. అందువలన వివాదాలకు ఏమాత్రం చోటు లేదు.

1.10.4. నిర్మాణము సులభము : ఏక కేంద్ర రాజ్య నిర్మాణం చాలా సులభం. ఒకే కేంద్ర ప్రభుత్వాన్ని నెలకొల్పటమే ఇందుకు కారణం. ఏక కేంద్రానికి రాజ్యాంగాన్ని తయారుచేసే రాజ్యాంగ సభ పనికూడా తేలిక అవుతుందని విలోబి అభిప్రాయపడ్డారు.

1.10.5. తక్కువ వ్యయం : ఏకకేంద్ర రాజ్యంలో ఒకే శాసనసభ, ఒకే కార్యం ఉంటాయి. అందువలన ప్రభుత్వ నిర్మాణంలో పరిపాలనలో వ్యయం చాలా తక్కువగా ఉంటుంది.

1.10.6. త్వరిత నిర్ణయాలు : దేశం మొత్తానికి ఒకే ప్రభుత్వం, ఒకే శాసనసభ ఉండటం వలన నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం ఉండదు. క్లిష్ట పరిస్థితులలో త్వరిత నిర్ణయాలను తీసుకొని సమస్యలను పరిష్కరించడం సాధ్యమవుతుంది.

1.10.7. చిన్న రాజ్యాలకు ప్రయోజనకరం: భౌగోళికంగా జనాభారీత్యా చిన్న రాజ్యాలకు ఏక కేంద్రవిధానం అనువైంది. జపాన్, ఇంగ్లండ్, స్వీడన్, ఇటలీ మొదలగు చిన్న రాజ్యాలు ఏక కేంద్ర విధానాన్ని అవలంబిస్తున్నాయి.

## 1.11. లోపాలు

1.11.1. కేంద్ర ప్రభుత్వ పాలనా భారం పెరుగుతుంది : ఏకకేంద్ర రాజ్యంలో అధికారాలన్నీ ఒకే ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించబడతాయి. అన్ని పాలనాంశాలను కేంద్ర ప్రభుత్వమే నిర్వహించటం వలన దాని పాలనా భారం ఎక్కువ అవుతుంది. కొన్ని పాలనాంశాలను పని ఒత్తిడి వలన విస్మరించడం లేక అశ్రద్ధ చేయడం జరుగుతుంది.

1.11.2. పెద్ద దేశాలకు అనువైనది కాదు : ఏక కేంద్ర ప్రభుత్వ విధానం ఇండియా వంటి పెద్ద రాజ్యాలకు ఏమాత్రం ఉపయోగకరం కాదు.

1.11.3. కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వం : ఏకకేంద్ర విధానంలో అధికారాలన్నీ ఒకే కేంద్ర ప్రభుత్వం చేతిలో కేంద్రీకరించబడతాయి. సర్వాధికారాలుకల్గిన కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించుటకు అవకాశం ఉంటుంది.

1.11.4. స్థానిక సమస్యల నిర్లక్ష్యం : ఏకకేంద్ర విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలుగాని, అధికార విభజనగాని ఉండదు. దేశంలో ఏక ప్రభుత్వం అన్ని ప్రాంతాల సమస్యలను సమర్ధవంతంగా పర్యవేక్షించలేదు. అనగా స్థానిక సమస్యలు నిర్లక్ష్యం చేయబడతాయి.

**1.11.5. స్థానిక స్వపరిపాలనకు ప్రోత్సాహం ఉండదు :** ఏకకేంద్ర ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనను ప్రోత్సహించదు. "గార్నర్" అభిప్రాయంలో ఏకకేంద్ర ప్రభుత్వం స్థానిక స్వపరిపాలనను, ప్రజా చొరవను నశింపజేస్తుంది. స్థానిక ప్రభుత్వాల ప్రతిపత్తిని నాశనం చేస్తుంది.

**1.11.6. ప్రపంచ ప్రభుత్వ ఆశయానికి విరుద్ధము :** ప్రపంచ ప్రభుత్వాన్ని నెలకొల్పాలనే రాజనీతిజ్ఞుల ఆశయం ఏకకేంద్ర ప్రభుత్వ విధానంలో సిద్ధించే అవకాశం లేదు.

## 1.12. ఏక కేంద్ర మరియు సమాఖ్య రాజ్యాల మధ్య తేడాలు

రాజ్య నిర్మాణం అధికార విభజనను బట్టి రాజ్యాలను రెండు విధాలుగా విభజింపవచ్చును. అవి 1) ఏక కేంద్ర రాజ్యము 2) సమాఖ్య రాజ్యము

**1.12.1.** ఏక కేంద్ర విధానంలో రాజ్యాధికారములన్నియు ఒకే ప్రభుత్వము చేతిలో కేంద్రీకరింపబడి ఉంటాయి. సమాఖ్య విధానంలో అధికారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విభజింపబడి ఉంటాయి.

**1.12.2.** ఏక కేంద్ర విధానంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉండవు. పరిపాలనా సౌలభ్యం కొరకు రాజ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తే కొన్ని ప్రభుత్వాలు ఉండవచ్చు. కానీ వాటికి స్వతంత్ర ప్రతిపత్తి అధికారాలు ఉండవు.

సమాఖ్య విధానంలో దేశం అనేక రాష్ట్రాలుగా విభజింపబడి ఉంటుంది. ఒక కేంద్ర ప్రభుత్వంతో పాటు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విధానంలో ఉంటాయి. రాష్ట్రాలు రాజ్యాంగబద్ధంగా కొన్ని అధికారాలు కల్గి ఉంటాయి.

**1.12.3.** ఏక కేంద్ర రాజ్యము లిఖితమై ఉండవచ్చు లేదా అలిఖితమై ఉండవచ్చు.

సమాఖ్యరాజ్యము తప్పనిసరిగా లిఖితంగా ఉండాలి.

**1.12.4.** ఏకకేంద్ర విధానంలో రాజ్యాంగం సరళంగా ఉండవచ్చు లేదా పరుషంగా ఉండవచ్చు.

సమాఖ్య విధానంలో తప్పనిసరిగా పరుషరాజ్యాంగం ఉండాలి.

**1.12.5.** ఏకకేంద్ర విధానంలో స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన ఉన్నత న్యాయస్థానం తప్పనిసరి.

**1.12.6.** ఏకకేంద్ర విధానంలో ఒకే రాజ్యాంగము ఉంటుంది.

సమాఖ్య విధానంలో జాతీయ రాజ్యాంగంలో పాటు ప్రతిరాష్ట్రము ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని కల్గి ఉంటుంది.

**1.12.7.** ఏకకేంద్ర విధానంలో ఒకే పౌరసత్వం ఉంటుంది. సమాఖ్య విధానంలో జాతీయ పౌరసత్వంతోపాటు రాష్ట్ర పౌరుసత్వం కూడా ఉంటుంది.

**1.12.8.** ఏకకేంద్ర విధానంలో త్వరితంగా నిర్ణయాలు తీసుకొనడానికి అవకాశం ఉంటుంది.

సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాలు కలసి కొన్ని నిర్ణయాలు తీసుకోవలసి వుంటుంది. అందువలన కాలయాపన జరిగేందుకు అవకాశం వుంటుంది.

**1.12.9.** ఏక కేంద్ర రాజ్య నిర్మాణం కష్టము. "విలోభి" అభిప్రాయంలో రాజ్యాంగాన్ని రూపొందించే రాజ్యాంగకర్తల పని శ్రమతో కూడి వుంటుంది.

**1.12.10.** ఏక కేంద్ర విధానంలో స్థానిక సమస్యలు త్వరితంగా, సమర్ధవంతంగా పరిష్కరించబడక పోవచ్చు.

సమాఖ్య విధానంలో స్థానిక సమస్యలు రాష్ట్ర ప్రభుత్వంచేత త్వరితంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది.

**1.12.11.** ఏకకేంద్ర విధానంలో అధికారాలన్నీ ఒకే కేంద్ర ప్రభుత్వం చేతిలో కేంద్రీకరింపబడి వుండటం వలన నిరంకుశంగా వ్యవహరించేందుకు అవకాశం ఉంటుంది.

సమాఖ్య విధానంలో కేంద్రం నిరంకుశంగా వ్యవహరించేందుకు వీలులేదు.

**1.12.12.** విభిన్న భాషలు, జాతులు కల్గిన చిన్న రాజ్యాలకు ఏక కేంద్ర విధానము అనువైంది. సమాఖ్య విధానము విభిన్న భాషలు, జాతులు కల్గిన పెద్ద రాజ్యాలకు అనువైంది.

**1.12.13.** ఏక కేంద్ర విధానంలో వివాదాలకు అవకాశం లేదు. సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య లేక రాష్ట్రాల మధ్య వివాదాలకు అవకాశం ఉంటుంది.

**1.12.14.** ఏక కేంద్ర విధానంలో శాసనాలు దేశమంతటా ఒకే రకంగా అమలు పరచబడలేవు.

సమాఖ్య విధానంలో శాసనాల విషయంలో భిన్నత్వం లేక వైవిధ్యం లేక వ్యత్యాసం గోచరిస్తుంది.

**1.12.15.** ప్రపంచ ప్రభుత్వ స్థాపన అనే భావనకు ఏకకేంద్ర విధానం వ్యతిరేకం.

సమాఖ్య విధానం ప్రపంచ ప్రభుత్వ ఆశయానికి తొలిమెట్టు.

## 1.13. సారాంశము

ఆధునిక ప్రభుత్వాలు సమాఖ్య, ఏకకేంద్ర అని రెండు విధాలుగా ఉంటాయి. అధికారాలన్నీ ఒకే ప్రభుత్వంలో కేంద్రీకృతమై ఉంటే ఏకకేంద్ర మని, అవి జాతీయ రాష్ట్ర ప్రభుత్వాలమధ్య విభజింపబడి ఉంటే సమాఖ్య అని అంటారు. సమాఖ్య విధానాన్ని కొన్ని స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకోవచ్చు లేదా ఒక కేంద్ర రాజ్యము నుంచి గూడా సమాఖ్య ఏర్పడవచ్చు. పెద్ద రాజ్యాలకు సమాఖ్య విధానము ప్రయోజనకారి. సమాఖ్యలో జాతీయ ప్రయోజనాలకు, ప్రాంతీయ ప్రయోజనాలకు మధ్య సమన్వయం సాధ్యమవుతుంది. ఏకకేంద్ర విధానము చిన్న, చిన్న రాజ్యాలకు ప్రయోజనకారి.

## అభ్యాసాలు

**I. వ్యాస ప్రశ్నలు :**

1. సమాఖ్య ప్రభుత్వ గుణదోషాలను వివరించండి.
2. ఏక కేంద్ర ప్రభుత్వ గుణదోషాలను వివరింపుము.
3. సమాఖ్య ప్రభుత్వానికి, ఏకకేంద్ర ప్రభుత్వానికి మధ్య గల తేడా లేవి?

**II. సంక్షిప్త వ్యాస ప్రశ్నలు :**

1. సమాఖ్య ప్రభుత్వ లక్షణాలేవి ?
2. ఏక కేంద్ర ప్రభుత్వ లక్షణాలేవి ?

**III. కుశాగ్రబుద్ధి ప్రశ్నలు**

1. సమాఖ్య అనే పదానికి సమానమైన ఆంగ్లపదం ....................అది ఫొడస్ అనే .......................... పదం నుండి గ్రహించబడింది.
2. ఫొడస్ అనగా .................................................. అని అర్థము.
3. డైసీ అభిప్రాయంలో సమాఖ్య రాజ్యము ...................................., ........................................ లను సమన్వయపరుస్తుంది.
4. ................................................ రాజ్యాలలో పౌరులకు ఒకే పౌరసత్వముంటుంది.
5. ................................................ విధానంలో స్వయం ప్రతిపత్తి కల్గిన ఉన్నత న్యాయస్థానం తప్పనిసరి.

# పాఠం- 2

# కేంద్ర రాష్ట్ర సంబంధాలు (శాసన, కార్యనిర్వాహక మరియు ఆర్థిక)

**లక్ష్యము :**

- భారత రాజ్యాంగంలో XI మరియు XII వ భాగంలో పొందుపరచిన శాసన, పరిపాలన, ఆర్థికపరమైన సంబంధాలను గురించి వివరించటం.
- ఈ పాఠం యొక్క లక్ష్యం.

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం :**


2.1 పరిచయం
2.2 శాసన సంబంధాలు
2.3 పాలన సంబంధాలు
2.4 కేంద్ర రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే రాజకీయ పరిణామాలు
2.5 పాలన సంస్కరణల సంఘం
2.6 రాజమన్నార్ సంఘం నివేదిక
2.7 ఆనందపూర్ సాహెబ్ తీర్మానం
2.8 సర్కారియా కమిషన్ నివేదిక
2.9 సంఘర్షణ రంగాలు
2.10 రావాల్సిన మార్పులు
2.11 కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో గవర్నర్ పాత్ర
2.12 గవర్నర్ పై వివాదాలకు కారణాలు
2.13 గవర్నర్ కేంద్రం హితకారియా?
2.14 ముఖ్యమంత్రి సలహా గవర్నర్ పాటించాలా?
2.15 గవర్నర్ ముఖ్యమంత్రిని తొలగించగలరా?
2.16 రాష్ట్రపతి పాలన
2.17 గవర్నర్ పదవిని రద్దు చేయాలి?
2.18 సారాంశం
2.19 స్వీయ అంచనా ప్రశ్నలు
2.20 ఉపయుక్త గ్రంధాలు


## 2.1. పరిచయం :

**కేంద్ర రాష్ట్ర సంబంధాలు :**

భారత రాజ్యాంగంలో నిర్మాతలు సిద్ధాంతపరంగా కాకుండా కేవలం పాలనా సౌలభ్యం కోసమే సమాఖ్య విధానాన్ని అనుసరించినట్లు కనిపిస్తుంది.

కారణం రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అను పదము పేర్కొనబడలేదు సరికదా బలమైన కేంద్ర ప్రభుత్వమును సృష్టించారు. అందువలన మన రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాల కంటే ఏకకేంద్ర లక్షణాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

Note: మనదేశం అనుసరించే సమాఖ్య విధానం కెనడాను పోలి ఉంటుంది. "కెనడాలో లాగానే మనం కూడా సమాఖ్యకు బదులుగా యూనియన్ అనే పదాన్ని ఉపయోగించాము.

భారత రాజ్యాంగంలోని XI వ భాగంలో ప్రకరణలు 245 నుండి 295 వరకు గల ప్రకరణలలో శాసన స ంబంధాలను, ప్రకరణలు 256 నుండి 263 వరకు గల ప్రకరణలలో పరిపాలనా సంబంధాలను మరియు XI 1 వ భాగంలోని ప్రకరణలు 264 నుండి 300(A) వరకు గల ప్రకరణలలో ఆర్థిక సంబంధాలను పేర్కొన్నారు.

కేంద్ర జాబితా (Union List) (List-I)

కేంద్ర జాబితాలోని ఎంట్రీల క్రమసంఖ్య 97 ఉన్ననూ, ప్రస్తుతం మొత్తం ఎంట్రీల (అంశాల) సంఖ్య 100.

రాష్ట్ర జాబితా (State List) (List-II)

రాష్ట్ర జాబితాలోని అంశాల క్రమసంఖ్య 66 ఉన్ననూ, కొన్ని తొలగించబడినవి ప్రస్తుతం మొత్తం అంశాల సంఖ్య 61.

ఉమ్మడి జాబితా (Concurrent List) (List-III)

ఉమ్మడి జాబితాలోని అంశాల క్రమసంఖ్య 47 ఉన్ననూ, ప్రస్తుతం మొతం అంశాల సంఖ్య 52

డాక్రిన్ ఆఫ్ అక్యుపైడ్ ఫీల్డ్ సిద్ధాంతం ఉమ్మడి జాబితా (Lin-III) కు వర్తిస్తుంది.

అవశిష్ట అంశాలు (Residual Powers):-

ఉదా:

1. అంతరిక్ష రంగంశక్తి
2. అణు శక్తి
3. మానవ వనరుల వినియోగము
4. పర్యావరణ శాస్త్రము
5. వాతావరణ కాలుష్యం

## 2.2. శాసన సంబంధాలు :

దేశ పరిపాలనకు సంబంధించిన అంశాలను మూడు జాబితాల కింద విభజించింది. అవి: కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా,ఉమ్మడి జాబితా. కేంద్ర జాబితాలోని పాలనాంశాలపై చట్టాలను రూపొందించే అధి కారం ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉంది. ఇందులో 97 అంశాలు ఉన్నాయి. వాటిలో దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, సాయుధబలాలు, మందుగుండు సామాగ్రి, అణుశక్తి, యుద్ధం, శాంతి, పౌరసత్వం, విదేశీ నేరస్తుల అప్పగింతలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్, నౌకాయానం, విమానయానం, తంతి తపాలా, ఆకాశవాణి, టెలిఫోను, సుప్రీంకోర్టు, కరెన్సీ నాణాలు, విదేశీ వ్యాపారం, అంతర్ రాష్ట్ర వర్తక వ్యాపారాలు, బ్యాంకులు మొదలైనవి.

రాష్ట్రజాబితాలో చేర్చిన పాలనాంశాలపై శాసనాలను రాష్ట్ర విధాన సభ ఆమోదిస్తుంది. రాష్ట్ర జాబితాలో 66 అంశాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి వ్యవసాయం, శాంతిభద్రతలు, పోలీసు, కారాగారాలు, నీటి సరఫరా, పంచాయితీల సంస్థలు, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొదలైనవి. వీటితో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పరిపాలన చేయటానికి అనువుగా కొన్ని పాలనాంశాలను ఉమ్మడి జాబితాలో చేర్చారు. అయితే ఉమ్మడి జాబితాలోని ఏదైనా ఒక అంశంపై పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ రూపొందించిన చట్టాల్లో తేడా ఉన్నట్లైతే ఆ వైవిధ్యం మేరకు కేంద్రచట్టమే అమల్లోకి వస్తుంది. ఉమ్మడి జాబితాలో 52 అంశా లు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి వివాహం, విడాకులు, వ్యవసాయేతర భూములు, ఆస్తుల మార్పిడి, ఒప్పందాలు, ధర్మకర్తలు, ధర్మకర్తృత్వ సంస్థలు, ఆహార పదార్థాల కల్తీ, ఆర్థిక సామాజిక ప్రణాళికా రచన మొదలైనవి.

రాష్ట్ర శాసనసభకు రాష్ట్ర జాబితాలోని పాలనాంశాలపై చట్టాలను రూపొందించే అధికారం ఉన్నప్పటికీ ఆ అధికారం బేషరతుగా లేదు. రాజ్యాంగ పరంగా శాసన సభ అధికారాలపై ఈ కింది పరిమితులు ఉన్నాయి.

1. జాతీయ ప్రయోజనం దృష్ట్యా రాష్ట్ర జాబితాలో ఏ అంశాన్నైనా 2/3 వంతు మెజారిటీతో ఒక తీర్మానాన్ని ఆమోదించి ఒక సంవత్సర కాలానికి సదరు అంశంపై చట్టాలను రూపొందించే అధికారాన్ని పార్లమెంటుకు రాజ్యసభ కల్పించవచ్చు. తర్వాత అవసరమైతే మరొక తీర్మానం ద్వారా ఈ కాలాన్ని ఇంకో సంవత్సరానికి పొడిగించవచ్చు.

2. రాష్ట్రంలో 'రాష్ట్రపతి పాలన' ను ప్రవేశపెట్టినప్పుడు శాసన సభ రూపొందించాల్సిన చట్టాలన్నింటిని పార్లమెంటే రూపొందిస్తుంది.
3. కొన్ని రాష్ట్రాలు తమ సమిష్టి ప్రయోజనం కోసం రాష్ట్ర జాబితాలో పేర్కొన్న ఒక అంశంపై చట్టాన్ని రూపొందించమని పార్లమెంట్ను కోరవచ్చు.
4. జాతి అత్యవసర పరిస్థితిని ప్రవేశపెట్టినపుడు పార్లమెంటుకు రాష్ట్ర జాబితాలోని పాలనాంశాలపై చట్టాలను ఆమోదించే అధికారం లభిస్తుంది.
5. అదే విధంగా భారత ప్రభుత్వం విదేశాలతో చేసుకున్న ఒడంబడికలను అమలు చేయటానికి అవసరమైన చట్టాలను పార్లమెంటు ఆమోదిస్తుంది. అవి మొత్తం దేశానికి వర్తించటమే కాకుండా కొన్ని సందర్భాల్లో రాష్ట్ర జాబితాకు సంబంధించిన అంశాలు కూడా కావచ్చు.
6. కొన్ని సందర్భాల్లో శాసన సభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ తమ సమ్మతిని ఇవ్వకుండా ఆ బిల్లులో వివాదాస్పదమైన అంశాలున్నాయని భావిస్తే దాన్ని రాష్ట్రపతి అభిప్రాయానికి పంపించవచ్చు.
7. వీటన్నిటి కంటే కేంద్ర రాష్ట్ర శాసన సంబంధాల్లో అత్యంత వివాదాస్పదమైన అంశం రాష్ట్రపతికి శాసనసభ కాలపరిమితి పూర్తి కాకుండానే రద్దుచేసే అధికారం. దీనివల్ల శాసనసభ ఉనికి కేంద్ర ప్రభుత్వ ఇష్టానిష్టాపై ఆధారపడి ఉంటుంది.

## 2.3. పాలనా సంబంధాలు :

కేంద్ర రాష్ట్రాల మధ్య పాలనా సంబంధాలను రాజ్యాంగంలోని 256 - 262 నిబంధనలు ఈ విధంగా వివరిస్తున్నాయి.

1. రాష్ట్రాలు తమ కార్యనిర్వాహణాధికారాన్ని కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహణాధికారానికి భంగం కలగని పద్ధతి. లో ఉపయోగించుకోవాలి. ఆ మేరకు అవసరమైన ఆదేశాలను కేంద్రం రాష్ట్రాలకు జారీ చేస్తుంది. కేంద్ర చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్రాలు తమ కార్యనిర్వాహణాధికారాలను చలాయించటానికి వీలులేదు.
2. కేంద్రం తమ విధానాలను నిర్వహించటంలో రాష్ట్రప్రభుత్వం ఎటువంటి ఇబ్బందులను, అడ్డంకులను కలుగనీయకుండా లేదా కల్గించరాదని రాష్ట్రాలకు ఆదేశాలను ఇవ్వవచ్చు. ఇటువంటి ఆదేశాలు ఉదా:- జాతీయ భద్రత, రైల్వేశాఖ ఆస్తులు, ప్రభుత్వరంగ సంస్థలు, ఆకాశవాణి దూరదర్శన్ కేంద్రాలు మొదలైనవి సంబంధించినవై ఉంటాయి.
3. కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు తరగతుల సంక్షేమానికి సంబంధించిన కొన్ని ఆదేశాలను రాష్ట్రాలకు ఇవ్వవచ్చు.
4. రాష్ట్రాల సమ్మతితో కేంద్రం కొన్ని షరతులతో లేదా ఎటువంటి షరతులను విధించకుండా కొన్ని విధులను రాష్ట్రాలకు అప్పగించవచ్చు. అటువంటి సందర్భాల్లో సదరు విధుల నిర్వహణకు రాష్ట్రాలు అంగీకరించాలి.
5. ప్రతి రాష్ట్రాన్ని విదేశ దురాక్రమణ నుంచి కాపాడటం, ఆ రాష్ట్రప్రభుత్వం కోరినపుడు అవసరమైన సైన్యాన్ని పంపి అక్కడ శాంతి భద్రతలకు ఏర్పడ్డ ప్రమాద పరిస్థితిని తొలగించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంది. అదే విధంగా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ పరంగా వ్యవహరించేటట్లు కేంద్ర ప్రభుత్వం చూడాల్సి ఉంటుంది.
6. నదీ జలాల వినియోగం వాటి పంపిణీకి సంబంధించిన కేంద్ర రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించటానికి అవసరమైన చట్టాలను ఆమోదించే అధికారం పార్లమెంటుకు ఉంది.
7. రాష్ట్రాల మధ్య ఏర్పడ్డ వివాదాల పరిష్కరణకు కేంద్రం ఒక అంతర రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవచ్చు.
8. జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలను తు.చ. తప్పకుండా అనుసరించాలి. సదరు అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు భారత రాజ్యాంగం సమాఖ్య తత్వాన్ని కోల్పోయి ఏక కేంద్ర వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది.
9. పైన పేర్కొన్న వాటికంటే అత్యంత కీలకమైంది. వివాదాస్పదమైన అంశం ఏమంటే రాష్ట్ర ప్రభుత్వాలను అర్థాంతరంగా రద్దు చేసే రాష్ట్రపతి అధికారం. రాజ్యాంగంలోని 356 నిబంధన కింద రాష్ట్రప్రభుత్వాన్నిఅంటే మంత్రిమండలిని శాసన సభలో మెజారిటీ ఉన్నప్పటికి పదవీ కాలం పూర్తి కాకుండానే రాష్ట్రపతి రద్దు చేయవచ్చు.

## ఆర్థిక సంబంధాలు:

కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను రాజ్యాంగం ఈ కింది విధంగా నిర్దేశిస్తుంది.

1. కేంద్ర జాబితాలో పేర్కొన్న పాలనాంశాలపై విధించిన పన్నుల నుంచి లభించే ఆదాయం మొత్తం కేంద్రానికే చెందుతుంది. అదే విధంగా రాష్ట్ర జాబితాలోని అంశాలపై విధించిన పన్నుల నుంచి వచ్చే రాబడి రాష్ట్రాలకు చెందుతుంది. కేంద్ర ప్రభుత్వానికి ఆదాయంపై పన్ను, విదేశీమారకం, కష్టమ్స్ సుంకాలు, పొగాకు, తంతి తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతాలు, రైల్వేలు, బ్యాంకులు, జీవిత బీమా, కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలు మొదలైన వాటినుంచి ఆదాయం లభిస్తుంది. రాష్ట్రాలకు భూమిశిస్తు, విద్యుచ్ఛక్తి భవనాలు, ఆబ్కారి, వాహనాలు, అమ్మకం పన్ను, వినోదంపై పన్ను మొదలైనవి ఆదాయ మార్గాలు.
2. కొన్ని పన్నులను కేంద్రం విధిస్తుంది. అయితే వాటిని వసూలుచేసి ఆ ఆదాయాన్ని రాష్ట్రాలు వేసుకుంటాయి. వీటిలో స్టాంపు పన్నులు, మందుల తయారీపై విధించే సుంకాలు మొదలైనవి ఉన్నాయి.
3. మరికొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి వసూలుచేసి అందులో కొంత ఆదాయాన్ని రాష్ట్రాలకు ఇస్తుంది. ఉదా:- రైల్వే చార్జీలపై విధించే పన్నులు.
4. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వమే విధించి వసూలు చేసి ఆ మొత్తాన్ని కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయటం జరుగుతుంది.

   ఉదా:- ఆదాయం పన్ను

రాష్ట్రాలకు ఆర్థిక వనరులను పంపిణీ చేయటంలో సలహాలివ్వటానికి అయిదు సంవత్సరాలకొక పర్యాయం రాష్ట్రపతి ఒక ఆర్థిక సంఘాన్ని నియమిస్తారు. ఈ సంఘం సలహాలను సాధారణంగా కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తుంది. అంతేకాక వివిధ రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ చేయటానికి అవసరమైన సూచనలు ఇవ్వటం, కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాల్సిన పన్నుల మూల నికర ఆదాయ మొత్తాలను కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయటం, ఇటువంటి ఆదాయాలను వివిధ రాష్ట్రాలకు కేటాయించటం, భారత సంఘటిత నిధినుంచి రాష్ట్రాల ఆదాయాల కోసం ఇచ్చే సహాయ మొత్తాలు (గ్రాంట్స్ ఇన్ -ఎయిడ్) నిర్దేశిం చే సూత్రాలను రూపొందించటం ఆదాయ పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం పాక్షికంగా వ్యవహరించ కుండా నివారించటం. ఎప్పటికప్పుడు మారుతూ ఉన్న రాష్ట్రాల అవసరాలను మదింపు చేయటం ఆర్థిక సంఘ బాధ్యత.

అయితే ఆర్థిక సంబంధాల్లో కూడా రాష్ట్రాలపై కేంద్రానికి ఆధిక్యత ఉంది. రాజ్యాంగంలోని 290, 291 నిబంధనల కింద ప్రజారుణాలను సేకరించే అధికారం కేంద్ర రాష్ట్రాలకు ఉన్నప్పటికీ, కేంద్రానికి రాష్ట్రాల కంటే అపారమైన వనరులు ఉన్నాయి. అతి ముఖ్యమైన సంస్థలు వాటి నిర్వహణపై కేంద్రానికి ఎక్కువ ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఆర్థిక సంఘం, జాతీయ ప్రణాళికా సంఘం, భారత రిజర్వ్ బ్యాంక్ మొదలైన సంస్థలు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడి పని చేస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వనరులను ప్రభావితం చేసే ఈ సంస్థలపై కేంద్ర ప్రాబల్యం ఎక్కువగా ఉండటం వల్ల రాష్ట్రాలు ఆర్థిక సంబంధాల్లో తరచు ఇబ్బందులకు గురి అవటమే కాకుండా కేంద్రంలో వివాదాలకు దిగుతున్నాయి.

కేంద్రంతో పోల్చినట్లైతే రాష్ట్రాల ఆదాయ వనరులు చాలా స్వల్పం. రాష్ట్ర ఆదాయంలో 40% ప్రభుత్వోద్యోగుల వేతనాలకిందే పోతుంది. మిగిలిన వాటిలో విద్య, సాంఘిక సంక్షేమం జనాకర్షణ విధానాల అమలుకు పెద్ద పీట లభిస్తుంది. ఏదైనా కాస్తో కూస్తో మిగిలి ఉన్నట్లైతే వాటిని కరువుకాటకాలు, తుఫాన్ సృష్టించిన బీభత్సం కబళించివేస్తాయి. అటువంటి పరిస్థితుల్లో దీర్ఘకాలిక ప్రాతిపదికపై పారిశ్రామికీకరణ వ్యవసాయాభి వృద్ధి, మంచినీటి కొరత నివారణకు కావాల్సిన నదీజలాల వినియోగంకై ప్రాజెక్టుల నిర్మాణం సహజంగానే అప్రాధాన్యత స్థితిలో ఉంటాయి.

అందువల్ల రాష్ట్రాలు తరచూ కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడతాయి. కేంద్రం తో అనుకూలంగా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ సహాయం సకాలంలో లభిస్తుందని, రాజకీయంగా కేంద్రంతో విభేదించే రాష్ట్రాలకు రుణ సహాయం నామమాత్రంగా ఉంటుందని ఒక సాధారణ విమర్శ సర్వత్రా వినిపిస్తూ ఉంటుంది. తెలుగు గంగ నిర్మాణం విషయంలో అనేక అడ్డంకులను కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తుందని, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికీకరణకై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకే కేంద్రం ప్రాధాన్యత ఇస్తుందని, తరచూ తెలుగు దేశం చేసే విమర్శలను పై ధోరణికి ఉదాహరణలుగా తీసుకోవచ్చు. ఆర్థిక సంబంధాల విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ వివాదం రావటానికి ఇటీవలి కాలంలో ఏర్పడ్డ అనేక సమస్యలు ముఖ్యకారణం. కాంగ్రెసేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడటానికి కేంద్ర ప్రభుత్వ పాక్షిక ధోరణే కారణమని కాంగ్రెసేతర

ముఖ్యమంత్రులు తరచూ విమర్శిస్తున్నారు. ఆదాయం పన్ను, ఎక్సైజ్ పన్ను మొదలైన వాటిలో రాష్ట్రాలకు కేంద్రంతో సమానంగా వాటా కావాలని తొమ్మిదో ఆర్థిక సంఘంతో కాంగ్రెసేతర ప్రభుత్వాలు వారించాయి.

అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఉదా:- తమిళనాడులో ఎం.జి. రామచంద్రన్ ప్రవేశపెట్టిన విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, వయసు మళ్ళిన వారికి పెన్షన్ సౌకర్యం, ఆంధ్రప్రదేశ్లో అమల్లో ఉన్న రెండు రూపాయల కిలో బియ్యం, సగం ధరలకే జనతా వస్త్రాలు మొదలైన సబ్సిడీ పథకాల వల్ల రాష్ట్రాల ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. వీటిని అంటే, అనుత్పాదక వ్యయాన్ని తగ్గించినట్లైతే రాజకీయంగా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్న భయం ఒకవైపు, అదుపు తప్పిన వ్యయం దివాలాకోట స్థితికి మరొకవైపు లాగుతూ ఉండటంవల్ల రాష్ట్రాలు తీవ్రమైన వత్తిడికిలోనై కేంద్రంతో తరచూ వివాదాలకు దిగుతున్నాయి. అందువల్ల ఆర్థిక వెసులుబాటుతనం, కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు సాఫీగా కొనసాగటానికి అడ్డంకులను సృష్టిస్తున్నాయి.

## 2.4. కేంద్ర రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే రాజకీయ పరిణామాలు :

రాజ్యాంగ పరంగానే కాకుండా ఇతరత్రా కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే అంశాలు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి రాజకీయ పరిణామాలు. 1950 నుంచి 1967 వరకూ కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో పెద్దగా వివాదాలు ఏర్పడలేదు. దీనికి ఒక ప్రధాన కారణం ఇటు కేంద్రంలోనూ అటు రాష్ట్రాల్లో నూ ఒక రాజకీయ పక్షం కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగడం. గవర్నర్లు, ముఖ్యమంత్రులు ఒక రాజకీయ పక్షానికి - కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షానికి చెంది ఉండటంవల్ల కేంద్ర రాష్ట్రాల మధ్య ఎటు వంటి రాజ్యాంగ, రాజకీయ పరమైన వివాదాలు ఉత్పన్నం కాలేదు.

అయితే 1967 నుంచి 1972 వరకూ కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విషయంలో, వనరుల విషయంలో తరచూ వివాదాలు తలెత్తాయి. దీనికి ప్రధాన కారణం 1967 సాధారణ ఎన్నికల అనంతరం అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయి మొదటిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. తమిళనాడులో డి.ఎమ్. కె., పశ్చిమ బెంగాల్లో యునైటెడ్ ఫ్రంట్, బీహార్, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సంయుక్త విధాయక దళ (ప్రతిపక్షకూటమి) ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దాంతోపాటు ఈ ప్రభుత్వం అధికారాల కోసం, కేంద్రం జోక్యం రాష్ట్ర వ్యవహారాల్లో తగ్గించటానికి ఆందోళన చేయటం ప్రారంభమైంది.

కానీ 1972-77 మధ్యకాలంలో మళ్ళీ కేంద్ర రాష్ట్రాల మధ్య తిరిగి ఎటువంటి వివాదాలు ఏర్పడ లేదు. దీనికి ముఖ్య కారణం తిరిగి ఒక రాజకీయ పక్షం కేంద్ర రాష్ట్రాల్లో అధికారాన్ని చేబట్టటం. 1972 సాధారణ ఎన్నికలలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో మళ్ళీ అధికారంలోకి వచ్చింది. అందువల్ల ఈ కాలం లో కేంద్ర రాష్ట్రాల మధ్య చెప్పుకోదగ్గ వివాదాలు ఏర్పడలేదు. అయితే 1977-1980 మధ్య కాలంలో తిరిగి భారత రాజకీయాల్లో మరొక నూతన పరిణామం ఏర్పడింది. 1977 లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయి జనతాపార్టీ కేంద్రంలో అధికారంలోకి రావటం, తదనంతరం 1978లో రాష్ట్ర శాసన సభలకు జరిగిన ఎన్నికల్లో జనతాపార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి రావటంతో పాటు తమిళనాడులో ఎ.ఐ.డి.ఎమ్.కె., పంజాబ్లో అకాళీదళ్, జమ్మూకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, పశ్చిమబెంగాల్లో వామపక్ష సమైక్య కూటమి ప్రభుత్వాలను ఏర్పరచటంతో అధికారం విషయంలో రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడిని తీసుకురావటానికి ప్రయత్నించాయి. అయితే మొరార్జీదేశాయ్ రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను ఇవ్వాల్సిన అవసరంలేదని భావించటంతో పాటు జనతా ప్రభుత్వం పతనం అవటం కూడా జరిగింది.

1980లో లోక్సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ ఘనవిజయాన్ని సాధించి కేంద్రంలో అధి కారంలోకి రావటంతోపాటు అనేక రాష్ట్రాల్లో జనత ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు తిరిగి ఏర్పడ్డాయి దీంతో తిరిగి కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో సాధారణ స్థితి ఏర్పడింది.

అయితే 1983 నుంచి అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడటంతో కేంద్ర రాష్ట్రాల మధ్య తిరిగి అధికారం విషయంలో, ఆర్థిక వనరుల విషయంలో, కేంద్రం రాజకీయ జోక్యం విషయంలో, ముఖ్యంగా గవర్నర్ తన పదవీబాధ్యతలను నిర్వహించే విషయంలో తరచూ వివాదాలు ఏర్పడ్డాయి.

1983లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలన్న రాజకీయ వివాదాన్ని లేవ నెత్తింది. 1983 మార్చిలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం బెంగుళూరులో జరిగింది. వీరు రాష్ట్రాలకు ఆర్థిక అధికారాలు, రాజ్యాంగ పరిధిలో ఉన్న సంబంధాలను సమీక్షించటానికి, అవసరమైన మార్పు లను సూచించటానికి ప్రభుత్వ జస్టిస్ సర్కారియా సంఘాన్ని నియమించింది. ఇంతవరకూ కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిశీలించిన సంఘాలు, వాటి సూచనలను ఇప్పుడు సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

## 2.5. పాలనా సంస్కరణల సంఘం :

ఎమ్.సి. సీతల్వాడ్ నాయకత్వంలో పాలనా సంస్కరణల సంఘం అధ్యయన కేంద్ర రాష్ట్ర సంబంధాల పై

ఈ కింది సూచనలు చేసింది:

- సాధారణ పరిస్థితుల్లో కేంద్రం రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదు.
- అత్యవసర పరిస్థితిలో రాష్ట్ర జాబితాలోని పాలనాంశాలపై కేంద్ర ప్రభుత్వానికి పరిమితమైన అధికారాలు మాత్రమే ఉండాలి.
- ఉత్పాదక శక్తి గల ప్రణాళికా పరమైన పథకాలకు మాత్రమే కేంద్రం రాష్ట్రాలకు ఋణసహాయం చేయాలి.
- రాష్ట్రాలకు అనుత్పాదక పథకాల విషయంలో మూలధనాన్ని గ్రాంటుల రూపంలో కేంద్రం లభ్యం చేయాలి.
- జాతీయ ప్రణాళికా పథకాల కింద రాష్ట్రాలు కేంద్రానికి చెల్లించాల్సిన రుణాల వ్యవహారాలను ఒక నిపుణులు సంఘం పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలి.
- రాష్ట్రాల మధ్య ప్రణాళికా గ్రాంటుల పంపిణీని ఆర్థిక సంఘం నిర్ణయించాలి. అంతేకాక ఆర్థిక సంఘానికి ప్రణాళికా సంఘానికి మధ్య సమన్వయం ఉండటానికి వీలుగా జాతీయ ప్రణాళికా సంఘంలోని ఒక సభ్యుడు ఆర్థిక సంఘంలో సభ్యునిగా నియమితుడవ్వాలి.
- ప్రధానమంత్రి అధ్యక్షతన ఆర్థికమంత్రి, దేశవ్యవహారాల మంత్రి, లోక్సభలోని ప్రతిపక్షనాయకుడు, జోనల్ కౌన్సిల్ నుంచి ఒక ప్రతిపక్ష ప్రతినిధి సభ్యులుగా ఒక అంతః రాష్ట్ర సమితిని ఏర్పాటు చేయాలి.
- గవర్నర్కు రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారాలను నిర్వహించటంలో పై సమితి కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించాలి.
- మంత్రిమండలి శాసనసభలో మెజారిటీ మద్దతును కోల్పోయిందని గవర్నర్ భావించినప్పుడు వెనువెంటనే గవర్నర్ శాసనసభను సమావేశపరిచి మంత్రిమండలికి మెజారిటీ మద్దతు ఉండాలనే నిర్ధారణ చేసుకోవాలి.
- అంతరాష్ట్ర నదీజలాల వినియోగం విషయంలో ఏర్పడే వివాదాలు మూడు సంవత్సరాల వ్యవధిలో పరిష్కరించాలి. కాలపరిమితి మించిన తర్వాత నిర్బంధ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించాలి.
- కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, ఆస్తి పాస్తుల భద్రత, జాతీయ రహదారి భవనాల నిర్మాణం మొదలైన విషయాలకు, సంబంధించినంత వరకూ రాష్ట్రాల్లో రక్షణ దళాలను నియమించే అధికారం కేంద్రానికి ఇవ్వాలి.

## 2.6 రాజమన్నార్ సంఘం నివేదిక :

1970లో తమిళనాడు ప్రభుత్వం నియమించిన రాజమన్నార్ సంఘం కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో ఈ కింది సూచనలను ఇచ్చింది.

1. రాష్ట్రపతి, ప్రధానమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రులు నియమించిన ప్రతినిధులతో కూడిన ఒక అంతర్ రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలకు రాజ్యాంగంలోని 256, 257,339(2) నిబంధనలను అనుసరించి కేంద్రం ఆదేశాలను ఇచ్చే అధికారాన్ని రద్దు చేయాలి. లేదా అటువంటి ఉత్తర్వులను అంతర్ రాష్ట్రమండలి అనుమతిలేకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు జారీచేయరాదు.
2. రాష్ట్ర అవసరాలను ప్రభావితం చేసే ముసాయిద బిల్లులను అంతరాష్ట్ర మండలి అనుమతితోనే పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలి.
3. కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని పాలనాంశాలను పునర్విభజించటానికి ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలి.
4. పన్నుల విధింపుకు సంబంధించిన అంశాలకు సంబంధించిన అవశేషాధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.
5. రాష్ట్రాలకు, రాష్ట్రాల్లోని సంస్థలకు బాధ్యతలను అప్పగించేటందుకు పార్లమెంటు చేసే చట్టాలను రాష్ట్ర ప్రభుత్వంతో ముందుగా ప్రస్తావించాలి.
6. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల కోసం రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అందిచ్చే ఆర్థిక సహాయం ఆర్థిక సంఘం చేసిన సూచనలకు అనుగుణంగా ఉండాలి.
7. ప్రస్తుతం అమల్లో ఉన్న జాతీయ ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష, పరోక్ష జొక్యాలకు అతీతంగా వ్యవహరించగల, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఒక నూతన ప్రణాళికా సంఘాన్ని పార్లమెంట్ చట్టం ద్వారా నియమించాలి.

8. శాసన సభలో మెజారిటీ సభ్యులు బలపరచిన నాయకుడిని ముఖ్యమంత్రిగా గవర్నర్ నియమించాలి.
9. ఏ రాజకీయ పక్షానికి మెజారిటీ లేనప్పుడు శాసనసభను సమావేశపరిచి మెజారిటీ సభ్యులు బరపరచిన నాయకుని గవర్నర్ ముఖ్యమంత్రిగా నియమించాలి.
10. శాసనసభలో మెజారిటీ మద్ధతుని ముఖ్యమంత్రి కోల్పోయిరని గవర్నర్ భావించినప్పుడు తక్షణమే శాసనస భను సమావేశపరిచి తన బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ముఖ్యమంత్రిని ఆదేశించాలి.
11. రాష్ట్రాల్లో "రాష్ట్రపతి పాలన" ను విధించటానికి రాష్ట్రపతికి అవకాశాన్ని కల్పించే 356 రాజ్యాంగ నిబంధనలను రద్దుచేయాలి.
12. అన్ని రాష్ట్రాలకు రాజ్యసభలా సమాన సభ్యుల ప్రాతినిధ్యాన్ని కల్పించాలి.
13. రాజ్యసభకు సభ్యులను నియమంచే 12 మందిని రాష్ట్రపతికి ఉన్న అధికారాన్ని రద్దు చేయాలి.
14. అంతర్ రాష్ట్ర వివాదాలను సుప్రీంకోర్టు ద్వారా పరిష్కరించాలి.
15. కేంద్ర మంత్రిమండలిలో అన్ని రాష్ట్రాలకూ సమానంగా ప్రాతినిధ్యం కల్పించాలి.
16. రాజ్యాంగ సవరణలకు 2/3 వంతు రాష్ట్రాల ఆమోదం ఉండాలి.

రాజమన్నార్ సంఘం నివేదిక ప్రారంభంలో చాలా సంచలనాన్ని కల్గించింది. నిజానికి 1973లో అకాలీదళ్ చేసిన తీర్మానం ఒక విధంగా సంఘం నివేదిక నుంచి స్ఫూర్తిని పొందిందని చెప్పవచ్చు.

## 2.7. ఆనందపూర్ సాహెబ్ తీర్మానం :

1973లో అకాలీదళ్ ఆనందపూర్ సాహెబ్లో సమావేశం అయి కేంద్ర రాష్ట్ర సంబంధం గురించి సమీక్షిస్తూ ఈ కింది అంశాలను ఉటంకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. నిజానికి తర్వాత కాలంలో ఏర్పడ్డ పంజాబ్ తీవ్రవాదం, ఖలిస్తాన్ ఉద్యం ఈ తీర్మానాన్ని అధారం చేసుకొన్నాయి.

1. పంజాబ్ నుంచి తీసుకొన్న ప్రాంతాలను ఇతర రాష్ట్రాల్లో చేర్చిన వాటిని తిరిగి పంజాబ్లో చేర్చాలి.
2. కేంద్ర ప్రభుత్వం రక్షణ, విదేశీవ్యవహారాలు, తంతి తపాలాలు, కరెన్సీ, నాణేలు రైల్వేలను నిర్వచించి మిగతా అన్నింటిని పంజాబు వదిలివేయాలి.
3. జాబ్ అవతల జీవించే అల్పసంఖ్యాక వర్గాల వారికి ముఖ్యంగా సిక్కు మతస్థులకు రక్షణ కల్పించాలి. వారి పట్ల ఏ రకమైన విచక్షణ చూపకూడదు.
4. శిరోమణి అకాలీదళ్ భారత రాజ్యాంగాన్ని సమాఖ్యగా కొనసాగించటానికి రాష్ట్రాలను కేంద్రంతో సమానహోదాతో దించటానికి కృషి చేస్తుంది.

సంబంధంలో మౌలికమైన మార్పును తీసుకురావటానికి తగిన సూచనలు చేస్తుందని ఆశించిన సమయంలో కమీషన్ తన నివేదిక సమర్పించటం వల్ల ఆసక్తి సహజంగానే పెరిగింది. అయితే ఈ కమీషన్ నివేదిక కీలకమైన అంశాలను దాటవేసింది. ప్రతిపక్ష ప్రభుత్వం మారిన మౌలిక మార్పును సర్కారియా కమీషన్ అంగీక రించలేదు. సూచించలేదు కూడా. ఆర్థిక వనరుల్లో, పన్నుల విధింపులో కొద్దిపాటి మార్పులను మాత్రం సూచించింది. కార్పొరేషన్ పనుల్లో రాజ్యాంగంలోని 299 నిబంధనలో మార్పులు తెచ్చి వ్యాపార ప్రకటన, రేడియో, దూరదర్శన్ ప్రకటనల నుంచి ఏర్పడే ఆదాయాలలో కొంత భాగం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వమని సూచించింది.

## 2.8. సర్కారియా కమీషన్ నివేదిక :-

1993 జూన్ 9న ఆర్. ఎమ్. సర్కారియా అధ్యక్షతన కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిశీలించటాని

కి ముగ్గురు సభ్యులతో ఒక కమిషన్ను శ్రీమతి ఇంతిరా గాంధీ నియమించారు. 1988 జనవరి 30న సర్కారి యా సమర్పించింది.

కేంద్ర ప్రభుత్వం సర్కారియా కమీషన్ను ఈ కింది అంశాలను పరిశీలించమని కోరింది.

1. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుతం ఉన్న సంబంధాల తీరును చక్కబరచాలి

2. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటినుంచి భారతదేశంలోని పరిస్థితులను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేయటం.
3. ప్రస్తుతం ఉన్న సమస్యల దృష్ట్యా కేంద్ర రాష్ట్ర సంబంధాలను మరింత మెరగుపరచటానికి అవసరమైన మార్పులు (రాజ్యాంగంలో)

సర్కారియా కమీషన్ నాలుగున్నర సంవత్సరాలు వివిధ రాజకీయ పక్షాలలో, రాష్ట్ర ప్రభుత్వాలను చర్చించింది. ఒక ప్రశ్నావళిని తయారు చేసి వివిధ వ్యక్తులను, ప్రభుత్వాధికారాన్ని మౌఖికంగా పరిశీలించింది. చివరకు కమీషన్ 4900 పుటలు నివేదికను పైన ఉటంకించిన తేదీన కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. సర్కారియా కమీషన్ నియామకం కేంద్ర ప్రభుత్వం తనంతటతానే చేయలేదు.

**కమీషన్ సూచించిన ఇతర మార్పులు:-**

1. ఆర్థిక సంఘం సూచించినట్లు రైళ్ళలో ప్రయాణం చేసే ప్రయాణికుల నుంచి వచ్చిన ఆదాయంలో రాష్ట్రాల కు వాటా కల్పించాలి.
2. ముడి సరుకుల గనులపై వచ్చే ఆదాయ పంపకం గురించి రెండు సంవత్సరాలకొకసారి ఒక సమీక్ష చేయాలి (ఇప్పుడు నాలుగు సంవత్సరాలకొకసారి పరిశీలిస్తున్నారు).
3. బ్యాంకుల నుంచి ఒక సంవత్సరం కోసం అప్పు తీసుకొనే హక్కు రాష్ట్రాలకు ఉండాలి.
4. రాష్ట్రాల్లో పన్ను లేనటువంటి మునిసిపల్ బాండ్లను ప్రవేశపెట్టుకోవచ్చు.

ఈ సూచనలు రాష్ట్రాలకు ఒదార్పుగానే కనిపిస్తున్నాయే కాని నిజానికి వాటి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచే విధంగా లేవు.

గవర్నర్ గురించి సర్కారియా సంఘం చేసిన మరొక సూచన ఏమిటంటే ఒకసారి గవర్నర్ నియమితుడైన వ్యక్తిని గవర్నర్ పదవికి తప్ప ఇతర పదవులకు నియమించరాదు. అయితే ఉపరాష్ట్రపతి పదవికానీ రాష్ట్రపతి పదవికానీ పోటీ చేయటంలో తప్పులేదని కమీషన్ భావించింది.

రాజకీయ నాయకులను, ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిని, కేంద్రమంత్రులుగా గతంలోఉన్న వారిని గవర్నర్లుగా నియమించరాదని సర్కారియా సంఘం సూచించింది. అయితే ఈ సూచన ఆచరణ సాధ్యంకాదు. ఎందుకంటే అధికారపక్షం పదవులను పంపిణీ చేయటంలో రాజకీయ వేత్తలను పూర్తిగా విస్మరించి లేదు. కాబట్టి సర్కారియా కమీషన్ తన నివేదికను సమర్పించిన ఒక సంవత్సరం దాటినప్ప టేక్ మాజీ మంత్రులు, ముఖ్యమంత్రులు వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమితులవుతూనే ఉన్నారు.

సర్కారియా కమీషన్ ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించే విషయంలో చేసిన సూచనలు కూడా గమనించదగ్గవిగా ఉన్నాయి. "రాజ్యాంగం ఈ అధికారాలను కల్పించటానికి గల ప్రధాన లక్ష్యం జాతీయ సమైక్యత కాబట్టి ఈ అధికారాన్ని అధికదాహం తీర్చుకోటానికి ఉపయోగించకూడదు. ఈ విషయంలో 356 నిబంధనను ఆచి, తూచి ఉపయోగించాలి. ఈ నేపధ్యంలో 1977లో జనతాపార్టీ తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయటం, అదే విధంగా 1980లో కాంగ్రెస్ పార్టీ జనతా ప్రభుత్వాలను రద్దుచేయటం అధికార దుర్వినియోగమే" అని కమీషన్ అభిప్రాయపడింది.

ఒక రాష్ట్రంలో రాష్ట్రపతిపాలనను విధించాలని నిర్ణయం తీసుకునేటప్పుడు అలా విధించటానికి గల కారణాలను రాష్ట్రపతి పాలన విధింపు పత్రంలో ప్రకటించాలి. రాజ్యాంగంలోని 356 నిబంధనను ఈ కార ణాలను చూపటానికి అనుగుణంగా సవరణ చేయాలి. రాష్ట్రపతిపాలనను విధించిన తర్వాత ఒక రాష్ట్ర శాసన సభను కానీ పార్లమెంట్ను కానీ రద్దు చేయ్యాలనుకుంటే ఆ యా సభల్లో ఆ ప్రతిపాదనను పెట్టి ఆమోదం పొందకుండా వాటిని రద్దు చేయకూడదు", ఎటువంటి పరిస్థితుల్లో అయినా రాష్ట్రపతి పాలన ఒక రాష్ట్రంలో విధించవచ్చు సర్కారియా కమీషన్ చెబుతూ ఈ కింది సూచనలను చేసింది.

**భారత సమాఖ్య సాధించిన విజయాలు :**

భారత రాజ్యాంగం సువిశాల భారతదేశంలో వివిధ రకాల ప్రాంతీయ, భాష, మత, ఆర్థిక, సాంఘిక వైవిధ్యాలున్న భారత సమాజానికి సరిపడిన రాజకీయ వ్యవస్థను సూచించటంలో నూటికి నూరుపాళ్ళు సిద్ధాంత బద్ధమైన సమాఖ్య వ్యవస్థను రూపొందించలేదు. భారత రాజ్యాంగవేత్తలు సిద్ధాంతం కంటే ఆచరణకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు.

భారత రాజ్యాంగంలో రూపొందించిన సమాఖ్యవ్యవస్థ ఈ కింది విజయాలను సాధించింది.

1. ఒక ప్రబలమైన కేంద్ర ప్రభుత్వ స్థాపన ద్వారా సమాఖ్య వ్యవస్థ భారతదేశ స్వతంత్ర ప్రతిపత్తి సమగ్రత, సార్వభౌమాధికారాలను కాపాడగలిగింది. అనేక వేర్పాటు ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా ఎదుర్కోగలిగింది.
2. బలమైన కేంద్ర ప్రభుత్వ స్థాపనవల్ల విదేశీ దండయాత్రల ప్రమాదాన్ని (పాకిస్తాన్, చైనా) విజయవంతంగా తిరగగొట్టడం సాధ్యమైంది.
3. 1956 లో రాష్ట్రాలు పునర్నిర్మాణం ద్వారా భారత రాజకీయ పటాన్ని తిరిగి రాయటం సులభమైంది. 4. అనేక రాష్ట్రాల్లో రాజకీయ, పాలనా సుస్థిరతకు ఉపకరించింది. 356 రాజ్యాంగ నిబంధన కింద తరచూ పార్టీ మార్పిడుల ద్వారా అనేక రాష్ట్రాల్లో ఏర్పడ్డ రాజకీయ అస్థిరతకు కేంద్ర ప్రభుత్వం "రాష్ట్రపతి పాలన" ద్వారా తొలగించడం సాధ్యమైంది.
4. అఖిల భారత సేవల ద్వారా అన్ని రాష్ట్రాల్లో ఉన్నత స్థాయిలో సామర్థ్యంతో కూడ కొన్ని ఉద్యోగ బృందం ఏర్పాటుకు ఉపకరించింది.
5. అనేక రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు ఏర్పడ్డ ప్రమాదాన్ని ఆయా రాష్ట్రాలకు సైనిక సహాయాన్నే అందించటం ద్వారా అనేక రాష్ట్రాల్లో శాంతి భద్రతలను కాపాడటం సాధ్యమైంది.

పైవిధంగా రాజ్యాంగం ఏర్పాటు చేసిన సమాఖ్య వ్యవస్థ రాజ్యాంగవేత్తలు ఆశించిన మౌలిక లక్ష్యాల సాధనకు విజయవంతంగా ఉపయోగపడింది. సమగ్రత, అభివృద్ధి, సమైక్యతలను సాధించటంలో చాలా వరకు

## 2.9. సంఘర్షణ రంగాలు :

అయితే ఒక వైపు పై చర్చించిన ప్రయోజనాలతో పాటు కొన్ని సమస్యలను కేంద్ర రాష్ట్రాల మధ్య సంఘర్షణను తరచూ ఉత్పన్నం అవటానికి కూడా ఈ సమాఖ్య వ్యవస్థ దోహదం చేసింది. ఫలితంగా మన రాజ్యాంగం కాలక్రమంలో బలంతోపాటు కొన్ని బలహీనతలను కూడా చూపించింది. కొన్ని ప్రత్యేక ధోరణులు కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో ముఖ్యంగా 1980 దశాబ్దంలో కనిపించటం ప్రారంభించాయి. కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ ఏర్పడే సంఘర్షణలకు ఈ కింది విధంగా పేర్కొనవచ్చు.

1. కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ ఏర్పడే సంఘర్షణలు రాజకీయమైనవే కాని న్యాయ సంబంధమైనవి కావు.
2. 1967 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ సంబంధాల్లో చెప్పుకోదగ్గ వివాదాలు ఈ కాలంలో ఏర్పడలేదు. అయితే 1977 నుంచి ముఖ్యంగా 1983 అనంతరం కాంగ్రెసేతర ప్రతిపక్షాలు, ప్రాంతీయ పార్టీలు కొన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టడంతో కేంద్ర రాష్ట్రాల మధ్య రాజకీయమైన వివాదాలు ఎక్కువైనాయి.
3. ఆంధ్రప్రదేశ్ అధికారంలో ఉన్న తెలుగు దేశ ప్రభుత్వం ప్రధానిపై, కేంద్ర మంత్రులపై, రాష్ట్ర గవర్నర్ల పై తరచూ ధ్వజం ఎత్తడం, తమ వైఫల్యానికి కేంద్రాన్ని అనేక సందర్భాల్లో నిందించటం సర్వసాధారణ.
4. 36 నిభంధన కింద ఒక రాష్ట్రంలో ప్రభుత్వాన్ని రద్దు చేసి కేంద్ర పాలనను విధించటానికి రాష్ట్రపతికి రాజ్యాంగ రీత్యా అధికారం ఉంది. ఈ అధికారాన్ని అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వం పాక్షిక ప్రయోజనాల దృష్ఠా దుర్వినియోగం చేయటం జరిగింది. 1988 లో నాగాలాండ్లో, మిజోరంలో, కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోయిన తర్వాత కాంగ్రెసేతర కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవకాశం ఇవ్వకుండా రాష్ట్రపతి పాలనను విధించటం సర్వత్రా నిరసన ఏర్పడింది. అందువల్ల కొన్ని ప్రతి పక్షాలు ఈ 356 నిబంధన ను రాజ్యాంగం నుంచి తొలగించాలని కోరుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వ స్వంతంత్ర ప్రతిపత్తిని, అధికారాలను తగ్గించినందుకు చూపించేనిరసన రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణం రాజ్యాంగంగా గుర్తింపు పొంది ఏర్పడినప్పటికీ రాష్ట్రకార్యనిర్వాహక వర్గం, శాసనసభల.

## 2.10 రావల్సిన మార్పులు :

కొరతల రాజకీయాల వల్ల కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో తరచూ వివాదాలు, ఉద్రిక్తతలు ఏర్పడుతు తొలగించడానికి రాజ్యాంగ చట్టాల్లో అమల్లో ఉన్న కేంద్ర రాష్ట్ర సంబంధాలను పటిష్టం చేయ సూచించిన మార్పులు అవసరం.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచటంలో పార్టీ వ్యవస్థ చాలా ప్రధాన పాత్రను నిర్వహిస్తుంది. కాంగ్రెస్, కాంగ్రెసేతర ప్రభుత్వాలకు కేంద్ర రాష్ట్రాలను ఏకకాలంలో పనిచేస్తున్నపుడు ఈ రాజకీయ పక్షాలు ఒక మౌళిక అంశాన్ని బాగా గుర్తించుకోవాలి. ఒక పార్టీలో వ్యవహరించటం వేరు, ఒక ప్రభుత్వంలో వ్యవహ రించడం వేరు. ప్రభుత్వపరంగా వ్యవహరిస్తున్నపుడు పార్టీ పరంగా చేసే విమర్శనలు మరీ చౌకబారుగా ఉంటే అవి కేంద్ర రాష్ట్ర సంబంధాలను మరింత బెడిసి కొట్టే ప్రమాదం ఉంది. అంతేగాక బహుపార్టీ పద్ధతి ఉన్న భారతదేశంలో రాజకీయహుందాతనం ప్రదర్శించటం ద్వారా కేంద్ర రాష్ట్రాలు సజావుగా వ్యవహరించటం సాధ్యమౌతుంది. కేవలం రాజకీయ ప్రయోజనాలను ఆశించి పరస్పరం మిమర్శించుకోవటం వల్ల నిందారోపణలు చేయటం వల్ల ప్రయోజనం ఏర్పడదు.

జాతీయ ప్రణాళిక సంఘం నిర్మాణంలో కొన్ని మౌలిక మార్పులు అవసరం. జాతీయ ప్రణాళికలను రూపొందించటంలో రాజకీయ వేత్తల ప్రమేయాన్ని తగ్గించాలి. ప్రణాళికాసంఘం నిపుణులతో ఏర్పాడాలి. దాని నిర్వహణపై రాజకీయవేత్తల పెత్తనం పరిమితినివ్వాలి. ఈ ప్రణాళికా సంఘం వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ప్రణాళికా పరమైన పధకాలను, తరచూ సమీక్షిస్తూ, నిర్మాణాత్మకమైన మార్పులను, చేర్పులను సూచించాలి. వనరుల సమీకరణ, ఉత్పత్తి పెరుగుదల, రవాణా, పంపిణీ సౌకర్యాలు, స్థానిక అవసరాలు మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకుని సత్వర ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా పారిశ్రామికీకరణకు వివిధ పధకాల విస్తీరణకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలే కాని రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనేక అనుత్పాదక పధకాలకు కావాల్సిన నిధులను సమకూర్చుకోవటానికి ఆందోళనలు, ఒత్తిడి పెరుగుతాయి. అంతే కాకుండా ప్రణాళికల్లో లేని అంశాలను సూచించని పతకాలకు అమలు పరచటంలో రాష్ట్రప్రభుత్వం తక్కువ ఉత్సాహాన్ని చూపించనట్లైతే ఆర్థిక రంగంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు మెరుగుపడానికి అవకాశాలు ఉన్నాయి.

1980 సంవత్సరాల్లో ఏర్పడ్డ ప్రాంతీయ పక్షాలు చాలావరకు కేంద్రవ్యతిరేకధోరణిని అనవసరమైన సందర్భా ల్లో కూడా అనుసరుస్తున్నాయి.

## 2.11. కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో గవర్నర్ పాత్ర :

కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో గవర్నర్ పాత్ర ఇటీవలి కాలంలో అనేక విమర్శలకు గురైంది. ఆంధ్రప్రదేశ్, కేరళలో తమిళనాడులో, పశ్చిమబెంగాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తరచూ వివాదాలకు దిగటమే కాకుండా 1988 లో లోకాయుక్త నియామకాన్ని జాప్యం చేయటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వ్యక్తికి ఆపదవికి నియమించటానికి గవర్నర్ నిరాకరించటం వల్ల గవర్నర్ మీద ఫిర్యాదు చేస్తూ గవర్నర్ చర్య ను విమర్శిస్తూ రాష్ట్ర మంత్రిమండలి ఒక తీర్మానాన్ని అమోదించింది. అంతేకాక గవర్నర్ పై ఒక వినతి పత్రాన్ని రాష్ట్రపతికి కూడా తెలుగుదేశ ప్రభుత్వం సమర్పించింది. సర్కారియా కమిషనరు కూడా తెలుగుదేశం గవర్నర్ పదవి అవసరమని, రాజకీయ వివాదాలకు నిలయమని అందువల్ల గవర్నర్ పదవిని రద్దు చేస్తే బాగుంటుంద ని ఒక వాదాన్ని సమర్పించింది. అంతకు ముందు డి.యం.కె పార్టీ కూడా ఇటువంటి విజ్ఞప్తినే చేసింది.

రాష్ట్రాని కి లాంచన ప్రాయమైన రాజ్యాంగాధిపతిగా వ్యవహరించాల్సిన గవర్నర్ కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో కీలకపాత్ర వహిస్తున్నాడు. రాష్ట్రానికి రాజ్యాంగాధిపతియైన గవర్నర్ను రాష్ట్రపతి ఐదు సంవత్సరాల పదవికాలానికి నియమి స్తారు. గవర్నర్ను ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి బదిలీ చేయవచ్చు. పదవీ కాలాన్ని పొడిగించవచ్చు. గవర్నరు పదవి నుంచి తొలగించే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంది. రాజ్యసభ సభ్యుడికి కావాల్సిన అర్హతలు ఉన్న వ్యక్తికి గవర్నర్ గా నియమించే వ్యక్తి కేంద్రంలో అధికార పార్టీ సభ్యుడు లేదా వివాదాస్పదమైన నాయకుడు లేదా ఎన్నికల్లో ఓడిపోయిన మంత్రి, ముఖ్యమంత్రి అవడం తరచుగా జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు దూరంగా ఉంచటానికి డాక్టర్ చెన్నరెడ్డి రెండు పర్యాయాలు (ఉత్తర ప్రదేశ్, పంజాబ్) గవర్నర్ నాటి ప్రధాని శ్రీమతి గాంధి సలహాపై రాష్ట్రపతి నియమించాడు. కలప కుంభకోణం లో వివాదాస్పదమై రాజకీయంగా తలనొప్పిని సృష్టించిన హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి రామ్లాల్ను ఆంప్రదేశ్ గవర్నర్ నియమించారు.నిజానికి రాజ్యాంగ పరిషత్ సభ్యుల్లో కొంతమంది గవర్నర్ను ఎన్నుకోవాలని సూచించారు, అయితే శాసన సభ ద్వారా ఎన్నికైన గవర్నర్ రాష్ట్ర ముఖ్యమంత్రితో సమానంగా అధికారాన్ని చెలాయించటానికి ప్రయత్నించ వచ్చని, అంతేకాకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాష్ట్రపతి నామమాత్రంగా వ్యవహరించాలంటే గవర్నర్ రాష్ట్రపతి నియమించటం సమంజసమని భావించటం జరిగింది.

## 2.12. గవర్నర్ వివాదాలకు కారణాలు :

1967 వరకు గవర్నర్ పదవి ఎటువంటి వివాదాలకు అవకాశం కల్పించలేదు. అంతవరకు గవర్నర్ పదవి అలంకార ప్రాయంగా ఉండేది. మధ్యప్రదేశ్ గవర్నర్ గా పనిచేసిన డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య గవర్నర్ పదవి అలంకార ప్రాయమైందని ఎవరైన రాజకీయాల నుంచి విరమించి విశ్రాంతి తీసుకోవటానికి చక్కగా ఉపయోగపడుతుందని తన ఆత్మకథలో రాసాడు.

1967 వరకు కేంద్రంలోను రాష్ట్రాల్లోను ఒకే పార్టీ (కాంగ్రెస్ పార్టీ) అధికారంలో ఉండటం వల్ల కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాలు ఎక్కువగా ఏర్పడలేదు. అందువల్ల గవర్నర్ సాహిత్యం, సాంస్కృతిక, తాను నిర్వహించాల్సిన అధికార కార్యక్రమాల్లో పాల్గొనటం మినహాయిస్తే ఇతరత్రా మరేమి పని ఉండేది కాదు. కొన్ని సార్లు ఆయన పేరు కూడా ప్రజల్లో చాలామందికి తెలిసేది కాదు అనటం అతిశయోక్తి కాదేమో! అయితే 1967లో జరిగిన నాల్గో సాధారణ ఎన్నికల్లో మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో తన ప్రాభవాన్ని కోల్పోయింది. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రతిపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. -1967-72 మధ్య కాలంలో ప్రతిపక్షాల బలహీనత, కాంగ్రెస్ పార్టీ మార్పిడుల ద్వారా రాజకీయ అస్థిరత ఏర్పడింది. కొన్ని రాష్ట్రాల్లో శాసన సభల్లో ఏ పార్టీకి మెజారిటీ లేకపోవటం వల్ల గవర్నర్ జోక్యంతో రాష్ట్రపతి పాలన విధించడం జరిగింది. ఆ సందర్భంలో మెజారిటీ నిరూపించుకోవటానికి అవకాశం ఇవ్వకుండా గవర్నర్ లు శాసనసభను రద్దు చేయమని రాష్ట్రపతికి నివేదిక పంపారని ప్రతిపక్షాలు విమర్శించటం, కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావటానికి గవర్నర్లు తోడ్పడుతున్నారన్న విమర్శకూడా సర్వత్రా వినిపించింది.

గవర్నర్ను రాష్ట్రపతి కేంద్ర ప్రభుత్వ సలహాపై నియమించటంవల్ల కేంద్రంలో అధికార పక్షానికి చెందిన వ్యక్తి ఉంటారని, అటువంటి వ్యక్తి కేంద్రానికి విధేయత చూపిస్తారన్న విషయం ఎన్నో సార్లు స్పష్టమైం దని పలువురు భావిస్తున్నారు. ఇందుకు ఉదాహరణలు చెప్పుకోవాలంటే జమ్ము కాశ్మీర్లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కూలదోసి సలాంపాను కాంగ్రెస్ మద్ధతులో ముఖ్యమంత్రిని చేయటంలో ఆ రాష్ట్ర గవర్నర్ జగన్ మోహన్ ప్రోత్సాహంతో నిర్వహించిన పాత్ర సర్వత్రా విమర్శలకు గురైంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్లో 1984 ఆగస్టులో యన్.టి. రామారావు ప్రభుత్వాన్ని రద్దుచేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిని చేసి మెజారిటి ని నిరూపించుకోవడానికి అప్పటి గవర్నర్ రామలాల్ భాస్కరరావును నెలరోజులు వ్యవధిని ఇవ్వటంతో రాష్ట్ర మంతటా "ప్రజాస్వామ్య పునరుద్ధరణం" ఉద్యమం జరిగి శాంతి భద్రతలు లోపించి చివరికి గవర్నర్ రామలాల్ రాజీనామా చేసి ప్రజా జీవితం నుంచి తెరమరుగు అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## 2.13. గవర్నర్ - కేంద్రం హితకారియా?

ఒక రాష్ట్రానికి లాంఛన ప్రాయమైన అధిపతిగా రాష్ట్రపతి ద్వారా నియమితులైన గవర్నర్ తన పదవి బాధ్యతలను నిర్వహించటంలో ఎలా వ్యవహరిస్తారు? శాసనసభలో మెజారిటీ మద్ధతు ఉన్న ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ పాటించాలి. అయితే గవర్నర్ ముఖ్యమంత్రిని కాదని వ్యవహరించటం తరచుగా జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం కేంద్రంలో, రాష్ట్రంలో విభిన్న రాజకీయ పక్షాలు అధికారంలో ఉండటమే. కేవలం రాజ్యాంగపరంగా నామమాత్రపు అధిపతిగా లాంఛనప్రాయంగా మంత్రిమండలి సలహాపై మాత్రమే వ్యవహరిస్తే గవర్నర్ కేంద్రాన్ని కాదనాల్సివస్తుంది. కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు ఉన్నంత వరకే ఆయన తన పదవిని నిలుపుకోగలుగుతారు. స్వతంత్రంగా వ్యవహరించాలన్న గవర్నర్ కేంద్రం అయిష్టానికి సరి అవ్వక తప్పదు. జమ్మూ కాశ్మీర్లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని పడగొట్టడంలో సహకరించని బి.కె. నెహ్రూను తప్పించి జగన్మోహన్ను గవర్నర్ గా నియమించి ఫరూక్ ప్రభుత్వాన్ని కేంద్రం ఆయన సహాయంతో పడగొట్ట గలిగింది. అదే విధంగా గవర్నర్ రామ్లాల్ సహాయంలేకుండా 1984లో యన్.టి.ఆర్ పతనం సాధ్యమయ్యేది కాదు. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా గవర్నర్ పరిస్థితి ప్రస్తుత రాజకీయ పరిణామాల మధ్య సందిగ్ధావస్థలో ఉంది.

## 2.14. ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ పాటించాలా?

రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగం కొన్ని విచక్షణాధికారాలను కల్పించింది. వీటిని నిర్వహించటంలో గవర్నర్ మంత్రి మండలి సలహాను గవర్నర్ పాటించాల్సిన అవసరంలేదు. మంత్రిమండలి రద్దు చేయటంలో లేదా శాసన సభను సమావేశపరచటంలో లేదా శాసనసభ ఆమోదించిన ఒక బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం ఆపడంలో లేదా రాష్ట్రంలో ప్రభుత్వం రాజ్యాంగ పరంగా పనిచేయటంలో విఫలమైనప్పుడు, రాష్ట్రపతి పాలన కోసం సిఫారసు చేసే సందరర్భంలో గవర్నర్ తన విచక్షణాధికారాన్ని ఉపయోగించవచ్చు.

పైన పేర్కొన్న సందర్భాలే కాకుండా రాష్ట్రపతికి 15 రోజులకొకసారి రాష్ట్ర పరిస్థితిని గురించి శాంతిభద్రతలను గురించి సాధారణ పాలన గురించి గవర్నర్ ఒక రహస్య నివేదికను పంపుతారు. ఈ సందర్భంలో

గవర్నర్ మంత్రిమండలి సలహాను గవర్నర్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అయితే గవర్నర్ విచక్షణాధికారాలు రాజకీయ దృక్పథంతో ముడిపడటం వల్ల అవి తరచూ వివాదాస్పదం అవుతాయి.

## 2.15. గవర్నర్ ముఖ్యమంత్రిని తొలగించగలరా? :

శాసనసభలో ముఖ్యమంత్రి మెజారిటీని కోల్పోయినట్లు గవర్నర్కు అనుమానం కలిగితే ఆయన రెండు విధానాలను అవలంబించవచ్చు. శాసనసభ సమావేశం వెంటనే ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి తన మెజారిటీని నిరూపించుకోమని కోరటం. మరొకరిని ముఖ్యమంత్రిగా నియమించి ఆయన తన మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించటం. మెజారిటీని కోల్పోయిన ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ స్వంతంగా నిర్ణయం తీసుకోవాల్సిందే. రాజ్యాంగం ఇతమిద్ధంగా ఏమి చెప్పలేదు.

ప్రభుత్వ బలాబలాలు తేల్చాల్సిన వేదిక శాసనసభ. శాసనసభ విశ్వాస లేదా అవిశ్వాస తీర్మానం ద్వారా ముఖ్యమంత్రికి మెజారిటీ మద్ధతు ఉందో లేదో నిర్ణయిస్తుంది. అయితే ముఖ్యమంత్రికి మద్ధతు ఉందా లేదా తేల్చుకోవటం గవర్నర్ సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం గవర్నర్ సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ముఖ్య మంత్రిని నియమిస్తాడు. ఆయన సలహాపై గవర్నర్ మంత్రులను నియమిస్తాడు. మంత్రిమండలి గవర్నర్ ఆమోదంపై పదవిలో కొనసాగుతుంది అని రాజ్యాంగం చెబుతుంది. అయితే అదే రాజ్యాంగం "మంత్రిమండ లి శాసనసభకు సమిష్టి బాధ్యత వహిస్తుంది"

## 2.16. రాష్ట్రపతి పాలన :

రాజ్యాంగంలోని 356వ నిబంధన కింద ఒక రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించటంలో గవర్నర్ రాజ్యాంగం ఇచ్చిన విచక్షణాధికారాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని మెప్పించటానికి ఉపయోగించటం జరుగు తుందన్న విమర్శ, ఆ విమర్శకు తగిన అనుకూల సాక్ష్యాలు అనేక సందర్భాల్లో కొట్టొచ్చినట్లు కనపడటంవల్ల గవర్నర్ పదవి వివాదాస్పదంగా ముఖ్యంగా ఆయన విచక్షణాధికారాలను వినియోగించే సందర్భంలో అనేక విమర్శలకు గురైంది. రాష్ట్రంలో రాజ్యాంగపరంగా ప్రభుత్వం పనిచేయటంలో విఫలమైందని నిర్ధారించినపుడు లేదా శాంతిభద్రతలను పరిరక్షించటంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గవర్నర్ భావించినపుడు ఈ ముగింపు అభిప్రాయానికి రావటానికి గవర్నర్కు ఖచ్చితమైన సమాచారం ఎలా లభ్యమవుతుంది? అంతేకాక గవర్నర్ రాష్ట్రపతికి పంపిన నివేదికను ఆ నివేదికపై రాష్ట్రపతి తీసుకున్న చర్యను న్యాయస్థానంలో సవాలు చేయటం వీలుకాకపోవటంవల్ల గవర్నర్ నిర్ణయం చాలా సందర్భాల్లో కేంద్రం అభిప్రాయం ద్వారా ప్రభావితం అవుతుందన్న విమర్శ సర్వత్రా ఉంది. అందువల్ల కేంద్రం నియమించిన గవర్నర్ కేంద్రానికి ఏజంట్లా పనిచే స్తున్నారని తీవ్రంగా విమర్శలకు లోనైన గవర్నర్ ఒకవైపు రాజ్యాంగ పరంగా అలంకార ప్రాయంగా రాష్ట్రాధిపతి గా ఉంటూ మరొకవైపు విచక్షణాధికారాలను ఉపయోగిస్తూ రాష్ట్రపతి ప్రతినిధిగా వ్యవహరించటం ద్విపాత్రా భినయంగా కనిపిస్తుంది.

గవర్నర్లను కేవలం లాంఛన ప్రాయమైన రాష్ట్రాధినేతలుగా మాత్రమే రాజ్యాంగం ఉద్దేశించింది. మంత్రి వర్గాలు వస్తాయి, పోతాయి. కాని రాజ్యాధికారం (స్టేట్) అవిచ్ఛిన్నంగా కొనసాగాల్సిందే. అందువల్లనే గవర్నర్ పదవిని రాజ్యాంగం సృష్టించింది. అయితే అసలు పరిపాలనంతా ప్రజలు ఎన్నుకొన్న మంత్రిమండలి నిర్వహిం చాలని రాజ్యాంగం నిర్ణయించింది. ఒక రాష్ట్రంలో రెండు అధికార కేంద్రాలు ఉండరాదు. కాబట్టి మంత్రి మండలిదే పై చేయిగా నిర్దేశించింది.

గవర్నర్ విచక్షణాధికారాలను రాజ్యాంగం పేర్కొన్నప్పటికీ అవి ప్రధానంగా రెండు సందర్భాల్లోనే అమల్లోకి వస్తాయి. ఒక ముఖ్యమంత్రిని నియమించే సందర్భంలో, రెండోది రాజ్యాంగ బద్ధంగా రాష్ట్రపరిపాలన కొనసాగటానికి వీలులేని పరిస్థితి ఏర్పడిందని నిర్ణయించాల్సిన సమయంలో ఇక సందర్భాల్లో గవర్నర్ మంత్రివర్గ సూచన మేరకు నడుచుకొన్నట్లైతే రాజకీయంగా రాజ్యాంగ పరంగా వివాదాలు తొలగిపోతాయి.

## 2.17. గవర్నర్ పదవిని రద్దు చేయాలి? :

గవర్నర్ పదవికి నియామకంపట్ల, గవర్నర్ పదవి నిర్వహణ పట్ల ఎపుడు వివాదాలు వస్తూనే ఉన్నాయి. గవర్నర్లను సాధారణంగా ఈ కింది వర్గాలనుంచి నియమిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శకులు విమర్శిస్తూ ఉంటారు.

ఎన్నికల్లో ఓడిపోయిన అధికారపార్టీకి సంబంధించిన ప్రముఖులు. ఉదా:- బ్రహ్మానందరెడ్డి, కోన ప్రభాకరరా వు, వెంకటసుబ్బయ్య.

ఆయా రాష్ట్రాల్లో కేంద్రంలోని అధికారపార్టీ నామినేట్ చేసే ముఖ్యమంత్రిలకు అదే పార్టీలో ఉండి అడ్డంకు లు, అసమ్మతి వర్గాలను సృష్టించేవారు. ఉదా:- యం. చెన్నారెడ్డి, వసంత దాదా పాటిల్.

కేంద్రంలోనే లేదా రాష్ట్రాల్లోనే ముఖ్యమంత్రులుగా ఉండి అక్కడ అసమర్థులని అవాంఛనీయులని భావిం చేవారు. ఉదా:- రామూల్

అధికార పార్టీకి విధేయులుగాను, అనుకూలంగానూ ఉండి కొన్ని పరిస్థితుల్లో మెహర్బానీ సంపాదించిన మాజీ ఉన్నతోద్యోగి వర్గం. ఉదా:- ఎ.ఎల్. ఖురానా, కె.సి. అలెగ్జాండర్

కొంచెం చురుకుగా వ్యవహరించాల్సిన మంత్రిపదవిని నిర్వహించలేక అశక్తులై వృద్ధాప్యంలో ఉన్నవారు. ఉదా:- కె.సి. అబ్రహం, ప్రభుదాన్ పట్వారీ

అయితే అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాల్లో ఏర్పడ్డప్పటినుంచీ అక్కడి కాంగ్రెస్వాదులైన గవర్నర్లకు కాంగ్రెసేతర మంత్రి వర్గాలకు బొత్తిగా పడకపోవడంవల్ల గవర్నర్ పదవి వివాదాల వలయంలో చిక్కుకొన్నది. ఇందుకు ఉదా:- కేరళ గవర్నర్ శ్రీమతి రామ్ దుల్హారి సిన్హాకు అక్కడి వామపక్ష సంఘటన మంత్రి వర్గానికి మధ్య ఏర్పడ్డ తీవ్రమైన విభేదాలు, ఆమె వ్యవహారసరళి పట్ల రాష్ట్ర అసెంబ్లీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆమోదించిన తీర్మానం ఆంధ్రప్రదేశ్లో గవర్నర్ కుముద్బెన్ జోషికి రాష్ట్ర మంత్రివర్గానికి మధ్య అభిప్రాయ భేదాలు ఎంత తీవ్ర స్థాయికి వెళ్ళాయి. ఇటువంటి వివాదాస్పదమైన గవర్నర్లు కాంగ్రెసేతర రాష్ట్రాలకే పరిమితం కాలేదు. కాంగ్రెస్ మంత్రి వర్గం ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్వారి గవర్నరైనప్పుడు కూడా అంతా సామరస్యంగా సాగిపోతుందని చెప్పటానికి వీల్లేదని బీహార్ ముఖ్యమంత్రి భగవతూ ఆజాక్కు ఆ రాష్ట్ర గవర్నర్ గోవింద నారాయణ్సింగ్కు మధ్య వచ్చిన తీవ్రమైన విభేదాలను ఉదాహరణగా తీసుకోవచ్చు. అయితే విభేదాలు ఉన్నంత మాత్రాన గవర్నర్ పదవిని రద్దు చేయాలనటం సమంజసం కాదు.

## 2.18. సారాంశం :

పార్లమెంటరీ ప్రభుత్వంలో మంత్రిమండలి శాసన సభ మద్దతుపై పదవిలో కొనసాగుతుంది. కాబట్టి అనిశ్చిత రాజకీయ పరిస్థితిలో ప్రభుత్వం రద్ధయినపుడు ప్రత్యామ్నాయ ప్రభుత్వం సాధ్యంకానపుడు గవర్నర్ ఆవశ్యకత తప్పనిసరి అవుతుంది. అందువల్ల గవర్నర్ పదవిని రద్దు చేయాలని వారించటంకంటే ఆ పదవిని నిర్వహించేవారు తమ అధికారాలను దుర్వినియోగం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో మెలగకుండా రాజ్యాంగపరమైన జాగ్రత్తలు తీసుకోవటం అవసరం.

## 2.19. స్వీయ అంచనా ప్రశ్నలు :

1. కేంద్ర రాష్ట్ర సంబంధాలలో శాసన పరమైన సంబంధాలను గురించి వివరించుము.
2. కేంద్ర రాష్ట్ర సంబంధాలలో పరిపాలన మరియు ఆర్థిక సంబంధాలు గురించి వివరించుము.
3. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఏర్పాటు చేయబడిన సర్కారియా కమిషన్ చేసిన సిఫార్సులను వివరించుము.
4. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై గవర్నర్ పాత్రను విమర్శనాత్మకంగా వివరింపుము.

## 2.20. చదువతగిన గ్రంథాలు :


1. Indian Government and Politics - J.C Johari
2. Introduction to the Constitution of India - D.D.Basu P
3. Indian Political System - Hans Raj.

## పాఠం - 3

## కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

విషయ క్రమం:-

**3.0** - లక్ష్యం

**3.1** - ఉపోద్ఘాతం

**3.2** - శాసన సంబంధాలు

**3.3** - పాలన సంబంధాలు

**3.4** - కేంద్ర రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే రాజకీయ పరిణామాలు

**3.5** - పాలన సంస్కరణల సంఘం

**3.6** - రాజమన్నార్ సంఘం నివేదిక

**3.7** - ఆనందపూర్ సాహెబ్ తీర్మానం

**3.8** - సర్కారియా కమిషన్ నివేదిక

**3.9** - సంఘర్షణ రంగాలు

**3.10** - రావాల్సిన రంగాలు

**3.11** - రావాల్సిన మార్పులు

**3.12** - కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో గవర్నర్ పాత్ర

**3.13** - గవర్నర్‌పై వివాదాలకు కారణాలు

**3.14** - గవర్నర్ - కేంద్రం హితకారియా?

**3.15** - ముఖ్యమంత్రి సలహా గవర్నర్ పాటించాలా?

**3.16** - గవర్నర్ ముఖ్యమంత్రిని తొలగించగలరా?

**3.17** - రాష్ట్రపతి పాలన

**3.18** - గవర్నర్ పదవిని రద్దు చేయాలి?

**3.19** - సారాంశం

**3.20** - మాదిరి ప్రశ్నలు

**3.21** - చదువదగిన గ్రంథాలు

## 3.0 - లక్ష్యం:-

భారత రాజ్యాంగంలో XI మరియు XII వ భాగంలో పొందుపరచిన శాసన, పరిపాలన, ఆర్థికపరమైన సం బంధాలను గురించి వివరించటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**కేంద్ర - రాష్ట్ర సంబంధాలు**

## 3.1. ఉపోద్ఘాతం:-

భారత రాజ్యాంగంలో నిర్మాతలు సిద్ధాంతపరంగా కాకుండా కేవలం పాలనా సౌలభ్యం కోసమే సమాఖ్య విధానాన్ని అనుసరించినట్లు కనిపిస్తుంది. కారణం రాజ్యాంగంలో ఎక్కడా సమాఖ్య అను పదము పేర్కొనబడలేదు సరికదా బలమైన కేంద్ర ప్రభుత్వమును సృష్టించారు. అందువలన మన రాజ్యాంగంలో సమాఖ్య లక్షణాల కంటే ఏకకేంద్ర లక్షణాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

Note:- మనదేశం అనుసరించే సమాఖ్య విధానం కెనడాను పోలి ఉంటుంది. "కెనడాలో లాగానే మనం కూడా సమాఖ్యకు బదులుగా యూనియన్ అనే పదాన్ని ఉపయోగించాము.

భారత రాజ్యాంగంలోని XI వ భాగంలో ప్రకరణలు 245 నుండి 255 వరకు గల ప్రకరణలలో శాసన స ంబంధాలను, ప్రకరణలు 256 నుండి 263 వరకు గల ప్రకరణలలో పరిపాలనా సంబంధాలను మరియు XI I వ భాగంలోని ప్రకరణలు 264 నుండి 300(A) వరకు గల ప్రకరణలలో ఆర్థిక సంబంధాలను పేర్కొన్నారు.

- కేంద్ర జాబితా (Union List) (List-I) -

కేంద్ర జాబితాలోని ఎంట్రీల క్రమసంఖ్య 97 ఉన్ననూ, ప్రస్తుతం మొత్తం ఎంట్రీల (అంశాల) సంఖ్య - 100.

- రాష్ట్ర జాబితా (State List) (List-II) -

రాష్ట్ర జాబితాలోని అంశాల క్రమసంఖ్య 66 ఉన్ననూ, కొన్ని తొలగించబడినవి ప్రస్తుతం మొత్తం అంశాల సంఖ్య 61.

- ఉమ్మడి జాబితా (Concurrent List) (List-III) -
- ఉమ్మడి జాబితాలోని అంశాల క్రమసంఖ్య 47 ఉన్ననూ, ప్రస్తుతం మొతం అంశాల సంఖ్య - 52
- డాక్ట్రిన్ ఆఫ్ ఆక్యుపైడ్ ఫీల్డ్ సిద్ధాంతం ఉమ్మడి జాబితా (List-III) కు వర్తిస్తుంది.

**అవశిష్ట అంశాలు (Residual Powers):-**

ఉదా:- 1. అంతరిక్ష రంగం

2. అణుశక్తి

3. మానవ వనరుల వినియోగము

4. పర్యావరణ శాస్త్రము

5. వాతావరణ కాలుష్యం

## 3.2. శాసన సంబంధాలు:-

దేశ పరిపాలనకు సంబంధించిన అంశాలను మూడు జాబితాల కింద విభజించింది. అవి: కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా,ఉమ్మడి జాబితా. కేంద్ర జాబితాలోని పాలనాంశాలపై చట్టాలను రూపొందించే అధి కారం ఒక్క పార్లమెంటుకు మాత్రమే ఉంది. ఇందులో 97 అంశాలు ఉన్నాయి. వాటిలో దేశరక్షణ, విదేశీ వ్యవహారాలు, సాయుధబలాలు, మందుగుండు సామాగ్రి, అణుశక్తి, యుద్ధం, శాంతి, పౌరసత్వం, విదేశీ నేరస్తుల అప్పగింతలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్, నౌకాయానం, విమానయానం, తంతి తపాలా, ఆకాశవాణి, టెలిఫోను, సుప్రీంకోర్టు, కరెన్సీ నాణాలు, విదేశీ వ్యాపారం, అంతర్ రాష్ట్ర వర్తక వ్యాపారాలు, బ్యాంకులు మొదలైనవి.

రాష్ట్రజాబితాలో చేర్చిన పాలనాంశాలపై శాసనాలను రాష్ట్ర విధాన సభ ఆమోదిస్తుంది. రాష్ట్ర జాబితాలో 66 అంశాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి వ్యవసాయం, శాంతిభద్రతలు, పోలీసు, కారాగారాలు, నీటి సరఫరా, పంచాయితీల సంస్థలు, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మొదలైనవి. వీటితో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పరిపాలన చేయటానికి అనువుగా కొన్ని పాలనాంశాలను ఉమ్మడి జాబితాలో చేర్చారు. అయితే ఉమ్మడి జాబితాలోని ఏదైనా ఒక అంశంపై పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ రూపొందించిన చట్టాల్లో తేడా ఉన్నట్లైతే ఆ వైవిధ్యం మేరకు కేంద్రచట్టమే అమల్లోకి వస్తుంది. ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి వివాహం, విడాకులు, వ్యవసాయేతర భూములు, ఆస్తుల మార్పిడి, ఒప్పందాలు, ధర్మకర్తలు, ధర్మకర్తృత్వ సంస్థలు, ఆహార పదార్థాల కల్తీ, ఆర్థిక సామాజిక ప్రణాళికా రచన మొదలైనవి.

రాష్ట్ర శాసనసభకు రాష్ట్ర జాబితాలోని పాలనాంశాలపై చట్టాలను రూపొందించే అధికారం ఉన్నప్పటికీ ఆ అధికారం బేషరతుగా లేదు. రాజ్యాంగ పరంగా శాసన సభ అధికారాలపై ఈ కింది పరిమితులు ఉన్నాయి.

1. జాతీయ ప్రయోజనం దృష్ట్యా రాష్ట్ర జాబితాలో ఏ అంశాన్నైనా 2/3 వంతు మెజారిటీతో ఒక తీర్మానాన్ని ఆమోదించి ఒక సంవత్సర కాలానికి సదరు అంశంపై చట్టాలను రూపొందించే అధికారాన్ని పార్లమెంటుకు రాజ్యసభ కల్పించవచ్చు. తర్వాత అవసరమైతే మరొక తీర్మానం ద్వారా ఈ కాలాన్ని ఇంకో సంవత్సరానికి పొడిగించవచ్చు.

2. రాష్ట్రంలో 'రాష్ట్రపతి పాలన' ను ప్రవేశపెట్టినపుడు శాసన సభ రూపొందించాల్సిన చట్టాలన్నింటిని పార్లమెంటే రూపొందిస్తుంది.

3. కొన్ని రాష్ట్రాలు తమ సమిష్టి ప్రయోజనం కోసం రాష్ట్ర జబితాలో పేర్కొన్న ఒక అంశంపై చట్టాన్ని రూపొందించమని పార్లమెంట్‌ను కోరవచ్చు.

4. జాతి అత్యవసర పరిస్థితిని ప్రవేశపెట్టినపుడు పార్లమెంట్‌కు రాష్ట్ర జాబితాలోని పాలనాంశాలపై చట్టాలను ఆమోదించే అధికారం లభిస్తుంది.
5. అదే విధంగా భారత ప్రభుత్వం విదేశాలతో చేసుకున్న ఒడంబడికలను అమలు చేయటానికి అవసరమైన చట్టాలను పార్లమెంటు ఆమోదిస్తుంది. అవి మొత్తం దేశానికి వర్తించటమే కాకుండా కొన్ని సందర్భాల్లో రాష్ట్ర జాబితాకు సంబంధించిన అంశాలు కూడా కావచ్చు.
6. కొన్ని సందర్భాల్లో శాసన సభ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ తమ సమ్మతిని ఇవ్వకుండా ఆ బిల్లులో వివాదాస్పదమైన అంశాలున్నాయని భావిస్తే దాన్ని రాష్ట్రపతి అభిప్రాయానికి పంపించవచ్చు.
7. వీటన్నిటి కంటె కేంద్ర రాష్ట్ర శాసన సంబంధాల్లో అత్యంత వివాదాస్పదమైన అంశం రాష్ట్రపతికి శాసనసభ కాలపరిమితి పూర్తి కాకుండానే రద్దుచేసే అధికారం. దీనివల్ల శాసనసభ ఉనికి కేంద్ర ప్రభుత్వ ఇష్టానిష్టాపై ఆధారపడి ఉంటుంది.

## 3.3. పాలనా సంబంధాలు:-

కేంద్ర రాష్ట్రాల మధ్య పాలనా సంబంధాలను రాజ్యాంగంలోని 256 - 262 నిబంధనలు ఈ విధంగా వివరిస్తున్నాయి.

1. రాష్ట్రాలు తమ కార్యనిర్వాహణాధికారాన్ని కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహణాధికారానికి భంగం కలగని పద్ధతి లో ఉపయోగించుకోవాలి. ఆ మేరకు అవసరమైన ఆదేశాలను కేంద్రం రాష్ట్రాలకు జారీ చేస్తుంది. కేంద్ర చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్రాలు తమ కార్యనిర్వాహణాధికారాలను చలాయించటానికి వీలులేదు.
2. కేంద్రం తమ విధానాలను నిర్వహించటంలో రాష్ట్రప్రభుత్వం ఎటువంటి ఇబ్బందులను, అడ్డంకులను కలుగనీయకుండా లేదా కల్గించరాదని రాష్ట్రాలకు ఆదేశాలను ఇవ్వవచ్చు. ఇటువంటి ఆదేశాలు ఉదా:- జాతీయ భద్రత, రైల్వేశాఖ ఆస్తులు, ప్రభుత్వరంగ సంస్థలు, ఆకాశవాణి దూరదర్శన్ కేంద్రాలు మొదలైనవి సంబంధించినవై ఉంటాయి.
3. కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డు కులాలు తరగతుల సంక్షేమానికి సంబంధించిన కొన్ని ఆదేశాలను రాష్ట్రాలకు ఇవ్వవచ్చు.
4. రాష్ట్రాల సమ్మతితో కేంద్రం కొన్ని షరతులతో లేదా ఎటువంటి షరతులను విధించకుండా కొన్ని విధులను రాష్ట్రాలకు అప్పగించవచ్చు. అటువంటి సందర్భాల్లో సదరు విధుల నిర్వహణకు రాష్ట్రాలు అంగీకరించాలి.
5. ప్రతి రాష్ట్రాన్ని విదేశ దురాక్రమణ నుంచి కాపాడటం, ఆ రాష్ట్రప్రభుత్వం కోరినపుడు అవసరమైన సైన్యాన్ని పంపి అక్కడ శాంతి భద్రతలకు ఏర్పడ్డ ప్రమాద పరిస్థితిని తొలగించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంది.

అదే విధంగా ప్రతి రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ పరంగా వ్యవహరించేటట్లు కేంద్ర ప్రభుత్వం చూడాల్సి ఉంటుంది.

6. నదీ జలాల వినియోగం వాటి పంపిణీకి సంబంధించిన కేంద్ర రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించటానికి అవసరమైన చట్టాలను ఆమోదించే అధికారం పార్లమెంటుకు ఉంది.

7. రాష్ట్రాల మధ్య ఏర్పడ్డ వివాదాల పరిష్కరణకు కేంద్రం ఒక అంతర రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవచ్చు.

8. జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలను తు.చ. తప్పకుండా అనుసరించాలి. సదరు అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు భారత రాజ్యాంగం సమాఖ్య తత్వాన్ని కోల్పోయి ఏక కేంద్ర వ్యవస్థగా రూపాంతరం చెందుతుంది.

9. పైన పేర్కొన్న వాటికంటే అత్యంత కీలకమైంది. వివాదాస్పదమైన అంశం ఏమంటే రాష్ట్ర ప్రభుత్వాలను అర్థాంతరంగా రద్దు చేసే రాష్ట్రపతి అధికారం. రాజ్యాంగంలోని 356 నిబంధన కింద రాష్ట్ర ప్రభుత్వాన్ని అంటే మంత్రిమండలిని శాసన సభలో మెజారిటి ఉన్నప్పటికి పదవీ కాలం పూర్తి కాకుండానే రాష్ట్రపతి రద్దు చేయవచ్చు.

**ఆర్థిక సంబంధాలు:-**

కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను రాజ్యాంగం ఈ కింది విధంగా నిర్దేశిస్తుంది.

1. కేంద్ర జాబితాలో పేర్కొన్న పాలనాంశాలపై విధించిన పన్నుల నుంచి లభించే ఆదాయం మొత్తం కేంద్రానికే చెందుతుంది. అదే విధంగా రాష్ట్ర జాబితాలోని అంశాలపై విధించిన పన్నుల నుంచి వచ్చే రాబడి రాష్ట్రాలకు చెందుతుంది. కేంద్ర ప్రభుత్వానికీ ఆదాయంపై పన్ను, విదేశీమారకం, కష్టమ్స్ సుంకాలు, పొగాకు, తంతి తపాలా కార్యాలయాల్లో పొదుపు ఖాతాలు, రైల్వేలు, బ్యాంకులు, జీవిత బీమా, కేంద్ర ప్రభుత్వ రంగ పరిశ్రమలు మొదలైన వాటినుంచి ఆదాయం లభిస్తుంది. రాష్ట్రాలకు భూమిశిస్తు, విద్యుచ్ఛక్తి, భవనాలు, ఆబ్కారి, వాహనాలు, అమ్మకం పన్ను, వినోదంపై పన్ను మొదలైనవి ఆదాయ మార్గాలు.

2. కొన్ని పన్నులను కేంద్రం విధిస్తుంది. అయితే వాటిని వసూలుచేసి ఆ ఆదాయాన్ని రాష్ట్రాలు వేసుకుంటాయి. వీటిలో స్టాంపు పన్నులు, మందుల తయారీపై విధించే సుంకాలు మొదలైనవి ఉన్నాయి.

3. మరికొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి వసూలుచేసి అందులో కొంత ఆదాయాన్ని రాష్ట్రాలకు ఇస్తుంది. ఉదా:- రైల్వే చార్జీలపై విధించే పన్నులు.

4. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వమే విధించి వసూలు చేసి ఆ మొత్తాన్ని కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయటం జరుగుతుంది.

ఉదా:- ఆదాయం పన్ను

రాష్ట్రాలకు ఆర్థిక వనరులను పంపిణీ చేయటంలో సలహాలివ్వటానికి అయిదు సంవత్సరాలకొకపర్యాయం రాష్ట్రపతి ఒక ఆర్థిక సంఘాన్ని నియమిస్తారు. ఈ సంఘం సలహాలను సాధారణంగా కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తుంది. అంతేకాక వివిధ రాష్ట్రాలమధ్య వనరుల పంపిణీ చేయటానికి అవసరమైన సూచన

లు ఇవ్వటం, కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాల్సిన పన్నుల మూల నికర ఆదాయ మొత్తాలను కేంద్ర రాష్ట్రాల మధ్య పంపిణీ చేయటం, ఇటువంటి ఆదాయాలను వివిధ రాష్ట్రాలకు కేటాయించటం, భారత సంఘటిత నిధినుంచి రాష్ట్రాల ఆదాయాల కోసం ఇచ్చే సహాయ మొత్తాలు (గ్రాంట్స్ - ఇన్ -ఎయిడ్) నిర్దేశించే సూత్రాలను రూపొందించటం ఆదాయ పంపిణీ విషయంలో కేంద్ర ప్రభుత్వం పాక్షికంగా వ్యవహరించకుండా నివారించటం. ఎప్పటికప్పుడు మారుతూ ఉన్న రాష్ట్రాల అవసరాలను మదింపు చేయటం ఆర్థిక సంఘ బాధ్యత.

అయితే ఆర్థిక సంబంధాల్లో కూడా రాష్ట్రాలపై కేంద్రానికి ఆధిక్యత ఉంది. రాజ్యాంగంలోని 290, 291 నిబంధనల కింద ప్రజారుణాలను సేకరించే అధికారం కేంద్ర రాష్ట్రాలకు ఉన్నప్పటికీ, కేంద్రానికి రాష్ట్రాల కంటే అపారమైన వనరులు ఉన్నాయి. అతి ముఖ్యమైన సంస్థలు వాటి నిర్వహణపై కేంద్రానికి ఎక్కువ ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఆర్థిక సంఘం, జాతీయ ప్రణాళికా సంఘం, భారత రిజర్వ్ బ్యాంక్ మొదలైన సంస్థలు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పడి పని చేస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వనరులను ప్రభావితం చేసే ఈ సంస్థలపై కేంద్ర ప్రాబల్యం ఎక్కువగా ఉండటం వల్ల రాష్ట్రాలు ఆర్థిక సంబంధాల్లో తరచు ఇబ్బందులకు గురి అవటమే కాకుండా కేంద్రంలో వివాదాలకు దిగుతున్నాయి.

కేంద్రంతో పోల్చినట్లైతే రాష్ట్రాల ఆదాయ వనరులు చాలా స్వల్పం. రాష్ట్ర ఆదాయంలో 40% ప్రభుత్వోద్యోగుల వేతనాలకిందే పోతుంది. మిగిలిన వాటిలో విద్య, సాంఘిక సంక్షేమం జనాకర్షణ విధానాల అమలుకు పెద్ద పీట లభిస్తుంది. ఏదైనా కాస్తో కూస్తో మిగిలి ఉన్నట్లైతే వాటిని కరువుకాటకాలు, తుఫాన్ సృష్టించిన బీభత్సం కబళించివేస్తాయి. అటువంటి పరిస్థితుల్లో దీర్ఘకాలిక ప్రాతిపదికపై పారిశ్రామికీకరణ వ్యవసాయాభివృద్ధి, మంచినీటి కొరత నివారణకు కావాల్సిన నదీజలాల వినియోగంకై ప్రాజెక్టుల నిర్మాణం సహజంగానే అప్రాధాన్యత స్థితిలో ఉంటాయి. అందువల్ల రాష్ట్రాలు తరచూ కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడతాయి. కేంద్రంతో అనుకూలంగా ఉన్న రాష్ట్రాలకు ఎక్కువ సహాయం సకాలంలోలభిస్తుందని, రాజకీయంగా కేంద్రంతో విభేదించే రాష్ట్రాలకు రుణ సహాయం నామమాత్రంగా ఉంటుందని ఒక సాధారణ విమర్శ సర్వత్రా వినిపిస్తూ ఉంటుంది. తెలుగు గంగ నిర్మాణం విషయంలో అనేక అడ్డంకులను కేంద్ర ప్రభుత్వం సృష్టిస్తుందని, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికీకరణకై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకే కేంద్రం ప్రాధాన్యత ఇస్తుందని, తరచూ తెలుగు దేశం చేసే విమర్శలను పై ధోరణికి ఉదాహరణలుగా తీసుకోవచ్చు.

ఆర్థిక సంబంధాల విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ వివాదం రావటానికి ఇటీవలి కాలంలో ఏర్పడ్డ అనేక సమస్యలు ముఖ్యకారణం. కాంగ్రెసేతర ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడటానికి కేంద్ర ప్రభుత్వ పాక్షిక ధోరణే కారణమని కాంగెసేతర ముఖ్యమంత్రులు తరచూ విమర్శిస్తున్నారు. ఆదాయం పన్ను, ఎక్సైజ్ పన్ను మొదలైన వాటిలో రాష్ట్రాలకు కేంద్రంతో సమానంగా వాటా

కావాలని తొమ్మిదో ఆర్థిక సంఘంతో కాంగ్రెసేతర ప్రభుత్వాలు వారించాయి. అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఉదా:- తమిళనాడులో ఎం.జి. రామచంద్రన్ ప్రవేశపెట్టిన విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, వయసు మళ్ళిన వారికి పెన్షన్ సౌకర్యం, ఆంధ్రప్రదేశ్‌లో అమల్లో ఉన్న రెండు రూపాయల కిలో బియ్యం, సగం ధరలకే జనతా వస్త్రాలు మొదలైన సబ్సిడీ పథకాల వల్ల రాష్ట్రాల ఖర్చు విపరీతంగా పెరిగిపోయింది. వీటిని అంటే, అనుత్పాదక వ్యయాన్ని తగ్గించినట్లైతే రాజకీయంగా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్న భయం ఒకవైపు, అదుపు తప్పిన వ్యయం దివాలాకోట స్థితికి మరొకవైపు లాగుతూ ఉండటంవల్ల రాష్ట్రాలు తీవ్రమైన వత్తిడికిలోనై కేంద్రంతో తరచూ వివాదాలకు దిగుతున్నాయి. అందువల్ల ఆర్థిక వెసులుబాటుతనం, కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలు సాఫీగా కొనసాగటానికి అడ్డంకులను సృష్టిస్తున్నాయి.

### 3.4. కేంద్ర రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే రాజకీయ పరిణామాలు:-

రాజ్యాంగ పరంగానే కాకుండా ఇతరత్రా కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలను ప్రభావితం చేసే అంశాలు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి రాజకీయ పరిణామాలు. 1950 నుంచి 1967 వరకూ కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో పెద్దగా వివాదాలు ఏర్పడలేదు. దీనికి ఒక ప్రధాన కారణం ఇటు కేంద్రంలోనూ అటు రాష్ట్రాల్లోనూ ఒక రాజకీయ పక్షం కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొనసాగడం. గవర్నర్లు, ముఖ్యమంత్రులు ఒక రాజకీయ పక్షానికి - కేంద్రంలో అధికారంలో ఉన్న రాజకీయ పక్షానికి చెంది ఉండటంవల్ల కేంద్ర రాష్ట్రాల మధ్య ఎటువంటి రాజ్యాంగ, రాజకీయ పరమైన వివాదాలు ఉత్పన్నం కాలేదు.

అయితే 1967 నుంచి 1972 వరకూ కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విషయంలో, వనరుల విషయంలో తరచూ వివాదాలు తలెత్తాయి. దీనికి ప్రధాన కారణం 1967 సాధారణ ఎన్నికల అనంతరం అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయి మొదటిసారిగా కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. తమిళనాడులో డి.ఎమ్.కె., పశ్చిమ బెంగాల్‌లో యునైటెడ్ ఫ్రంట్, బీహార్, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సంయుక్త విధాయక దళ (ప్రతిపక్షకూటమి) ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. దాంతోపాటు ఈ ప్రభుత్వం అధికారాల కోసం, కేంద్రం, జోక్యం రాష్ట్ర వ్యవహారాల్లో తగ్గించటానికి ఆందోళన చేయటం ప్రారంభమైంది.

కానీ 1972-77 మధ్యకాలంలో మళ్ళీ కేంద్ర రాష్ట్రాల మధ్య తిరిగి ఎటువంటి వివాదాలు ఏర్పడలేదు. దీనికి ముఖ్య కారణం తిరిగి ఒక రాజకీయ పక్షం కేంద్ర రాష్ట్రాల్లో అధికారాన్ని చేబట్టటం. 1972 సాధారణ ఎన్నికలలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో మళ్ళీ అధికారంలోకి వచ్చింది. అందువల్ల ఈ కాలంలో కేంద్ర రాష్ట్రాల మధ్య చెప్పుకోదగ్గ వివాదాలు ఏర్పడలేదు. అయితే 1977-1980 మధ్య కాలంలో తిరిగి భారత రాజకీయాల్లో మరొక నూతన పరిణామం ఏర్పడింది. 1977 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయి

జనతాపార్టీ కేంద్రంలో అధికారంలోకి రావటం, తదనంతరం 1978లో రాష్ట్ర శాసన సభలకు జరిగిన ఎన్నికల్లో జనతాపార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి రావటంతో పాటు తమిళనాడులో ఎ.ఐ.డి.ఎమ్.కె., పంజాబ్‌లో అకాళీదళ్, జమ్మూకాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, పశ్చిమబెంగాల్‌లో వామపక్ష సమైక్య కూటమి ప్రభుత్వాలను ఏర్పరచటంతో అధికారం విషయంలో రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడిని తీసుకురావటానికి ప్రయత్నించాయి. అయితే మొరార్జీదేశాయ్ రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను ఇవ్వాల్సిన అవసరంలేదని భావించటంతో పాటు జనతా ప్రభుత్వం పతనం అవటం కూడా జరిగింది.

1980లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ ఘనవిజయాన్ని సాధించి కేంద్రంలో అధికారంలోకి రావటంతోపాటు అనేక రాష్ట్రాల్లో జనత ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు తిరిగి ఏర్పడ్డాయి . దీంతో తిరిగి కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో సాధారణ స్థితి ఏర్పడింది.

అయితే 1983 నుంచి అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడటంతో కేంద్ర రాష్ట్రాల మధ్య తిరిగి అధికారం విషయంలో, ఆర్థిక వనరుల విషయంలో, కేంద్రం రాజకీయ జోక్యం విషయంలో, ముఖ్యంగా గవర్నర్ తన పదవీబాధ్యతలను నిర్వహించే విషయంలో తరచూ వివాదాలు ఏర్పడ్డాయి. 1983లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలన్న రాజకీయ వివాదాన్ని లేవనెత్తింది. 1983 మార్చిలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం బెంగుళూరులో జరిగింది. వీరు రాష్ట్రాలకు ఆర్థిక అధికారాలు, రాజ్యాంగ పరిధిలో ఉన్న సంబంధాలను సమీక్షించటానికి, అవసరమైన మార్పులను సూచించటానికి ప్రభుత్వ జస్టిస్ సర్కారియా సంఘాన్ని నియమించింది. ఇంతవరకూ కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిశీలించిన సంఘాలు, వాటి సూచనలను ఇప్పుడు సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

### 3.5. పాలనా సంస్కరణల సంఘం:-

ఎమ్.సి. సితల్‌వాడ్ నాయకత్వంలో పాలనా సంస్కరణల సంఘం అధ్యయన కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఈ కింది సూచనలు చేసింది:

1. సాధారణ పరిస్థితుల్లో కేంద్రం రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదు.
2. అత్యవసర పరిస్థితిలో రాష్ట్ర జాబితాలోని పాలనాంశాలపై కేంద్ర ప్రభుత్వానికి పరిమితమైన అధికారాలు మాత్రమే ఉండాలి.
3. ఉత్పాదక శక్తి గల ప్రణాళికా పరమైన పథకాలకు మాత్రమే కేంద్రం రాష్ట్రాలకు ఋణసహాయం చేయాలి.
4. రాష్ట్రాలకు అనుత్పాదక పథకాల విషయంలో మూలధనాన్ని గ్రాంటుల రూపంలో కేంద్రం లభ్యం చేయాలి.
5. జాతీయ ప్రణాళికా పథకాల కింద రాష్ట్రాలు కేంద్రానికి చెల్లించాల్సిన రుణాల వ్యవహారాలను ఒక నిపుణుల సంఘం పరిశీలించి తగిన సూచనలు ఇవ్వాలి.
6. రాష్ట్రాల మధ్య ప్రణాళికా గ్రాంటుల పంపిణీని ఆర్థిక సంఘం నిర్ణయించాలి. అంతేకాక ఆర్థిక సంఘానికి

ప్రణాళికా సంఘానికి మధ్య సమన్వయం ఉండటానికి వీలుగా జాతీయ ప్రణాళికా సంఘంలోని ఒక సభ్యుడు ఆర్థిక సంఘంలో సభ్యునిగా నియమితుడవ్వాలి.

7. ప్రధానమంత్రి అధ్యక్షతన ఆర్థికమంత్రి, దేశవ్యవహారాల మంత్రి, లోక్‌సభలోని ప్రతిపక్షనాయకుడు, జోనల్ కౌన్సిల్ నుంచి ఒక ప్రతిపక్ష ప్రతినిధి సభ్యులుగా ఒక అంతః రాష్ట్ర సమితిని ఏర్పాటు చేయాలి.

8. గవర్నర్‌కు రాజ్యాంగం కల్పించిన విచక్షణాధికారాలను నిర్వహించటంలో పై సమితి కొన్ని మార్గదర్శక సూత్రాలను రూపొందించాలి.

9. మంత్రిమండలి శాసనసభలో మెజారిటీ మద్దతును కోల్పోయిందని గవర్నర్ భావించినప్పుడు వెనువెంటనే గవర్నర్ శాసనసభను సమావేశపరిచి మంత్రిమండలికి మెజారిటీ మద్దతు ఉండాలనే నిర్ధారణ చేసుకోవాలి.

10. అంతరాష్ట్ర నదీజలాల వినియోగం విషయంలో ఏర్పడే వివాదాలు మూడు సంవత్సరాల వ్యవధిలో పరిష్కరించాలి. కాలపరిమితి మించిన తర్వాత నిర్బంధ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించాలి.

11. కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, ఆస్తి పాస్తుల భద్రత, జాతీయ రహదారి భవనాల నిర్మాణం మొదలైన విషయాలకు, సంబంధించినంత వరకూ రాష్ట్రాల్లో రక్షణ దళాలను నియమించే అధికారం కేంద్రానికి ఇవ్వాలి.

### 3.6. రాజమన్నార్ సంఘం నివేదిక:-

1970లో తమిళనాడు ప్రభుత్వం నియమించిన రాజమన్నార్ సంఘం కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో ఈ కింది సూచనలను ఇచ్చింది.

1. రాష్ట్రపతి, ప్రధానమంత్రి రాష్ట్ర ముఖ్యమంత్రులు నియమించిన ప్రతినిధులతో కూడిన ఒక అంతర్ రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలకు రాజ్యాంగంలోని 256, 257, 339(2) నిబంధనలను అనుసరించి కేంద్రం ఆదేశాలను ఇచ్చే అధికారాన్ని రద్దు చేయాలి. లేదా అటువంటి ఉత్తర్వులను అంతర్ రాష్ట్రమండలి అనుమతిలేకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు జారీచేయరాదు.

2. రాష్ట్ర అవసరాలను ప్రభావితం చేసే ముసాయిద బిల్లులను అంతర్‌రాష్ట్ర మండలి అనుమతితోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి.

3. కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని పాలనాంశాలను పునర్విభజించటానికి ఒక ఉన్నతాధికార సంఘాన్ని నియమించాలి.

4. పన్నుల విధింపుకు సంబంధించిన అంశాలకు సంబంధించిన అవశేషాధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.

5. రాష్ట్రాలకు, రాష్ట్రాల్లోని సంస్థలకు బాధ్యతలను అప్పగించేటందుకు పార్లమెంటు చేసే చట్టాలను రాష్ట్ర ప్రభుత్వంతో ముందుగా ప్రస్తావించాలి.

6. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల కోసం రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అందిచ్చే ఆర్థిక సహాయం ఆర్థిక సంఘం చేసిన సూచనలకు అనుగుణంగా ఉండాలి.

7. ప్రస్తుతం అమల్లో ఉన్న జాతీయ ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష, పరోక్ష జాప్యాలకు అతీతంగా వ్యవహరించగల, స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న ఒక నూతన ప్రణాళికా సంఘాన్ని పార్లమెంట్ చట్టం ద్వారా నియమించాలి.

8. శాసన సభలో మెజారిటీ సభ్యులు బలపరచిన నాయకుడిని ముఖ్యమంత్రిగా గవర్నర్ నియమించాలి.

9. ఏ రాజకీయ పక్షానికీ మెజారిటీ లేనప్పుడు శాసనసభను సమావేశపరిచి మెజారిటీ సభ్యులు బరపరచిన నాయకుని గవర్నర్ ముఖ్యమంత్రిగా నియమించాలి.

10. శాసనసభలో మెజారిటీ మద్దతుని ముఖ్యమంత్రి కోల్పోయిరని గవర్నర్ భావించినప్పుడు తక్షణమే శాసనస భను సమావేశపరిచి తన బలాన్ని నిరూపించుకోవాలని గవర్నర్ ముఖ్యమంత్రిని ఆదేశించాలి.

11. రాష్ట్రాల్లో "రాష్ట్రపతి పాలన" ను విధించటానికి రాష్ట్రపతికి అవకాశాన్ని కల్పించే 356, 357 రాజ్యాంగ నిబంధనలను రద్దుచేయాలి.

12. అన్ని రాష్ట్రాలకు రాజ్యసభలా సమాన సభ్యుల ప్రాతినిధ్యాన్ని కల్పించాలి.

13. రాజ్యసభకు సభ్యులను నియమంచే - 12 మందిని రాష్ట్రపతికి ఉన్న అధికారాన్ని రద్దు చేయాలి.

14. అంతర్ రాష్ట్ర వివాదాలను సుప్రీంకోర్టు ద్వారా పరిష్కరించాలి.

15. కేంద్ర మంత్రిమండలిలో అన్ని రాష్ట్రాలకూ సమానంగా ప్రాతినిధ్యం కల్పించాలి.

16. రాజ్యాంగ సవరణలకు 2/3 వంతు రాష్ట్రాల ఆమోదం ఉండాలి.

రాజమన్నార్ సంఘం నివేదిక ప్రారంభంలో చాలా సంచలనాన్ని కల్గించింది. నిజానికి 1973లో అకాలీదళ్ చేసిన తీర్మానం ఒక విధంగా సంఘం నివేదిక నుంచి స్ఫూర్తిని పొందిందని చెప్పవచ్చు.

### 3.7. ఆనందపూర్ సాహెబ్ తీర్మానం:-

1973లో అకాలీదళ్ ఆనందపూర్ సాహెబ్‌లో సమావేశం అయి కేంద్ర రాష్ట్ర సంబంధం గురించి సమీక్షిస్తూ ఈ కింది అంశాలను ఉటంకిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. నిజానికి తర్వాత కాలంలో ఏర్పడ్డ పంజాబ్ తీవ్రవాదం, ఖలిస్తాన్ ఉద్యం ఈ తీర్మానాన్ని అధారం చేసుకొన్నాయి.

1. పంజాబ్ నుంచి తీసుకొన్న ప్రాంతాలను - ఇతర రాష్ట్రాల్లో చేర్చిన వాటిని - తిరిగి పంజాబ్‌లో చేర్చాలి.

2. కేంద్ర ప్రభుత్వం రక్షణ, విదేశీవ్యవహారాలు, తంతి తపాలాలు, కరెన్సీ, నాణేలు రైల్వేలను నిర్వచించి మిగతా, అన్నింటిని పంజాబ్‌కు వదిలివేయాలి.

3. పంజాబ్ అవతల జీవించే అల్పసంఖ్యాక వర్గాల వారికి ముఖ్యంగా సిక్కు మతస్థులకు రక్షణ కల్పించాలి. వారి పట్ల ఏ రకమైన విచక్షణ - చూపకూడదు.

4. శిరోమణి అకాలీదళ్ భారత రాజ్యాంగాన్ని సమాఖ్యగా కొనసాగించటానికి రాష్ట్రాలను కేంద్రంతో సమానహోదాతో దించటానికి కృషి చేస్తుంది.

5. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న విదేశాంగ విధానం నిరుపయోగమంది. అది దేశానికి ప్రమాదకరమైంది. పొరుగు దేశాలతో స్నేహ సంబంధాలు పెంచుకోడానికి ముఖ్యంగా సిక్కు ప్రజలు అధిక సంఖ్యలో జీవించే రాజ్యాల్లో సంత్సంబంధాలు నెలకొల్పాలి.

6. అన్ని రాష్ట్రాలకు న్యాయం చేకూర్చటానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా రక్షణ విభాగంలో పనిచేసే సిక్కు సైనికులకు సైనికుల దుస్తుల్లో భాగంగా కృపాన్ ధరించటానికి అవకాశం ఇవ్వాలి.

7. మాజీ సైనికులకు పునరావాస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

8. నేరస్తులు కాని స్త్రీ, పురుషులు ఎటువంటి అనుమతి లేకుండా ఆయుధాలను ధరించటానికి చట్టాన్ని రూపొందించాలి.

9. ప్రజా బాహుళ్యం నివసించే ప్రదేశాల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ధూమపానాన్నీ నిషేధించాలి.

10. శిరోమణి అకాళీదళ్ ద్వారా కమిటీ సిక్కుమత సూత్రాలను ప్రచారం చేసుకోవటానికి ఒక అవకాశాన్ని కల్గించాలి.

11. చండీఘర్‌ను అంతర్జాతీయ విమానాశ్రయంగా మార్చాలి.

### 3.8. సర్కారియా కమీషన్ నివేదిక:-

1993 జూన్ 9న ఆర్. ఎమ్. సర్కారియా అధ్యక్షతన కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిశీలించటానికి ముగ్గురు సభ్యులతో ఒక కమిషన్‌ను శ్రీమతి ఇంతిరా గాంధీ నియమించారు. 1988 జనవరి 30న సర్కారియా సమర్పించింది.

కేంద్ర ప్రభుత్వం సర్కారియా కమీషన్‌ను ఈ కింది అంశాలను పరిశీలించమని కోరింది.

1. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ప్రస్తుతం ఉన్న సంబంధాల తీరును చక్కబరచాలి.

2. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నాటినుంచి భారతదేశంలోని పరిస్థితులను పరిశీలించి అభివృద్ధికి తగిన సూచనలు చేయటం.

3. ప్రస్తుతం ఉన్న సమస్యల దృష్ట్యా కేంద్ర రాష్ట్ర సంబంధాలను మరింత మెరగుపరచటానికి అవసరమైన మార్పులు (రాజ్యాంగంలో)

సర్కారియా కమీషన్ నాలుగున్నర సంవత్సరాలు వివిధ రాజకీయ పక్షాలలో, రాష్ట్ర ప్రభుత్వాలను చర్చించింది. ఒక ప్రశ్నావళిని తయారు చేసి వివిధ వ్యక్తులను, ప్రభుత్వాధికారాన్ని మౌఖికంగా పరిశీలించింది. చివరకు కమీషన్ 4900 పుటల నివేదికను పైన ఉటంకించిన తేదీన కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది.

సర్కారియా కమీషన్ నియామకం కేంద్ర ప్రభుత్వం తనంతటతానే చేయలేదు. వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రతిపక్షాల ఒత్తిడి వల్ల సర్కారియా కమీషన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేంద్ర రాష్ట్ర

సంబంధంలో మౌలికమైన మార్పును తీసుకురావటానికి తగిన సూచనలు చేస్తుందని ఆశించిన సమయంలో కమీషన్ తన నివేదిక సమర్పించటం వల్ల ఆసక్తి సహజంగానే పెరిగింది. అయితే ఈ కమీషన్ నివేదిక కీలకమైన అంశాలను దాటవేసింది. ప్రతిపక్ష ప్రభుత్వం మారిన మౌలిక మార్పును సర్కారియా కమీషన్ అంగీక రించలేదు. సూచించలేదు కూడా. ఆర్థిక వనరుల్లో, పన్నుల విధింపులో కొద్దిపాటి మార్పులను మాత్రం సూచించింది. కార్పొరేషన్ పనుల్లో రాజ్యాంగంలోని 299 నిబంధనలో మార్పులు తెచ్చి వ్యాపార ప్రకటన, రేడియో, దూరదర్శన్ ప్రకటనల నుంచి ఏర్పడే ఆదాయాలలో కొంత భాగం రాష్ట్ర ప్రభుత్వాలకు ఇవ్వమని సూచించింది.

**కమీషన్ సూచించిన ఇతర మార్పులు:-**

1. ఆర్థిక సంఘం సూచించినట్లు రైళ్ళలో ప్రయాణం చేసే ప్రయాణికుల నుంచి వచ్చిన ఆదాయంలో రాష్ట్రాల కు వాటా కల్పించాలి.

2. ముడి సరుకుల గనులపై వచ్చే ఆదాయ పంపకం గురించి రెండు సంవత్సరాలకొకసారి ఒక సమీక్ష చేయాలి (ఇప్పుడు నాలుగు సంవత్సరాలకొకసారి పరిశీలిస్తున్నారు).

3. బ్యాంకుల నుంచి ఒక సంవత్సరం కోసం అప్పు తీసుకొనే హక్కు రాష్ట్రాలకు ఉండాలి.

4. రాష్ట్రాల్లో పన్ను లేనటువంటి మునిసిపల్ బాండ్లను ప్రవేశపెట్టుకోవచ్చు.

ఈ సూచనలు రాష్ట్రాలకు ఓదార్పుగానే కనిపిస్తున్నాయే కాని నిజానికి వాటి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచే విధంగా లేవు.

5. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం లభ్యం చేసిన వనరులను దుర్వినియోగం చేసినట్లైతే లేదా ఒక పద్దు నుంచి మరొక పద్దుకు ఆర్థిక వనరులను మార్చినా అటువంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి. అయితే కేంద్ర ప్రభుత్వం కనుక నిధులను దుర్వినియోగం చేసినట్లైతే కేంద్రాన్ని ఎవరు శిక్షించాలో అనే దాన్ని సర్కారియా సంఘం సూచించలేదు.

6. గవర్నర్ నియామకంలో సంఘం ఈ సూచనను చేసింది. అదేమిటంటే "గవర్నర్ నియామకం సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాకే, ఏ వ్యక్తిని నియమించాలో నిర్ణయించాలి. "రాజ్యాంగంలోని 155 నిబంధనను ఇందుకు అనుగుణంగా మార్చాలి. ముఖ్యమంత్రితో సంప్రదింపులను చట్టబద్ధం చెయ్యాలి" అని సంఘం స్పష్టంగా సూచించింది.

సర్కారియా కమీషన్ గవర్నర్ నియామక సందర్భంలో గమనించాల్సిన అర్హతలకు సంబంధించి కూడా కొన్ని సూచనలు చేసింది. గవర్నర్ విషయంలో వస్తున్న వివాదాలన్నీ సరైన వ్యక్తులను నియమించటం ద్వారా తొలగించవచ్చని కమీషన్ అభిప్రాయపడింది. అందుకుగాను గవర్నర్ ఏదో ఒక రంగంలో ప్రజ్ఞాశాలి

అయి ఉండాలి. అతడు గవర్నర్‌గా పనిచేసే రాష్ట్రానికి చెందకూడదు. ఆ రాష్ట్ర రాజకీయంలో అతనికి ఎటువంటి సంబంధాలు ఉండరాదు. గవర్నర్ నియామకానికి ఎంపికైన వ్యక్తులు ఆ పదవీ బాధ్యత లు స్వీకరించటానికి పూర్వ దేశ రాజకీయాల్లో క్రియాత్మకంగా పాల్గొనక పోవడం మంచిది. వీటితోపాటు కేంద్ర మంత్రులను గవర్నర్లుగా నియమించే పద్ధతిని మానుకోవాలి. మైనారిటీ వర్గాలకు చెందిన వారిని గవర్నర్లుగా నియమించటం కొనసాగించవచ్చని కమీషన్ అభిప్రాయపడింది.

గవర్నర్ గురించి సర్కారియా సంఘం చేసిన మరొక సూచన ఏమిటంటే ఒకసారి గవర్నర్‌గా నియమితుడైన వ్యక్తిని గవర్నర్ పదవికి తప్ప ఇతర పదవులకు నియమించరాదు. అయితే ఉపరాష్ట్రపతి పదవికానీ రాష్ట్రపతి పదవికానీ పోటీ చేయటంలో తప్పులేదని కమీషన్ భావించింది.

రాజకీయ నాయకులను, ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారిని, కేంద్రమంత్రులుగా గతంలో ఉన్న వారిని గవర్నర్‌లుగా నియమించరాదని సర్కారియా సంఘం సూచించింది. అయితే ఈ సూచన ఆచరణ సాధ్యంకాదు. ఎందుకంటే అధికారపక్షం పదవులను పంపిణీ చేయటంలో రాజకీయ వేత్తలను పూర్తిగా విస్మరించి లేదు. కాబట్టి సర్కారియా కమీషన్ తన నివేదికను సమర్పించిన ఒక సంవత్సరం దాటినప్ప టికి మాజీ మంత్రులు, ముఖ్యమంత్రులు వివిధ రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమితులవుతూనే ఉన్నారు.

సర్కారియా కమీషన్ ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను విధించే విషయంలో చేసిన సూచనలు కూడా గమనించదగ్గవిగా ఉన్నాయి. "రాజ్యాంగం ఈ అధికారాలను కల్పించటానికి గల ప్రధాన లక్ష్యం జాతీయ సమైక్యత కాబట్టి ఈ అధికారాన్ని అధికదాహం తీర్చుకోటానికి ఉపయోగించకూడదు. ఈ విషయంలో 356 నిబంధనను ఆచి, తూచి ఉపయోగించాలి. ఈ నేపథ్యంలో 1977లో జనతాపార్టీ తొమ్మిది రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయటం, అదే విధంగా 1980లో కాంగ్రెస్ పార్టీ జనతా ప్రభుత్వాలను రద్దుచేయటం అధికార దుర్వినియోగమే" అని కమీషన్ అభిప్రాయపడింది.

ఒక రాష్ట్రంలో రాష్ట్రపతిపాలనను విధించాలని నిర్ణయం తీసుకునేటప్పుడు అలా విధించటానికి గల కారణాలను రాష్ట్రపతి పాలన విధింపు పత్రంలో ప్రకటించాలి. రాజ్యాంగంలోని 356 నిబంధనను ఈ కార ణాలను చూపటానికి అనుగుణంగా సవరణ చేయాలి. రాష్ట్రపతిపాలనను విధించిన తర్వాత ఒక రాష్ట్ర శాసన సభను కానీ పార్లమెంట్‌ను కానీ రద్దు చేయ్యాలనుకుంటే ఆ యా సభల్లో ఆ ప్రతిపాదనను పెట్టి ఆమోదం పొందకుండా వాటిని రద్దు చేయకూడదు". ఎటువంటి పరిస్థితుల్లో అయినా రాష్ట్రపతి పాలన ఒక రాష్ట్రంలో విధించవచ్చు సర్కారియా కమీషన్ చెబుతూ ఈ కింది సూచనలను చేసింది.

"ఒక రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఏర్పడ్డప్పుడు, అంటే ఏ రాజకీయ పార్టీకీ మెజారిటీ లేక ప్రభుత్వాన్ని ఏర్పరచే పరిస్థితి లేనప్పుడు, ఒక రాష్ట్ర ప్రభుత్వం విదేశీ శక్తుల సహాయంతో కానీ స్వతహాగా కానీ

కేంద్రంపై తిరుగుబాటు చేసి స్వతంత్రతను ప్రకటించుకునే పరిస్థితి ఏర్పడినప్పుడు, భూకంపాల వల్ల కానీ తీవ్రమైన అంటువ్యాధుల వల్లకానీ ఆ రాష్ట్ర ప్రభుత్వం తలక్రిందులైపోయి, ప్రభుత్వ యంత్రాంగం పనిచేయ లేని పరిస్థితి ఏర్పడినప్పుడు, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగపరమైన ఆదేశం ఏదైనా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం దాన్ని పాటించటానికి నిరాకరించినప్పుడు మాత్రమే రాష్ట్రపతిపాలనను విధించాలి".

ఈ సందర్భంలో కమీషన్ చేసిన మరొక సూచన కూడా గమనించదగ్గది. అది ఏమిటంటే ఒక రాష్ట్రంలో ముఖ్యమంత్రి మెజారిటీని కోల్పోయాడన్న సందేహం గవర్నర్‌కు కలిగినప్పుడు తక్షణమే శాసనసభను సమావేశపరిచి తన మెజారిటీని నిరూపించుకోవాలని గవర్నర్ ముఖ్యమంత్రిని ఆదేశించాలి. అలా కాకుండా మంత్రిమండలిని గవర్నర్ బర్తరఫ్ చేయరాదు. అయితే కర్నాటకలో గవర్నర్ ఆ విధంగా ముఖ్యమంత్రిని శాసనసభను వెనువెంటనే సమావేశపరిచి తన మెజారిటీని నిరూపించుకోమని కోరకుండా బొమ్మయ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయటం సర్కారియా సూచనకు కర్నాటక గవర్నర్ చర్య వ్యతిరేకంగా ఉంది.

సర్కారియా సంఘం, కేంద్ర రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచటానికి చేసిన మరొక సూచన. అంతర్ రాష్ట్ర ప్రభుత్వం సమితి ని ఏర్పాటు చేయటం ఈ సమితికి ప్రధానమంత్రి అధ్యక్షులుగాను, రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులందరూ సభ్యులుగా ఉండాలి. ఈ సమితి అంతర్ రాష్ట్రాల మధ్య తలెత్తే సమస్యలన్నింటినీ పరిష్కరించేదిగా ఉండాలి.

పై ప్రతిపాదనను కర్నాటక మాజీ ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే చేశారు. సర్కారియా సంఘం ఈ ప్రతిపాదనను అంగీకరించింది. అయితే ఈ సమితిని కేంద్ర ప్రభుత్వం ఏర్పరచినాడు అది పనిచేసే తీరును అనుసరించి మాత్రమే దీన్ని గురించి మనం సమీక్షించటానికి సాధ్యం అవుతుంది. వివిధ రాజకీయ పక్షాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను నిర్వహిస్తున్న ప్రస్తుత భారత రాజకీయ వ్యవస్థలో అంతర్‌రాష్ట్ర సమితి ఏర్పాటు తప్పనిసరిగా అవసరం అవుతుంది. రాజకీయ స్థాయిలో కాకుండా పాలన యంత్రాంగ స్థాయిలో, ప్రభుత్వ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో ఎవైనా సమస్యలను పరిష్కరించుకోటానికి,అందరికీ ప్రయోజనం ఉండాలి. ఆసక్తి ఉన్న అంశాలను చర్చించుకోటానకి, కనీస సహనంతో ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించటానికి తగిన వాతావరణాన్ని ఈ అంతర్‌రాష్ట్ర సమితి కల్పిస్తుందని ఆశిద్దాం.

9. ఆర్థికసంఘం ఉనికిని ఆమోదిస్తూనే సర్కారియా సంఘం ఈ ఆర్థిక సంఘం సక్రమంగా పనిచేయటానికి కొన్ని సూచనలు చేసింది. ఆర్థిక సంఘాన్ని నియమించిన ప్రతి సంవత్సరం దాని పరిశీలనాంశాలకు తుది రూపం ఇచ్చే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర ప్రభుత్వం తప్పక సంప్రదించాలని సర్కారియా సంఘం సూచించింది.

బారతదేశంలో ప్రాంతీయ అసమానతలు అనేక రాష్ట్రాల్లో, కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల, భాషల, మతాల, కులాల ప్రజల మధ్య భాషా పరమైన ఐక్యతను, ఆర్థికాభివృద్ధిని, ఉద్యోగావకాశా

లను కల్పించగల వ్యవస్థకు రూపొందించటానికి, దానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడటానికి చేయాల్సి న ప్రయత్నం గురించి సర్కారియా సంఘం ప్రస్తావించలేదు. కేవలం రాష్ట్రాలకు ఆధిక్యతలను కల్పించినంత మాత్రాన్నే ప్రజల మౌలిక సమస్యలు నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యతా తీరవు, రాష్ట్రాలు కూడా ఒకవైపు స్వయం ప్రతిపత్తి అధికారాలు కావాలని ఇవ్వటానికి పాలనా ప్రతిపత్తిని కల్పించటానికి సంసిద్ధతలను చూపటం లేదు. కేంద్రం నుంచి అధికారాలు "నా వరకూ వచ్చి, నా చేతిలో కేంద్రకరించబడాలి." అనే భావం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నంతకాలం రాష్ట్రాలు అభివృద్ధి చెందటం చాలా కష్టం.

### 3.9. భారత సమాఖ్య సాధించిన విజయాలు:-

భారత రాజ్యాంగం సువిశాల భారతదేశంలో వివిధ రకాల ప్రాంతీయ, భాష, మత, ఆర్థిక, సాంఘిక వైవిధ్యాలున్న భారత సమాజానికి సరిపడిన రాజకీయ వ్యవస్థను సూచించటంలో నూటికి నూరుపాళ్ళు సిద్ధాంత బద్ధమైన సమాఖ్య వ్యవస్థను రూపొందించలేదు. భారత రాజ్యాంగవేత్తలు సిద్ధాంతం కంటే ఆచరణకే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు.

భారత రాజ్యాంగంలో రూపొందించిన సమాఖ్యవ్యవస్థ ఈ కింది విజయాలను సాధించింది.

1. ఒక ప్రబలమైన కేంద్ర ప్రభుత్వ స్థాపన ద్వారా సమాఖ్య వ్యవస్థ భారతదేశ స్వతంత్ర ప్రతిపత్తి సమగ్రత, సార్వభౌమాధికారాలను కాపాడగలిగింది. అనేక వేర్పాటు ఉద్యమాలను కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా ఎదుర్కోగలిగింది.

2. బలమైన కేంద్ర ప్రభుత్వ స్థాపనవల్ల విదేశీ దండయాత్రల ప్రమాదాన్ని (పాకిస్తాన్, చైనా) విజయవంతంగా తిరగగొట్టడం సాధ్యమైంది.

3. 1956 లో రాష్ట్రాలు పునర్నిర్మాణం ద్వారా భారత రాజకీయ పటాన్ని తిరిగి రాయటం సులభమైంది.

4. అనేక రాష్ట్రాల్లో రాజకీయ, పాలనా సుస్థిరతకు ఉపకరించింది. 356 రాజ్యాంగ నిబంధన కింద తరచూ పార్టీ మార్పిడుల ద్వారా అనేక రాష్ట్రాల్లో ఏర్పడ్డ రాజకీయ అస్థిరతకు కేంద్ర ప్రభుత్వం "రాష్ట్రపతి పాలన" ను విధించడం ద్వారా తొలగించడం సాధ్యమైంది.

5. అఖిల భారత సేవల ద్వారా అన్ని రాష్ట్రాల్లో ఉన్నత స్థాయిలో సామర్థ్యంతో కూడ కొన్ని ఉద్యోగ బృందం ఏర్పాటుకు ఉపకరించింది.

6. అనేక రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు ఏర్పడ్డ ప్రమాదాన్ని ఆయా రాష్ట్రాలకు సైనిక సహాయాన్నే అందించటం ద్వారా అనేక రాష్ట్రాల్లో శాంతి భధ్రతలను కాపాడటం సాధ్యమైంది.

7. పైవిధంగా రాజ్యాంగం ఏర్పాటు చేసిన సమాఖ్య వ్యవస్థ రాజ్యాంగవేత్తలు ఆశించిన మౌలిక లక్ష్యాల సాధనకు విజయవంతంగా ఉపయోగపడింది. సమగ్రత, అభివృద్ధి, సమైక్యతలను సాధించటంలో చాలా వరకు

కృతకృత్యమైంది. అంతరంగిక, బాహ్య సవాళ్ళను విజయవంతంగా ఎదుర్కొటానికి ఉపయోగపడింది. భారత రాజ్యాంగానికి రూపకల్పన జరుగుతున్న కాలంలో అనేక మౌళిక సమస్యలు ఎదుర్కొవాల్సి వచ్చింది. దేశ విభజన, స్వదేశీ సంస్థానాల విలీనం, కాందిశీకుల పునారావాస సౌకర్యం మతకల్లోలాలు, అధిక సంఖ్యా కల నిరక్షరాస్యత, నిరుద్యోగం, పేదరికం మొదలైన వాటిని తొలగించటానికి పెద్ద స్థాయిలో ప్రయత్నిస్తేనే తప్ప సాధ్యం కాదు. వీటిని దృష్టిలో పెట్టుకుని సాధారణంగా సమాఖ్య వ్యవస్థలో ఉండాల్సిన దానికంటే కేంద్ర ప్రభుత్వానికి భారత రాజ్యాంగం అనేక విస్తృతాధికారాలను కల్పించింది.

## 3.10. సంఘర్షణ రంగాలు:-

అయితే ఒక వైపు పై చర్చించిన ప్రయోజనాలతో పాటు కొన్ని సమస్యలను కేంద్ర రాష్ట్రాల మధ్య సంఘర్ష ణను తరచూ ఉత్పన్నం అవటానికి కూడా ఈ సమాఖ్య వ్యవస్థ దోహదం చేసింది. ఫలితంగా మన రాజ్యాంగం కాలక్రమంలో బలంతోపాటు కొన్ని బలహీనతలను కూడా చూపించింది. కొన్ని ప్రత్యేక ధోరణులు కేంద్ర, రాష్ట్ర సంబంధాల్లో ముఖ్యంగా 1980 దశాబ్దంలో కనిపించటం ప్రారంభించాయి. కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ ఏర్పడే సంఘర్షణలకు ఈ కింది విధంగా పేర్కొనవచ్చు.

1. కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ ఏర్పడే సంఘర్షణలు రాజకీయమైనవే కాని న్యాయ సంబంధమైనవి కావు. 1967 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో ఒకే పార్టీ సంబంధాల్లో చెప్పుకోదగ్గ వివాదాలు ఈ కాలంలో ఏర్పడలేదు. అయితే 1977 నుంచి ముఖ్యంగా 1983 అనంతరం కాంగ్రెసేతర ప్రతిపక్షాలు, ప్రాంతీయ పార్టీలు కొన్ని రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టడంతో కేంద్ర రాష్ట్రాల మధ్య రాజకీయమైన వివాదాలు ఎక్కువైనాయి.

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న తెలుగు దేశ ప్రభుత్వం ప్రధానిపై, కేంద్ర మంత్రులపై, రాష్ట్ర గవర్నర్లపై తరచూ ధ్వజం ఎత్తడం, తమ వైఫల్యానికి కేంద్రాన్ని అనేక సందర్బాల్లో నిందించటం సర్వసాధారణ మైంది.

2. 356 నిభంధన కింద ఒక రాష్ట్రంలో ప్రభుత్వాన్ని రద్దు చేసి కేంద్ర పాలనను విధించటానికి రాష్ట్రపతికి రాజ్యాంగ రీత్యా అధికారం ఉంది. ఈ అధికారాన్ని అనేక సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వం పాక్షిక ప్రయోజనాల దృష్ట్యా దుర్వినియోగం చేయటం జరిగింది. 1988 లో నాగాలాండ్‌లో, మిజోరంలో, కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోయిన తర్వాత కాంగ్రెసేతర కూటమికి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి అవకాశం ఇవ్వకుండా రాష్ట్రపతి పాలనను విధించటం సర్వత్రా నిరసన ఏర్పడింది. అందువల్ల కొన్ని ప్రతి పక్షాలు ఈ 356 నిబంధన ను రాజ్యాంగం నుంచి తొలగించాలని కోరుతున్నాయి.

3. రాష్ట్ర ప్రభుత్వ స్వంతంత్ర ప్రతిపత్తిని, అధికారాలను తగ్గించినందుకు చూపించేనిరసన రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణం రాజ్యాంగ పరంగా గుర్తింపు పొంది ఏర్పడినప్పటికీ రాష్ట్రకార్యనిర్వాహక వర్గం, శాసనసభల

కొనసాగింపు, కేంద్ర ప్రభుత్వ దయాధర్మాలపై ఆధారపడి ఉంది. 1978 లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల శాసనసభలను మూకుమ్మడిగా రద్దు చేసి నాటి జనతా ప్రభుత్వం అనేక విమర్శలకు గురైంది.

4. సమైఖ్యీకరణకు బదులు అధికారాల కేంద్రీకరణ ఎక్కువగా ఉండటం వల్ల అటువంటి ధోరణులను అరికట్టడానికి తగిన ప్రయత్నాలు చేయాలి.

## 3.11. రావల్సిన మార్పులు:-

కొరతల రాజకీయాల వల్ల కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో తరచూ వివాదాలు, ఉద్రిక్తతలు ఏర్పడుతున్నాయి. వీటిని తొలగించడానికి రాజ్యాంగ చట్టాల్లో అమల్లో ఉన్న కేంద్ర రాష్ట్ర సంబంధాలను పటిష్టం చేయటానికి ఈ కింద సూచించిన మార్పులు అవసరం.

1. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను మెరుగుపరచటంలో పార్టీ వ్యవస్థ చాలా ప్రధాన పాత్రను నిర్వహిస్తుంది. కాంగ్రెస్, కాంగ్రెసేతర ప్రభుత్వాలకు కేంద్ర రాష్ట్రాలను ఏకకాలంలో పనిచేస్తున్నపుడు ఈ రాజకీయ పక్షాలు ఒక మౌళిక అంశాన్ని బాగా గుర్తించుకోవాలి. ఒక పార్టీలో వ్యవహరించటం వేరు, ఒక ప్రభుత్వంలో వ్యవహరించడం వేరు. ప్రభుత్వపరంగా వ్యవహరిస్తున్నపుడు పార్టీ పరంగా చేసే విమర్శనలు మరీ చౌకబారుగా ఉంటే అవి కేంద్ర రాష్ట్ర సంబంధాలను మరింత బెడిసి కొట్టే ప్రమాదం ఉంది. అంతేగాక బహుపార్టీ పద్ధతి ఉన్న భారతదేశంలో రాజకీయహుందాతనం ప్రదర్శించటం ద్వారా కేంద్ర రాష్ట్రాలు సజావుగా వ్యవహరించటం సాధ్యమౌతుంది. కేవలం రాజకీయ ప్రయోజనాలను ఆశించి పరస్పరం విమర్శించుకోవటం వల్ల నిందారోపణలు చేయటం వల్ల ప్రయోజనం ఏర్పడదు.

2. జాతీయ ప్రణాళిక సంఘం నిర్మాణంలో కొన్ని మౌలిక మార్పులు అవసరం. జాతీయ ప్రణాళికలను రూపొందించటంలో రాజకీయ వేత్తల ప్రమేయాన్ని తగ్గించాలి. ప్రణాళికాసంఘం నిపుణులతో ఏర్పాడాలి. దాని నిర్వహణపై రాజకీయవేత్తల పెత్తనం పరిమితినివ్వాలి. ఈ ప్రణాళికా సంఘం వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న ప్రణాళికా పరమైన పథకాలను, తరచూ సమీక్షిస్తూ, నిర్మాణాత్మకమైన మార్పులను, చేర్పులను సూచించాలి. వనరుల సమీకరణ, ఉత్పత్తి పెరుగుదల, రవాణా, పంపిణీ సౌకర్యాలు, స్థానిక అవసరాలు మొదలైన వాటిని దృష్టిలో పెట్టుకుని సత్వర ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా పారిశ్రామికీకరణకు వివిధ పథకాల విస్తీరణకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలే కాని రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అనేక అనుత్పాదక పథకాలకు కావాల్సిన నిధులను సమకూర్చుకోవటానికి ఆందోళనలు, ఒత్తిడి పెరుగుతాయి. అంతేకాకుండా ప్రణాళికల్లో లేని అంశాలను సూచించని పతకాలకు అమలు పరచటంలో రాష్ట్రప్రభుత్వం తక్కువ ఉత్సాహాన్ని చూపించనట్లైతే ఆర్థిక రంగంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు మెరుగుపడానికి అవకాశాలు ఉన్నాయి.

3. 1980 సంవత్సరాల్లో ఏర్పడ్డ ప్రాంతీయ పక్షాలు చాలావరకు కేంద్రవ్యతిరేకధోరణిని అనవసరమైన సందర్భాల్లో కూడా అనుసరుస్తున్నాయి.

సమాఖ్యలక్ష్యం జాతీయ సమైక్యతతో పాటు రాష్ట్ర ప్రత్యేక ఆసక్తులను కాపాడటం జాతి ప్రయోజనంతో రాష్ట్రాల ప్రత్యేక ఆసక్తులకు సమన్వయం చేయటం ద్వారా కొన్ని పరిమితులను ప్రాతీయ పక్షాలు ఐచ్ఛికంగా అనుసరించటం భారత రాజకీయ వ్యవస్థ దీర్ఘకాలిక మనుగడకు చాలా అవసరం.

4. కేంద్ర రాష్ట్రాల మధ్య తరచూ సంఘర్షణలకు కారణం గవర్నర్ వ్యవహరించే పద్ధతి. గవర్నర్‌లు రాజకీయ వేత్తలుగా కేంద్రప్రభుత్వ ఏజెంట్లుగా కాకుండా రాజ్యాంగ పరంగా తమ విధులను అక్షరాలా, భావపరంగా నిర్వహించనట్లైతే, హుందాతో వ్యవహరిచనట్లైతే, కేంద్ర రాష్ట్ర సంబంధాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను కొంత వరకు తొలిగించుకోవటం సాధ్యమౌతుంది.

గవర్నర్‌లను నియమించుకోవటంలో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంప్రదించటం అనే రాజ్యాంగ సంప్రదాయాన్ని గౌరవిచటం ఉభయాత్రా శ్రేయస్కరం, అదే విధంగా ఏయే సందార్భాల్లో 356 నిబంధన కింద రాష్ట్రపతి పాలన విధించమని గవర్నర్ రాష్ట్రపతికి నివేదికలు పంపటంలోగల తన విచక్షణాది కారాన్ని జాగ్రత్తగా, వివాదాలకు అతీతంగా వినియోగించాలి. 1988 లో తమిళనాడు, నాగాలాండ్, మిజోరాం గవర్నర్‌లు తొందరపడి వ్యవహరించటం వల్లనే ఆయా రాష్ట్రాల అనేక రాజకీయ వివాధాలు ఏర్పడ్డాయి.

సర్కారియా సంఘం సూచనలు గల కాలంలో పరిపాలనా సంస్కరణల సంఘం చేసిన సూచన లు, రాజమన్నారు సంఘం నివేదిక అటుంచి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జ్ఞాపకం ఉంచుకోవాల్సిన అంశం మరో కటి ఉంది. అది మన ప్రజాస్వామ్యం మనుగడ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల సహకారం లేకుండా తన విధానాల ను అమలు పరచలేదు. తన విధానాలు విజయవంతంగా రాష్ట్రాలో అమలు కావలంటే రాజకీయ సుస్థిరత పాలనా కొనసాగింపు చాలా అవసరం. కేంద్ర ప్రభుత్వ జోక్యం తరచూ రాష్ట్రపతి పాలన విధింపు ముఖ్య మంత్రుల మార్పు మొదలైన పాక్షిక ప్రయోజనాల కోసం చేసినపుడు అభివృద్ధి కుంటుపడుతుంది. సుస్థిరత లోపిస్తుంది. అదే విధంగా రాష్ట్రాలు కూడా కేంద్రం సహకారం లేకుండా ప్రజలు ఆకర్షించే పధకాలను అమలు పరచలేవు. ఆఖరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలో రాజకీయ పార్టీలు తప్పనిసరి కాబట్టి రాజకీయ పార్టీల, రాజ్యాంగ భవితవ్యం ప్రజల ఆదరణపై ఆధారపడి ఉంటాయి. ఈనాడు సామాన్య మానవుడి కంటే సగటు ఓటరుకు కావాల్సింది. తన అవసరాలు తీర్చే ప్రభుత్వం. అతడు రాజకీయ నినాదాలు రాజ్యాంగ చట్టాల పట్ల తక్కువ విధేయతను చూపిస్తున్నాడు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని, కేంద్ర కాష్ట్రాలు కేవలం రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలను మాత్రమే కాకుండా కొంత వాస్తవికతను చూపించాలి.

### 3.12. కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో గవర్నర్ పాత్ర:-

కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో గవర్నర్ పాత్ర ఇటీవలి కాలంలో అనేక విమర్శలకు గురైంది. ఆంధ్రప్రదేశ్, కేరళలో తమిళనాడులో, పశ్చిమబెంగాల్లో ఆయా రాష్ట్రల ప్రభుత్వాలు తరచూ వివాదాలకు

దిగటమే కాకుండా 1988 లో లోకాయుక్త నియామకాన్ని జాప్యం చేయటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం సూచించిన వ్యక్తికి ఆపదవికి నియమించటానికి గవర్నర్ నిరాకరించటం వల్ల గవర్నర్ మీద ఫిర్యాదు చేస్తూ గవర్నర్ చర్య ను విమర్శిస్తూ రాష్ట్ర మంత్రిమండలి ఒక తీర్మానాన్ని అమోదించింది. అంతేకాక గవర్నర్‌పై ఒక వినతి పత్రాన్ని రాష్ట్రపతికి కూడా తెలుగుదేశ ప్రభుత్వం సమర్పించింది. సర్కారియా కమిషనరు కూడా తెలుగుదేశం గవర్నర్ పదవి అవసరమని, రాజకీయ వివాదాలకు నిలయమని అందువల్ల గవర్నర్ పదవిని రద్దు చేస్తే బాగుంటుంద ని ఒక వాదాన్ని సమర్పించింది. అంతకు ముందు డి.యం.కె పార్టీ కూడా ఇటువంటి విజ్ఞప్తినే చేసింది. రాష్ట్రాని కి లాంచన ప్రాయమైన రాజ్యాంగాధిపతిగా వ్యవహరించాల్సిన గవర్నర్ కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో కీలకపాత్ర వహిస్తున్నాడు.

రాష్ట్రానికి రాజ్యాంగాధిపతియైన గవర్నర్‌ను రాష్ట్రపతి ఐదు సంవత్సరాల పదవికాలానికి నియమి స్తారు. గవర్నర్‌ను ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి బదిలీ చేయనచ్చు. పదవీ కాలాన్ని పొడిగించవచ్చు. గవర్నర్‌ను పదవి నుంచి తొలగించే అధికారం రాష్ట్రపతికి మాత్రమే ఉంది. రాజ్యసభ సభ్యుడికి కావాల్సిన అర్హతలు ఉన్న వ్యక్తికి గవర్నర్‌గా నియమించే వ్యక్తి కేంద్రంలో అధికార పార్టీ సభ్యుడు లేదా వివాదాస్పదమైన నాయకుడు లేదా ఎన్నికల్లో ఓడిపోయిన మంత్రి, ముఖ్యమంత్రి అవడం తరచుగా జరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు దూరంగా ఉంచటానికి డాక్టర్ చెన్నరెడ్డి రెండు పర్యాయాలు (ఉత్తర ప్రదేశ్, పంజాబ్) గవర్నర్ నాటి ప్రధాని శ్రీమతి గాంధి సలహాపై రాష్ట్రపతి నియమించాడు. కలప కుంభకోణం లో వివాదాస్పదమై రాజకీయంగా తలనొప్పిని సృష్టించిన హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి రామ్‌లాల్‌ను ఆంప్రదేశ్ గవర్నర్ నియమించారు.

నిజానికి రాజ్యాంగ పరిషత్ సభ్యుల్లో కొంతమంది గవర్నర్‌ను ఎన్నుకోవాలని సూచించారు, అయితే శాసన సభ ద్వారా ఎన్నికైన గవర్నర్ రాష్ట్ర ముఖ్యమంత్రితో సమానంగా అధికారాన్ని చెలాయించటానికి ప్రయత్నించ వచ్చుని, అంతేకాకుండా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రాష్ట్రపతి నామమాత్రంగా వ్యవహరించాలంటే గవర్నర్ రాష్ట్రపతి నియమించటం సమంజసమని భావించటం జరిగింది.

### 3.13. గవర్నర్ వివాదాలకు కారణాలు:-

1967 వరకు గవర్నర్ పదవి ఎటువంటి వివాదాలకు అవకాశం కల్పించలేదు. అంతవరకు గవర్నర్ పదవి అంలంకార ప్రాయంగా ఉండేది. మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పనిచేసిన డా. భోగరాజు పట్టాభి సీతారామయ్య గవర్నర్ పదవి అలంకార ప్రాయమైందని ఎవరైన రాజకీయాల నుంచి విరమించి విశ్రాంతి తీసుకోవటానికి చక్కగా ఉపయోగపడుతుందని తన ఆత్మకథలో రాసాడు.

1967 వరకు కేంద్రంలోను రాష్ట్రాల్లోను ఒకే పార్టీ (కాంగ్రెస్ పార్టీ) అధికారంలో ఉండటం వల్ల కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాలు ఎక్కువగా ఏర్పడలేదు. అందువల్ల గవర్నర్ సాహిత్యం, సాంస్కృతిక కార్యక

లాపాలతోను తాను నిర్వహించాల్సిన అధికార కార్యక్రమాల్లో పాల్గొనటం మినహాయిస్తే ఇతరత్రా మరేమి పని ఉండేది కాదు. కొన్ని సార్లు ఆయన పేరు కూడా ప్రజల్లో చాలామందికి తెలిసేది కాదు అనటం అతిశయోక్తి కాదేమో! అయితే 1967లో జరిగిన నాల్గో సాధారణ ఎన్నికల్లో మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ అనేక ఉత్తరాది రాష్ట్రాల్లో తన ప్రాభవాన్ని కోల్పోయింది. అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రతిపక్ష ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి . 1967-72 మధ్య కాలంలో ప్రతిపక్షాల బలహీనత, కాంగ్రెస్ పార్టీ మార్పిడుల ద్వారా రాజకీయ అస్థిరత ఏర్పడింది. కొన్ని రాష్ట్రాల్లో శాసన సభల్లో ఏ పార్టీకి మెజారిటీ లేకపోవటం వల్ల గవర్నర్ జోక్యంతో రాష్ట్రపతి పాలన విధించడం జరిగింది. ఆ సందర్భంలో మెజారిటీ నిరూపించుకోవటానికి అవకాశం ఇవ్వకుండా గవర్నర్లు శాసనసభను రద్దు చేయమని రాష్ట్రపతికి నివేదిక పంపారని ప్రతిపక్షాలు విమర్శించటం, కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావటానికి గవర్నర్లు తోడ్పడుతున్నారన్న విమర్శకూడా సర్వత్రా వినిపించింది.

గవర్నర్‌ను రాష్ట్రపతి కేంద్ర ప్రభుత్వ సలహాపై నియమించటంవల్ల కేంద్రంలో అధికార పక్షానికి చెందిన వ్యక్తి ఉంటారని, అటువంటి వ్యక్తి కేంద్రానికి విధేయత చూపిస్తారన్న విషయం ఎన్నో సార్లు స్పష్టమైందని పలువురు భావిస్తున్నారు. ఇందుకు ఉదాహరణలు చెప్పుకోవాలంటే జమ్ము కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కూలదోసి సలాంషాను కాంగ్రెస్ మద్దతులో ముఖ్యమంత్రిని చేయటంలో ఆ రాష్ట్ర గవర్నర్ జగన్ మోహన్ ప్రోత్సాహంతో నిర్వహించిన పాత్ర సర్వత్రా విమర్శలకు గురైంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 1984 ఆగస్టులో యన్.టి. రామారావు ప్రభుత్వాన్ని రద్దుచేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిని చేసి మెజారిటిని నిరూపించుకోవడానికి అప్పటి గవర్నర్ రామలాల్ భాస్కరరావును నెలరోజులు వ్యవధిని ఇవ్వటంతో రాష్ట్ర మంతటా "ప్రజాస్వామ్య పునరుద్ధరణం" ఉద్యమం జరిగి శాంతి భద్రతలు లోపించి చివరికి గవర్నర్ రామలాల్ రాజీనామా చేసి ప్రజా జీవితం నుంచి తెరమరుగు అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### 3.14. గవర్నర్ - కేంద్రం హితకారియా?

ఒక రాష్ట్రానికి లాంఛన ప్రాయమైన అధిపతిగా రాష్ట్రపతి ద్వారా నియమితులైన గవర్నర్ తన పదవి బాధ్యతలను నిర్వహించటంలో ఎలా వ్యవహరిస్తారు? శాసనసభలో మెజారిటీ మద్దతు ఉన్న ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ పాటించాలి. అయితే గవర్నర్ ముఖ్యమంత్రిని కాదని వ్యవహరించటం తరచుగా జరుగుతుంది. దీనికి ప్రధాన కారణం కేంద్రంలో, రాష్ట్రంలో విభిన్న రాజకీయ పక్షాలు అధికారంలో ఉండటమే. కేవలం రాజ్యాంగపరంగా నామమాత్రపు అధిపతిగా లాంఛనప్రాయంగా మంత్రిమండలి సలహాపై మాత్రమే వ్యవహరిస్తే గవర్నర్ కేంద్రాన్ని కాదనాల్సివస్తుంది. కేంద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాలు ఉన్నంత వరకే ఆయన తన పదవిని నిలుపుకోగలుగుతారు. స్వతంత్రంగా వ్యవహరించాలన్న గవర్నర్ కేంద్రం అయిష్టానికి సరి అవ్వక తప్పదు. జమ్మూ కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని పడగొట్టడంలో సహకరించని బి.కె. నెహ్రూను తప్పించి జగన్‌మోహన్‌ను గవర్నర్‌గా నియమించి ఫరూక్ ప్రభుత్వాన్ని కేంద్రం ఆయన

సహాయంతో పడగొట్ట గలిగింది. అదే విధంగా గవర్నర్ రామ్‌లాల్ సహాయంలేకుండా 1984లో యన్.టి.ఆర్ పతనం సాధ్యమయ్యేది కాదు. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా గవర్నర్ పరిస్థితి ప్రస్తుత రాజకీయ పరిణామాల మధ్య సందిగ్ధావస్థలో ఉంది.

## 3.15. ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ పాటించాలా?

రాష్ట్ర గవర్నర్ రాజ్యాంగం కొన్ని విచక్షణాధికారాలను కల్పించింది. వీటిని నిర్వహించటంలో గవర్నర్ మంత్రి మండలి సలహాను గవర్నర్ పాటించాల్సిన అవసరంలేదు. మంత్రిమండలి రద్దు చేయటంలో లేదా శాసన సభను సమావేశపరచటంలో లేదా శాసనసభ ఆమోదించిన ఒక బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం ఆపడంలో లేదా రాష్ట్రంలో ప్రభుత్వం రాజ్యాంగ పరంగా పనిచేయటంలో విఫలమైనప్పుడు, రాష్ట్రపతి పాలన కోసం సిఫారసు చేసే సందరర్భంలో గవర్నర్ తన విచక్షణాధికారాన్ని ఉపయోగించవచ్చు.

పైన పేర్కొన్న సందర్భాలే కాకుండా రాష్ట్రపతికి 15 రోజులకొకసారి రాష్ట్ర పరిస్థితిని గురించి శాంతిభద్రతలను గురించి సాధారణ పాలన గురించి గవర్నర్ ఒక రహస్య నివేదికను పంపుతారు. ఈ సందర్భంలో గవర్నర్ మంత్రిమండలి సలహాను గవర్నర్ తీసుకోవాల్సిన అవసరం లేదు. అయితే గవర్నర్ విచక్షణాధికారాలు రాజకీయ దృక్పథంతో ముడిపడటం వల్ల అవి తరచూ వివాదాస్పదం అవుతాయి.

## 3.16. గవర్నర్ ముఖ్యమంత్రిని తొలగించగలరా?

శాసనసభలో ముఖ్యమంత్రి మెజారిటీని కోల్పోయినట్లు గవర్నర్‌కు అనుమానం కలిగితే ఆయన రెండు విధానాలను అవలంబిచవచ్చు.

1. శాసనసభ సమావేశం వెంటనే ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి తన మెజారిటీని నిరూపించుకోమని కోరటం.
2. మరొకరిని ముఖ్యమంత్రిగా నియమించి ఆయన తన మెజారిటీని నిరూపించుకోవాలని నిర్దేశించటం.

మెజారిటీని కోల్పోయిన ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ స్వంతంగా నిర్ణయం తీసుకోవాల్సిందే. రాజ్యాంగం ఇత మిద్ధంగా ఏమి చెప్పలేదు.

ప్రభుత్వ బలాబలాలు తేల్చాల్సిన వేదిక శాసనసభ. శాసనసభ విశ్వాస లేదా అవిశ్వాస తీర్మానం ద్వారా ముఖ్యమంత్రికి మెజారిటీ మద్దతు ఉందో లేదో నిర్ణయిస్తుంది. అయితే ముఖ్యమంత్రికి మద్దతు ఉందా లేదా తేల్చుకోవటం గవర్నర్ సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం గవర్నర్ సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే రాజ్యాంగం ప్రకారం గవర్నర్ ముఖ్య మంత్రిని నియమిస్తాడు. ఆయన సలహాపై గవర్నర్ మంత్రులను నియమిస్తాడు. మంత్రిమండలి గవర్నర్ ఆమోదంపై పదవిలో కొనసాగుతుంది అని రాజ్యాంగం చెబుతుంది. అయితే అదే రాజ్యాంగం "మంత్రిమండ లి శాసనసభకు సమిష్టి బాధ్యత వహిస్తుంది" అని కూడా చెబుతుంది. దీన్ని బట్టి శాసనసభలో మెజారిటీ

మద్దతున్న నాయకుడిని ముఖ్యమంత్రిగా నియమించాలన్నది స్పష్టంఅవుతుంది. అయితే ఈ అస్పష్టమైన రాజ్యాంగ పరిస్థితి అనేక సందర్భాల్లో ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అనేక వివాదాలు ఏర్పడటానికి, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడానికి గవర్నర్‌ను ఒక పావుగా వినియోగించుకోటానికి అవకాశం కల్పిస్తుంది. సిక్కిం, కాశ్మీర్, ఆంధ్రప్రదేశ్, నాగాలాండ్, మిజోరం రాష్ట్రాల్లో సంభవించిన రాజకీయ పరిణామాలు ఇందుకు నిదర్శనం.

రాజ్యాంగ పరిధి, వాస్తవ పరిస్థితి ఈ రెంటిని పరిశీలించినట్లైతే గవర్నర్ నామమాత్ర రాష్ట్రాధిపతి గా వ్యవహరించటంకంటే రాష్ట్రపతికి ఎక్కువ బాధ్యత వహించేటట్లు కన్పిస్తుంది.

### 3.17. రాష్ట్రపతి పాలన:-

రాజ్యాంగంలోని 356వ నిబంధన కింద ఒక రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించటంలో గవర్నర్ రాజ్యాంగం ఇచ్చిన విచక్షణాధికారాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీని మెప్పించటానికి ఉపయోగించటం జరుగు తుందన్న విమర్శ, ఆ విమర్శకు తగిన అనుకూల సాక్ష్యాలు అనేక సందర్భాల్లో కొట్టొచ్చినట్లు కనపడటంవల్ల గవర్నర్ పదవి వివాదాస్పదంగా ముఖ్యంగా ఆయన విచక్షణాధికారాలను వినియోగించే సందర్భంలో అనేక విమర్శలకు గురైంది. రాష్ట్రంలో రాజ్యాంగపరంగా ప్రభుత్వం పనిచేయటంలో విఫలమైందని నిర్ధారించినపుడు లేదా శాంతి భద్రతలను పరిరక్షించటంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గవర్నర్ భావించినపుడు ఈ ముగింపు అభిప్రాయానికి రావటానికి గవర్నర్‌కు ఖచ్చితమైన సమాచారం ఎలా లభ్యమవుతుంది? అంతేకాక గవర్నర్ రాష్ట్రపతికి పంపిన నివేదికను ఆ నివేదికపై రాష్ట్రపతి తీసుకున్న చర్యను న్యాయస్థానంలో సవాలు చేయటం వీలుకాకపోవటంవల్ల గవర్నర్ నిర్ణయం చాలా సందర్భాల్లో కేంద్రం అభిప్రాయం ద్వారా ప్రభావితం అవుతుందన్న విమర్శ సర్వత్రా ఉంది. అందువల్ల కేంద్రం నియమించిన గవర్నర్ కేంద్రానికి ఏజంట్‌గా పనిచే స్తున్నారని తీవ్రంగా విమర్శలకు లోనైన గవర్నర్ ఒకవైపు రాజ్యాంగ పరంగా అలంకార ప్రాయంగా రాష్ట్రాధిపతి గా ఉంటూ మరొకవైపు విచక్షణాధికారాలను ఉపయోగిస్తూ రాష్ట్రపతి ప్రతినిధిగా వ్యవహరించటం ద్విపాత్రా భినయంగా కనిపిస్తుంది.

గవర్నర్‌లను కేవలం లాంఛన ప్రాయమైన రాష్ట్రాధినేతలుగా మాత్రమే రాజ్యాంగం ఉద్దేశించింది. మంత్రి వర్గాలు వస్తాయి, పోతాయి. కాని రాజ్యాధికారం (స్టేట్) అవిచ్ఛిన్నంగా కొనసాగాల్సిందే. అందువల్లనే గవర్నర్ పదవిని రాజ్యాంగం సృష్టించింది. అయితే అసలు పరిపాలనంతా ప్రజలు ఎన్నుకొన్న మంత్రిమండలి నిర్వహిం చాలని రాజ్యాంగం నిర్ణయించింది. ఒక రాష్ట్రంలో రెండు అధికార కేంద్రాలు ఉండరాదు. కాబట్టి మంత్రి మండలిదే పై చేయిగా నిర్దేశించింది.

గవర్నర్ విచక్షణాధికారాలను రాజ్యాంగం పేర్కొన్నప్పటికీ అవి ప్రధానంగా రెండు సందర్భాల్లోనే అమల్లోకి వస్తాయి. ఒక ముఖ్యమంత్రిని నియమించే సందర్భంలో, రెండోది రాజ్యాంగ బద్ధంగా రాష్ట్ర

పరిపాలన కొనసాగటానికి వీలులేని పరిస్థితి ఏర్పడిందని నిర్ణయించాల్సిన సమయంలో ఇక మిగిలిన సందర్భాల్లో గవర్నర్ మంత్రివర్గ సూచన మేరకు నడుచుకొన్నట్లైతే రాజకీయంగా రాజ్యాంగ పరంగా అనేక వివాదాలు తొలగిపోతాయి.

## 3.18. గవర్నర్ పదవిని రద్దు చేయాలి?

గవర్నర్ పదవికి నియామకంపట్ల, గవర్నర్ పదవి నిర్వహణ పట్ల ఎపుడు వివాదాలు వస్తూనే ఉన్నాయి. గవర్నర్లను సాధారణంగా ఈ కింది వర్గాలనుంచి నియమిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శకులు విమర్శిస్తూ ఉంటారు.

1. ఎన్నికల్లో ఓడిపోయిన అధికారపార్టీకి సంబంధించిన ప్రముఖులు. ఉదా:- బ్రహ్మానందరెడ్డి, కోన ప్రభాకరరావు, వెంకటసుబ్బయ్య.

2. ఆయా రాష్ట్రాల్లో కేంద్రంలోని అధికారపార్టీ నామినేట్ చేసే ముఖ్యమంత్రిలకు అదే పార్టీలో ఉండి అడ్డంకులు, అసమ్మతి వర్గాలను సృష్టించేవారు. ఉదా:- యం. చెన్నారెడ్డి, వసంత దాదా పాటిల్.

3. కేంద్రంలోనే లేదా రాష్ట్రాల్లోనే ముఖ్యమంత్రులుగా ఉండి అక్కడ అసమర్థులని అవాంఛనీయులని భావించేవారు. ఉదా:- రాముూల్

4. అధికార పార్టీకి విధేయులుగాను, అనుకూలంగానూ ఉండి కొన్ని పరిస్థితుల్లో మెహర్బానీ సంపాదించిన మాజీ ఉన్నతోద్యోగి వర్గం. ఉదా:-ఎ.ఎల్. ఖురానా, కె.సి. అలెగ్జాండర్

5. కొంచెం చురుకుగా వ్యవహరించాల్సిన మంత్రిపదవిని నిర్వహించలేక అశక్తులై వృద్ధాప్యంలో ఉన్నవారు. ఉదా:- కె.సి. అబ్రహం, ప్రభుదాన్ పట్వారీ

అయితే అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాల్లో ఏర్పడ్డప్పటినుంచీ అక్కడి కాంగ్రెస్‌వాదులైన గవర్నర్‌లకు కాంగ్రెసేతర మంత్రి వర్గాలకు బొత్తిగా పడకపోవడంవల్ల గవర్నర్ పదవి వివాదాల వలయంలో చిక్కుకొన్నది. ఇందుకు ఉదా:- కేరళ గవర్నర్ శ్రీమతి రామ్ దుల్హారి సిన్హాకు అక్కడి వామపక్ష సంఘటన మంత్రి వర్గానికి మధ్య ఏర్పడ్డ తీవ్రమైన విభేదాలు, ఆమె వ్యవహారసరళి పట్ల రాష్ట్ర అసెంబ్లీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆమోదించిన తీర్మానం ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కుముద్‌బెన్ జోషికి రాష్ట్ర మంత్రివర్గానికి మధ్య అభిప్రాయ భేదాలు ఎంత తీవ్ర స్థాయికి వెళ్ళాయి. ఇటువంటి వివాదాస్పదమైన గవర్నర్‌లు కాంగ్రెసేతర రాష్ట్రాలకే పరిమితం కాలేదు. కాంగ్రెస్ మంత్రి వర్గం ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్‌వారి గవర్నరైనప్పుడు కూడా అంతా సామరస్యంగా సాగిపోతుందని చెప్పటానికి వీల్లేదని బీహార్ ముఖ్యమంత్రి భగవత్‌ఝూ ఆజార్‌కు ఆ రాష్ట్ర గవర్నర్ గోవింద నారాయణ్‌సింగ్‌కు మధ్య వచ్చిన తీవ్రమైన విభేదాలను ఉదాహరణగా తీసుకోవచ్చు. అయితే విభేదాలు ఉన్నంత మాత్రాన గవర్నర్ పదవిని రద్దు చేయాలనటం సమంజసం కాదు. రాష్ట్రంలో

రాజకీయ అస్థిరత ఏర్పడ్డప్పుడు రాష్ట్ర పాలనను గవర్నర్ నిర్వహిస్తారు. కాని వివాదాలు రాకుండా ఉండాలంటే గవర్నర్ పదవిని, ఆ పదవికి ఉన్న అధికారాలను, విధులను కేంద్రం జోక్యానికి అతీతంగా ఉంచటానికి కొన్ని సంస్కరణలను వెనువెంటనే అమలు పరచాలి. గవర్నర్‌ను రాష్ట్రపతి కేవలం ప్రధాని సలహాపైనే నియమించటం మంచిది కాదని స్వతంత్ర ప్రతిపత్తిగల ఒక సంఘం చూపించిన పేర్ల జాబితానుంచి ఒకరిని గవర్నర్‌గా నియమించాలని కొందరు సూచించారు. లోక్‌సభ స్పీకర్‌వలె రాష్ట్ర గవర్నర్ కూడా క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండటమే కాదు, ఉన్నట్లు అందరికి అభిప్రాయం కలిగించటం చాలా అవసరం. రాజకీయ రంగంలో వ్యక్తిగతంగా ఎటువంటి వివాదాలు లేనివారిని, పాలనా రంగంలో అనుభవం, పేరుగడించిన వారిని, మేధావి వర్గానికి చెందినవారిని గవర్నర్లుగా నియమించినపుడు ఆ పదవి వల్ల ప్రయోజనం, ఆ పదవికి గౌరవ ప్రతిష్టలు ఏర్పడతాయి. అలా కాకపోతే ఈ వివాదాలు ఈ విమర్శలు సమసిపోవటం సాధ్యంకాని విషయమే అవుతుంది.

**3.19. సారాంశం:-** పార్లమెంటరీ ప్రభుత్వంలో మంత్రిమండలి శాసన సభ మద్దతుపై పదవిలో కొనసాగుతుంది. కాబట్టి అనిశ్చిత రాజకీయ పరిస్థితిలో ప్రభుత్వం రద్దయినపుడు ప్రత్యామ్నాయ ప్రభుత్వం సాధ్యంకానపుడు గవర్నర్ ఆవశ్యకత తప్పనిసరి అవుతుంది. అందువల్ల గవర్నర్ పదవిని రద్దు చేయాలని వారించటంకంటే ఆ పదవిని నిర్వహించేవారు తమ అధికారాలను దుర్వినియోగం చేయకుండా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లో మెలగకుండా రాజ్యాంగపరమైన జాగ్రత్తలు తీసుకోవటం అవసరం.

## 3.20 - మాదిరి ప్రశ్నలు:-

1. కేంద్ర రాష్ట్ర సంబంధాలలో శాసన పరమైన సంబంధాలను గురించి వివరించుము.
2. కేంద్ర రాష్ట్ర సంబంధాలలో పరిపాలన మరియు ఆర్థిక సంబంధాలు గురించి వివరించుము.
3. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై ఏర్పాటు చేయబడిన సర్కారియా కమిషన్ చేసిన సిఫార్సులను వివరించుము.
4. కేంద్ర రాష్ట్ర సంబంధాలపై గవర్నర్ పాత్రను విమర్శనాత్మకంగా వివరింపుము.

## 3.21 - చదువతగిన గ్రంథాలు:-


1. Indian Government and Politics – J.C Johari
2. Introduction to the Constitution of India – D.D.Basu
3. Indian Political System – Hans Raj.

పాఠం - 4

# ఎన్నికల సంఘము

విషయసూచిక


4.0 లక్ష్యం
4.1 ఉపోద్ఘాతం
4.2 ఎన్నికల సంఘము
4.3 ఎన్నికల సంఘము అధికారాలు - విధులు
4.4 నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ
4.5 ఎన్నికల సంఘువిధి, నిర్వహణపై సమీక్ష
4.6 ముగింపు
4.7 మాదిరి ప్రశ్నలు
4.8 చదువదగిన గ్రంథాలు


## 4.0 లక్ష్యం :

విద్యార్థులకు భారత దేశములో ఎన్నికలు నిర్వహించుటకు ఏర్పాటు చేయబడ్డ సర్వస్వతంత్ర రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘపు నిర్మాణము, అధికారము, నిర్వహించు పద్ధతులను గురించి తెలియజేయుట.

## 4.1 ఉపోద్ఘాతం :

ఆధునిక యుగము ప్రజాస్వామ్య యుగము. ప్రజలు ప్రజాస్వామ్య-ప్రభుత్వాన్ని తప్ప వేరే దేనిని ఓర్చుకొనే పరిస్థితిలో లేరు. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలలో భారత ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాల్గొంటున్నారు. ప్రజాస్వామ్యం విజయవంతమవ్వాలంటే నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి. అందుకొరకు రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించే వ్యవస్థ యొక్క అవసరము ఎంతైనా ఉంది. అసంఖ్యాక నిరక్షరాశ్యులైన ఓటర్లు పాల్గొనే మనదేశ ఎన్నికలు రహస్య బాలెట్ పద్ధతి ద్వారా నిర్వహించబడుచున్నవి. రహస్య బాలెట్ లేని యెడల ఓటరు ఓటు చేయటానికి భయపడటానికి అవకాశముంది. ఎన్నికలు నిర్వహించబడటానికి భారత రాజ్యాంగంలో కట్టుదిట్టమైన చర్య తీసుకోబడింది. భారత రాజ్యాంగ చట్టములో 15వ విభాగములో 324వ నిబంధన నుండి 329 నిబంధన వరకు పొందుపరచిన ఎన్నికల కమీషన్‌కు ఎన్నికల నిర్వహణ బాధ్యతను అప్పచెప్పటం జరిగింది.

మనదేశంలో ఎన్నికలు రెండు స్థాయిలలో నిర్వహించబడుచున్నవి. కేంద్రస్థాయిలో లోకసభ, రాజ్యసభ, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి, రాష్ట్ర శాసనసభలలో దిగువ సభలకు ప్రాదేశిక నియోజక వర్గాల ప్రాతిపదిక పద్ధతిలో ఎన్నికలు జరుగును. దేశాధ్యక్షుడు, ఉపాధ్యక్షుల పదవులకు ఓటు మార్పిడి నైష్పత్తిక విధానము ద్వారా ఎన్నికలు నిర్వహించబడును. దేశంలో జరిగే ఎన్నికలలో దిగువసభకు జరిగే ఎన్నికలకు అధిక ప్రాధాన్యత ఉన్నది. రాజ్యాంగ పరిషత్ సార్వజనీన వయోజన ఓటింగ్ హక్కుకు అనుకూలంగా నిర్ణయము చేసినది. ఒక్క వయఃనిబంధన తప్ప, ఎటువంటి అర్హతలు లేకుండా వయోజనులందరికి ఓటు

హక్కును ప్రసాదించడం జరిగింది. అల్లాడి కృష్ణస్వామి అభిప్రాయములో ప్రజాస్వామ్యం విజయం కొరకు సామాన్య వ్యక్తి మీద ఉంచిన అపారమైన నమ్మకమే దీనికి కారణము. ప్రస్తుత ఓటరు వయోపరిమితి 21 సంవత్సరముల నుండి 18 సంవత్సరములకు తగ్గించబడినది. రాజ్యాంగం 330, 332 నిబంధనలలో షెడ్యూలు కులాలకు, తెగలకు నియోజక వర్గాలు రిజర్వు చేయవచ్చునని పేర్కొనటం జరిగింది. మత ప్రాతిపదిక మీద రిజర్వేషనుకు స్వస్తి చెప్పటం జరిగింది. ఆంగ్లో ఇండియన్ కమ్యూనిటీకి తగిన ప్రాతినిధ్యము లేదని భావించి, అధ్యక్షుడు ఇద్దరు ఆంగ్లో ఇండియన్ సభ్యులను లోక్‌సభకు నామినేట్ చేయుపద్ధతిని, రాష్ట్ర శాసనసభలకు ఒక్క సభ్యుడ్ని మాత్రమే నియమించటానికి వీలు కల్పించటం జరిగింది.

## 4.2 ఎన్నికల కమీషన్ నిర్మాణము :

రాజ్యాంగ శాసన నిబంధనల ననుసరించి దేశంలో ఎన్నికలు నిర్వహించి, పర్యవేక్షించి, ఇతర ఎన్నికల బాధ్యతలను చేపట్టటానికి రాష్ట్రపతి ప్రధాన ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఎన్నికల కమీషన్‌ను నియమించును. 1950 నుండి 1989 వరకు మనకు ఒకే ఎన్నికల అధికారి ఉండేవాడు. అక్టోబరు 16, 1989వ తేదీన రాష్ట్రపతి మరి ఇద్దరు ఎన్నికల అధికారులను నియమించెను. దానితో ఎన్నికల కమీషన్ త్రి సభ్య కమీషన్‌గా మారింది. 1990 జనవరిలో తిరిగి ఎన్నికల కమీషన్ ఏకసభ్య కమీషన్‌గా మారింది. అక్టోబర్‌లో 1993లో రాష్ట్రపతి ఇద్దరు కమీషనర్లను నియమించటంతో మన ఎలక్షన్ కమీషన్ తిరిగి మరొకమారు త్రిసభ్య కమీషన్‌గా మారింది. అప్పటి నుండి నేటి దాకా ఎలక్షన్ కమీషన్ త్రిసభ్య కమీషన్‌గానే వ్యవహరిస్తూ ఉన్నది. ఎలక్షన్ కమీషన్ తీసుకునే ఏ నిర్ణయమైనా, మెజారిటీ సభ్యుల అంగీకారంతో తీసుకోబడుతుంది. ఇది రాజ్యాంగబద్ధమైన సంస్థ. ఎన్నికల ప్రధానాధికారి అతనిని నియమించిన అధ్యక్షుడికి తప్ప వేరెవ్వరికి బాధ్యత వహించడు. కేంద్ర, రాష్ట్ర కార్యనిర్వాహక వర్గాలకి, శాసనసభల, ఇతర జాతీయ, ప్రాంతీయ రాజకీయ పక్షాల ప్రభావానికి గురికాడు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ ఉద్యోగులలో ఒకరిని ఎన్నికల కమీషనర్‌గా నియమిస్తారు. అతని జీతభత్యాలు భారతదేశ సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. అతని పదవీకాలం జీతభత్యాలు పార్లమెంట్ తగ్గించటానికి వీలుకాదు. నిర్దుష్టమైన నేరారోపణ మీద పార్లమెంట్ ఉభయసభ సభ్యుల అత్యధిక మెజారిటీతో మాత్రమే ఎన్నికల కమీషనర్‌ను పదవీచ్యుతుడ్ని చేయవచ్చు. 65 సంవత్సరముల వయస్సు వచ్చేంతవరకు పదవిలో కొనసాగవచ్చు. ఎన్నికల ప్రధానాధికారి, అతని వ్యవస్థతోపాటు రాష్ట్రస్థాయిలో ఎన్నికల వ్యవస్థను ప్రధాన అధికారి ఆధ్వర్యంలో రూపకల్పన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఉంటాడు. 1952లో మొదటి సాధారణ ఎన్నికల నుండి చీఫ్ ఎన్నికల ఆఫీసరు పదవి అమలులోనికి వచ్చినది. ఇతని ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఎన్నికలు నిర్వహించబడును. జిల్లాస్థాయిలో జిల్లాలోని ఎన్నికల యంత్రాంగము మొత్తమునకు జిల్లాకలెక్టరు బాధ్యత వహించును. ఆయనే ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రత్యేక రిటర్నింగ్ ఆఫీసరుగా వ్యవహరించును. ఎన్నికల నిర్వహణ బాధ్యత రెవిన్యూ శాఖకు అప్పజెప్పబడినది.

## 4.3 అధికారాలు - విధులు :

1. ఎన్నికల కమీషన్ విభిన్నమైన బాధ్యతలను నిర్వహించును. అవసరమని తోచిన యితర ఉన్నత ఉద్యోగుల సహాయాన్ని అధ్యక్షుని చేత నియమింప చేసుకొని పొందవచ్చును. కమీషన్ మొదటి బాధ్యత కేంద్ర, రాష్ట్రాలలో జరుపబోవు ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సిద్ధము చేయించటము, ఎప్పటికప్పుడు చేర్పులు, మార్పులు చేయించడము. దేశాధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను కూడా సిద్ధముగా నుంచవలయును. 5 సంవత్సరములకొక పర్యాయము జరుగు సాధారణ ఎన్నికలతోపాటు, అవసరమైనప్పుడు మధ్యంతర ఎన్నికలు కూడా నిర్వహించవలె.

ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థి ఎన్నికలలో గెలిచిన సభ్యుని మరణముల వలన న్యాయస్థానాల తీర్పు వలన ఏర్పడిన ఖాళీలు భర్తీ చేయించుటకు ఉపఎన్నికలు కూడా నిర్వహించవలెను.

2. ఎలక్షన్ కార్యక్రమమును సిద్ధం చేయవలెను. ఎలక్షన్ జరిపించు తేదీలు, నామినేషన్లు తీసికొనుటకు ఉపసంహారణకు ఆఖరుతేదిని నిర్ణయించటం.
3. అర్హమైన నామినేషన్ల పరిశీలన, ప్రకటన కమీషన్ విధి.
4. దేశ వ్యాప్తంగా ఎన్ని రోజులలో ఎన్నికలు పూర్తి చేయవలెనో నిర్ణయము తీసికొనుట.
5. పోలింగ్ బూత్ లను ఏర్పరచటము.
6. ఓట్ల లెక్కింపు, ఎన్నికలు జరిపిన రోజుల్లు (తేదీలు) లో మార్పు ఉన్నప్పుడు, ఒక ఎన్నిక ఫలితము, ఇంకొక ప్రాంతపు ఎన్నికపై ఉండకుండ నివారించుటకు ఓట్ల లెక్కింపు ఎన్నికలు అన్ని ప్రాంతాలలో ముగిసిన తరువాతనేచేపట్టడము.
7. అంతవరకు బాలెట్ పెట్టెల రక్షణ బాధ్యత.
8. ఓట్ల లెక్కింపు జరుగుతున్నప్పుడు తరువాత శాంతి భద్రతలను కాపాడు బాధ్యత కూడ ఎన్నికల కమీషన్‌దే.
9. ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు అనుసరించవలసిన ప్రవర్తనా నియమావళిని రూపొందించుటతో పాటు దానిని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆమోదించి అనుసరించేటట్లు చేయటము.
10. రాజ్యాంగ చట్ట నిబంధనల ప్రకారము అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి ఖర్చుపెట్టే మొత్తాలపై గరిష్ట పరిమితిని విధించటం.
11. ఎన్నికల గుర్తులను కేటాయించవలసిన బాధ్యత కూడా ఎన్నికల కమీషనదే. వాటిని రాజకీయ పక్షాలకు, స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించవలసి ఉంటుంది.
12. జాతీయ, ప్రాంతీయ రాజకీయ పక్షాలను గుర్తించటము.
13. ఎన్నికలలో విజయము సాధించిన అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను యిచ్చుట.

## 4.4 నియోజక వర్గాల పునర్ వ్యవస్థీకరణ :

ఎన్నికలు సంబంధించినంత వరకు ఒక ప్రధానమైన అంశం నియోజకవర్గాలను ఏర్పాటు చేయడం. మనదేశములో ఏకసభ్య నియోజకవర్గ ఎన్నికల విధానము అమలులో ఉన్నది. పెరుగుతున్న జనాభా, పారిశ్రామికీకరణ వలన జనసాంద్రతలో వస్తున్న మార్పులను అనుసరించి నియోజక వర్గాలను పునర్‌వ్యవస్థీకరించవలసిన అవసరము ఏర్పడుతున్నది. కేంద్ర పార్లమెంటు మరియు రాష్ట్ర శాసన సభ్యుని ఎన్నుకొను నియోజకుల సంఖ్యలను వీలైనంత వరకు సమానము చేయటం కోసం కూడా ఒక నియోజక వర్గంలోని కొంత ప్రాంతాన్ని తీసి మరో నియోజక వర్గానికి కలపటం తప్పనిసరిఐనది. కాని ఈ ప్రక్రియలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల ప్రభావము, మరియు కుల, మత ప్రాతిపదికపై ఓటర్లను చీల్చటం వంటి చర్యలకు పాల్పడకుండ 1952 సంవత్సరములో అమలులోనికి వచ్చిన చట్టము ప్రకారము 'డిలిమిటేషన్ కమీషన్' ఏర్పాటు చేయటం జరిగింది. ఇందులో ముగ్గురు సభ్యులుంటారు. ఎన్నికల ప్రధానాధికారి అధికార సభ్యుడు. మిగతా ఇద్దరు హైకోర్టు లేక సుప్రీంకోర్టు న్యాయమూర్తులు లేక రిటైర్డ్ అయిన న్యాయమూర్తులు ఒక రాష్ట్రంలోని నియోజక వర్గాల పునర్‌వ్యవస్థీకరణ నిమిత్తము పరిశీలిస్తున్నప్పుడు ఆ నియోజక వర్గం నుంచి ఎన్నుకోబడిన రాష్ట్ర శాసన సభ్యుడు, మరియు పార్లమెంటు సభ్యుడు కూడా పరిశీలకులుగా పాల్గొనవచ్చును. ఆసక్తి ఉన్న వర్గాలు, సంఘాలు కూడా ప్రతిపాదనలను పునర్‌వ్యవస్థీకరణ సంఘానికి పంపవచ్చు. 10 సంవత్సరముల ఒకసారి జరుగు జనాభా లెక్కల సేకరణ ప్రాతిపదికగా మాత్రమే ఈ నియోజక వర్గాలను పునర్ వ్యవస్థీకరించవలెను. ఒకసారి నియోజక వర్గాలను పునర్‌వ్యవస్థీకరించిన తరువాత ఎన్నికల సంఘానిదే అంతిమ నిర్ణయము దానిని మార్చటానికి వీలులేదు.

## 4.5 ఎలక్షన్ కమీషన్ విధి నిర్వహణపై సమీక్ష :

ప్రపంచములో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఎన్నికలు నిర్వహించుట అంత సులభమైన పనికాదు. ఎలక్షన్ కమీషన్ ప్రధాన బాధ్యత స్వేచ్ఛాయుత వాతావరణములో, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించుట. విపరీతంగా పెరుగుతున్న జనాభా తదనుగుణంగా పెరుగుతున్న ఓటర్ల సంఖ్య వలన ప్రతి ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరణ చేయవలసి వస్తుంది. ఓటర్ల సంఖ్యతోపాటు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య కూడా ఊహించనంత పెరుగుతున్నది. 1985 సం॥లో లోక్‌సభ ఎన్నికలలో కర్నాటకలో బెంగుళూరు దగ్గర ఒక నియోజకవర్గంలో 50 మందికి పైగా అభ్యర్థులు చివరికి పోటీకి నిలబడగా, వార్తా పత్రికంత బాలెట్ పేపరు, యినుప బీరువా సైజు బ్యాలెట్ బాక్స్ తయారుచేయటంతో పాటు ఎన్నికల చిహ్నాలు కేటాయించటం ఎన్నికల కమీషన్‌కు పెద్దతలనొప్పిగా తయారైంది. విజయం సాధించటమే ధ్యేయంగా పెట్టుకున్న రాజకీయ పక్షాలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించటంతోపాటు అనేక అక్రమాలకు పాల్పడుచున్నవి. దౌర్జన్య చర్యలు, బాలెట్ పెట్టెలను ఎత్తుకొని వెళ్ళటం, బూతుల ఆక్రమణ, వ్యతిరేక పక్షము వారిని ఓటు చేయకుండ నివారించడము, దొంగఓట్లు వేయడం జరుగుతున్నది. షెడ్యూల్ కులాలు, తెగల వారిని ఓటు చేయనీయకుండా నివారించడం వంటి చర్యలను కూడా పాల్పడుచున్నారు. ఇక ఎన్నికలలో ధనము పాత్ర చెప్పనవసరము లేనంతగా పెరిగిపోయింది. అభ్యర్థులు అనుమతించిన దానికంటే కొన్ని వందలరెట్లు ఎక్కువ ఖర్చు చేయటమేగాక చిట్టచివరగా ఓట్లను నోట్ల కట్టలతో కొనుగోలు చేయటము సర్వసామాన్యమై పోయింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన వ్యవస్థ ఏ లోపభూయిష్టమైనదని తీవ్ర విమర్శ యున్నది. కాని దీని పరిష్కారమార్గంగా ఎన్నికల కమీషన్ సెప్టెంబర్ 21, 1992న చేసిన సిఫార్సు ననుసరించి 1. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు తాము ఎన్నికల సందర్భంగా చేసిన వ్యయం వాస్తవ వివరాలను అందించలేకపోయినా, తప్పుడు లెక్కలు చూపించినా వారిని శిక్షార్హులుగా పరిగణించించడము. 2. ఈ నేరానికి జరిమానాతో పాటు ఆరు నెలల నుంచి ఏడాదిపాటు కారాగారా శిక్ష ఉండాలని కమీషన్ సూచించింది. ఈ నేరం క్రింద శిక్ష పడిన వారిని కనీసం ఆరేళ్లపాటు ఎన్నికలలో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించాలని ఎన్నికల సంస్కరణలలో చేసిన సిఫార్సుల్లో కమీషన్ సూచించింది. 4. ప్రతి రాజకీయపక్షం తన వార్షిక ఆదాయ వ్యయ వివరాలను ప్రచురించి కమీషన్ సూచించిన సంస్థతో వాటిని ఆడిట్ చేయించాలని కూడా ఎన్నికల కమీషన్ సూచించింది.

## 4.6 ముగింపు :

భారత దేశములో ఎన్నిక నిర్వహణ వ్యవస్థలో రావలసిన మార్పులను గురించి అనేక వాదోపవాదాలు ఉన్నవి. చిన్నచిన్న పార్టీలను ప్రాంతీయ పార్టీలుగా మాత్రమే గుర్తించి కేంద్రంలో బలమైన ద్విపార్టీ విధానము ప్రవేశ పెట్టడం వల్ల ధనం పాత్రను తగ్గించటం, ఎలక్ట్రానిక్ ఓటింగు యంత్రాలను ప్రవేశపెట్టడం వంటి చర్యల ద్వారా ఎన్నికలను మరింత కట్టుదిట్టంగా నిర్వహించవచ్చు. ఆషామాషీగా పోటీ చేయు అభ్యర్థుల సంఖ్యను కూడా తగ్గించవలసి ఉంది.

### మాదిరి ప్రశ్నలు :

**వ్యాసరూప ప్రశ్నలు :**

1. ఎన్నికల కమీషన్ నిర్మాణము, అధికార విధులను వివరించుము.

**లఘు వ్యాసరూప ప్రశ్నలు**

1. ఎన్నికల కమీషన్ విధి నిర్వహణలో ఎదుర్కొనుచున్న సమస్యలను తెలుపుము.
2. నియోజక వర్గాల పునరవ్యవస్థీకరణ ఆవశ్యకతను వివరించుము.

**కుశాగ్ర బుద్ధి ప్రశ్నలు :**

1. ఎన్నికల కమీషన్

రచయిత : శ్రీమతి మెహ్రున్నీసా బేగం

## పాఠం - 5

# ఎన్నికల ధోరణులు - వోటింగ్ ప్రవర్తన

### 5.0. లక్ష్యం :

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి నేటివరకు పార్లమెంటులో లోక్‌సభకు, ఆంధ్రప్రదేశ్ విధానసభకు జరిగిన ఎన్నికలలో ధోరణులను పరిశీలించడం. ఎన్నికల్లో వోటర్ల ప్రవర్తనను ప్రభావితం చేయు కారకాలను ప్రకటించడం.

**విషయ సంగ్రహం**


5.1. పరిచయం

5.2. భారతదేశంలో ఎన్నికలు, ప్రధానాంశాలు

5.3. లోక్‌సభ సాధారణ ఎన్నికలు, ధోరణులు

5.4. ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేయు కారకాలు

5.4.1 మతం

5.4.2 కులం

5.4.3 వర్గం

5.4.4 నాయకుల సమ్మోహన శక్తి

5.4.5 జనాకర్షణ విధానాలు, పథకాలు

5.4.6 పవనాలు లేదా ప్రభంజనాలు

5.4.7 పార్టీల గుర్తులు

5.4.8 ధన ప్రభావం

5.4.9 కుటుంబ వ్యవస్థ

5.5 ముగింపు


### 5.1. పరిచయం :

భౌగోళిక పరిమాణం, సాంస్కృతిక వైవిధ్యం సంక్లిష్ట మరియు సామాజిక, జాతిపర భిన్నత్వాలు భారతదేశ విశిష్ట లక్షణాలు. ఈ లక్షణాలకంటే చైతన్యవంతమైన, శక్తివంతమైన ప్రజాస్వామిక దేశంగా మూడవ ప్రపంచ దేశాలలో, దక్షిణ ఆసియాలో భారతదేశానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరిగే ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గీటురాయి. నాలుగు దశాబ్దాలుగా (ఎమర్జెన్సీ కాలాన్ని మినహాయిస్తే) భారత ప్రజాస్వామ్యం ఎన్నికలపై, పార్టీ రాజకీయాలపై ఆధారపడి ఆసక్తికరమైన, చురుకైన, పోటీగల రాజకీయ వ్యవస్థగా పనిచేయుచున్నది. ఇప్పటివరకు పది పార్లమెంటరీ ఎన్నికలు జరిగాయి. వీటితోపాటు రాష్ట్రాల విధాన సభలకు, పురపాలక సంఘాలకు, పంచాయతీరాజ్ సంస్థలకు అనేక పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు ప్రజాస్వామిక వ్యవస్థను పటిష్ఠపరచినవని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1960 దశకపు ఉత్తరార్ధంనుండి జరిగిన ఎన్నికల ఫలితాలు భారతీయ సగటు ఓటర్ల రాజకీయ చైతన్యం స్థిరసంకల్పంను ప్రకటించుచున్నవి. 1970, 1980 సం॥లోని లోక్‌సభ ఎన్నికలు దీనికి ఒక ఉదాహరణ. భారతదేశంలో ఎన్నికలను

నిర్వహించే కార్యభారం సర్వస్వతంత్రంగా వ్యవహరించే ఎన్నికల కమీషన్‌కు అప్పగించబడింది. రాజ్యాంగ నిబంధనలకు, అనేక ఇతర చట్టాలకు ప్రవర్తనా నియమావళికి లోబడి (ఉదా॥ ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1950, 1951, నియోజక వర్గాల డిలిమిటేషన్ చట్టం 1952, ప్రవర్తనా నియమావళి చట్టం 1961, ఎన్నికల గుర్తుల రిజర్వేషన్ మరియు కేటాయింపుల ఆర్డరు 1968) భారతదేశంలో ఎన్నికలు జరుగుచున్నవి. పార్లమెంటులో లోక్‌సభకు జరిగిన వివిధ ఎన్నికల ఫలితాలను అధ్యయనం చేయుటద్వారా ఎన్నికల ధోరణులను తెలుసుకోవచ్చు.

## 5.2. భారతదేశంలో ఎన్నికలు, ప్రధానాంశాలు :

లోక్‌సభకు, రాష్ట్రాల విధానసభలకు జరిగే ఎన్నికలకు వయోజన ఓటింగ్ విధానం ఆధారం. 61 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటర్ల కనీస వయోపరిమితిని 18 సం॥లకు పరిమితం చేశారు. ఈ ఎన్నికల కొరకు జనాభా ప్రాతిపదికగా, భౌగోళిక పరిధి ఆధారంగా నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజక వర్గాలలో 5 నుండి 7 1/2 లక్షల మేరకు ఓటర్లు ఉంటారు. విధానసభల నియోజక వర్గాలలో 75 వేలనుండి 1 1/2 లక్షవరకు ఓటర్లు ఉంటారు. సాంఘిక సమానత్వాన్ని సాధించటం కోసం బలహీన వర్గాలకు, యస్.సి., యస్.టి.లకు కొన్ని స్థానాలను రిజర్వు చేశారు. ఎన్నికలలో అత్యధిక ఓట్లను పొందిన అభ్యర్థులను గెలిచినట్లు ప్రకటిస్తారు. అభ్యర్థులు గెలుచుటకు పొందవలసిన కనీస ఓట్ల సంఖ్యను నిర్ధారించలేదు.

## 5.3. లోక్‌సభ సాధారణ ఎన్నికలు, ధోరణులు :

(1) భారతదేశంలో 1952 లో మొటి సాధారణ ఎన్నికలు జరిగాయి. నేటివరకు పది సాధారణ ఎన్నికలు జరిగినవి. ఇప్పటివరకు జరిగిన లోకసభ ఎన్నికలలో దాదాపు రెండువందల పార్టీలు పాల్గొన్నవి. తొలి సాధారణ ఎన్నికలలో 485 స్థానాలకు 15 వేలకు పైగా అభ్యర్థులు పోటీచేశారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీ 45 శాతం ఓట్లతో 364 స్థానాలను గెలుచుకుంది. ప్రతిపక్షాలలో 3.3 శాతం ఓట్లతో సి.పి.ఐ. 16 స్థానాలను అత్యధికంగా గెలుచుకున్నది. భారతీయ జనసంఘ్, సోషలిస్ట్ పార్టీ, రామరాజ్య పరిషత్, కిసాన్ మజ్దూర్ పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, అకాలీదళ్, పెజంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ మొదలగునవి పాల్గొనినప్పటికి వీటికి అతి తక్కువ శాతం ఓట్లు, స్థానాలు లభించినవి. ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి దేశంలో ఉన్న ఆధిక్యాన్ని స్పష్టం చేసినవి. కేవలం 45 శాతం ఓట్లను మాత్రమే పొందగలిగిన కాంగ్రెస్‌పార్టీ 74.44 శాతం స్థానాలను పొందగలగడానికి మిగిలిన 55 శాతం ఓట్లు అనేక జాతీయ ప్రతిపక్షాలమధ్య, ఇండిపెండెంట్లమధ్య చీలిపోవుటయే కారణం. ఈ ఎన్నికలు ఏకపార్టీ ఆధిక్యత కలిగిన బహుళ పార్టీ విధాన ప్రారంభానికి నాంది పలికాయి.

(2) 1956 లో రాష్ట్రాల పునఃనిర్మాణం జరిగిన తరువాత రెండవ లోక్‌సభకు సాధారణ ఎన్నికలు జరిగినవి. మొదటి సాధారణ ఎన్నికలు జరగడానికి 17 వారాల కాలం పట్టగా ఈ ఎన్నికలు 17 రోజులలో పూర్తి అయినవి. గతంలో కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో 364 స్థానాలుండగా ఈ ఎన్నికలలో 490 మంది అభ్యర్థులు కాంగ్రెస్ తరపున పోటీచేసి 371 స్థానాలను గెలుచుకున్నారు. 47.78 ఓట్ల శాతంలో 75.1 సీట్ల శాతాన్ని గెలుచుకోవడం విశేషం. రెండవస్థానంలో 19.39 ఓట్ల శాతంతో, ఇండిపెండెంట్లు 39 స్థానాలను పొందారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా 108 స్థానాలకు పోటీ చేసింది. 8.92 ఓట్ల శాతంతో 27 స్థానాలను గెలుచుకున్నది. ఏ ఇతర పార్టీకి 10 శాతం మించి ఓట్లు లభించలేదు. ఈ ఎన్నికల ద్వారా కమ్యూనిస్ట్‌లు తొలిసారిగా కేరళ రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చారు. రాష్ట్రాలవారీగా ఎన్నికల ఫలితాలను గమనించినట్లైతే ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాలలోను, బొంబాయి, కలకత్తా వంటి పెద్ద నగరాలలోను కాంగ్రెస్ పార్టీబలం కొంత తగ్గి, కమ్యూనిస్ట్ పార్టీబలం కొంతమేరకు పెరిగిందని తెలుస్తుంది.

(3) 1962 లో స్వతంత్రపార్టీ మొదటిసారిగా ఎన్నికలలో పాల్గొనడం ఈ సాధారణ ఎన్నికల విశేషం. కాంగ్రెస్ పార్టీ 488 స్థానాలలో పోటీచేసి 44.7 ఓట్ల శాతంతో 361 స్థానాలను గెలుచుకొని తన ఆధిక్యాన్ని దాదాపుగా నిలుపుకొనగలిగింది. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా 137 స్థానాలకు పోటీచేసి 9.96 శాతం ఓట్లను పొంది 29 స్థానాలను గెలుచుకుంది. జనసంఘ్ పార్టీ 198 స్థానాలకు పోటీచేసి 6.44 ఓట్ల శాతాన్ని పొంది 14 స్థానాలను గెలవటం విశేషం. జనసంఘ్ 1952 ఎన్నికలలో 0.6 శాతం, 1957 లో 0.8 శాతం ఓట్లు పొందగలిగినది. ఈ ఎన్నికలలో 6.44 శాతం ఓట్లను సంపాదించగలిగింది. ప్రాంతీయ పార్టీయైన డి.యం.కె. 18 స్థానాలకు పోటీచేసి 2.20 ఓట్ల శాతంతో 7 స్థానాలను గెలుచుకొని ప్రధాన ప్రాంతీయ పార్టీగా అవతరించింది. మిగిలిన రాజకీయ పార్టీలలో ఏ పార్టీకి 5 శాతం మించి

ఓట్లు లభ్యం కాలేదు. ఇండిపెండెంట్లు 12.27 శాతం ఓట్లతో 27 స్థానాలను పొందగలిగారు. 1952 లో 36 స్థానాలు, 1957 లో 27 స్థానాలను పొందిన ఇండిపెండెంట్లు ఈ ఎన్నికలలో కేవలం 24 స్థానాలను మాత్రమే పొందగలిగారు.

(4) నెహ్రూ మరణానంతరం జరిగిన తొలి ఎన్నికలు 1967 ఫిబ్రవరి మూడవ వారంలో జరిగినవి. 1962 లో చైనా యుద్ధం, 1964 లో కమ్యూనిస్టుపార్టీ సి.పి.ఐ., సి.పి.యం లుగా చీలిపోవడం, సోషలిస్ట్ పార్టీ, ప్రజా సోషలిస్ట్ పార్టీలు కలిసి సంయుక్త సోషలిస్ట్ పార్టీగా ఏర్పడటం, నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరగడం వంటి సంఘటనల తరువాత జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ ఉత్తరాది రాష్ట్రాలలో తన మెజారిటీ కోల్పోయింది. పర్యవసానంగా అనేక సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడినవి. ఈ నూతన వాతావరణంలో పార్టీ ఫిరాయింపులు అసంఖ్యాకంగా జరిగినవి.

మొట్టమొదటిసారిగా కాంగ్రెస్‌పార్టీ ఆధిక్యతకు బీటలు పడినవి. 516 స్థానాలకు పోటీచేసిన కాంగ్రెస్‌పార్టీ 40.8 ఓట్లశాతంతో కేవలం 284 స్థానాలను మాత్రమే గెలుచుకొనగలిగింది. 1967 లో 361 స్థానాలను పొందిన కాంగ్రెస్ ఈ ఎన్నికలలో 77 స్థానాలను కోల్పోయింది. స్వతంత్ర పార్టీ రెండవ ప్రధానపార్టీగా అవతరించింది. 179 స్థానాలకు పోటీచేసి 8.68 ఓట్ల శాతంతో 44 స్థానాలను కైవశం చేసుకుంది. ఈ ఎన్నికలలో జనసంఘ్ బలం పెరిగింది. 250 స్థానాలకు పోటీచేసి 9.41 ఓట్ల శాతాన్ని పొంది 35 స్థానాలను గెలుచుకొనగలిగింది. కేవలం 25 స్థానాలకు పోటీచేసి 25 స్థానాలను గెలుచుకొని డి.యం.కె. అఖండ విజయాన్ని సాధించింది. 3.90 ఓట్ల శాతంతో 4.80 సీట్లను గెలుచుకోవడం ఒక విశిష్టమైన పరిణామం. సి.పి.ఐ. 5.19 ఓట్ల శాతంతో 23 స్థానాలను, సి.పి.యం. 4.21 ఓట్ల శాతంతో 19 స్థానాలను, సంయుక్త సోషలిస్ట్ పార్టీ 4.92 ఓట్లశాతంతో 23 స్థానాలను గెలుచుకున్నవి. ప్రతిపక్షాల ఓట్లు చీలినపుడు మాత్రమే కాంగ్రెస్‌పార్టీకి ఆధిక్యత లభిస్తుందనే వాస్తవం మరోమారు వెల్లడయింది.

(5) 1969లో రాష్ట్రపతి ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పార్టీ చీలిపోయింది. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటి విప్లవాత్మక నిర్ణయాలను తీసుకున్న శ్రీమతి ఇందిరాగాంధీ మధ్యంతర ఎన్నికలు ప్రకటించి గరీబీ హటావో నినాదంతో ఎన్నికల బరిలోకి దిగింది. ఇది భారతదేశంలో జరిగిన తొలి మధ్యంతర ఎన్నిక. 462 స్థానాలకు పోటీచేసి 43 శాతం ఓట్లతో 350 స్థానాలను కాంగ్రెస్ (ఐ) (ఇందిరా కాంగ్రెస్) గెలుచుకొని తన పూర్వవైభవాన్ని నిలబెట్టుకొనగలిగింది. కాంగ్రెస్‌నుండి చీలిపోయిన కాంగ్రెస్ (ఓ) 239 స్థానాలకు పోటీచేసి 10 శాతం ఓట్లతో 16 సీట్లను మాత్రమే పొందగలిగింది. సి.పి.ఐ., కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకొని 23 స్థానాలు గతంలో 35 స్థానాలను కలిగిన జనసంఘ్ పార్టీ ఈ ఎన్నికలలో 22 స్థానాలను, గతంలో 44 స్థానాలను కలిగిన స్వతంత్రపార్టీ 8 స్థానాలను పొందగలిగాయి.

(6) 1971 సాధారణ ఎన్నికలలో కనపడిన ఇందిరా ప్రభంజనం 1972 రాష్ట్ర విధాన సభ ఎన్నికలలో కూడా కొనసాగింది. కాని భారతదేశ రాజకీయాలలో ఆందోళనా రాజకీయాల ఘట్టం ప్రారంభమైంది. 1974 లో గుజరాత్ ఆందోళన కారణంగా 1975 లో గుజరాత్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. బీహార్ విద్యార్థుల ఆందోళనకు శ్రీ జయప్రకాష్ నారాయణ్ సారథ్యం వహించి "సంపూర్ణ విప్లవ నినాదాన్ని" ఇచ్చారు. ఈ నేపథ్యంలో అలహాబాదు హైకోర్టు తీర్పు వెలువడటం జరిగింది. ఈ తీర్పు ప్రకారం శ్రీమతి ఇందిరాగాంధి ఎన్నిక రద్దు చేయబడింది. ఈ రాజకీయ పరిణామాల పర్యవసానంగా శ్రీమతి గాంధీ 1975 జూన్ 26 అర్ధరాత్రి ఆంతరంగిక అత్యవసర పరిస్థితి విధించింది. పత్రికా స్వాతంత్ర్యాన్ని నిషేధించి మీసా (MISA) పి.డి. చట్టాల ద్వారా ప్రతిపక్షాల నాయకులను నిర్బంధంలోకి తీసుకుంది. ఈ ఎమర్జెన్సీ సమయంలో 42 వ రాజ్యాంగ సవరణ చట్టం చేసి లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల పదవీకాలాన్ని 5 సం॥ల నుండి 6 సం॥లకు పొడిగించారు. న్యాయస్థానాల న్యాయసమీక్షాధికారంపై నిర్బంధాలను విధించారు. ఈ నేపథ్యంలో 1977 లో లోక్‌సభకు 6 వ సాధారణ ఎన్నికలు జరిగాయి, ఉత్తరాది రాష్ట్రాలలో జనతాప్రభంజనం, దక్షిణాది రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభంజనం వీచింది. ఎన్నికల వివరాలను ఈ క్రింది పట్టికలో చూపడమైనది.

**ఆరవ లోకసభ సాధారణ ఎన్నికలు, పార్టీల బలాబలాలు :-**

| క్ర.సం. | పార్టీపేరు | గెలిచిన స్థానాలు | గెలిచిన స్థానాల శాతం |
|---|---|---|---|
| 1. | కాంగ్రెస్ | 153 | 28.33 |
| 2. | జనత | 298 | 53.37 |
| 3. | సి.పి.ఐ | 7 | 1.30 |
| 4. | సి.పి.యం. | 21 | 4.07 |
| 5. | డి.యం.కె. | 1 | 0.18 |
| 6. | ఏ.ఐ.ఏ.డి.యం.కె. | 18 | 3.30 |
| 7. | అకాలీదళ్ | 8 | 10.93 |
| 8. | స్వతంత్రులు | 14 | 2.48 |
| 9. | ఇతరులు | 22 | 3.50 |
| | మొత్తం | 542 | 100.00 |

కాంగ్రెస్‌పార్టీ 28.33 ఓట్ల శాతంతో 153 స్థానాలను మాత్రమే గెలుచుకొనగలిగింది. కాగా జనతాపార్టీ, కాంగ్రెస్ డెమోక్రసీ పార్టీలు 53.37 శాతం ఓట్లతో 298 స్థానాలను గెలుచుకున్నవి. కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న సి.పి.ఐ కేవలం 1.3 ఓట్ల శాతంతో 7 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. సి.పి.యం. 4.0 7 శాతం ఓట్లతో 21 స్థానాలను గెలుచుకున్నది. ఏ.ఐ.ఏ.డి.యం.కె. 3.30 ఓట్ల శాతంతో 18 స్థానాలను, అకాలీదళ్ 10.93 ఓట్ల శాతంతో 8 స్థానాలను గెలుచుకున్నాయి. ఇండిపెండుంటుకు 14 స్థానములు లభించినవి.

ఉత్తర, దక్షిణ భారతదేశాలు భిన్నమార్గాలలో పయనించటం ఒక నూతన ధోరణి. ఉత్తరాది రాష్ట్రాలలో కనిపించిన జనతా ప్రభంజనం దక్షిణాది రాష్ట్రాలలో కనిపించలేదు. దీనికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభంజనానికి దక్షిణాది రాష్ట్రాలలో ఎమర్జెన్సీ అత్యాచారాలు అతి తక్కువ స్థాయిలో జరగటం, ఇరవై సూత్రాల పథకాన్ని, ఐదు సూత్రాల పథకాన్ని శక్తివంతంగా కాంగ్రెస్ రాష్ట్రాలు అమలుచేయడం వంటి కారణాలను ఉదహరించవచ్చు. ఆంధ్రప్రదేశ్ 42 స్థానాలలో, 41 స్థానాలను తమిళనాడులో 39 స్థానాలకు 14 స్థానాలను (కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న అన్నా డి.ఎం.కె.కు 18 స్థానాలు లభించనవి). కర్ణాటకలో 28 స్థానాలకు 26 స్థానాలను కాంగ్రెస్‌పార్టీ పొందింది. దీనికి భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లో జనతాపార్టీకి ఒక స్థానం, తమిళనాడులో మూడు, కర్ణాటకలో రెండు స్థానాలు లభించినవి. ఈ ఎన్నికలలో ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీలు ఓటమిపాలైనారు. ఎన్నికలలో పోటీచేసిన 49 కేంద్రమంత్రులలో 15 మంది మాత్రమే గెలిచినారు. 13 కేబినెట్ మంత్రులలో 7 మంది, 17 స్టేట్ మంత్రులలో 4 గురు, 19 డిప్యూటీ మంత్రులలో 4 గురు మాత్రమే గెలుపొందారు.

1977 లో జరిగిన ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌పార్టీ కాంగ్రెస్ (ఐ), కాంగ్రెస్ (ఆర్) లుగా విడిపోవడం, జనతాపార్టీ విచ్ఛిన్నం కావడం వంటి రాజకీయ పరిణామాల అనంతరం 1980 లో లోక్‌సభ ఏడవ సాధారణ ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికలలో జనతాపార్టీ 420 స్థానాలకు పోటీచేసి 31 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. లోక్‌దళ్ 42 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. ఈ ఎన్నికలలో సి.పి.యం. బలం గణనీయంగా పెరిగింది. కేవలం 6.43 ఓట్ల శాతంతో 38 స్థానాలను గెలుచుకొనగలిగింది. రద్దయిన లోక్‌సభలో 56 స్థానాలు గల కాంగ్రెస్ (ఆర్) ఈ ఎన్నికలలో కేవలం 13 స్థానాలను మాత్రమే పొంది తీవ్ర పరాజయం పాలైనది. ప్రాంతీయపార్టీల ప్రాబల్యం ఈ ఎన్నికలతో క్షీణించింది. 1977 లో 9 స్థానాలను కలిగిన అకాలీదళ్ ఈ ఎన్నికలలో ఒక స్థానాన్ని మాత్రమే పొందింది. ఆర్స్‌కాంగ్రెస్‌లో విలీనమైన కర్ణాటక కాంగ్రెస్‌కు గత లోక్‌సభలో 10 స్థానాలుండగా, ఈ ఎన్నికలలో ఒక్కస్థానం కూడా దక్కలేదు. 1984 లో జరిగిన లోక్‌సభ సాధారణ ఎన్నికలు ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగినవి. ఈ ఎన్నికలు రాజీవ్‌గాంధీనాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ అఖండ విజయాన్ని సాధించి 412 స్థానాలను గెలుచుకుంది.

ఈ ఎన్నికల వివరాలను ఈ క్రింది పట్టికలో చూపడమైనది.

**లోక్‌సభ ఎనిమిదవ సాధారణ ఎన్నికలు, పార్టీల బలాబలాలు :-**

| క్ర.సం. | పార్టీపేరు | గెలిచిన స్థానాలు | గెలిచిన స్థానాశాతం |
|---|---|---|---|
| 1. | కాంగ్రెస్ (ఐ) | 412 | 75.73 |
| 2. | తెలుగుదేశం | 30 | 5.51 |
| 3. | సి.పి.యం. | 22 | 4.04 |
| 4. | ఏ.ఐ.ఏ.డి.యం.కె. | 12 | 2.20 |
| 5. | జనత | 10 | 1.83 |
| 6. | సి.పి.ఐ. | 6 | 1.1 |
| 7. | స్వతంత్రులు, ఇతరులు | 52 | 9.53 |
| | మొత్తం | 544 | 100.00 |

ఈఎన్నికలలో ఒక ప్రాంతీయ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా అవతరించటం విశేషం. ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ 30 స్థానాలను గెలుచుకున్నది. ఇందిరాగాంధీ హత్యానంతరం ఆంధ్రప్రదేశ్‌లో సానుభూతి పవనాలు వీచకపోగా, తెలుగుదేశం అనుకూల పవనాలు వీచడానికి 1984, ఆగస్టు నెలలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని రాజ్యాంగ వ్యతిరేకంగా గద్దెనుండి దింపియుండుటయే ప్రధాన కారణం. ఈ ఎన్నికలలో సి.పి.ఐ. 22 స్థానాలను, ఎ.ఐ.ఎ.డి.యం.కె. 12 స్థానాలను, జనతాపార్టీ 10 స్థానాలను, సి.పి.ఐ. 6 స్థానాలను గెలుచుకున్నవి. ఈ ఎన్నికలలో ఎక్కువగా నష్టపోయిన పార్టీ బి.జె.పి. 226 స్థానాలకు పోటీచేసి కేవలం రెండు స్థానాలను మాత్రమే పొందగలిగింది. తక్కిన 15 రాష్ట్రాలలోను, 3 కేంద్రపాలిత ప్రాంతాలలోను కేవలం ఒక్క సీటుకూడా బి.జె.పి.కి లభించలేదు. జనతాపార్టీ 207 స్థానాలకు పోటీచేసి కేవలం 10 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. ఈ ఎన్నికలలో ఇండిపెండెంట్లు అధికశాతం పోటీచేయడం విశేషం. 513 లోక్‌సభ స్థానాలకు పోటీచేసిన 5,186 మందిలో 3,696 మంది ఇండిపెండెంట్లు ఉన్నారు. మహిళా ప్రతినిధులు అధికంగా గెలవడం ఈ ఎన్నికలలో మరోవిశేషం. 157 మంది స్త్రీలు పోటీచేయగా 42 మంది ఎన్నికైనారు.

(7) లోక్‌సభ కాలపరిమితి 1990, జనవరి 14 తో ముగివయవలసి ఉన్నప్పటికి బోఫార్స్ కుంభకోణంపై జరిగిన అనేక ఆరోపణలు, ప్రతి ఆరోపణల మధ్య శ్రీ రాజీవ్‌గాంధీ లోక్‌సభను రద్దుచేయవలసిందిగా రాష్ట్రపతి సిఫారసుచేసి మధ్యంతర ఎన్నికల నిర్వహణకు సలహాను ఇచ్చినారు. ఈ నేపథ్యంలో 1989 లో జరిగిన తొమ్మిదవ లోక్‌సభ సాధారణ ఎన్నికలు అనేక విధాల ప్రత్యేకతను సంతరించుకున్నది. 18 సం॥ల వయస్సు కలిగిన వారందరికీ ఈ ఎన్నిక ఓటుహక్కును కల్పించింది. ఈ ఎన్నికలలో 49 కోట్లమంది ఓటర్లు పాల్గొన్నారు. ఎన్నికల బూతును స్వాధీనం చేసుకోనడం, రిగ్గింగ్, ఓటర్లను భయభ్రాంతులను చేయటం పోలీస్ కాల్పులు విస్తృతస్థాయిలో జరగటం మొదలగునవి ఈ ఎన్నికలలో నూతనంగా తలెత్తిన ధోరణులు. నామినేషన్‌ల సమయంలోనే హింసాకాండ కొనసాగింది. 1984 లో అఖండ విజయాన్ని సాధించి 412 స్థానాలను గెలుచుకున్న కాంగ్రెస్(ఐ) విపరీతంగా నష్టపోయింది. ఈ ఎన్నికలలో కేవలం 193 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. జనతాదళ్, బి.జె.పి.లకు అధికంగా సీట్లు లభించాయి. 1977లో 34.5 శాతం ఓట్లతో 154 స్థానాలు సంపాదించిన కాంగ్రెస్‌కు 1989 లో 43.5 శాతం ఓట్లతో 193 స్థానాలు లభించినవి. 1984 ఎన్నికలలో 48.1 శాతం ఓట్లతో 415 స్థానాలు సంపాదించిన కాంగ్రెస్‌కు ఇది ఘోర పరాజయం. తాదితనసీట్లలో 133 ను జనతాదళ్‌కు 84 ను బి.జె.పికి. కోల్పోయింది. సుమారు 4.5 శాతం ఓట్లు కోల్పోయిన కాంగ్రెస్ 36 శాతం ఓట్లు నష్టపోయినది. 17.93 శాతం ఓట్లతో జనతాదళ్ 141 స్థానాలను సంపాదించినది. 1984 పార్లమెంటు ఎన్నికలలో 216 స్థానాలకు పోటీచేసి రెండు సీట్లు గెలుచుకున్న భారతీయ జనతాపార్టీ ఎన్నికలలో 220 స్థానాలకు పోటీచేసి 88 స్థానాలను గెలుచుకొని అఖండ విజయాన్ని సాధించినది. ప్రాంతీయ పార్టీలలో డి.ఎం.కె., తెలుగుదేశం పార్టీలు ఘోరపరాజయాన్ని పొందినవి. ఏ

పార్టీకి నిర్ణీత మెజారిటీ రాకుండా హంగ్ (HUNG) పార్లమెంటు లేదా ఊగిసలాడే (అనిశ్చిత) పార్లమెంటు ఏర్పడింది. 1989 ఎన్నికలు అస్థిర రాజకీయ వాతావరణానికి నాంది పలికాయి.

**తొమ్మిదవ లోక్‌సభ సాధారణ ఎన్నికలు-1989, పార్టీల బలాబలాలు :-**

| క్ర.సం. | పార్టీపేరు | గెలిచిన స్థానాలు |
|---|---|---|
| 1. | కాంగ్రెస్ | 193 |
| 2. | జనతాదళ్ | 141 |
| 3. | బి.జె.పి. | 88 |
| 4. | సి.పి.యం. | 32 |
| 5. | సి.పి.ఐ | 11 |
| 6. | ఏ.ఐ.ఏ.డి.యం.కె. | 11 |
| 7. | అకాలీదళ్ (మాన్) | 6 |
| 8. | తెలుగుదేశం పార్టీ | 2 |
| 9. | ఇతరులు | 40 |
| | మొత్తం | 525 |

(8) నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి భారతీయ జనతాపార్టీ తన మద్దతును ఉపసంహరించుకున్న కారణంగా 1991 మే నెలలో పదవ లోక్‌సభ సాధారణ ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికలు రెండు విడతలలో జరగవలసి ఉండగా మొదటి విడత అనంతరం శ్రీ రాజీవ్‌గాంధీ హత్యకు గురియైనారు. హత్యానంతరం జరిగిన ఎన్నికలపై కాంగ్రెస్‌పార్టీకి అనుకూలంగా కొంతమేరకు సానుభూతి పవనాలు వీచినవి. ఈ ఎన్నికలు 1989 ఎన్నికల ఫలితాలను కొనసాగించే ధోరణులను కలిగిఉన్నది. ఈ ఎన్నికలలో పార్టీల బలాబలాలను ఈ క్రింది పట్టికలో చూపడమైనది.

**పదవ లోకసభ ఎన్నికలు-1991, పార్టీల బలాబలాలు :-**

| క్ర.సం. | పార్టీపేరు | గెలిచిన స్థానాలు | ఓట్లశాతం |
|---|---|---|---|
| 1. | కాంగ్రెస్ | 218 | 36.7 |
| 2. | బి.జె.పి. | 116 | 20.3 |
| 3. | జనతాదళ్ | 56 | 11.6 |
| 4. | టి.డి.పి. | 13 | 3.2 |
| 5. | ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. | 11 | 1.8 |
| 6. | సి.పి.యం | 34 | 6.6 |
| 7. | సి.పి.ఐ | 13 | 2.4 |
| 8. | శివసేన | 4 | 0.8 |
| 9. | ముస్లింలీగ్ | 2 | 0.3 |
| 10. | ఇతరులు | 27 | 16.3 |
| | మొత్తం | 494 | 100.0 |

ఈ ఎన్నికలలో 39.5 ఓట్ల శాతంతో 193 స్థానాలను కలిగిన కాంగ్రెస్‌పార్టీ 36.7 ఓట్ల శాతంతో 218 స్థానాలను గెలుచుకుంది. ఈ ఎన్నికలలో అసాధారణంగా లాభపడిన పార్టీ బి.జె.పి. 11.5 ఓట్లశాతంతో 88 స్థానాలను కలిగిన భారతీయ జనతాపార్టీ కూటమి 21.2 ఓట్ల శాతంతో 120 స్థానాలను పొందింది. 1989 లో 185 స్థానాలను పొందిన నేషనల్ ఫ్రంట్, లెఫ్ట్ పార్టీల కూటమి 1991 ఎన్నికలలో 28.7 ఓట్ల శాతంతో 131 స్థానాలను మాత్రమే పొందినది. తెలుగుదేశం పార్టీ 1989 లో 3.3 ఓట్ల శాతంతో రెండు స్థానాలను మాత్రమే కలిగిఉన్నది. కాగా 1991 లో 3.2 ఓట్ల శాతంతో 13 స్థానాలను చేజిక్కించుకున్నది. 1991 ఎన్నికల ధోరణులు నిశితంగా పరిశీలించినట్లైతే అయోధ్య వివాదం యొక్క ప్రభావం, రాజీవ్‌గాంధీ హత్యానంతరం సానుభూతి పవనాల యొక్క ప్రభావం భారతీయ ఓటర్లపై ఉన్నట్లు స్పష్టమవుతుంది.

(9) భారతదేశంలో నేటివరకు జరిగిన లోక్‌సభ ఎన్నికల ధోరణులను నిశితంగా పరిశీలిస్తే ప్రతిపక్షాల అనైక్యత పాలకపార్టీకి ఉపయోగపడినట్లుగా స్పష్టమవుతుంది. 1967 లో కాంగ్రెస్‌పార్టీ ప్రాబల్యం తగ్గినప్పటికి 1971 ఎన్నికలలో తిరిగి నిలుపుకొనగలిగింది. 1977 సం॥లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి, జనతాపార్టీ అధికారంలోకి వచ్చినపుడు ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్నత్వం ప్రస్ఫుటమైంది. 1980 లోను, 1984 లోను కాంగ్రెస్ అనుకూల పవనాలు వీచినవి. 1980 లో జనతాపార్టీ అస్థిరత్వం వల్ల 1984 లో ఇందిరాగాంధీ హత్యవల్ల కాంగ్రెస్‌కు అనుకూల పవనాలు వీచినట్లు స్పష్టమవుతుంది. 1989 ఎన్నికలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాని పరిస్థితి తలెత్తినట్లు స్పష్టమవుతుంది. ఇదే ధోరణి 1991 ఎన్నికలలో కూడా పునరావృతమైంది. సానుభూతి, అనుకూల పవనాలు ఉత్తర దక్షిణ భారత దేశాలమధ్య భిన్నత్వం ఉండటమనేది ఈ ఎన్నికల ధోరణులలోని ప్రధానాంశంగా వివరించవచ్చు.

## 5.4. ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేయు కారణాలు :

రాజనీతి శాస్త్రంలో ఓటర్ల ప్రవర్తనను అధ్యయనం చేయడమనేది ఇటీవలి కాలంలో అత్యంత ప్రాధాన్యతను పొందినది. ఓటర్ల ప్రవర్తన పాలక, ప్రతిపక్ష పార్టీల భవితవ్యాలను నిర్ధారిస్తాయి. ఈ సందర్భంగా ప్రపంచదేశాలను (1) పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలు, (2) పరిణతి చెందుచున్న ప్రజాస్వామ్య దేశాలు, (3) ప్రజాస్వామ్యేతర దేశాలుగా వర్గీకరించటం పరిపాటి. పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలకు ఇంగ్లాండ్, అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలను ఉదహరిస్తారు. భారతదేశం పరిణతి చెందుచున్న, నిరంతర మార్పుకు లోనవుతున్న, ఒక అభివృద్ధి చెందుచున్న దేశం. పరిణతి చెందిన ప్రజాస్వామ్యాలలో ద్విపార్టీ విధానం బలంగా పనిచేస్తూ పాలక, ప్రతిపక్ష పార్టీల సిద్ధాంతాలు ఓటరు ప్రవర్తనను నిర్ధారిస్తాయి. దీనికి భిన్నంగా భారతదేశం వంటి దేశాలలో ఓటర్ల ప్రవర్తన అతి సంక్లిష్టంగా ఉంటుంది. భారతదేశం భౌగోళికంగా, సాంస్కృతిక పరంగా భిన్నత్వం కలిగిన దేశం. ఇందులో అనేక రాజకీయ పార్టీలు పనిచేస్తున్నాయి. ఇట్టి పరిస్థితులలో ఓటరు ప్రవర్తనను అధ్యయనం చేయటంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి.

ఎన్నికల సమయంలో సగటు ఓటరు ఏ పార్టీకి ఓటు వేస్తాడనేది, ఒక తీవ్రమైన ప్రశ్న. గతంలో కాంగ్రెస్ పార్టీకి ధీటైన ప్రత్యామ్నాయం లేకపోవుట వలన సమాజంలోని దాదాపు అధిక వర్గాలలోని అధిక శాతంవారు కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేయడానికి సిద్ధపడేవారు. కాగా ఇటీవలి కాలంలో ఆరంభమైన రాజకీయ అనిశ్చిత వాతావరణం దృష్ట్యా ఓటరు ఏ పార్టీకి ఓటు వేస్తాడనేది ఒక తీవ్రమైన ప్రశ్న. ఈ సందర్భంగా భారతదేశంలో సగటు ఓటరుపై మతం, కులం, వర్గం, నాయకుల సమ్మోహనశక్తి, ప్రభుత్వాలు అనుసరించే జనాకర్షణ పథకాలు, ఎన్నికల సమయంలో వీచే పవనాలు లేదా ప్రభంజనాలు పార్టీలకు ఎన్నికల కమీషన్ కేటాయించిన గుర్తులు, ధనం కుటుంబవ్యవస్థల ప్రభావం అధికంగా ఉంటుంది. వీటి ప్రభావాల ఫలితంగా తలెత్తిన అయోమయ పరిస్థితిలో చివరిరోజు వరకు సగటు ఓటరు కొన్ని సందర్భాలలో ఎవరికి ఓటు వేయాలనేది తేల్చుకోలేకపోవచ్చు. ఈ కారణంగా భారతదేశంలో జరిపిన అనేక అధ్యయనాలు అనిశ్చిత ఓటరు ప్రభావం అపారంగా ఉందని అంచనా వేశాయి. అనిశ్చిత సగటు ఓటరు ఏ పార్టీకి ఓటువేస్తాడో ఆ పార్టీ గెలిచే అవకాశాలు హెచ్చుగా ఉన్నట్లు భావించవచ్చు

### 5.4.1. మతం :

భారతదేశంలో హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు, శిక్కులు మొదలగు మతస్థుల వారున్నారు. వ్యక్తికి, మతానికి విడదీయరాని అనుబంధం ఉండటం భారత సమాజ విశిష్ట లక్షణం. ఎన్నికల సమయంలో వ్యక్తిపై మతం ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది.

స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి రామరాజ్య పరిషత్, విరాట్ హిందూ మహాసభ, ముస్లింలీగ్, మజ్లీస్, ఇత్తేహాదుల్ ముస్లిమీన్ వంటి మతతత్వ పార్టీలు ఎన్నికలలో పాల్గొన్నవి. అయినప్పటికీ ప్రారంభంలో నిర్వహించబడిన సాధారణ ఎన్నికలలో ఈ మతం ప్రభావం పరిమితంగా ఉండేది. ఇటీవలి కాలంలో షాబాను కేసులో సుప్రీంకోర్టు తీర్పునివ్వడం, అయోధ్యలో రామాలయంలో శిలాన్యాసాలను నిర్వహించటం, అద్వానీ రథయాత్రను నిర్వహించడం, సంఘటనల ఫలితంగా భారతీయ ఓటరుపై మతంయొక్క ప్రభావం అపారంగా కనిపిస్తుంది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ అధికారాన్ని కైవసం చేసుకోవడానికి హిందూమత ఓటర్ల ఆదరాభిమానాలను పొంది వారి ఓట్లను ఎన్నికలలో సంఘటితంగా పొందగలగడమే కారణమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మహమ్మదీయులపట్ల ఇటీవలి కాలంలో కాంగ్రెస్ అనుసరించిన అనిశ్చిత వైఖరులవల్ల మహమ్మదీయుల ఓట్లు నేషనల్ ఫ్రంట్, లెఫ్ట్‌పార్టీల కూటమికి వెళుతున్నట్లు కూడా రాజకీయ విమర్శకులు అంచనా వేస్తున్నారు.

### 5.4.2. కులం :

హిందూ జాతి అనేక కులాల సముదాయం. ఇందులో అగ్రకులాలు, వెనుకబడిన కులాలు, హరిజనులు అనే వర్గీకరణ కనిపిస్తుంది. అగ్రకులాలవారు కాంగ్రెస్‌పార్టీకి లేదా భారతీయ జనతా పార్టీకి ఓటు వేస్తారని వెనుకబడిన కులాలకు సంబంధించినవారు నేషనల్ ఫ్రంట్, లెఫ్ట్‌కూటములకు ఓటు వేస్తారనే బలమైన నమ్మకం ఉంది. సాంప్రదాయకంగా షెడ్యూల్డు తెగల వారు కాంగ్రెస్‌పార్టీకి ఓటువేయడం పరిపాటి. సగటు ఓటరుపై కులం ప్రభావం రాష్ట్ర రాజకీయాలలో విపరీతంగా కనిపిస్తుంది. మద్రాసు రాష్ట్రంలో జస్టిస్ పార్టీ బ్రాహ్మణేతరులకు సంబంధించిన ఓటర్లను ఆకట్టుకొనింది. ఆంధ్రరాష్ట్రంలో 1955 లో కమ్మకులస్తుల ఓట్లను కమ్యూనిస్ట్ పార్టీలు పొందగలిగినవని ఒక అంచనా. 1982 లో స్థాపించిన తెలుగుదేశం పార్టీ 1983 లో కమ్మకులస్తుల ఓట్లను కూడగట్టుకొనగలిగిందని కూడా ఎన్నికల అధ్యయనాలు వెల్లడి చేశాయి. 1988 లో రాష్ట్ర విధానసభకు జరిగిన ఎన్నికలలో కాపునాడు తీసుకున్న అనేక నిర్ణయాల ఫలితంగా కాపుకులస్తులు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటువేశారని, అందువల్లనే తెలుగుదేశంపార్టీ పరాజయం పొందిందని కూడా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

### 5.4.3. వర్గం :

నూతనంగా స్వాతంత్ర్యాన్ని పొందిన మూడవ ప్రపంచదేశాలలో ఆర్థిక అసమానత్వాలు పరిపాటి. భారతదేశంలో కూడా కార్మికులు, రైతుకూలీలు, పట్టణాలలో నివసించే మురికి వాడలతో కూడిన వర్గం లెఫ్ట్‌పార్టీలకు ఓటువేయడం మనం గమనించవచ్చు. విద్యార్థులు, ప్రభుత్వోద్యోగులు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి వ్యతిరేకమనే వాదం కూడా కనిపిస్తుంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన బలహీన వర్గాలు, దళితవర్గాలు, పీడిత తాడిత వర్గాలు అధికార పక్షానికి ఓటు వేస్తాయని అనేక పరిశోధనలు తేటతెల్లం చేస్తున్నాయి.

### 5.4.4. నాయకుల సమ్మోహన శక్తి :

స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీ సమ్మోహన శక్తి, తదనంతరం నెహ్రూ పొందిన ఆకర్షణల ఫలితంగా కాంగ్రెస్‌పార్టీకి అధిక ఓట్లు లభించి నిరవధికంగా 1977 వరకు అధికారంలో ఉండగలిగింది. 1977లో తమిళనాడులో ఏ.ఐ.ఏ.డి.యం.కె. అధికారంలోకి రావడానికి యం.జి.రామచంద్రన్, 1983 లో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి నందమూరి తారక రామారావుల సమ్మోహన శక్తియే ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఈ సమ్మోహన శక్తి వీరికి సినీ ఆకర్షణ ద్వారా లభించింది.

### 5.4.5. జనాకర్షణ విధానాలు, పథకాలు :

భూ సంస్కరణలను అమలు చేయడం వల్ల 1950 దశకంలో సగటు ఓటరు కాంగ్రెస్ పార్టీవైపు మొగ్గు చూపినాడు. 1969 లో బ్యాంకులను జాతీయం చేయడం, బ్యాంకుల ద్వారా బడుగు వర్గాలకు రుణాలను అందజేయడం వంటి జనాకర్షణ పథకాలను చేపట్టి కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని నిలుపుకొనగలిగింది. యంజి.రామచంద్రన్ తమిళనాడులో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో యన్.టి.రామారావు పేదప్రజలకు 25 కిలోల బియ్యాన్ని కిలో రెండూ రూపాయలకే అందజేయడం అనే విధానాన్ని అనుసరించి సగటు ఓటరు యొక్క ఓటును పొందగలిగినారు.

### 5.4.6. పవనాలు లేదా ప్రభంజనాలు :

పైన వివరించిన కారకాలు సామాన్య పరిస్థితులలో ఓటర్ల ప్రభావితం చేసే అంశాలు. కాగా ఒక్కొక్కమారు అనూహ్యమైన రీతిలో ఒక పార్టీకి అత్యధిక స్థాయిలో ఓట్లు లభించవచ్చు. అట్టి పరిస్థితులలో ఆ పార్టీకి అనుకూలంగా పవనాలు వీచినట్లని రాజకీయ పరిశీలకులు ప్రకటిస్తారు. దీనికి కారణం ఆశించిన ఓట్ల శాతం కంటే ఆ పార్టీకి అత్యధిక స్థాయిలో ఓట్ల పొందటమే. ఈ పవనాలు నాయకుల వ్యక్తిగత సమ్మోహనశక్తి ఫలితంగా ఏర్పడవచ్చు లేదా నాయకులు చేసే నినాదాలకు ఆకర్షితమై ప్రజలు స్పందించినపుడు జరగవచ్చు లేదా ఒక పార్టీకి చెందిన నాయకుడు హత్య చేయబడినపుడు సానుభూతి పవనాలు వీయవచ్చు. ఇట్టి పవనాలు లేదా ప్రభంజనాలు వీచినపుడు సగటు ఓటరు ప్రవర్తన అనూహ్యంగా ఉంటుంది.

### 5.4.7. పార్టీల గుర్తులు :

ఆధునికీకరణ చెందిన దేశాలలో పార్టీల గుర్తులు తక్కువ ప్రభావాన్ని కలిగి ఉంటాయి. కాని సాంప్రదాయకంగా ప్రజాస్వామిక వ్యవస్థలు పనిచేయటం మొదలైన ఆరంభదశలో పార్టీల గుర్తుల ప్రభావాలు ఓటరుపై ఎక్కువగా ఉంటుంది. 1950 దశకంలో కాడి, జోడెద్దులగుర్తు, 1970వ దశకంలో ఆవు, దూడ గుర్తు ప్రభావం కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా పనిచేసింది.

### 5.4.8. ధన ప్రభావం :

నిరక్షరాస్యత, పేదరికం హెచ్చుగా కనిపించే సమాజాల్లో ఎన్నికలపై ధనప్రభావం అధికం. మన దేశంలో ఎన్నికలు జరిగే తేదీకి ముందురోజున ఏ అభ్యర్థి ఎక్కువ ధనాన్ని ఓటరుకు అందజేస్తాడో ఆ పార్టీకే ఓటు వేస్తాడనే వాదనకూడా ఉంది. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీలు పాలక పార్టీని ఎన్నికల సమయంలో ధనాన్ని అధిక మోతాదులో ఖర్చు చేయటంవల్ల గెలిచిందని నిందించడం, ఆరోపించడం మనం గమనిస్తూనే ఉన్నాము.

### 5.4.9. కుటుంబ వ్యవస్థ :

దీని ప్రభావం పట్టణ ప్రాంతపు ఓటరుపైకన్నా గ్రామీణ ప్రాంతపు ఓటరుపై అధికంగా కనిపిస్తుంది. కుటుంబ పెద్ద తన కుటుంబ సభ్యులు ఏ పార్టీకి ఓటు వేయాలో ముందుగా నిర్ణయిస్తాడని తదనుగుణంగానే కుటుంబ సభ్యులు ఆ పార్టీకి ఓటువేస్తారని బలమైన విశ్వాసముంది.

## 5.5 ముగింపు :

భారతదేశంలో జరిగిన అనేక సాధారణ ఎన్నికలను జాగ్రత్తగా గమనిస్తే దాదాపు అన్ని ఎన్నికలలోను కాంగ్రెస్ పార్టీ లేదా మరే ఇతర పాలకపార్టీకి కూడా 50 శాతం ఓట్లును మించి రాలేదని స్పష్టమవుతుంది. కాగా కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ప్రతిపక్షాల కూటముల సీట్లు సర్దుబాట్లు ఏర్పడి ఓట్ల చీలికను నివారించే ప్రయత్నాలు జరిగినపుడు, ప్రతిపక్షాల అధికారాన్ని చేజిక్కించుకొనగలిగింది. ఇందుకు 1977, 1989 సం॥లో జరిగిన ఆరవ, తొమ్మిదవ లోక్‌సభ సాధారణ ఎన్నికల ఫలితాలను ఉదహరించవచ్చు. అంతేగాక, ప్రతిపక్షాల అనైక్యతవల్ల కాంగ్రెస్ పార్టీ తక్కువశాతం ఓట్లను పొందుతూనే ఎక్కువస్థానం సీట్లను పొందగలిగింది.

భారతదేశంలో ఓటరు ప్రవర్తనను ప్రభావితం చేసే అంశాలలో నేడు మతం కీలకమైన పాత్రను నిర్వహిస్తుంది. ఇందుకు 1989, 1991 లలో జరిగిన తొమ్మిదవ, పదవ లోక్‌సభ సాధారణ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ, సాధించిన ఘనవిజయాన్ని పేర్కొనవచ్చు. కులం, మతం వర్గం మొదలగు అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయటాన్ని జాతీయ సమైక్యతకు అవరోధంగా భావించటం పరిపాటి. కాని ఇప్పుడిప్పుడే పరిణితి చెందుచున్న రాజకీయ సమాజంలో ఈ శక్తులు ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని పెంచుతూ, ఓటర్లను రాజకీయ విషయాల పట్ల ఆసక్తిని పెంచుటలో విజయాన్ని సాధిస్తున్నాయనే విషయాన్ని మనం విస్మరించరాదు.

## అభ్యాసాలు

I. ఈ క్రింది ప్రశ్నలకు 5 లేదా 6 పుటలకు మించని వ్యాసాలు వ్రాయండి

1. భారతదేశంలో ఎన్నికల ధోరణులను అంచనా వేయండి.
2. ఓటరు ప్రవర్తనను ప్రభావితం చేయు కారకాల పాత్రను పరిశీలించండి.

II. **ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించని సమాధానాలు వ్రాయుము.**

1. తొమ్మిదవ, పదవ లోక్‌సభ సాధారణ ఎన్నికలను తులనాత్మకంగా పరిశీలించుము.

III. **ఈ క్రింది వాటికి లఘుటీకలను వ్రాయుము**

(a) ఓటరు ప్రవర్తన
(b) ఎన్నికలలో దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల మధ్య భిన్నత్వం
(c) సానుభూతి పవనాలు

## కుశాగ్రబుద్ధి ప్రశ్నలు

1. **ఈ క్రింది వాటికి సరియైన సమాధానమును ఎంపిక చేయుము.**

i) భారతదేశంలో తొలిసాధారణ ఎన్నికలు జరిగిన సంవత్సరం [ D ]
(A) 1947 (B) 1956 (C) 1950 (D) 1952

ii) తొలి మధ్యంతర ఎన్నికలు ఎపుడు జరిగినవి [ D ]
(A) 1955 (B) 1957 (C) 1967 (D) 1971

iii) తమిళనాడులో డి.యం.కె. సాధారణ ఎన్నికలలో గెలిచి అధికారాన్ని పొందింది. [ B ]
(A) 3 వ (B) 4 వ (C) 5 వ (D) 6 వ

iv) తెలుగుదేశం పార్టీ అవతరించినది [ C ]
(A) 1981 (B) 1982 (C) 1983 (D) 1985

v) ఏడవ సాధారణ ఎన్నికల విశిష్టత [ C ]
(A) దన ప్రభావం అధికంగా ఉండటం
(B) ఇందిరా ప్రభంజనం
(C) ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్నత్వం
(D) పైవేవీకావు

## సంప్రదింపు గ్రంథాలు


1) యం.యన్. శ్రీనివాస్ - డైమెన్షన్స్ ఆఫ్ సోషల్ ఛేంజి ఇన్ ఇండియా
2) మైరన్ వీనర్ - పార్టీ పాలిటిక్స్ ఇన్ ఇండియా
3) వి. క్రిష్ణారావు మరియు కె. పాండురంగం - భారత ప్రభుత్వం మరియు రాజకీయాలు (అకాడమీ ప్రచురణ)


**T. Bhaktavatsalam**

# పాఠం - 6
# పంచాయితీరాజ్ వ్యవస్థ

**లక్ష్యం :**

స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్థానిక సంస్థల చరిత్రను, పంచాయితీరాజ్ సంస్థల పటిష్టతకు సంబంధించిన వివిధ కమిటీల సిపార్సులను, పంచాయతీరాజ్ సంస్థల ప్రాధాన్యతను, పంచాయితీరాజ్ సంస్థల వ్యవస్థాగత, సంస్థాగత నిర్మాణాలను మరియు అవి ఎదుర్కొంటున్న సమస్యలను సవాళ్ళను సవివరంగా వివరించటం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


6.1 పరిచయం

6.2 స్వాతంత్ర్యానికి ముందు – బ్రిటీష్ పరిపాలనలో పంచాయితీరాజ్ వ్యవస్థ

6.2.1 మెయోతీర్మానం

6.2.2 లార్డ్ రిప్పన్ తీర్మానం

6.2.3 రాయల్ కమిషన్ – వికేంద్రీకరణ సిఫారసులు

6.2.4 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు

6.2.5 భారత ప్రభుత్వ చట్టం 1935

6.3 స్వాతంత్ర్యం తరువాత పంచాయితీరాజ్ వ్యవస్థ

6.3.1 సమాజాభివృద్ధి పథకం

6.3.2 బలవంతరాయ్ మెహతా కమిటీ

6.3.2.1 పంచాయితీ విధులు – ప్రభుత్వ పాలనావిధులు

6.3.2.2 ఆర్థిక వనరులు

6.3.3 పంచాయితీ సమితి

6.3.3.1 సమితి విధులు

6.3.3.2 ఆర్థికవనరులు

6.3.4 జిల్లా పరిషత్

6.3.4.1 జిల్లా పరిషత్ విధులు

6.4 అశోక్ మెహతా కమిటీ

6.4.1 జిల్లా పరిషత్ కూర్పు

6.4.2 పంచాయితీ సమితి

6.4.3 మండల పంచాయితీ

6.4.4 గ్రామ సంఘం

6.4.5 గ్రామ సభ

6.4.6 పంచాయితీ రాజ్ సంస్థల విధులు

6.5 పంచాయితీ రాజ్ సంస్థల వ్యవస్థాగత నిర్మాణం

6.5.1 73వ రాజ్యాంగ సవరణలోని ప్రధాన అంశాలు

6.5.1.1 తప్పనిసరిగా నిర్వహించవలసిన అంశాలు

6.5.1.2 స్వచ్ఛందంగా నిర్వహించవలసిన అంశాలు

6.5.2 పదకొండవ షెడ్యూలు

6.6 పంచాయితీ రాజ్ సంస్థాగత నిర్మాణాలు

6.6.1 గ్రామ సభ

6.6.2 గ్రామ పంచాయితీ

6.6.3 మధ్యస్థాయి సమితి /తాలుకా/మండల పంచాయితీ

6.6.4 మూడవ అంచె – జిల్లాస్థాయి పంచాయితీ

6.7 పంచాయితీరాజ్ సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ళు

6.7.1 ఎన్నికల వాయిదా

6.7.2 సమాంతర సంస్థలు

6.7.3 జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

6.7.4 వాటర్ షెడ్ అభివృద్ధి పథకం

6.7.5 ఉమ్మడి అడవి నిర్వహణ కమిటీలు

6.7.6 జిల్లా ప్రాథమిక విద్యాపథకం

6.7.7 ఎంపీల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం

6.8 సారాంశం

6.9 ముఖ్య పదకోశం

6.10 స్వీయ మదింపు ప్రశ్నలు

6.11 ఉపయుక్త గ్రంథాలు

## 6.1 పరిచయం :

ప్రజలందరినీ సమానంగా గుర్తించేది ప్రజాస్వామ్యం. ఆధునిక రాజ్యాలు అధికంగా ప్రజాస్వామ్యాలే. ప్రజాస్వామ్యం యొక్క ప్రధాన లక్ష్యం అభివృద్ధి. ప్రజాస్వామ్యంలో ప్రజలు అంటే ముఖ్యంగా పేద ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పురోగతి అభివృద్ధిగా భావించబడుతుంది. పేద ప్రజల అభివృద్ధి సాధ్యపడాలంటే వారు అధికారంలో భాగస్వాములు కావాలి. అధికారంలో భాగస్వామ్యం పేద ప్రజలు పంచుకున్నపుడే అభివృద్ధి సాధ్యమవుతుంది అనేది జగమెరిగిన సత్యం. అంతేకాని ఏదేశంలోనైనా కేవలం రాజకీయ నాయకుల ద్వారా గానీ, పాలనా ఉద్యోగుల ద్వారా గానీ లేదా సాంకేతిక నిపుణులద్వారా గానీ మాత్రమే అభివృద్ధి సాధ్యపడుతుందని భావించకూడదు. ఈ సత్యాన్ని ఎరిగిన ప్రజాస్వామ్య దేశాలు అభివృద్ధి కార్యక్రమంలో ప్రజలు నిరంతరం పాల్గొనడానికి అవకాశం కల్పించడాన్ని ఒక లక్ష్యంగా ఏర్పరచుకున్నాయి. ప్రజల చైతన్యంపై ప్రజాస్వామ్య సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. ప్రజావసరాలన్నింటిని సంక్షేమ రాజ్యంలో కేవలం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే తీర్చలేవు.

నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో రకాలైన పనుల వత్తిడికి గురి అవుతున్నాయి. దేశరక్షణ బాధ్యత ఒక ముఖ్య పనిభారంగా నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. సోషలిస్టు సమాజ నిర్మాణం కూడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక మహత్తర పనిభారంగా తయారయింది. ఇట్టి పరిస్థితుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచిన్న పట్టణాల్లోని అవసరాలను కానీ, గ్రామ ప్రజల సేవలను కానీ, ప్రత్యక్షంగా నెరవేర్చడం చాలా కష్టసాధ్యం. స్థానిక ప్రజలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం లేకుండా స్థానిక సమస్యలను పరిష్కరించుకోవటం ప్రజలకు ప్రభుత్వానికి శ్రేయస్కరం. దీనికి తగిన అధికారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికేంద్రీకరించి వాటిని స్థానిక సంస్థలకు అప్పగించాలి. అధికార వికేంద్రీకరణ ప్రజాస్వామ్యంలో కూడా అధికార దుర్వినియోగానికి దారితీస్తుంది. కాబట్టి ప్రభుత్వ అధికారాలన్నింటినీ పరిశీలించి వాటిలో వికేంద్రీకరించడానికి వీలైన అధికారాలను గుర్తించాలి. విరివిగా స్థానిక ప్రభుత్వాలను స్థాపించి వాటికి ఆ అధికారాలను అప్పగించాలి. దీనివల్ల ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్ఠమౌతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక ప్రభుత్వాల ప్రాముఖ్యాన్ని గుర్తించి "డిటోకియవేల్లి" అనే ఫ్రెంచి రచయిత ఈ విధంగా తెలిపాడు. "విజ్ఞానశాస్త్ర సముపార్జనకు ప్రాథమిక పాఠశాలలు ఎట్లో స్వేచ్ఛాసముపార్జనకు టౌన్ మీటింగ్లు అట్లే". అవి స్వేచ్ఛను ప్రజలకు అందుబాటులోకి తెస్తాయి. దాన్ని ఎట్లా ఉపయోగించవలసిందీ, ఏ విధంగా అనుభవించవలసిందీ ప్రజలకు అవి బోధిస్తాయి.

భారతదేశంలో ఋగ్వేద కాలంనుండి స్వపరిపాలనతో కూడిన గ్రామ సమాజాలు ఉండేవి. కాలక్రమంలో ఈ గ్రామీణ "సంస్థలు" పంచాయితీలుగా పరిణామం చెందాయి. అనగా ఐదుమంది వ్యక్తులతో కూడిన సభ అని అర్థం. పంచాయితీలు గ్రామ విషయాలను చూసే సంస్థలు. ఈ సంస్థలు పాలనా ప్రాముఖ్యతను కలిగి సామాజిక జీవనానికి కేంద్రంగా భరతదేశ గవర్నర్ జనరల్ గా (1835-36) పనిచేసిన సర్ చార్లెస్ మెట్ కాఫ్, భారతదేశ గ్రామీణ

సమాజాలను "చిన్న రిపబ్లిక్" గా అభివర్ణించాడు. నేడు ఆ చిన్న రిపబ్లిక్సే పంచాయితీరాజ్ సంస్థలుగా, పట్టణ ప్రాంతాలలో పురపాలక సంస్థలుగా, నగర పాలక సంస్థలుగా పిలుస్తున్నాం. ఆధునిక భారతదేశంలో ఈ సంస్థలను గ్రామీణ, పట్టణ పరిపాలక సంస్థలుగా పిలువబడుచున్నాయి. స్వపరిపాలన అనేది బ్రిటీషు ప్రభుత్వ సృష్టిగా ఇక్కడ మనం గుర్తించుకోవాలి.

## 6.2 స్వాతంత్ర్యానికి ముందు – బ్రిటీష్ పరిపాలనలో పంచాయితీరాజ్ వ్యవస్థ :

బ్రిటీష్ వారు మనదేశమునకు వచ్చేనాటికి శతాబ్దాల కాలం నుండి సాంప్రదాయముగా వస్తున్న గ్రామీణ స్వపరిపాలనా వ్యవస్థ చాలావరకు క్షీణించుటచే వారు పునాదులు వేసి వృద్ధిచేసినారన్న పేరు వచ్చినది. భారతదేశములో నేడు అమలులోనున్న స్థానిక ప్రభుత్వములు–పట్టణ, గ్రామీణ ప్రాంతములకు చెందిన సంస్థలు ప్రాచీన మధ్యయుగాలలో భారతదేశములో వర్ధిల్లిన స్థానిక ప్రభుత్వముల నుండి వర్ధిల్లినవి కావు. ఇవి బ్రిటీష్ వారి పాలనా కాలంలో ఉద్భవించి, పరిణామము పొందినవి. బ్రిటీష్ పరిపాలనా కాలంలో పల్లె ప్రాంతాల అవసరాలను తీర్చుటకు, ప్రాంతాల పునరుద్ధరణకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి. వాటి ఫలితంగా స్థానిక స్వపరిపాలనా వ్యవస్థ రూపొందింది. 1959లో ప్రవేశపెట్టబడిన పంచాయితీ రాజ్య విధానానికి చాలా వరకు ఇది మార్గదర్శి అయినది. బ్రిటీష్ పరిపాలనా కాలంలోని ప్రయత్నాలకు రెండు ప్రధాన కారణాలు ఉన్నవని చెప్పవచ్చు. పరిపాలనా దృక్పథంలో కలిగిన మార్పు వాటిలో మొదటికారణం. ఇంగ్లీషు దేశంలో వ్యాపించి, దానిమూలంగా విద్యాధికుల వర్గం ఒకటి ఏర్పడడం, పరిపాలనలో భాగస్వామ్యం ఉండవలెనని వారు ఆందోళన సాగించడం రెండవకారణం.

### 6.2.1 మెయోతీర్మానం :

పాలనా సామర్థ్యాన్ని పెంపొందించబడడానికి అధికారాలను వికేంద్రీకరిస్తూ ఒక తీర్మానాన్ని 1870లో లార్డ్ మెయో ఆమోదింపజేశాడు. ఈ తీర్మానాన్ని మెయో తీర్మానంగా పిలుస్తారు. ఈ తీర్మానం ప్రధానాంశం స్థానిక సేవలకయ్యే వ్యయాన్ని స్థానిక పన్నులనుండి ఖర్చు చేయడం, పాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం. స్థానిక సంస్థల ఆవిర్భావంతో లార్డ్ మెయో ఈ ప్రయత్నం చారిత్రాత్మకమైనదిగా భావింపబడుతుంది.

### 6.2.2 లార్డరిప్పన్ తీర్మానం :

ఆధునిక భారతదేశంలో స్థానిక సంస్థల పితామహునిగా లార్డ్ రిప్పన్ ను పేర్కొంటారు. ఇతను రూపొందించిన స్థానిక స్వపరిపాలనా తీర్మానాన్ని “మెగ్నాకార్టా” గా అభివర్ణిస్తారు. ఇతను మే 18వ తేది 1882లో స్థానిక బోర్డులను ఏర్పాటు చేస్తూ, తీర్మానాన్ని రూపొందించాడు. ఈ బోర్డులలో ఎక్కువ మంది ఎంపికైన అనధికార సభ్యులు ఉంటారు. ఈ బోర్డులకు అనధికార సభ్యుడు ఛైర్మన్ గా వ్యవహరిస్తాడు. స్థానిక స్వపరిపాలనా సంస్థలు విద్యాసంస్థలుగా, రాజకీయ విద్యా సాధనాలుగా పని చేయాలని రిప్పన్ అభిప్రాయపడ్డాడు. భారతదేశంలో స్థానిక ప్రజాస్వామ్య వ్యవస్థలకు ఇతను మార్గాన్ని వేశాడు. రిప్పన్ తీర్మానం స్థానిక పాలన పాత్రను పెంపొందించింది.

1882 సం॥ లో భారత వైస్రాయి లార్డ్ రిప్పన్ జారీచేసిన తీర్మానము, భారత స్థానిక స్వపరిపాలన సంస్థల చరిత్రలో ఒక మైలు రాయివంటిది. రిప్పన్ తీర్మానము స్వపరిపాలన స్వరూపములో కొన్ని మార్పులు సూచించినది. అవి :

1. స్థానిక బోర్డు పరిధి యందు ఉండవలసిన గరిష్ట పరిమితి గల ప్రదేశము సాధారణముగా అతి చిన్న పరిపాలన యూనిట్ అయిన తాలూకా లేక తహసిల్ అయి ఉండవలెను.

2. పట్టణ, గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థలలో అనధికార సభ్యులే ఎక్కువ సంఖ్యలో ఉండవలెను.

3. ఎన్నిక పద్ధతికి ఆచరణ యోగ్యమైన అన్ని సంస్థలందు కౌన్సిల్ సభ్యులను ఎన్నుకొనే పద్ధతిని ప్రవేశ పెట్టవలెను.

4. స్థానిక సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ బహిర్గతముగానే ఉండవలెను.

5. స్థానిక సంస్థలకు కావలసినన్ని ఆర్థిక వనరులు ఉండవలెను. రిప్పన్ ప్రభుత్వం ప్రతిపాదించిన తీర్మానమును ఎంతో స్వేచ్ఛతో, ప్రజాస్వామ్య సూత్రాలతో కూడుకొనియున్నది. దీనిని భారతదేశమందు స్థానిక స్వపరిపాలన సంస్థలు స్వపరిపాలనా 'మాగ్నాకార్టా'గా భావించుచున్నారు. ఈ తీర్మాన ఫలితమే 1883-84 మధ్య కాలమందు వివిధ రాష్ట్రములలో అనేక చట్టములు అమోదించినారు.

### 6.2.3 రాయల్ కమిషన్ – వికేంద్రీకరణ సిఫారసులు :

1907 సం॥లో సర్ ఛార్లెస్ హబ్ హౌస్ అధ్యక్షతన రాయల్ వికేంద్రీకరణ సంఘం నియమించబడింది. ఈ సంఘం క్రింది సిఫారసులను చేసినది :

1. ప్రతి గ్రామానికి పంచాయితీ ఉండవలయును.

2. గ్రామాల్లో బావులను త్రవ్వించి సక్రమంగా నిర్వహించడం, గ్రామ పరిశుభ్రత, గ్రామ ప్రాంతాలో రోడ్లును మరమ్మత్తులు చేయించడం వంటి చిన్నచిన్న పనులనే వాటికి అప్పగించాలి.

3. అన్ని చోట్ల సబ్-డిస్ట్రిక్ బోర్డులను సాధారణంగా తహసిల్ కు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో వాటిని ముఖ్యమైన ఏజెన్సీలుగా చేయాలి. జిల్లా బోర్డులు జిల్లా అంతటికి సంబంధించిన కొన్ని కార్యకలాపాలకు జిల్లా బోర్డు అధ్యక్షుడుగా జిల్లా కలెక్టరే ఉండాలి. మొత్తం మీద వికేంద్రీకరణ సిఫారసులు చాలా సంప్రదాయబద్ధంగా ఉన్నాయి. దీనిని పరిశీలించి తగిన చర్యలు తీసుకొనుటకు భారత ప్రభుత్వము 1915 సం॥ వరకు పట్టినది.

### 6.2.4 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు :

స్థానిక బోర్డులను ప్రాతినిధ్య సంస్థలుగా రూపొందించాలని 1919లో మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ నివేదిక సూచించినది. ఈ నివేదిక ప్రకారం స్థానిక సంస్థల విషయాలలో రాజ్యం జోక్యం సాధ్యమైనంత వరకు తక్కువగా ఉండాలని, స్థానిక సంస్థలు అవి తప్పు చేసి సరిదిద్దుకునే అవకాశాన్ని వాటికి ఇవ్వాలని సూచించింది. సంస్కరణలు స్థానిక స్వపరిపాలనను ప్రతిపాదిత ద్వంద్వపాలనలోని రాష్ట్రజాబితాలో చేర్చింది. అనగా ప్రాంతీయ స్థాయిలో భారత మంత్రిత్వ నియంత్రణ క్రిందికి స్థానికి స్వపరిపాలనను తీసుకొని రావడం జరిగింది. స్థానిక సంస్థలను ప్రాతినిధ్యంతో కూడిన ప్రజానియంత్రణ సంస్థలుగా తీర్చిదిద్దడమే ఈ సంస్కరణల ప్రధాన ఆలోచన.

### 6.2.5 భారత ప్రభుత్వ చట్టం 1935 :

భారత ప్రభుత్వ చట్టం 1935, ప్రాంతీయ ప్రభుత్వాలు గ్రామపంచాయితీలతో సహా స్వపరిపాలన సంస్థలను మరికొంత వికేంద్రీకరించుటకు, చట్టాలను రూపొందించుటకు వీలుకల్పించింది. ఈ చట్టం ఫలితంగా అన్ని ప్రాంతీయ ప్రభుత్వాలు తమ తమ చట్టాలను రూపొందించాయి. స్థానిక సంస్థల అధికారాలు, విధులు మొదలగు విషయాలలో అంతకుముందు కంటే కొంత మెరుగుదలను ఈ చట్టాలు తీసుకొని వచ్చినప్పటికీ, వాస్తవంగా ఈ సంస్థలు ప్రజాస్వామ్య సంస్థలుగా అభివృద్ధి చెందలేదు. ఈ సంస్థలు కొన్ని అధికారాలను, పరిమిత విత్తవనరులను కలిగి ఉండేవి. ఈ పరిస్థితి 1947 వరకు ఇదేవిధంగా కొనసాగినట్లు చెప్పవచ్చును.

## 6.3 స్వాతంత్ర్యం తరువాత పంచాయితీరాజ్ వ్యవస్థ :

భారత జాతీయోద్యమంలో ఒక భాగం గ్రామపంచాయితీల ఏర్పాటు. గాంధీ మహాత్ముడు పూర్తి అధికారాలు కలిగిన పంచాయితీల ఏర్పాటు ద్వారా గ్రామ స్వరాజ్ సాధించడం ధ్యేయంగా పెట్టుకున్నాడు. ఈ ఆలోచన వెనుక జాతీయ స్థాయిలో మాదిరి, స్థానిక స్థాయిలో కూడా ప్రజాస్వామ్య ప్రక్రియ ఆశయం దాగి ఉంది. పంచాయితీల ఏర్పాటు ఈ విషయంలో జాతీయ ఉద్యమ నిబద్ధత, మహాత్మాగాంధీ ఆదర్శం బలంగా ఉన్నప్పటికీ భారత రాజ్యాంగాన్ని రూపొందించే ముసాయిదాలో పంచాయితీల ప్రస్తావన చోటు చేసుకోలేదు. భారతదేశంలో గ్రామాలు కులతత్వానికి ఆలవాలమని, అవి స్వపరిపాలనా సంస్థలుగా విజయవంతం కావడానికి అవకాశాలు తక్కువగా ఉన్నాయని డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం. గ్రామపంచాయితీల గురించి విస్తృత చర్చ జరిగిన తరువాత రాజ్యాంగంలో చోటు కల్పించడం జరిగింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 ప్రకారం "గ్రామ పంచాయితీల" ఏర్పాటుకు రాజ్యం చర్యలు చేపట్టాలి. ఈ సంస్థలు స్వపరిపాలనా యూనిట్ గా పని చేయుటకు అవసరమైన అధికారాలను వాటికి అప్పగించాలి. సామాజిక మార్పు, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ముఖ్యమైన సాధనంగా గ్రామపంచాయితీలను గుర్తించడం జరిగింది. అయినప్పటికీ, రాజ్యాంగ హోదాను ఈ సంస్థలు పొందలేదు.

### 6.3.1 సమాజాభివృద్ధి పథకం :

భారత ప్రభుత్వం 1952లో గాంధీజీ జన్మదినంనాడు దేశము మొత్తంలో 55 "సమాజాభివృద్ధి ప్రాజెక్టులను" ప్రారంభించింది. దీనిద్వారా ప్రజల్లో స్వయంకృషి భావాన్ని, మొదటి రెండు పంచవర్ష ప్రణాళికల ద్వారా కొంత ప్రగతిని సాధించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమాజికాభివృద్ధి పథకాలు జాతీయ విస్తరణ సేవాపథకాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. ఈ పథకాల కోసం ప్రభుత్వం అధికారులను ప్రేరేపించి నిర్వహిస్తుంది. కాని ఇందులో ప్రజల చొరవ ఉత్సాహం లోపించిందని వీటిని ప్రజాస్వామ పరిపాలన సంస్థలకు అప్పగించాలని పంచవర్ష ప్రణాళిక గుర్తించింది. గ్రామ పంచాయితీలను పైస్థాయి ప్రజాస్వామిక సంస్థలతో కలపాలని కూడా పేర్కొంది. 1957 జనవరిలో ప్రణాళిక సంఘానికి చెందిన ప్రణాళిక ప్రాజెక్టుల సంఘము "బల్వంతరాయ్ మెహతా" అధ్యక్షతన ఒక 'స్టడీటీమ్'ను నియమించింది.

### 6.3.2 బల్వంత్ రాయ్ మెహతా కమిటీ :

రెండో పంచవర్ష ప్రణాళికను ప్రారంభించిన తరువాత గ్రామీణ ప్రాంతాల సత్వరాభివృద్ధికి తగు చర్యలను

తీసుకొనే నిమిత్తం జాతీయాభివృద్ధి మండలి ప్రణాళికా ప్రాజెక్టుల సంఘాన్ని ఒక దాన్ని నియమించింది. ఆ సంఘం సమాజాభివృద్ధి, జాతీయవిస్తరణ సేవలు పనిచేసే తీరును అధ్యయనం చేసి అవి విజయవంతం కావడానికి తగు సలహాల నిచ్చే నిమిత్తం బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక అధ్యయన బృందాన్ని, 1957 జనవరిలో నియమించింది. తరువాత జాతీయాభివృద్ధి మండలి, రెండో పంచవర్ష ప్రణాళిక సూచించిన విధంగా జిల్లాలో పాలన యంత్రాగాన్ని సంస్కరించేందుకు సూచనలు కూడా చేయాలని బల్వంతరాయ్ మెహతా సంఘాన్ని కోరింది. ఈ అధ్యయన బృందం ఒక సంవత్సరంపాటు దేశమంతటా పర్యటించి వివిధ రాష్ట్రాల అధికారులతోను, ప్రజాప్రతినిధులతోను సమగ్రంగా చర్చించి 1957 డిసెంబరులో భారత ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించింది.

ఈ కమిటీ తన సూచనల మేరకు స్థాపించవలసిన స్థానిక సంస్థ పరిధిని మరీ ఎక్కువగాను మరీ తక్కువగానూ కాకుండా సామర్థ్యం, మితవ్యయానికి లోబడి నిర్ణయించాలి. ఈ ప్రయోజనం రీత్యా జిల్లాల పరిధి పెద్దదిగా ఉంటుందని భావించిన బల్వంతరాయ్ మెహతా కమిటీ అభివృద్ధి బ్లాక్, ఈ ప్రమాణం ఆదర్శవంతంగా ఉంటుంది. గ్రామ పంచాయితీలాగా అతి చిన్నదిగా గాక, జిల్లాలాగా పెద్దది గాక ప్రజలు పాల్గొనే పరిమాణంలో ఉంటుంది. ఈ ప్రయోజనం కోసమే బ్లాక్లను నిర్మించడమైందని కమిటీ అభిప్రాయపడింది. మూడంచెల స్వపరిపాలన సంస్థల వ్యవస్థ ద్వారా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ జరిగే రాష్ట్ర ప్రభుత్వ విధుల్లో ఎక్కువ భాగం విధులను స్థానికంగా నిర్వహించాలని బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచించింది. గ్రామ స్థాయిలో ప్రజలు ఎన్నుకొన్న గ్రామపంచాయితీ ఉండాలని, మధ్య స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టే అతికీలకమైన పరోక్ష ఎన్నికల ప్రాతిపదికపై కూర్చే పంచాయత్ సమితి ఉండాలని, జిల్లా స్థాయిలో ప్రముఖంగా పంచాయత్ – సమితిల మధ్య సమన్వయం, పర్యవేక్షణ జరిపే జిల్లా పరిషత్ ను నిర్మించాలని కమిటీ సూచించింది.

### 6.3.2.1 గ్రామ పంచాయితీ విధులు – ప్రభుత్వ పాలనావిధులు :

గ్రామ పంచాయితీ కేవలం ఎన్నికైన సభ్యులతోనే కూడుకొని ఉండాలి. కాగా ఇద్దరు స్త్రీలు, షెడ్యూల్డు జాతులు, షెడ్యూల్డు కులాలకు చెందిన ఒక్కొక్కరిని కో–ఆప్ట్ చేసుకోవచ్చు. ఇతర తరగతులకు చెందిన సభ్యులెవ్వరూ ఉండరాదని కమిటీ అభిప్రాయపడింది. గ్రామ పంచాయితీలు కింద ఉదహరించిన విధులను నిర్వహించాలి.

ఎ) గృహ ఉపయోగార్థం మంచినీటి సరఫరా

బి) పారిశుధ్యం

సి) వీధులు, మురికినీటి కాలువలు, తాలూకాలు మొదలైనవి నిర్వహించడం

డి) వీధిదీపాలు అమర్చడం

ఇ) భూమినిర్వహణ

ఎఫ్) పశువులకు సంబంధించిన రికార్డులు

జి) ఆపదకాలంలో ఉపశమనం

హెచ్) ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ

ఐ) వెనుక బడ్డతరగతుల సంక్షేమం.

జె) గణాంకాల సేకరణ, మొదలైనవి.

ఇవిగాక పంచాయత్ సమితి ఏజంటుగా దానికి అప్పగించిన విధులను కూడా గ్రామ పంచాయతీ నిర్వహిస్తుంది.

### 6.3.2.2 ఆర్థిక వనరులు :

గ్రామ పంచాయితీలకు అవసరమైన నిధులు తప్పని సరిగా సమకూర్చాలని కమిటీ సూచించింది. పన్నులను పంచాయతీలు సరిగా వసూలు చేయక కొంతకాలం తరువాత మాఫీ చేస్తారని, కాబట్టి పన్నులు కట్టని వ్యక్తులకు ఓటు హక్కురద్దు చేయాలని, పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయడానికి వారిని అనర్హులుగా చేయాలని కమిటీ సూచించింది. వీలైనంతవరకు భూమిశిస్తు గ్రామ పంచాయతీల ద్వారా వసూలు చేయాలి. గ్రామ పంచాయతీకి కింది ఆర్థిక వనరులుండాలి.

1. ఆస్థి లేదా ఇంటి పన్ను
2. మార్కెట్లు, బజార్లు, సంతలు మొదలైనవాటిపై పన్నులు
3. వాహనాలు, జంతువులపై పన్నులు
4. ఆక్ట్రాయ్
5. పారిశుద్ధ్య పన్ను
6. విద్యుద్దీపాల రేటు
7. బందెల దొడ్లపై ఆదాయం
8. కొన్ని వ్యవహారాలకు సంబంధించిన ఫీజులు

వాటితోపాటు పంచాయత్ సమితి నుంచిగాని, ప్రభుత్వం నుంచిగాని లభించే గ్రాంటులు, గ్రామపంచాయత్ బడ్జెట్, పంచాయత్ సమితి ఆమోదముద్ర కూడా పొందాలని, ఒక్క ప్రభుత్వం మాత్రమే అది కూడా జిల్లా పరిషత్ సిఫారసు ఉండాలని మాత్రమే కమిటీ సూచించింది.

### 6.3.3 పంచాయితీ సమితి :

పంచాయతీ సమితిని గ్రామ పంచాయతీల నుంచి పరోక్ష ఎన్నికల పద్ధతి ద్వారా నిర్మించాలని కమిటీ సూచించింది. బ్లాక్ లో ఉన్న పంచాయితీలను గ్రామ సేవకుల సర్కిళ్లను యూనిట్ గా గ్రహించి ప్రతిదానిలో సర్పంచులందరు తమలో వారిని పంచాయత్ సమతి సభ్యులను ఎన్నుకొంటారు. ఈ విధంగా ఎన్నికైన సభ్యులు దాదాపు 20 మంది ఉంటారు. ఇద్దరు స్త్రీలను, ఒక షెడ్యూల్డు కులాలు, ఒక షెడ్యూల్డు తరగతికి చెందినవారిని కో-ఆప్ట్ చేసుకొంటారు. బ్లాక్ లో ఉన్నటువంటి చిన్న మున్సిపాలిటీలు తమసభ్యుల్లో ఒకరిని పంచాయత్ సమతి సభ్యుడుగా

ఎన్నుకొంటారు. వీరుగాక సహకార సంఘాలు కూడా తమ ప్రతినిధులను పంచాయత్ సమితి సభ్యులుగా ఎన్నుకోవాలని బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచించింది.

### 6.3.3.1 సమితి విధులు :

1. వ్యవసాయం దాని అనుబంధ విషయాల అభివృద్ధి
2. పశుగణాభివృద్ధి
3. స్థానిక పరిశ్రమలు
4. ప్రజారోగ్యం
5. సంక్షేమం
6. ప్రాథమిక పాఠశాలల నిర్వహణ
7. గణాంకాలు

ఇవి గాక రాష్ట్ర ప్రభుత్వం అప్పగించే అభివృద్ధి విషయాలన్నీ కూడా పంచాయతీ సమితి నిర్వహించాలి.

### 6.3.3.2 ఆర్థిక వనరులు :

1. బ్లాక్ లో వసూలైన భూమిశిస్తులో కొంత భాగం
2. భూమి శిస్తుపై సెస్సు
3. వృత్తి పన్ను
4. స్థిరాస్తి మార్పిడిపై విధించే డ్యూటీపై సర్చార్జి
5. పంచాయత్ సమితికి చెందిన ఆస్తినుంచి లాభాలు, అద్దెలు
6. యాత్రికులపై పన్ను.
7. వినోదపు పన్ను
8. ప్రాథమిక విద్యపై సెస్సు
9. మార్కెట్లు, జాతరలనుంచి వసూళ్ళు
10. మోటార్ వాహనాల పన్నులో భాగం
11. ప్రభుత్వ గ్రాంట్లు
12. ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చే విరాళాలు

### 6.3.4 జిల్లా పరిషత్ :

వివిధ పంచాయత్ సమితుల మధ్య, సమన్వయం సాధించే నిమిత్తం ఈ కింది సభ్యులతో కూడుకొన్న జిల్లా పరిషత్ ను ప్రతి జిల్లాలో స్థాపించాలని మెహతా కమిటీ సూచించింది.

1. పంచాయత్ సమితి అధ్యక్షులందరూ
2. జిల్లా నుంచి ఎన్నికైన రాష్ట్ర శాసన సభ, పార్లమెంటు సభ్యులు.
3. వివిధ అభివృద్ధి శాఖలకు చెందిన జిల్లా అధికారులు

జిల్లా కలెక్టర్ ను పరిషత్ కు అధ్యక్షుడిగా ఉంచాలనీ అతని అధికారి ఒకరు పరిషత్ సెక్రటరీగా వ్యవహరించాలనీ కమిటీ అభిప్రాయపడింది.

### 6.3.4.1 జిల్లా పరిషత్ విధులు :

1. వివిధ పంచాయత్ సమితుల సమన్వయం సమకూర్చడం పరిషత్ కర్తవ్యం
2. పంచాయత్ సమితులు సమర్పించే బడ్జెట్లను పరిశీలించి ఆమోదించడం
3. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన నిధులను వివిధ బ్లాక్ ల మధ్య పంచడం
4. బ్లాక్ ప్రణాళికలన్నీ పరిశీలించి జిల్లా ప్రణాళిక తయారు చేయడం

ఈ విధులను నిర్వహించడానికి, జిల్లా పరిషత్ లో స్థాయి సంఘాలుండాలి. ముఖ్యంగా ఛైర్మన్ ను, ఇద్దరు అనధికార సభ్యులతోను కూడుకున్న ఆర్థిక స్థాయి సంఘం అదేవిధంగా సర్వీసు విషయాలను చూడటానికి వేరొక స్థాయి సంఘం ఉండాలి. తాము సూచించిన వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే మూడు అంచెలను ఒకేసారి నిర్మించాలని అభిప్రాయపడింది. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా బ్లాక్ కు బదులు జిల్లా స్థాయిని అభివృద్ధి పనులకు వినియోగించు కోవాలంటే తాము పంచాయితీ సమితికి చూపించిన పాత్రను జిల్లా స్థాయికి అప్పగించాలని బల్వంత రాయ్ మెహతా కమిటీ సూచించింది. కాగా బ్లాక్ స్థాయిలోని పంచాయత్ సమితి ఆ జిల్లా వ్యవస్థ ఆధీనంలో సమాజాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలి. జిల్లా స్థాయిలో నిర్మించే అట్లాంటి సంస్థకు గ్రామ పంచాయతీ సభ్యులు తమలో కొందరిని సభ్యులుగా ఎన్నుకొనాలి.

## 6.4 అశోక్ మెహతా కమిటీ :

1977వ సంవత్సరములో కేంద్రంలో జనతా ప్రభుత్వం అధికారంలో కొచ్చిన తరువాత అశోక్ మెహతా అధ్యక్షతన పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించి డిసెంబర్, 1977లో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసింది. రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానాన్ని సమీక్షించడం ఈ కమిటీ ముఖ్యమైన విధిగా నిర్ణయించడం జరిగింది. ఆర్థిక వనరులను సమీకరించడం, గ్రామీణాభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందించి అమలు చేయడం, పంచాయితీ రాజ్య వ్యవస్థలకూర్పు, అవి పనిచేయడంలో ఉన్న బాగోగులను గుర్తించి, నివారణోపాయాలను సూచించడం, గ్రామీణాభివృద్ధిలో పాల్గొనే వివిధరకాల సంస్థల మధ్య అవగాహన ఏర్పాటు చేయడం మొదలైన విషయాలను గురించి దర్యాప్తు జరిపి తగు సూచనలను చేయవలసిందిగా భారత ప్రభుత్వం ఈ సంఘాన్ని కోరింది.

పంచాయతీరాజ్ వ్యవస్థల ప్రాముఖ్యాన్ని గుర్తించి అశోక్ మెహతా కమిటీ స్థానికంగా ప్రజలు, రాజకీయ పార్టీలు ఆరోగ్యకరమైన పోటీతో పాటు, పరస్పర సహకారంతో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తించి, పంచాయితీ రాజ్యవ్యవస్థల నిర్మాణం, కూర్పు, విధులను వివరంగా గుర్తించే విధానం కాకుండా, వాటిని సాధారణంగా గుర్తిస్తూ, ఈ స్థానిక ప్రభుత్వాల పాత్రను మాత్రం వివరించాలన్నది ఈ సంఘం తన విధానంగా పెట్టుకొంది. అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా ఉండే విధానంగాను, భవిష్యత్తులో పదవీ బాధ్యతలను స్వీకరించే విధంగాను పంచాయతీ రాజ్ వ్యవస్థను రూపొందించాలన్నది అశోక్ మెహతా కమిటీ భావన.

అశోక్ మెహతా కమిటీ, బల్వంతరాయ్ మెహతా కమిటీ సూచించిన మూడు అంతస్తుల వ్యవస్థకు మారుగా రెండంతస్థుల వ్యవస్థను మాత్రమే సూచించింది. జిల్లాస్థాయి కింద 15 నుంచి 20 వేల జనాభాతో కూడుకొన్న కొన్ని గ్రామాల సముదాయాన్ని మండల్ పంచాయత్ గా ఏర్పరచాలని అశోక్ మెహతా కమిటి సూచించింది. ఈ విధంగా ఒక చిన్న ప్రాంతాన్ని ప్రాథమిక వ్యవస్థగా నిర్ణయిస్తే, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రాంతంలో అమలుజరిపే చిన్నచిన్న ప్రాజెక్టులపై ప్రజాస్వామిక పర్యవేక్షణ జరపడానికనుగుణంగా ఉంటుందని కమిటీ భావించింది. బ్లాక్ స్థాయిలో అప్పటికి అమల్లో ఉన్న పంచాయతీ సమితిని తాత్కాలిక ప్రాతిపదికపై జిల్లా స్థాయిలో స్థాపించబోయే జిల్లా పరిషత్ కార్యనిర్వాహక సంఘంగా శాసనపరంగా కాకుండా ఏర్పాటు చేయాలని కమిటీ భావించింది. ప్రతి గ్రామంలో ఏర్పరచనున్న గ్రామీణ సంఘాలు మున్సిపల్ విధులను, సాంఘిక కార్యకలాపాలను నిర్వహించడంలో మండల్ పంచాయతీలకు లోబడి వ్యవహరించాలని అశోక్ మెహతా కమిటీ సూచించింది. పంచాయతీరాజ్ వ్యవస్థల గురించి ఎన్నిక ప్రధానంగా ఉండాలనీ షెడ్యూల్డు జాతులు, షెడ్యూల్డు తెగలవారికి జనాభా ప్రాతిపదికగా ప్రాతినిధ్యం ఉండాలనీ కమిటీ సూచించింది. జిల్లా పరిషత్ అధ్యక్షుడు పరోక్షంగా ఎన్నిక కావాలి. కాగా మండల పంచాయతీ అధ్యక్షుడిని రాష్ట్రాలు ఇష్టానుసారం ప్రత్యక్షంగగాని, పరోక్షంగగాని ఎన్నుకోవచ్చు.

### 6.4.1 జిల్లా పరిషత్ కూర్పు :

జిల్లా పరిషత్తులో ఆరు రకాల సభ్యులుంటారు.

1. నిర్దేశించిన నియోజక వర్గాల నుంచి నేరుగా ఎన్నికయ్యే సభ్యులు
2. పంచాయతీ సమితుల అధ్యక్షులు పదవి రీత్యా సభ్యులు
3. పురపాలక సంఘాల ప్రతినిధులు
4. జిల్లా స్థాయి పురపాలక సంఘ సమాఖ్య నామ నిర్దేశం చేసినవారు
5. జిల్లా పరిషత్ ఎన్నికలో అత్యధిక ఓట్లతో గెలచిన ఇద్దరు స్త్రీలు
6. గ్రామీణాభివృద్ధిలో ఆసక్తిగల వారు ఒకరు, విశ్వవిద్యాలయం లేదా కాలేజీ అధ్యాపకుల్లో ఒకరు కో-ఆప్టెడ్ సభ్యులుగా, కో-ఆప్టెడ్ సభ్యులుగాక మిగతా సభ్యులందరూ తమలో ఒకరిని జిల్లా పరిషత్ అధ్యక్షునిగా ఎన్నుకోవాలి.

ప్రతి జిల్లా పరిషత్తు, దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో తమ సభ్యులతో కూడుకొన్న అయిదు కమిటీలను ఏర్పరచుకొంటుంది. వ్యవసాయం, విద్య, చిన్న తరహా పరిశ్రమలు, ఆర్థిక విషయాలు ప్రజాపనులకు ఏర్పరుస్తున్న ఈ కమిటీల చైర్మన్ లందరితో స్థాయి సంఘాన్ని కూడా ఏర్పరుస్తారు. పైన ఉదాహరించిన కమిటీలు కాకుండా ప్రతి జిల్లా పరిషత్తు సాంఘిక న్యాయం కోసం ఒక కమిటీని ఏర్పరచాలన్నదీ అశోక్ మెహతా కమిటీ ప్రత్యేక సూచన. జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తులోని సభ్యులందరితోను, రాష్ట్ర విధానసభ, విధాన మండలి సభ్యులతో పాటు జిల్లా నుండి ఎన్నికైన పార్లమెంటు సభ్యులతో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేయాలని అశోక్ మెహతా కమిటీ సూచించింది.

### 6.4.2 పంచాయితీ సమితి :

పంచాయిత్ సమితి తాత్కాలికంగా కొనసాగినన్నాళ్లు కింది సభ్యులతో కూడుకొని ఉంటుంది.

1. మండల పంచాయిత్ అధ్యక్షులు (పదవి రీత్యా)
2. ఆ ప్రాంతం నుంచి ఎన్నికైన జిల్లా పరిషత్ సభ్యులు (పదవి రీత్యా)
3. చిన్న మున్సిపాలిటీలు, బ్లాక్ స్థాయి సహకార సమాఖ్యలు
4. ఒక కో–ఆప్ట్ అయిన సభ్యుడు

ప్రతి పంచాయత్ సమితీ తమ సభ్యుల్లో ఒకరిని అధ్యక్షుడిగా ఎన్నుకొంటుంది. అధ్యక్ష పదవికి నామినేట్ అయిన సభ్యులుగాని, కో–ఆప్ట్ అయిన సభ్యులుగాని అనర్హులు.

### 6.4.3 మండల పంచాయితీ :

మండల పంచాయత్ కింది సభ్యులతో కూడుకొని ఉంటుంది.

1. గ్రామం – జనాభా, ఈ రెండింటి ప్రాతిపదిక పైన నేరుగా ఎన్నికైన 15 మంది సభ్యులు
2. వ్యవసాయక సేవా సంఘాల ప్రతినిధులు
3. మండల పంచాయత్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సంపాదించిన ఇద్దరు స్త్రీలు

నేరుగా ఎన్నికయిన సభ్యులు తమలో ఒకరిని మండల పంచాయత్ అధ్యక్షునిగా ఎన్నుకోవాలి. కాగా రాష్ట్రాలు తమ ఇష్టానుసారం అధ్యక్షుడిని నేరుగా ఎన్నుకోవచ్చని అశోక్ మెహతా కమిటీ సూచించింది. మండల పంచాయత్ కమిటీలకు సంబంధించి సభ్యుల్లోని స్త్రీలందరితోను కూడుకున్న ఒక సంఘం స్త్రీలు, పిల్లల అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించే నిమిత్తం ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది.

### 6.4.4 గ్రామ సంఘం :

ఈ కింది సభ్యులతో కూడుకున్న గ్రామ సంఘాలను కూడా ప్రతి గ్రామానికి ఎన్నుకోవాలని కమిటీ సూచించింది.

1. ఆ ప్రాంతం నుంచి మండల పంచాయత్ కు ఎన్నికైన సభ్యులు

2. ఆ ప్రాంతం నుంచి జిల్లా పరిషత్తుకు ఎన్నికయిన సభ్యులు

3. సన్నకారు రైతుల ప్రతినిధులు

ఈ సంఘానికి ఆ గ్రామం నుంచి ఎన్నికైన మండల పంచాయత్ సభ్యుడు అధ్యక్షత వహిస్తాడు.

### 6.4.5 గ్రామ సభ :

గ్రామ సభలను ప్రోత్సాహించాలని అశోక్ మెహతా కమిటీ అభిప్రాయపడింది. ప్రతి సంవత్సరం గ్రామ సంఘాలు రెండుసార్లు గ్రామ సభలను ఏర్పాటు చేసి మండల పంచాయత్ జరిపే కార్యక్రమాలను వివరించే ప్రజాభిప్రాయాలను మండల పంచాయత్ కు నివేదించాలి. పైన ఉదాహరించిన వ్యవస్థలతో పాటు న్యాయ పంచాయతీలను కూడా ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. రాష్ట్రాలకు చెందిన ప్రధాన ఎన్నికల అధికారే భారత దేశపు ప్రధాన ఎన్నికల అధికారితో సంప్రదించి ఎన్నికలు జరిపించాలి. సాధారణంగా పంచాయతీ రాజ్య వ్యవస్థలను అధిగమనం చేయరాదని, తప్పనిసరి పరిస్థితులలో చేసేటట్లయితే ఆరునెలల్లో ఎన్నికలు తప్పనిసరిగా జరపాలని కమిటీ సూచించింది. పంచాయతీరాజ్ ఎన్నికలలో రాజకీయ పార్టీలు పాల్గొనాలని తద్వారా బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం ఎక్కువగా లభిస్తుందని కమిటీ భావించింది.

### 6.4.6 పంచాయితీ రాజ్ సంస్థల విధులు :

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయికి సంబంధించి నిర్వహించే అభివృద్ధికి సంబంధించిన విధులనన్నిటిని జిల్లా పరిషత్తులకు అప్పగించాలి. ఈ విధంగా వికేంద్రీకరించాల్సిన విధులలో వ్యవసాయం, తత్ సంబంధిత విధులు, ఆరోగ్యం, విద్య, రోడ్లు, గ్రామీణ పరిశ్రమలు, వెనుకబడిన తరగతుల సంక్షేమం మొదలయిన విధులనుకమిటీ ప్రత్యేకంగా పేర్కొంది. జిల్లా స్థాయికి వికేంద్రీకరించిన రాష్ట్ర కార్యక్రమాలను, ప్రణాళికా రూపకల్పనను జిల్లా పరిషత్తుకు అప్పగించగా వాటి అమలును మాత్రం మండల పంచాయతీలకు అప్పగించడమైంది. అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనేటట్లు బాధ్యత పౌర విధులను, సంక్షేమానికి సంబంధించిన విధులను కూడా మండల పంచాయత్ కు అప్పగించడం జరిగింది. రెవిన్యూ, శాంతి భద్రతల వంటివి నియామక విధులు కలెక్టర్ వద్దనే ఉండాలనీ, అభివృద్ధి పనులకు అవసరమైనంత వరకు మాత్రమే అవి పంచాయతీరాజ్ వ్యవస్థలకు ఇవ్వాలనీ అశోక్ మెహతా కమిటీ సూచించింది. జిల్లా స్థాయిలో ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన పనులను మొత్తం జిల్లా పరిషత్తుకే అప్పగించాలి. జిల్లా పరిషత్తుకు చెందిన అభివృద్ధి శాఖల అధికారులను జిల్లా పరిషత్తుకుచెందిన ప్రధాన కార్యనిర్వహణాధికారి ఆధీనంలో ఉండాలి. ప్రతి మండల పంచాయతీలో వ్యవసాయ విస్తరణాధికార, పశుపోషణ, చేపల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు, ఆరోగ్యశాఖలకు సంబంధించిన ఉద్యోగులందరినీ ఒక పూర్తి కాలపంచాయత్ మండల కార్యనిర్వాహణాధికారి ఆధీనం లో ఉంచాలి.

## 6.5 పంచాయితీ రాజ్ సంస్థల వ్యవస్థాగత నిర్మాణం :

పంచాయతీరాజ్ సంస్థలకు సంబంధించి భారతదేశంలో భిన్నమైన నమూనాలు అమలు పరిచారు. ఈ సంస్థల నిర్మాణం, అధికారాలు, కార్యకలాపాలు, ఎన్నికల పద్ధతులు, ఆర్థిక వనరుల కేటాయింపు తదితర అంశాలకు

సంబంధించి వేర్వేరు నమూనాలు ఉన్నాయి. ఈ సమస్యలను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం రాజ్యంగ సవరణ ద్వారా కొన్ని సంస్కరణలు తెచ్చింది. దాన్నే 1992లో తేబడిన 73వ రాజ్యాంగ సవరణగా వ్యవహరిస్తారు.

### 6.5.1 73వ రాజ్యాంగ సవరణలోని ప్రధాన అంశాలు :

73వరాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యంగ హోదా కల్పించింది. ఈ సవరణ, పంచాయతీరాజ్ నిర్మాణం, కార్యకలాపాలలో ఏకరూపత ఎన్నికల నిర్వహణలో క్రమబద్ధత తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. 73వ రాజ్యాంగ సవరణ ముఖ్యాంశాలను ఈ దిగువ చూడవచ్చు.

### 6.5.1.1 తప్పనిసరిగా నిర్వహించవలసిన అంశాలు :

ఈ క్రింది అంశాలు 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం తప్పనిసరిగా నిర్వహించవలయును. అవి :

1. గ్రామ సభలను ఏర్పాటు చేయడం
2. జిల్లా, బ్లాకు మరియు గ్రామ స్థాయిలలో మూడు అంచల పంచాయితీరాజ్ వ్యవస్థ నిర్మాణాన్ని ఏర్పరచడం.
3. అన్ని స్థాయిలలో, అన్ని పదవులను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నియమించడం
4. పంచాయితీరాజ్ సంస్థల ఎన్నికలకు పోటీ చేయుటకు కనీస వయస్సు 21 సంవత్సరాలు కలిగి ఉండడం
5. పైస్థాయి, మధ్యస్థాయి సంస్థల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను పరోక్ష ఎన్నికలద్వారా నియమించడం
6. పంచాయితీలలో ఛైర్మన్, సభ్యుల పదవులను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించడం.
7. పంచాయితీలలో మొత్తం సీట్లలో 1/3 సీట్లు మహిళలకు రిజర్వేషన్ కల్పించడం.
8. ఈ సంస్థలకు ఎన్నికలను నిర్వహించుటకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ ను ఏర్పాటు చేయడం.
9. ఐదు సంవత్సరాలకు ఒక సారి ఎన్నికలు నిర్వహించడం. ఒకవేళ ఈ సంస్థలను కాలపరిమితికి ముందే రద్దు చేసినట్లయితే, ఆరు నెలలలోపు ఎన్నికలను జరిపించడం.
10. రాష్ట్రం – స్థానిక సంస్థల మధ్య విత్త వనరులను పంపిణీ చేయుటకు రాష్ట్ర ఆర్థిక కమీషను ఏర్పరచడం.

### 6.5.1.2 స్వచ్ఛందంగా నిర్వహించాల్సిన అంశాలు :

ఈ క్రింద వివరించినవి స్వచ్ఛందంగా నిర్వహించాల్సిన అంశాలు, వాటి అమలును రాష్ట్ర ప్రభుత్వాల విచక్షణకు వదలడం జరిగింది, ఆ అంశాలు :

1. పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ సభ్యులకు ఓటు హక్కును కల్పించడం
2. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం

3. పన్నులు, ఫీజులు మొదలైన వాటిని విధించి, వసూలు చేసే విత్తపరమైన అధికారాలను కేటాయించడం

4. పంచాయితీలను స్వతంత్ర సంస్థలుగా రూపొందించడం, మరియు

5. రాజ్యాంగం 73వ సవరణ ద్వారా పదకొండవ షెడ్యూలులో చేర్చబడిన అన్ని లేదా కొన్ని విధులను నిర్వహించుటకు పంచాయితీ సంస్థలకు అధికారాలను కేటాయించడం మరియు ఆర్థికాభివృద్ధి సంబంధించుటకు ప్రణాళికలను రూపొందించె అధికారాలను ఇవ్వడం.

### 6.5.2 పదకొండవ షెడ్యూలు :

రాజ్యాంగ 73వ సవరణ పదకొండవ షెడ్యూలులో పొందుపరచిన పంచాయితీ రాజ్ సంస్థల విధుల జాబితాను క్రింద వివరించడం జరిగింది.

1. వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2. భూమిని అభివృద్ధి పరచడం, భూసంస్కరణలను అమలు పరచడం, భూమి వనరులను స్థిరీకరించి పరిరక్షించడం.
3. చిన్న నీటిపారుదల, నీటి నిర్వహణ మరియు వాటర్ షెడ్ అభివృద్ధి
4. పశు సంవర్ధన, పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం
5. చేపల పెంపకం
6. సామాజిక అడవుల పెంపకం, అడవులలో వ్యవసాయం
7. అటవీ ఉత్పత్తులు
8. చిన్న తరహా పరిశ్రమలు, ఆహార ఉత్పత్తి ప్రక్రియ పరిశ్రమలు.
9. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు
10. గ్రామీణ గృహవసతి
11. త్రాగునీరు
12. ఇంధనం, దానా (పశుగ్రాసం)
13. రోడ్లు, కల్వర్టులు, వంతెనలు, నీటి మార్గాలు, ఇతర ప్రసారమార్గాలు
14. గ్రామీణ విద్యుదీకరణ, విద్యుత్ శక్తి సరఫరా
15. సాంప్రదాయేతర ఇంధన వనరులు
16. పేదరిక నిర్మూలనా కార్యక్రమాలు
17. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాల విద్య

18. సాంకేతిక శిక్షణ, వృత్తివిద్య
19. వయోజన, అనియత విద్య
20. గ్రంథాలయాలు
21. సాంస్కృతిక కార్యకలాపాలు
22. మార్కెట్లు, సంతలను ఏర్పరచడం
23. ఆరోగ్యం, పారిశుద్యం, వైద్యశాలలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, డిస్పెన్సిరీలను ఏర్పరచడం
24. కుటుంబ సంక్షేమం
25. మహిళ, శిశు అభివృద్ధి
26. సామాజిక సంక్షేమం, వికలాంగుల, మానసిక వికలాంగుల సంక్షేమం
27. బలహీన వర్గాలు ముఖ్యంగా షెడ్యూలు కులాల, తెగల సంక్షేమం
28. ప్రజాపంపిణీ వ్యవస్థ
29. సామాజిక ఆస్తులను నిర్వహించడం

## 6.6 పంచాయితీరాజ్ సంస్థాగత నిర్మాణాలు :

అయితే, 73 రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ కు సంబంధించిన అన్ని అంశాలను స్పృశించలేదు. ఫలితంగా అనేక అంశాలు రాష్ట్ర చట్టసభల నిర్ణయాలకే వదిలివేశారు. ఉదాహరణకు గ్రామ పంచాయితీ సర్పంచ్ ఎన్నిక పద్ధతి పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పాల్గొనడం, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు, స్థానిక సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ లాంటివి. ఈ కారణంగా పంచాయితీరాజ్ సంస్థల నిర్మాణం, నిర్వహణ తీరుతెన్నులలో వివిధ రాష్ట్రాల మధ్య తేడాలు కనిపిస్తాయి.

### 6.6.1 గ్రామ సభ :

పంచాయితీరాజ్ నిర్మాణంలో గ్రామసభ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రామ స్థాయిలో అన్ని కార్యకాలాపాలకు ఇది కేంద్ర బిందువు. 73వ సవరణ ప్రకారం అట్టడుగు గ్రామసభలు ఏర్పాటు తప్పనిసరి. కాబట్టి అన్ని రాష్ట్రాల్లోనూ వాటి నిర్మాణం ఉంది. అయితే గ్రామసభ సమావేశాల కాల పరిమితి మాత్రం ఆయారాష్ట్రాల్లో వేర్వేరుగా ఉంది. మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ లో గ్రామసభలు సంవత్సరానికి ఒకసారి, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేరళలలో సంవత్సరంలో రెండుసార్లు, తమిళనాడులో సంవత్సరానికి మూడు సార్లు గ్రామసభలు సమావేశమవుతాయి. కేరళలో గ్రామ పంచాయితీ పరిమాణం చాలా పెద్దది. ప్రతి వార్డుకు ఒక గ్రామసభ లాంటిది ఉంటుంది.

### 6.6.2 గ్రామ పంచాయితీ :

పంచాయితీరాజ్ గ్రామపంచాయతీ దిగువ అంచె. ఆయా రాష్ట్రాలలో దీనికి భిన్నమైన పేర్లున్నాయి.

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో దీన్ని 'గ్రామ పంచాయితీ' అని పిలుస్తారు. గుజరాత్, కేరళ, తమిళనాడులలో కూడా 'గ్రామ పంచాయత్' అంటారు. అస్సాంలో దీనిని 'గాంవ్ పంచాయత్' అని అంటారు. రాష్ట్రాలను బట్టి గ్రామపంచాయతీ పరిమాణంలో కూడా మార్పు ఉంది. కర్ణాటకలో గ్రామ పంచాయితీ 500-700 మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అరుణాచల్ ప్రదేశ్ లో మాత్రం కేవలం 300 మంది జనాభా ఉంటే గ్రామ పంచాయతీ ఏర్పటవుతుంది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, మహారాష్ట్రాలలో జనాభా ఎంత ఉండాలన్న విషయం పేర్కొనబడలేదు. అయితే, అన్ని రాష్ట్రాలలోను పంచాయితీ సభ్యులను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకునే పద్ధతి ఉంది. రాష్ట్ర జనాభాను బట్టి సభ్యుల సంఖ్యను నిర్ణయిస్తారు. ఒక గ్రామపంచాయితీలో ఆయా రాష్ట్రాలను బట్టి సభ్యుల సంఖ్య నాలుగు నుంచి 30 దాకా భిన్నంగా ఉంది. ఎక్కువ వార్డులున్న పెద్ద గ్రామాలలో సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. అన్ని రాష్ట్రాలలోను ఎస్.సి., ఎస్.టి. కులాలకు వారి జనాభా అనుసారంగా రిజర్వేషన్లు కల్పించారు. అలాగే మహిళా రిజర్వేషన్లు కూడా మూడో వంతు అమలు పరుస్తున్నారు. ఇక వెనుకబడిన కులాల (బీ.సి.లు) కు సంబంధించి వివిధ పద్ధతులు అమలులో ఉన్నందువల్ల ఆయా రాష్ట్రాల్లో ఈ రిజర్వేషన్లు మాత్రం భిన్నంగా ఉన్నాయి. బీహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవాలాంటి రాష్ట్రాలలో బి.సి లకు రిజర్వేషన్లున్నాయి. అయితే ఆయా రాష్ట్రాలలో బీ.సిల రిజర్వేషన్ల శాతం వేర్వేరుగా ఉంది. ఉత్తర ప్రదేశ్ లో 50 శాతం, ఆంధ్రప్రదేశ్ లో 34శాతం, మహారాష్ట్రాలో 27 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.

వివిధ రాష్ట్రాల్లో, అధ్యక్షుల పేర్లు వేర్వేరుగా పిలుస్తారు. కర్ణాటకలో వీరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా మరికొన్ని రాష్ట్రాల్లో వీరిని సర్పంచ్, ఉపసర్పంచ్ గా పిలుస్తారు. కేరళ, అస్సాం, తమిళనాడులో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, బీహార్ ముఖియా, ఉపముఖియాలుగా, త్రిపుర, మణిపూర్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ లో ప్రధాన్, ఉపప్రధాన్లుగా పిలుస్తారు.

పంచాయితీ చైర్ పర్సన్ / సర్పంచ్ ఎన్నిక కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాధికారం మీద ఆధారపడి ఉంటుంది. దీనివల్ల ఈ ఎన్నికలు రాష్ట్రానికి – రాష్ట్రానికి మధ్య భిన్నంగా జరుగుతున్నాయి. బీహార్, గుజరాత్, గోవా, మధ్యప్రదేశ్, అస్సాం, మణిపూర్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, హర్యాణా, పంజాబ్ రాష్ట్రాలలో గ్రామ పంచాయతీ అధ్యక్షుడు లేదా సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతుంది. హిమాచల్ ప్రదేశ్ లో ప్రధాన్, ఉపప్రధాన్లను ఓటర్లు నేరుగా ఎన్నుకుంటారు. మిగత రాష్ట్రాలు మాత్రం పరోక్ష పద్ధతిలో సర్పంచ్లను ఎన్నుకుంటాయి. పంచాయతీకి ఎన్నికైన సభ్యులు తమలో ఒకరిని సర్పంచ్ గా ఎన్నుకుంటారు. అన్ని రాష్ట్రాల్లోను సర్పంచ్ లేదా అధ్యక్ష పదవులలో ఎస్.సి., ఎస్.టి. లకు వారి జనాభా అనుసారంగా, మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు ఉన్నాయి. బీహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ లాంటి రాష్ట్రాలు మాత్రం బీ.సి.లకు రిజర్వేషన్లు కల్పించాయి. అయితే సీట్ల రిజర్వేషన్ శాతం మాత్రం ఆయా రాష్ట్రాల్లో భిన్నంగా ఉంది. గుజరాత్ లో బీ.సి.లకు 10శాతం, ఆంధ్రప్రదేశ్ లో 34 శాతం రిజర్వేషన్లున్నాయి. పంచాయితీల స్థాయిలో కూడా స్థాయి సంఘాల ఏర్పాటు ఆయా రాష్ట్రాల్లో భిన్నంగా ఉంది. కేరళలో ఒక స్థాయి సంఘం ఏర్పాటు చేస్తున్నారు. త్రిపుర, సిక్కిం, ఒరిస్సాలలో ఎలాంటి స్థాయి సంఘాల ఏర్పాటు లేదు.

### 6.6.3 మధ్యస్థాయి సమితి/తాలూకా/మండల పంచాయితీ :

మధ్యస్థాయి పంచాయతీల పేర్లు కూడా ఆయా రాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్, పంజాబ్, హర్యాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీటిని పంచాయతీ సమితి అంటారు. ఆంధ్రప్రదేశ్ లో దీనిని 'మండల పరిషత్' అని కేరళాలో 'బ్లాక్ పంచాయతీ' అని, కర్ణాటక, గుజరాత్ లో 'తాలూకా పంచాయతీ'లని, ఉత్తరప్రదేశ్ లో 'క్షాత్ర పంచాయతీ'గా, మధ్యప్రదేశ్ లో 'జనపద పంచాయతీ'గా వాడుకలో ఉన్నది. బీహార్, త్రిపుర, ఒరిస్సా, రాజస్తాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో మధ్య స్థాయి పంచాయతీ సమితి ల స్థాయిలో ఏర్పాటయింది. కర్ణాటక, ఒరిస్సా, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాంలలో తాలూకా స్థాయిలో, ఆంధ్రప్రదేశ్ లో మండలాల స్థాయిలో మధ్యస్థాయి సంస్థలు ఏర్పాటయ్యాయి. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారంగా మధ్యస్థాయి పంచాయతీల ఎన్నికలు వీటికోసం ఏర్పాటు చేసిన భౌగోళిక నియోజకవర్గాల ఓటర్లు ప్రత్యక్ష ఎన్నిక పద్ధతిలో ఎన్నుకుంటారు. దీనికి తోడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక పంజాబ్ లో దిగువస్థాయి/గ్రామస్థాయి సర్పంచ్లు కూడా మధ్య స్థాయి పంచాయతీలలో ఏదో విధంగా అనుసంధానమై ఉంటారు. అలాగే ఆయా మండలాలు లేదా సమితుల పరిధిలో గల ఎమ్మెల్యేలు, ఎం.పీ.లు కూడా మధ్యస్థాయి పంచాయతీలలో భాగస్వామ్యం వహిస్తారు.

ఈ స్థాయి ఎన్నికల్లో కూడా అన్ని రాష్ట్రాలు ఎస్.సి., ఎస్.టి.లకు వారి జనాభా అనుసారంగా, మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. బీహార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ లాంటి రాష్ట్రాలు బీ.సి. లకు కూడా రిజర్వేషన్లు కల్పించాయి. అయితే బీ.సి. రిజర్వేషన్ల విషయంలో వేర్వేరు రాష్ట్రాల్లో వేర్వేరు శాతాలున్నాయి.

మధ్య స్థాయి పంచాయతీల అధ్యక్షుడు లేదా చైర్-పర్సన్ ఎన్నిక ప్రత్యక్షంగా ఎన్నికైన ప్రతినిధులనుంచి పరోక్ష ఎన్నికల ద్వారా జరుగుతుంది. చైర్-పర్సన్, వైస్ చైర్-పర్సన్ లను వేర్వేరు రాష్ట్రాలలో వేర్వేరుగా పిలుస్తారు. కర్ణాటకాలో వీరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులంటారు. బీహార్, ఉత్తరప్రదేశ్ లో ప్రముఖ్, ఉప ప్రముఖ్ లని, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కేరళ, మధ్యప్రదేశ్ లో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లుగా, పశ్చిమ బెంగాలో సభావతి, ఉపసభాపతిగా, రాజస్థాన్ లో ప్రధాన్, ఉప ప్రధాన్ లుగా పిలుస్తారు. చైర్-పర్సన్ లకు అన్ని రాష్ట్రాలలోను ఎస్.సి, ఎస్.టిలకు వారి జనాభా అనుసారంగా, మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు ఉన్నాయి. కొన్నిరాష్ట్రాల్లో మాత్రం బీ.సిలకు రిజర్వేషన్లున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మధ్యస్థాయి పంచాయతీలలో కూడా స్థాయి సంఘాలున్నాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు మాత్రం ఈ స్థాయిలో ఏ స్థాయి సంఘాలను ఏర్పాటు చేయడంలేదు.

### 6.6.4 మూడవ అంచె – జిల్లాస్థాయి పంచాయితీ :

కర్ణాటక, గోవా, ఉత్తరప్రదేశ్ మూడోస్థాయి పంచాయతీలను 'జిల్లా పంచాయత్' లు అంటారు. గుజరాత్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో జిల్లా పంచాయతీలని, ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, పశ్చిమ బెంగాల్ రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో 'జిల్లా పరిషత్'లుగా పిలుస్తారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ ఆ స్థాయి పంచాయతీ సంస్థల సభ్యులను ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల కోసం జిల్లాను భౌగోళిక నియోజకవర్గాలుగా విభజిస్తారు. ఈ నియోజక వర్గాల జనాభా పరిమాణం మణిపూర్ లాంటి చోట్ల 15000గా, బీహార్, ఉత్తరప్రదేశలో 50,000గా రకరకాలుగా ఉన్నాయి. జిల్లా పరిషత్ ల మొత్తం సంఖ్య రాష్ట్రానికి, రాష్ట్రానికి వేర్వేరుగా ఉన్నాయి.

కర్ణాటక, బీహార్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో మధ్యస్థాయి పంచాయతీ చైర్-పర్సన్, జిల్లాస్థాయి పంచాయతీలో పదవీరీత్యా సభ్యులుగా ఉంటారు. దీనికితోడు ఒక్క మహారాష్ట్రలో తప్ప అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయి పంచాయతీలలో ఆ జిల్లాలకు చెందిన ఎం.పీలు, ఎమ్మెల్యేలు కూడా సభ్యులుగా ఉంటారు. కొన్ని రాష్ట్రాలలో మాత్రం వారు ఓటింగ్ సభ్యులుగా ఉంటారు. కొన్ని రాష్ట్రాలలో జిల్లా మార్కెటింగ్ సొసైటీ ఛైర్మెన్, జిల్లా సహకారబ్యాంకు చైర్-పర్సన్, జిల్లా కలెక్టరు కూడా జిల్లా స్థాయి పంచాయతీ సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయి సంస్థల్లో కూడా అన్ని రాష్ట్రాలు, ఎస్.సి., ఎస్.టి.లకు వారి జనాభా ప్రాతిపదికన మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తున్నాయి. బీహార్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్ లాంటి రాష్ట్రాలు బీ.సి.లకు రిజర్వేషన్లు కల్పించాయి. అయితే బీ.సి. రిజర్వేషన్ల శాతం మాత్రం ఆయారాష్ట్రాల్లో వేర్వేరుగా ఉన్నాయి. జిల్లాస్థాయి పంచాయతీల చైర్-పర్సన్, వైస్ చైర్-పర్సన్ ను ఆ పంచాయతీ సభ్యులు తమలో ఒకరిని ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. ఆయా రాష్ట్రాలలో చైర్-పర్సన్, వైస్ చైర్-పర్సన్ పేర్లు వేర్వేరుగా ఉన్నవి. కర్నాటక, బీహార్, ఉత్తరప్రదేశ్లో వీరిని అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశాలలో ఛైర్పర్సన్లుగా, గుజరాత్, ఒరిస్సా, కేరళ మరికొన్ని రాష్ట్రాలలో వీరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లుగా, పశ్చిమ బెంగాల్, త్రిపురలలో సభాపతి, సహకారి సభాపతిగా వ్యవహరిస్తారు. దానికి కూడా ఎస్.సి., ఎస్.టి.లకు జనాభా ప్రాతిపదికన, మహిళలకు మూడోవంతు రిజర్వేన్లు కల్పిస్తున్నారు.

జిల్లాస్థాయిలో విద్య, సాంఘిక సంక్షేమం, వ్యవసాయం లాంటి వివిధ అంశాల నిర్వహణకు అన్ని రాష్ట్రాలలో స్థాయి సంఘాలున్నాయి. అయితే ఈ స్థాయి సంఘాల సంఖ్యలో మాత్రం రాష్ట్రాలలో తేడా ఉంది. ఉదాహరణకు కేరళలో ఒక స్థాయి సంఘం, అయిదు నిర్వాహక కమిటీలు ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ పదిస్థాయి సంఘాలు, ఆంధ్రప్రదేశ్ లో ఏడు స్థాయి సంఘాలు ఉన్నాయి.

## 6.7 పంచాయితీరాజ్ సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్ళు :

ఇటీవలి కాలంలో పంచాయతీరాజ్ సంస్థల పనితీరును సమీక్షించిన అనంతరం వీటిలో మూడు ఆందోళనకరమైన అంశాలున్నట్లు జార్జి మాథ్యూ గుర్తించారు.

అవి :

1. పంచాయతీరాజ్ ఎన్నికలు వాయిదా వేయడం.
2. సమాంతర సంస్థలను ఏర్పాటు చేయడం,
3. లోక్ సభ సభ్యుల స్థానిక అభివృద్ధి పథకాలు (M.P.Local Area Development Scheme).

వీటిని గురించి కొంత వివరంగా తెలుసుకుందాం.

### 6.7.1 ఎన్నికల వాయిదా :

పంచాయతీల ఐదేళ్ల పదవీకాలం పూర్తికాగానే తాజాగా ఎన్నికలు జరిపించాలన్న నింబంధనలను చాలా రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. చాలా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు ఈ సంస్థల పదవీకాలం మధ్యలోగాని, చివరలోగానీ ఎన్నికల ద్వారా ప్రజాతీర్పును ఎదుర్కొనేందుకు సిద్ధపడడంలేదు. మళ్లీ ఎన్నికలలో

గెలవాలని భావించే ఏ పార్టీ కూడా పంచాయతీరాజ్ లో స్థానాలు కోల్పోవడం ద్వారా అప్రతిష్టపాలు కావడానికి ఇష్టపడడంలేదు. అందువల్ల ఏదో ఒక సాకుతో పంచాయతీల ఎన్నికలను వాయిదా వేయడానికే ఈ పార్టీలు సిద్ధపడుతున్నాయి. అయితే సుప్రీంకోర్టు తీర్పులతో కొన్ని సందర్భాలలో మాత్రమే ఈ పార్టీలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎన్నికలు జరిపించడానికి సిద్ధపడు తున్నాయి.

### 6.7.2 సమాంతర సంస్థలు :

వ్యవసాయం, వైద్యం, విద్య మహిళా శిశు సంక్షేమం లాంటి గ్రామీణాభివృద్ధి పథకాల అమలుకు సంబంధించిన కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర మంత్రిత్వశాఖలు సమాంతర వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నాయి. జిల్లా స్థాయిలోనే ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. అవి రిజిస్టర్డ్ సొసైటీల ద్వారా పాక్షిక స్వయంప్రతిపత్తి సంస్థల ఏర్పాటు ద్వారా పంచాయతీలను అధిగమించి కార్యకలాపాలు నెరపుతున్నాయి. మంత్రిత్వ శాఖలు, ఇతర విభాగాలు వారి ఆధీనంలో ఉన్న నిధులను పంచాయితీలకు కేటాయించవలసి వస్తే 'టైడ్ గ్రాంట్ల' కింద ఇస్తున్నారు. కొన్ని సందర్భాలలో గ్రామాలలోని ప్రజలకు దగ్గరకావడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను కూడా అధిగమిస్తున్నది.

### 6.7.3 జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ :

చాలా రాష్ట్రాలలో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను, సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (District Rural Development Agency – DRDA) లాంటి ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేస్తున్నది. పంచాయతీరాజ్ సంస్థలు నిర్వహించాల్సిన ఈ పథకాలు ప్రాజెక్టు డైరెక్టర్ జిల్లా కలెక్టర్ లాంటి ఉద్యోగి వర్గం అజమాయిషి చేస్తున్నది. ప్రస్తుతం ఇలాంటిదే స్వర్ణజయంతి స్వరోజ్ గార్ యోజన అనే కొత్త పథకాన్ని ప్రారంభించారు.

### 6.7.4 వాటర్ షెడ్ అభివృద్ధి పథకము :

ఈ పథకాన్ని ముఖ్యంగా వ్యవసాయ మంత్రిత్వశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు (Non Governmental Organisations NGO's) కూడా ఈ పథకం అమలు చేస్తున్నాయి. ఈ నియమాలను, పథకాల అమలును పంచాయతీరాజ్ కు ఇచ్చేందుకు నిరాకరించారు.

### 6.7.5 ఉమ్మడి అడవి నిర్వహణ కమిటీలు :

ఉమ్మడి అడవి నిర్వహణ కమిటీలు (Joint Forest Management Committees – JFMCs) పంచాయతీరాజ్ లకు జవాబుదారి కాదు. అవి పర్యావరణం, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తాయి. అటవీ సంరక్షణ, సామాజిక అటవీ పథకాలు, చిన్నతరహా అడవుల సంరక్షణలాంటివి పంచాయతీల పరిధిలో ఉన్నప్పటికీ పంచాయతీలతో సంబంధం లేకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయి.

### 6.7.6 జిల్లా ప్రాథమిక విద్యాపథకం :

ప్రాథమిక విద్య సార్వత్రీకరణకు సంబంధించి జిల్లా ప్రాథమిక విద్యా పథకం (District Primary Education Programme – DPEP) ప్రపంచబ్యాంకు నిధులతో నడుస్తున్న అయిదేళ్ల పథకం, నిర్ణీత రాష్ట్రాలలోని

150 జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దీనిపై జరిపిన అధ్యయనాల ద్వారా తేలిన అంశమేమిటంటే పంచాయతీరాజ్ సంస్థలలో ఏమాత్రం సంబంధం లేకుండా సమాంతరంగా ఈ పథకం అమలవుతున్నది.

### 6.7.7 ఎంపీల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకము :

పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంతాల అభివృద్ధి పథకం (Member of Parliaments Local Area Development Scheme – MPLADS) ను 1993లో ప్రధాన మంత్రి ప్రకటించారు. ప్రస్తుతానికి ఒక పార్లమెంటు సభ్యుడు నియోజకవర్గం పరిధిలో సంవత్సరానికి రెండు కోట్ల రూపాయల విలువగల పనులను జిల్లా కలెక్టర్లకు పురమాయించవచ్చు. ఈ మొత్తాన్ని పాఠశాల భవనాల నిర్మాణం, గ్రామీణ రహదారులు, వంతెనలు, పంచాయతీ భవనాలు ఆసుపత్రులు, గొట్టపు బావుల తవ్వకం లాంటి పనులకు ఉపయోగిస్తారు.

## 6.8 సారాంశం :

ప్రజలందరినీ సమానంగా గుర్తించేది ప్రజాస్వామ్యం. ఆధునిక రాజ్యాలు అధికంగా ప్రజాస్వామ్యాలే. ప్రజాస్వామ్యం యొక్క ప్రధాన లక్ష్యం అభివృద్ధి. ప్రజాస్వామ్యంలో ప్రజలు అంటే ముఖ్యంగా పేద ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పురోగతి అభివృద్ధిగా భావించబడుతుంది. పేద ప్రజల అభివృద్ధి సాధ్యపడాలంటే వారు అధికారంలో భాగస్వాములు కావాలి. అధికారంలో భాగస్వామ్యం పేద ప్రజలు పంచుకొన్నపుడే అభివృద్ధి సాధ్యమవుతుంది అనేది జగమెరిగిన సత్యం. అంతేకాని ఏదేశంలోనైనా కేవలం రాజకీయ నాయకుల ద్వారా గానీ, పాలనా ఉద్యోగుల ద్వారా గానీ, సాంకేతిక నిపుణుల ద్వారా గానీ మాత్రమే అభివృద్ధి సాధ్యపడుతుందని భావించకూడదు. ఈ సత్యాన్ని ఎరిగిన ప్రజాస్వామ్య దేశాలు అభివృద్ధి కార్యక్రమంలో ప్రజలు నిరంతరం పాల్గొనడానికి అవకాశం కల్పించడాన్ని ఒక లక్ష్యంగా ఏర్పరచుకున్నాయి. ప్రజల చైతన్యంపై ప్రజాస్వామ్య సామర్థ్యం ఆధారపడి ఉంటుంది. ప్రజావసరాలన్నింటిని సంక్షేమ రాజ్యంలో కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే తీర్చలేవు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోనూ పంచాయతీరాజ్ సంస్థలు ఏర్పాటు చేశారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం సాధించడానికి, ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు పంచాయతీరాజ్ సంస్థలు అవసరమని భావించిన బల్వంత్ రాయ్ మెహతా కమిటీ వాటి ఏర్పాటుకు సిఫారసు చేసింది. ఈ సంస్థలు ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని తెచ్చి, అట్టడుగు స్థాయి అభివృద్ధికి స్థానిక నాయకత్వాన్ని పెంపొందించడానికి ఏర్పాటు చేశారు. స్థానిక అభివృద్ధికి, ప్రణాళిక, స్థానిక వనరుల సేకరణ, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాల అమలు వీటి లక్ష్యం. కానీ వాస్తవంగా చూసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వీటికి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు.

1992కు ముందు పంచాయతీరాజ్ సంస్థల నిర్మాణాలు వివిధ రాష్ట్రాలలో వివిధ రకాలుగా ఉండేవి. స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సరిగా కేటాయించకపోయేవి. ఎన్నికలు కూడా క్రమబద్ధంగా నిర్వహించేవారు కాదు. ఇలాంటి సంస్థాగత లోపాలనను సరిదిద్దడానికి భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ సంస్థలకు అవసరమైన ప్రోత్సాహాన్ని కలిపించేందుకు రాజ్యాంగ సవరణ చేసింది. దీనినే 1992, 73వ రాజ్యంగ సవరణ చట్టం అంటున్నాం. ఈ సవరణ అన్ని రాష్ట్రాల్లో ఒకే నిర్మాణం కోసం ఉద్దేశించారు. పంచాయితీరాజ్ సంస్థలకు క్రమబద్ధ ఎన్నికలు జరగడానికి ఉద్దేశించారు. పంచాయతీరాజ్ సంస్థల పని నిర్వహణకు అవసరమైన నిధులు, అధికారాల కోసం ఈ చట్టాన్ని ఉద్దేశించారు. అయితే 73వ రాజ్యాంగ సవరణ తర్వాత కూడా పంచాయతీరాజ్ సంస్థలలో అంతగా అభివృద్ధి

లేదు. పంచాయతీరాజ్ సంస్థల నిర్మాణం, కార్యక్రమాలలో ఇప్పటికీ రాష్ట్రాల మధ్య తేడాలు కొనసాగుతున్నాయి. వాటికి అవసరమైన నిధులు, అధికారాలు ఇవ్వడం లేదు. అందువల్ల పంచాయతీరాజ్ సంస్థల నిర్వహణా, సామర్థ్యం పెంపుదలకు మరిన్ని సంస్కరణలు జరగవలసి ఉంది. ఈ భాగంలో పంచాయతీరాజ్ సంస్థల విధులు, పనితీరును విశ్లేషించడం జరిగింది. భారతదేశంలో పంచాయతీ రాజ్ సంస్థల సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రభావాలను కూడా చర్చించాము. సామాజిక అంశానికి సంబంధించి పంచాయతి ఎన్నికలలో కులం ప్రధానాంశంగా ఉంటుందని గమనించాం. బలహీనవర్గాలకు ప్రాతినిధ్యం అన్న నిబంధన వారి సామాజిక హోదాను, ఆత్మ విశ్వాసాన్ని కొంత మేరకు పెంచింది. ఇక రాజకీయ కోణం నుంచి అధ్యయనం చేసినప్పుడు రాజకీయ వేత్తలు, ఉద్యోగుల మధ్య సంబంధాలు, పంచాయతీరాజ్ సంస్థలపై రాష్ట్ర, స్థానిక సంబంధాల ప్రభావం, ప్రజల రాజకీయ చైతన్యంలో పెరుగుదల అంశాలను గమనించాము. కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ పంచాయతీరాజ్ సంస్థల సృష్టి, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచింది. గ్రామీణ జనాభా జాగురకతను పెంచింది. 73వ రాజ్యాంగ సవరణ చట్టం కూడా ఎస్సీ, ఎస్టీలు మహిళల భాగస్వామ్యాన్ని పెంచింది.

## 6.9 ముఖ్య పదకోశం :

1. **పంచాయితీ రాజ్ వ్యవస్థ :**

   గ్రామం స్థాయిలో అమల్లో ఉండే, స్థానిక స్వపరిపాలన సంస్థల వ్యవస్థ.

2. **గ్రామ సభ :**

   గ్రామం పరిధిలో ఉన్న పెద్దలందరి సమావేశం (18 సం॥ లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు).

3. **గ్రామ పంచాయితీ :**

   గ్రామసభ కార్యనిర్వాహక కమిటీ.

4. **మండల పరిషత్ :**

   పంచాయతీరాజ్ వ్యవస్థలో మధ్యస్థాయిలో మండల పరిషత్ ఉంటుంది.

5. **జిల్లా పరిషత్ :**

   పంచాయతీరాజ్ వ్యవస్థలో పైస్థాయిలో జిల్లా పరిషత్ ఉంటుంది.

6. **రాయల్ కమీషన్ :**

   ఒక సమస్యను పరిశీలించడానికి మరియు చట్టంలో మార్పులను సిఫార్సు చేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం ఎంపిక చేసిన వ్యక్తుల సమూహం.

7. **సమాజాభివృద్ధి పథకం :**

ఈ పథకం అమలు కోసం ఫోర్డ్ ఫౌండేషన్ అప్పటి అమెరికా రాయబారి అయిన చెస్టర్ బౌల్స్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించింది.

8. **స్థానిక స్వపరిపాలన సంస్థలు :**

అతి విశాలమైన భారతదేశంలో మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం ప్రభుత్వ ఫలాలు అందాలనీ స్థానిక స్వపరిపాలన సంస్థలను ఏర్పాటు చేసెను.

9. **బల్వంతరాయ్ మెహతా కమిటీ :**

గ్రామ స్వపరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత ఏర్పాటును సూచించాల్సిందిగా, ప్రణాళికా పథకాల కమిటీ 1959, జనవరి 16న బల్వంతరాయ్ మెహతా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

10. **గ్రామ స్వరాజ్ :**

ఇది మహాత్మా గాంధీచే రూపొందించబడిన ఒక ప్రత్యేక పదం, ఇది ప్రతి గ్రామాన్ని స్వయం-సమర్ధవంతమైన స్వయంప్రతిపత్తి సంస్థగా మార్చడాన్ని ప్రోత్సహిస్తుంది.

## 6.10 స్వీయ మదింపు ప్రశ్నలు :

1. భారతదేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం స్థానిక సంస్థల స్థితిగతులను వివరించండి.
2. బల్వంతరాయ్ మెహతా కమిటీ సిపార్సులను పరిశీలించండి.
3. పంచాయితీరాజ్ సంస్థల ప్రాధాన్యతను చర్చించండి.

## 6.11 ఉపయుక్త గ్రంథాలు :


1. హెచ్.డి మాలవ్య – విలేజ్ పంచాయిత్ ఇన్ ఇండియా
2. వి.ఎస్. ప్రసాద్ – పంచాయత్స్ అండ్ డెవలప్మెంట్
3. యం. వెంకట రంగయ్య & జి. రామిరెడ్డి – పంచాయితీ రాజ్ ఇన్ ఆంధ్రప్రదేశ్
4. జి. రామిరెడ్డి – పెటరన్స్ ఆఫ్ పంచాయితీరాజ్ ఇన్ ఇండియా
5. ఎస్.పి. జెయిన్ – పెటరన్స్ ఆఫ్ డీసెంట్రలైజ్డ్ గవర్నెన్స్


**డా. కె.వి.ఆర్. శ్రీనివాస్**

# పాఠం – 7

# పట్టణ స్థానిక సంస్థలు

**లక్ష్యం :**

గ్రామీణ స్థానిక సంస్థల ఆవిర్భావం, వాటి చారిత్రక నేపథ్యం, వాటి సంస్థాగత నిర్మాణం, పురపాలక, నగరపాలక సంస్థల అధికారాలు, విధులు, అవి ఎదుర్కొంటున్న సమస్యలు, దాని ప్రాధాన్యతను, పట్టణ స్థానిక ప్రభుత్వాల నూతన పోకడలు సవివరంగా వివరించడం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

ఈ పాఠాన్ని చదివిన తరువాత మీరు

- పట్టణ స్థానిక ప్రభుత్వాలు – చారిత్రక నేపథ్యం
- పట్టణ స్థానిక ప్రభుత్వాలు – రాజ్యాంగం (74వ సవరణ) చట్టం, 1993
- పురపాలక సంఘ ఆవిర్భావం
- ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం, మున్సిపల్ అధికార సంస్థలు, కమీషనర్
- నగరపాలక సంస్థల విధులు, కమీషనర్, వార్డు కమిటీలు
- మేయరు, పురపాలక సంఘ చైర్ పర్సన్ అధికారాలు, విధులు
- పట్టణ స్థానిక ప్రభుత్వాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ, నూతనపోకడలు మొదలగు విషయాల గురించి సవివరంగా వివరించ గలుగుతారు.

**పాఠ్యాంశ విషయ నిర్మాణ క్రమం :**


7.1 పరిచయం

7.2 పట్టణ స్థానిక ప్రభుత్వాలు – చారిత్రక నేపథ్యం

7.3 పట్టణ స్థానిక ప్రభుత్వాలు – రాజ్యాంగం (74వ సవరణ) చట్టం, 1993

7.3.1 ప్రధానాంశాలు

7.4 పురపాలక సంఘ ఆవిర్భావం

7.4.1 కోస్తా, రాయలసీమ ప్రాంతాలు

7.4.2 తెలంగాణ ప్రాంతం

7.5 మున్సిపల్ అధికార సంస్థలు

7.5.1 మున్సిపల్ కౌన్సిల్

7.5.2 కమిటీ పద్ధతి

7.5.3 పురపాలక సంఘం చైర్పర్సన్

7.5.4 కమీషనర్

7.6 రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ
7.7 నూతన పోకడలు
7.8 నగరపాలక సంస్థల విధులు
7.9 అధికారిక సంస్థలు
7.9.1 మేయరు
7.9.2 కార్పొరేషన్ కౌన్సిల్
7.9.3 కార్పొరేషన్ అధికారాలు, విధులు
7.10 కమీషనర్
7.10.1 విధులు
7.11 నగరపాలక సంస్థ – ఆదాయ వ్యయాలు
7.12 సారాంశం
7.13 ముఖ్య పదకోశం
7.14 స్వీయ మదింపు ప్రశ్నలు
7.15 ఉపయుక్త గ్రంథాలు

## 7.1 పరిచయం :

భారతదేశ పరిపాలనలో పట్టణ స్థానిక ప్రభుత్వాలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రజలు తమను తాము పరిపాలించుకొనే విధంగా పట్టణ ప్రాంతాలలో స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమైంది. అట్టడుగు స్థాయిలో నివసించే ప్రజలకు అధికారాలను దత్తంచేసి పరిపాలనలో వారు భాగస్వాములు అయ్యేలాగా చూడడమే పట్టణ స్థానిక ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశం. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వ లక్ష్యం సంక్షేమరంగంపై ఉండడం వల్ల ప్రజలకు అతి దగ్గరలో పాలన అందించవలసిన అవసరం ఏర్పడింది. స్థానిక ప్రజల భాగస్వామ్యం లేకుండా సంక్షేమ పథకాల అమలు నిష్ఫలమని భావించి ప్రభుత్వాలు క్రమంగా పట్టణ స్థానిక ప్రభుత్వాల ఏర్పాటుకు కృషిచేశాయి.

## 7.2 పట్టణ స్థానిక ప్రభుత్వాలు – చారిత్రక నేపథ్యం :

భారతదేశంలోని పట్టణ ప్రాంతాల పరిపాలన వ్యవస్థలో పట్టణ స్థానిక ప్రభుత్వాలు కీలక స్థానాన్ని ఆక్రమిస్తాయి. భారతదేశం సుసంపన్నమైన, ఉదాత్తమైన సాంస్కృతిక వారసత్వంతో కూడిన అత్యంత విశాలమైన రాజ్యం. భారతదేశంలో ప్రాచీన, మధ్యయుగాలలో రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్యపరమైన ప్రాధాన్యతను సంతరించుకున్న అనేక పట్టణ ప్రాంతాలు ఏర్పడి అభివృద్ధి చెందాయి.

క్రీస్తు పూర్వం నాలుగో శతాబ్దంలో మౌర్యుల పాలనలో గ్రీస్ కు చెందిన ప్రసిద్ధ పర్యాటకుడయిన మెగస్థనీస్ భారతదేశంలో పర్యటించాడు. అతడు తన గ్రంథం 'ఇండికా'లో భారతదేశంలో పట్టణ స్థానిక ప్రభుత్వాల గురించి ప్రస్తావించాడు. ఆనాటి కాలంలో భారతదేశంలో జన సాంద్రత ఉన్న ప్రాంతాలలో పట్టణాలు ఉండేవనీ, పట్టణాల యొక్క పరిపాలన వ్యవహారాలను పర్యవేక్షించడానికి అయిదుగురు అధికారులు ఉండేవారని అతడు పేర్కొన్నాడు. ప్రతి కమిటీ కొన్ని ప్రత్యేక వ్యవహారాలను పరిశీలించి తగిన నిర్ణయాలను తీసుకునేది. పారిశ్రామిక వాడలు, విదేశీ

యాత్రికుల కమిటీ కొన్ని ప్రత్యేక వ్యవహారాలను పరిశీలించి తగిన నిర్ణయాలను తీసుకునేది. పారిశ్రామిక వాడలు, విదేశీ యాత్రికుల విషయాలు, జనన మరణాలు, వర్తక వ్యాపారాలు, వస్తువుల తయారీని నియంత్రించడం, వాణిజ్య పన్నుల వసూళ్ళు వంటి విషయాలు వాటిలో ఉన్నాయి. అబుల్ ఫజల్ అనే మరొక విదేశీ పర్యాటకుడు మొగలాయి కాలంలో భారతదేశంలో పర్యటించి ఆనాటి పట్టణ స్థానిక ప్రభుత్వాల గురించి పేర్కొన్నాడు. ఆనాటి పట్టణాలలో కొందరు మునిసిపల్ అధికారులు ఉండేవారని అతడు తెలిపాడు. అలాంటి వారిలో కొత్వాల్ ఒకరని అతడు ఉదాహరించాడు. మున్సిపల్ ప్రాంత పరిధిలోని వ్యవహారాల పై కొత్వాల్ కు సంపూర్ణ నియంత్రణాధికారం ఉండేదనీ, అతడు అనేక విధులను నిర్వహించేవాడని అబుల్ ఫజల్ పేర్కొన్నాడు. అలాంటివారిలో న్యాయసంబంధమైన, విత్త సంబంధమైన విధులు ఉన్నాయని చెప్పాడు. అబుల్ ఫజల్ రచించిన అబున్–ఇ–అక్బరీ గ్రంథంలో కొత్వాల్ విధులలో కొన్నింటిని ఉదహరించడం జరిగింది. ప్రజల బహిరంగ వ్యవహారాలపై నిఘా ఉంచడం, రాత్రి వేళలలో గస్తీ వంటివి వాటిలో ఉన్నాయి. పట్టణ ప్రాంతాలలోని నివాసిత గృహాలు, రహదార్లు గురించి సమాచారం కొత్వాల్ ఆధీనంలోని అధీకృత గ్రంథాలలో లిఖించబడి ఉన్నాయి. పట్టణ ప్రాంతాల ప్రజల మధ్య సుహృద్భావ సంబంధాలను పెంపొందించడానికి కొత్వాల్ కృషి చేయవలసి ఉంటుంద ని అబుల్ ఫజల్ ఉద్ఘాటించాడు.

భారతదేశంలో బ్రిటీష్ పాలనకాలంలో పట్టణ స్థానిక ప్రభుత్వాల పరిణామంలో అనేక ప్రధాన సంఘటనలు జరిగాయి. వాటిని కింది విధంగా పేర్కొనవచ్చు. బ్రిటీష్ కాలంలో భారతదేశంలో మొట్టమొదటిసారిగా 1687లో మద్రాస్ (ప్రస్తుతం చెన్నై) పట్టణానికి నగరపాలక సంస్థ హోదాను కల్పిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతనంగా ఏర్పడిన మద్రాస్ నగరపాలక సంస్థకు పట్టణానికి సంబంధించిన ఆర్థికపరమైన వ్యవహారాలను పర్యవేక్షించే అధికార బాధ్యతలు అప్పగించడమైంది. తరువాత 1720లో ప్రత్యేక చార్టర్ ద్వారా ప్రెసిడెన్సీ పట్టణాలైన అప్పటి మదరాసు, బొంబాయి, కలకత్తాలకు మేయర్ కోర్టులను ఏర్పాటు చేయడమైంది. 1850 సంవత్సరపు చట్టం పట్టణ ప్రాంతాల పరిధిలో స్థానిక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లుగా ప్రకటించింది. ప్రజారోగ్యం వంటి అంశాల నిర్వహణను ఆ స్థానిక కమిటీలకు అప్పగించడమైంది. తరువాత 1870లో లార్డ్ మేయో తీర్మానం భారతదేశంలో పట్టణ స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసే ఉద్దేశంతో వాటి నిర్వహణలో భారతీయుల భాగస్వామ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకోబడతాయని ప్రకటించింది. తరువాత 1882లో లార్డ్ రిప్పన్ తీర్మానం భారతదేశంలోని పట్టణ స్థానిక ప్రభుత్వాల నిర్మాణంలో చెప్పుకోదగినదిగా చరిత్రకారులు వర్ణించారు. పట్టణ స్థానిక ప్రభుత్వాలకు ఆర్థిక అధికారాలను అధికంగా కల్పించడం, ఆ సంస్థల నిర్వహణలో అధికారుల సంఖ్యను మూడోవంతుకు తగ్గించడం వంటి పురోగాత్మక చర్యలు ఆ తీర్మానంలో ప్రస్తావించడం జరిగింది. భారతదేశంలో స్థానిక ప్రభుత్వాల నిర్మాణ, నిర్వహణలో రిప్పన్ తీర్మానం 'మాగ్నాకార్టా'గా వర్ణించడం జరిగింది.

1907 సంవత్సరంలో అధికారాలు వికేంద్రీకరణపై ఉద్దేశించిన రాయల్ కమీషన్ పట్టణ స్థానిక ప్రభుత్వాల నిర్మాణ నిర్వహణలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. వాటిలో పట్టణ స్థానిక ప్రభుత్వాల నిర్మాణ నిర్వహణలలో అధికారుల సంఖ్య, పెత్తనాలను బాగా తగ్గించడం, ఓటు హక్కు పరిమితిని తొలగించి, విస్తృపరచడం, ఆర్థిక వనరులను అధిక మొత్తాలలో మంజూరు చేయడం వంటివి కూడా రాయల్ కమీషన్ సూచనలలో ఉన్నాయి.

భారత ప్రభుత్వ చట్టం, 1919 భారతదేశంలో రాష్ట్ర స్థాయిలో ద్వంద్వపాలనను ప్రవేశపెట్టింది. మొత్తం పట్టణ పాలన అంశాలను 'పట్టణ స్థానిక ప్రభుత్వాలు' అనే అంశంలో చేర్చింది. ఆ అంశాల పర్యవేక్షణను భారతీయ మంత్రులలో ఒకరికి అప్పగించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఓటుహక్కు పరిమితిని విస్తృతం చేయడం,

పన్ను విధింపు అధికారాలను విస్తృతం చేయడం, నామినేటెడ్ / అధికార సభ్యుల సంఖ్యను తగ్గించడం వంటి చర్యల అమలుకు ఆ చట్టం వీలు కల్పించింది. అయితే ఆ తరవాత వచ్చిన 1935 నాటి భారత ప్రభుత్వ చట్టం పట్టణ స్థానిక ప్రభుత్వాల గురించి ప్రత్యేకంగా ఎలాంటి ప్రాధాన్యతను ఇవ్వలేదు. ఆ తరవాత కూడా రెండో ప్రపంచయుద్ధ ప్రకటన వెలువడిన నేపథ్యంలో భారతదేశంలో పట్టణ ప్రభుత్వాల నిర్మాణ, నిర్వహణలలో చెప్పుకోదగిన ప్రగతి కనిపించలేదు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత పంచాయితీరాజ్ సంస్థల స్థాపన గురించి రాజ్యాంగం ద్వారా కొన్ని స్పష్టమైన చర్యలు తీసుకోవడం జరిగింది. భారత రాజ్యాంగంలోని 40వ అధికరణం "రాజ్య విధాన ఆదేశక సూత్రాలు" అనే శీర్షిక కింద స్థానిక స్వపరిపాలన ప్రభుత్వాలకు సంబంధించి కొంత వివరణ ఇవ్వడం జరిగింది. అయితే ఆ సంస్థల ఏర్పాటుకు, వికాసానికి చెప్పుకోదగిన కృషి జరగలేదు. కానీ రాజ్యాంగం 7వ షెడ్యూల్లో 5వ ఎంట్రీ కింద ఈ సంస్థల ఏర్పాటు గురించి ప్రస్తావన చేయడం జరిగింది. దానిలోని పురపాలక మండళ్ళు, పట్టణాభివృద్ధి సంస్థలు, జిల్లా బోర్డులు, ఇతర స్థానిక సంస్థల గురించిన అంశాలు ఆ ఎంట్రీలో ప్రస్తావించడం జరిగింది. పట్టణ ప్రాంతాల వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై తగిన చట్టాలను రూపొందించే అధికారాన్ని భారత రాజ్యాంగం రాష్ట్రాల అధీనంలో ఉంచింది. పట్టణ ప్రణాళికలకు సంబంధించిన అంశాలు 20వ ఎంట్రీలో ఉదహరించడం జరిగింది. ఆ ఎంట్రీలో సామాజిక, ఆర్థిక ప్రణాళిక అంశాలు చేర్చడం జరిగింది. ఆ ఎంట్రీ ప్రకారం పట్టణ స్థానిక ప్రభుత్వాల అధికారాలు, విధులకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడమైంది. అలాగే పట్టణ ప్రణాళికల అంశంపై పర్యవేక్షణా అధికారం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటి ఆధీనంలో ఉంచడం జరిగింది.

## 7.3 పట్టణ స్థానిక ప్రభుత్వాలు – రాజ్యాంగం (74వ సవరణ) చట్టం, 1993 :

రాజ్యాంగం 74వ సరణ చట్టం, 1993ను భారత పార్లమెంటు 1992 డిసెంబర్ లో ఆమోదించింది. దానికి 1993 ఏప్రిల్ 20వ తేదీన రాష్ట్రపతి ఆమోదం లభించింది. భారతదేశంలో పట్టణ స్థానిక ప్రభుత్వాలు సమర్థవంతంగా కార్యకలాపాలను నిర్వహించడానికి ఆ చట్టం ఒక ఉమ్మడి విధివిధానాలను రూపొందించింది. అంతకు పూర్వం ఆ చట్టాన్ని రూపొందించడానికి విశేషమైన కృషి జరిగింది. తొలుత పార్లమెంట్ ఆ చట్టానికి సంబంధిత బిల్లును 1989లో రాజ్యాంగం (65వ సరవణ) బిల్లుగా ప్రతిపాదించడం జరిగింది. అయితే లోక్ స భ అర్ధంతర రద్దు కారణంగా ఆ బిల్లు పార్లమెంటు ఆమోదానికి నోచులేదు. తరవాత ఆ బిల్లులు కొన్ని సవరణలు చేసి, 1991 సెప్టెంబర్ 16వ తేదీన లోక్ సభలో ప్రవేశపెట్టడం జరిగింది. దరిమిలా పార్లమెంటు ఉభయసభలు ఆ బిల్లును కూలంకుషంగా పరిశీలించి, 1992 డిసెంబర్ లో ఆమోదించాయి. చివరికి రాష్ట్రపతి ఆమోదం తరవాత ఆ బిల్లు చట్టంగా రూపొంది 1993 జూన్ 1వ తేదీన అమల్లోకి వచ్చింది.

### 7.3.1 ప్రధానాంశాలు :

1. ఈ చట్టం పట్టణ స్థానిక సంస్థలకు మొట్టమొదటిసారిగా రాజ్యాంగపరమైన గుర్తింపునిచ్చింది. రాజ్యాంగంలో 9ఎ అనే భాగాన్ని అదనంగా చేర్చింది. ఆ భాగంలో రాజ్యాంగ అధికరణాలు 243 పి నుండి 243 జెడ్ ఇ వరకు కొత్తగా పేర్కొనడం జరిగింది.

2. రాజ్యాంగంలో పన్నెండో షెడ్యూల్ ను ప్రవేశ పెట్టింది (243 డబ్ల్యూ అధికరణం).

3. పట్టణ స్థానిక సంస్థలకు 8 అంశాలపై తీర్మానాలను రూపొందించుకొని అమలులో ఉంచుకోవడానికి అధికారాన్ని ఇచ్చింది.

4. పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన వివిధ పదాలను నిర్వచించింది. జనాభా పదిలక్షలు లేదా అంతకుమించి ఉంటే పట్టణ ప్రాంతాన్ని మహానగర ప్రాంతం (మెట్రోపాలిటన్ ఏరియా)గా ప్రకటించింది. అలాంటి మహానగర ప్రాంతం ఒకటి లేదా అంతకుమించిన జిల్లాలు, పురపాలక సంస్థలు లేదా పంచాయితీలకు విస్తరించి ఉండవచ్చని పేర్కొంది (243 పి అధికరణం).

5. నగరపాలక సంస్థ, మున్సిపల్ కౌన్సిల్, నగర పంచాయితీ వంటి అనేక సంస్థల నిర్మాణానికి వీలు కల్పించింది. నగరపాలక సంస్థ అనేది విస్తృతమైన పట్టణ ప్రాంతాలకు వర్తిస్తుంది. మునిసిపల్ కౌన్సిళ్ళనేవి చిన్న పట్టణ ప్రాంతాలకు సంబంధించినవి. నగర పంచాయితీలనేవి గ్రామీణ వాతావరణం నుంచి పట్టణ వాతావరణానికి మార్పుచెందే దశలో ఉండే ప్రాంతాలతో ఏర్పడతాయి. పట్టణ స్థానిక సంస్థల పేర్లను ఖరారు చేయడానికి, వాటి భౌగోళిక సరిహద్దులను స్పష్టంగా గుర్తించడానికి ఈ చట్టం రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇచ్చింది (243 క్యూ అధికరణం) .

6. పురపాలక సంఘాల నిర్మాణాన్ని ఈ చట్టం ప్రత్యేకంగా గుర్తించింది. పురపాలక సంఘాల సభ్యులను వార్డుల వారీగా రిజిష్టర్డ్ ఓటర్లు ప్రత్యేకంగా ఎన్నుకుంటారని సూచించింది. పురపాలక సంస్థల సమావేశాలలో అనుభవజ్ఞులు, నేర్పరితనం ఉన్న ప్రసిద్ధ వ్యక్తులు పాల్గొనడానికి అవసరమైన నియమనిబంధనలను రూపొందించే అధికారాన్ని ఈ చట్టం రాష్ట్ర శాసనసభలకు సంక్రమించేలా చేసింది. అలాగే పురపాలక సంస్థ పరిధిలోని విధానసభ సభ్యులు, లోక్ సభ సభ్యులు పురపాలక సంస్థల కౌన్సిళ్ళ సమావేశాలలో రాష్ట్ర ప్రభుత్వం నామ నిర్దేశం చేసే విధానపరిషత్తు లేదా రాజ్యసభ సభ్యులు పాల్గొనడానికి అర్హులని ప్రకటించింది (243 ఆర్ అధికరణం).

7. జనాభా మూడు లక్షలు లేదా అంతకుమించి ఉన్న పురపాలక సంస్థలలో వార్డ్ కమిటీల ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది. అలాంటి వార్డు కమిటీల ఏర్పాటు విషయంలో శాసనాలను రూపొందించే అధికారాన్ని రాష్ట్ర శాసనసభకు అప్పగించింది (243 ఎస్ అధికరణం).

8. పట్టణ స్థానిక సంస్థలలో కొన్ని స్థానాలను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు వారి జనాభా పరిమాణానికి అనుగుణంగా కేటాయించటం జరుగుతుందని పేర్కొంది. అంతే కాకుండా ఆ సంస్థలలో మూడోవంతు స్థానాలు మహిళలకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. నగరపాలక సంస్థ, పురపాలక సంస్థ ఛైర్మన్ / ఛైర్-పర్సన్ పదవులలో కొన్నింటిని బలహీనవర్గాలకు కేటాయిస్తున్నట్లుగా ప్రకటించింది (243 టి అధికరణం).

9. పురపాలక సంస్థల కాలపరిమితిని సూచించింది. ప్రతి పురపాలక సంస్థ తొలి సమావేశం జరిగింది మొదలు అయిదేళ్ళపాటు కొనసాగవచ్చని ప్రకటించింది. అలాగే ప్రతి పురపాలక సంస్థ కాలపరిమితి ముగిసేలోగా లేదా కాలపరిమితి పూర్తయిన ఆరు నెలల వ్యవధిలోపు ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం

చేసింది. అలాగే రాష్ట్రంలోని అన్ని పురపాలక సంస్థలకు ఒకే పర్యాయం ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుందని పేర్కొంది.

10. పురపాలక సంస్థల సభ్యులు ఏ పరిస్థితులలో పోటీ చేయడానికి అనర్హులనే విషయాన్ని నిర్దిష్టంగా పేర్కొంది. విధానసభకు పోటీచేయడానికి అర్హత లేనివారు పురపాలక సంస్థలకు కూడా పోటీ చేయడానికి అనర్హులని ప్రకటించింది. పురపాలక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయస్సు 21 సంవత్సరాలుగా నిర్ణయించింది (243 వి అధికరణం).

11. పురపాలక సంస్థ అధికారాలు, విధుల గురించి రాష్ట్ర శాసనసభలు అవసరమైన చట్టాలను రూపొందిస్తాయని ప్రకటించింది. రాష్ట్ర శాసనసభలు పురపాలక సంస్థలకు సంబంధించిన ప్రజల ప్రగతికి అవసరమయ్యే

    a.) ప్రణాళికల రూపకల్పన,

    b.) సామాజిక న్యాయ సాధన,

    c.) రాజ్యాంగం పన్నెండో షెడ్యూల్ కు సంబంధించిన పథకాల అమలు,

    d.) వార్డ్ కమిటీల సమర్థవంతమైన పనితీరు వంటి అంశాలపై శాసనాలను రూపొందించవచ్చని పేర్కొంది.

    – (243 డబ్ల్యూ అధికరణం).

12. పురపాలక సంస్థలు తమ ఆదాయాల కోసం ప్రజలపై పన్నులు విధించడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంచి సహాయక గ్రాంట్లను పొందడానికి వీలు కల్పించింది (243 ఎక్స్ అధికరణం).

13. పట్టణ స్థానిక సంస్థలకు సహాయక గ్రాంట్ల మంజూరు, పంపకం వంటి విషయాలకోసం రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సలహా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అయిదేళ్ళకొకసారి ఒక ఆర్థిక సంఘాన్ని నియమించవలసి ఉంటుంది. (243 వై అధికరణం).

14. పట్టణ స్థానిక సంస్థల పద్దుల తనిఖీ నిమిత్తమై రాష్ట్ర ప్రభుత్వం ఆడిటర్ల బృందాన్ని పంపించవచ్చు (243 జెడ్ అధికరణం).

15. పట్టణ స్థానిక సంస్థలకు ప్రతి అయిదేళ్ళకొకసారి ఎన్నికలు నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమీషన్ ను ఏర్పరచింది. ఆ ఎన్నికల కమీషన్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ వంటి అధికారాలు కలిగి ఉంటుంది. ఎన్నికల కమీషన్ ఛైర్మన్, సభ్యులను రాష్ట్ర గవర్నర్ నియమిస్తాడని పేర్కొంది. అయితే అతడిని తొలగించే అధికారాన్ని భారత రాష్ట్రపతికి ఉంటుందని తెలిపింది.

16. ప్రతి జిల్లాలో ఒక జిల్లా ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర శాసనసభ చట్టం రూపొందిస్తుంది. ఆ కమిటీ జిల్లా స్థాయిలో వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయపరుస్తుందని పేర్కొంది (243 జెడ్ డి అధికరణం).

17. మెట్రోపాలిటన్ ఏరియాలలో మెట్రోపాలిటన్ ప్రణాళిక కమిటీలు ఏర్పాటవుతాయని ఈ చట్టం ప్రకటించింది. మెట్రోపాలిటన్ ఏరియా పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఆ కమిటీ తగిన ప్రణాలికలను రూపొందిస్తుందని పేర్కొంది (243 జెడ్ ఇ అధికరణం).

## 7.4 పురపాలక సంఘ ఆవిర్భావం :

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నేడు పని చేస్తున్న పురపాలక సంఘాలు రెండు స్పష్టమైన పాలనా తీరుతెన్నులను కనపరుస్తూన్నాయి. కోస్తా, రాయలసీమ జిల్లాలలోని పురపాలక సంఘాలు బ్రిటీష్ ప్రభుత్వం ప్రత్యక్ష ఆధీనంలో ఉన్న మద్రాసు ప్రభుత్వ విధానం వల్ల ప్రభావితమయినాయి. తెలంగాణ ప్రాంతంలోని పురపాలక సంఘాలు పూర్వపు పాలకుడు నైజాం విధానాల ఫలితంగా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ చారిత్రక వాస్తవాలు ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో పురపాలక సంఘాల నిర్మాణం, అధికారాలు, పాత్ర, వాటి పనితీరుపై ప్రభావం కలిగి ఉన్నాయి.

### 7.4.1 కోస్తా, రాయలసీమ ప్రాంతాలు :

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో పురపాలక సంస్థల ఆవిర్భావంలో వివిధ ఘట్టాలను గుర్తించవచ్చును. మొదటి దశలో 1860 ప్రాంతాలలో బ్రిటీషు ప్రభుత్వం అమలు చేసిన ఆర్థిక వికేంద్రీకరణ ప్రక్రియ ఫలితంగా పురపాలక సంస్థలు ఏర్పాటైనాయి. ఆర్థిక భారం అధికం కావడం వల్ల బ్రిటీష్ ప్రభుత్వం స్థానిక భద్రత, పారిశుద్ధ్యానికి సంబందించిన ఖర్చులను స్థానిక సంస్థలకు బదలాయించాల్సిన అవసరం ఏర్పడింది. పన్నులు విధించే అధికారాన్ని, స్థానిక పారిశుద్ధ్యం, భద్రతను నిర్వహించే బాధ్యతను ఈ పురపాలక సంస్థకు అప్పగించారు.రెండవ దశలో స్థానిక సంస్థలలో ప్రజాస్వామీకరణ ప్రవేశపెట్టారు. మేయో (1870), లార్డ్ రిప్పన్ (1882) తీర్మానాల ఆధారంగా పురపాలక సంస్థలలో ప్రజాస్వామ్య పద్ధతులు ప్రవేశపెట్టారు. స్థానిక స్వపరిపాలనా సంస్థలను రాజకీయ, ప్రజా విద్యకు శిక్షణాశాలలుగా భావించడం జరిగింది. ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. పురపాలక సంస్థ అధ్యక్షుడు కౌన్సిల్ సభ్యులచే ఎన్నుకోబడి, వారికి బాద్యత వహించే పద్ధతిని ప్రవేశపెట్టడం జరిగింది. మద్రాసు జిల్లా ఈ చట్టం ఓటు హక్కును మున్సిపాలిటీల చట్టం (1920) పురపాలక వ్యవస్థలో అనేక మార్పులను ప్రవేశపెట్టింది. పన్ను చెల్లించే వారందరికీ విస్తరింప చేయడం, చైర్మన్ పాత్రకు ప్రాధాన్యత పెంచడం వంటి చర్యలను చేపట్టింది. అయితే జాతీయ ఉద్యమం కారణంగా వివిధ పురపాలక సంఘాలు బ్రిటీషు పరిపాలన పట్ల నిరసన కేంద్రాలుగా మారాయి. అంతేకాకుండా, ఎన్నుకోబడిన పురపాలక సంఘ అధ్యక్షులు దైనందిన పరిపాలన పట్ల పూర్తికాలం శ్రద్ధ చూపడంలేదు. ఈ కారణాల దృష్ట్యా మునిసిపల్ చట్టం 1933 లో మార్పులు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ మార్పుల ఫలితంగా చైర్మన్ నగర ప్రభుత్వ రాజకీయ కార్యనిర్వాహణాధికారిగా ఎదగడంతో పాటుగా, కౌన్సిల్ విధానాలు రూపొందించడం, వాటిని అమలుపరచే అధికారాన్ని కమీషనర్ కు అప్పచెపుతూ విధానరూపకల్పన, అమలు మధ్య సంబంధాన్ని నెలకొల్పడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘాలపై నియంత్రణాధికారాలను కలిగి ఉన్నది. ఈ పద్ధతి 1947లో స్వాతంత్ర్యం వచ్చేవరకు కొనసాగింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అనేక రాష్ట్రాలు తమ మునిసిపల్ చట్టాలను సవరించుకొని ఎన్నికైన కౌన్సిల్ కు ఎక్కువ అధికారాలను కట్టపెట్టారు.

### 7.4.2 తెలంగాణ ప్రాంతం :

హైదరాబాద్ రాష్ట్రంలో పురపాలక సంఘాల ఏర్పాటు ఆర్థిక కారణాలవల్ల జరిగింది. నిజాం ప్రభుత్వం ఆర్థిక

సమస్యలను అధిగమించుటకు పురపాలక సంఘాలను ఏర్పరచారు. పురపాలక సంస్థలను ఏర్పరచే ప్రారంభ దశలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఎటువంటి తేడాను చూపలేదు. జిల్లా, పట్టణ ఆదాయాలను కలిపి వేశారు. పురపాలక సేవలను నిర్వహించే బాధ్యతను కూడా జిల్లా, తాలుకా బోర్డులకు అప్పగించారు. జిల్లా, పట్టణ బడ్జెటులను వేరు చేయడానికి మొదటి చర్య 1921లో తీసుకున్నారు. జిల్లా మున్సిపాలిటీలు నిధుల కొరత వల్ల చాలా ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. ప్రభుత్వం 1937లో ఉన్నతాధికారులతో కూడిన ఒక కమిటీని ఏర్పాటు చేసి, పురపాలక సంఘం పరిపాలనా వ్యవస్థలో మార్పులను సూచించవలసినదిగా కోరింది. ఈ కమిటీ తన నివేదికలో ఇతర విషయాలతో పాటు మునిసిపల్ అధికార్ల విషయంపై కౌన్సిల్లో ప్రాతినిధ్య విషయంపై పురపాలక సంఘ నిధుల, ఆర్థిక వనరులు, వాటిపై ప్రభుత్వ అదుపు, ఆజమాయిషీల విషయంపై సూచనలను చేసింది. ఈ కమిటీ పట్టణాల వర్గీకరణకు జనాభాను ప్రాతిపాదికగా తీసుకున్నది. జనాభాకంటే సమూహాల ప్రాతిపాదికలపై పురపాలక సంఘాలలో ప్రాతినిధ్యం ఉండాలని కమిటీ సూచించింది. దీనితో పాటు కొంత మంది కౌన్సిల్ కు నామినేట్ చేయడం జరుగుతుంది. కౌన్సిల్ కాలపరిమితి మూడు సంవత్సరాలు. అధికారులు కౌన్సిల్ కు అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. పురపాలక సంఘాలకు అప్పగించవలసిన విధులను గూర్చి ఈ కమిటీ సమగ్రమైన జాబితాను రూపొందించింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా 1941 లో హైద్రాబాద్ మున్సిపల్, టౌన్ కమిటీ చట్టం చేసి మునిసిపాలిటీలకు, టౌన్ కమిటీలకు చట్టబద్ధతను కల్పించడం జరిగింది. ఈ చట్టం అధ్యక్షులకు పర్యవేక్షణ, నిర్దేశకత్వం, నియంత్రణ అధికారాలను కల్పించి వారి పాత్రను పటిష్ఠపరచింది. మున్సిపాలిటీలు విధించవలసిన పన్నులను చట్టం పేర్కొన్నది. భూములు, భవనాలపై పన్నులతోపాటు, ఈ చట్టం వృత్తిపన్ను, నీటిపన్ను వసూలును కూడా ఏర్పాటు చేసింది. పురపాలక సంఘాలపై ప్రభుత్వ నియంత్రణకు ఈ చట్టం గట్టి ఏర్పాటు చేసింది. హైద్రాబాద్ రాష్ట్రంలో పురపాలక సంఘాల పరిణామంలో మరొక ప్రధాన ఘట్టం 1941లో చేసిన హైద్రాబాద్ పారిశుద్ధ్యం అధికారాల చట్టం. ఈ చట్టం ఆరోగ్యం, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్ విషయాలలో మున్సిపాలిటీల కార్యనిర్వాహక చర్యలకు చట్టబద్ధమైన ప్రాతిపాదికను కలుగచేసింది.

## 7.5 మునిసిపల్ అధికార సంస్థలు :

ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ చట్టం విధులను సక్రమంగా నిర్వహించుటకు నాలుగు అధికార సంస్థల ఏర్పాటుకు వీలు కల్పించింది. అవి : మునిసిపల్ కౌన్సిల్, మునిసిపల్ చైర్మన్, మునిసిపల్ కమీషనర్, వార్డు కమిటీలు. ఈ సంస్థల గురించి క్రింద చర్చిద్దాం.

### 7.5.1 మునిసిపల్ కౌన్సిల్ :

ప్రభుత్వంలోనైనా ఎన్నిక కాబడిన ప్రతినిధులతో కూడిన విధాన రూపకల్పనకు సంబంధించిన శాసన పరమైన విభాగం ముఖ్యమైనది. ఈ విభాగం విధాన రూపకల్పనలో ప్రముఖ పాత్రను పోషిస్తుంది. ప్రతి పురపాలక సంఘానికి ఎన్నుకోబడిన సభ్యులు, పదవీరీత్యా సభ్యులు, కో–ఆప్టెడ్ సభ్యులతో కూడిన కౌన్సిల్ ఉంటుంది. మునిసిపల్ కౌన్సిల్ గురించి చర్చించేటప్పుడు సభ్యులను ఎన్నిక చేసుకునే పద్ధతి, రిజర్వేషన్లను కల్పించడం వంటి విషయాలను గురించి తెలుసుకొనడం అవసరము.

#### 7.5.1.1 నిర్మాణం :

ఆంధ్రప్రదేశ్ నగర జనాభా ఆధారంగా మునిసిపల్ కౌన్సిల్ సభ్యుల సంఖ్య నిర్ధారించబడుతుంది. పదవీరీత్యా

సభ్యులు, కో–ఆప్టెడ్ సభ్యులు కాకుండా రాష్ట్రంలో మునిసిపల్ కౌన్సిల్ కనిష్ఠంగా 21 సభ్యులను, గరిష్ఠంగా 45 సభ్యులను కలిగి ఉంటుంది. అనగా ప్రతి మునిసిపల్ కౌన్సిల్లో ఎన్నిక కాబడిన సభ్యులు 21 మందికి తగ్గకుండా 45 మందికి ఎక్కువకాకుండా ఉంటారు. మున్సిఫల్ కౌన్సిల్ సభ్యుల వివరాలను క్రింద పట్టిక వివరిస్తుంది.

| వరుస సంఖ్య | జనాభాస్థాయి | ఎన్నికకాబడే సభ్యులసంఖ్య |
|---|---|---|
| 1. | 40,000 కు తక్కువ జనాభా | 21 |
| 2. | 40,000 నుండి 1,00,000 వరకు | 21+40,000 జనాభా దాటిన తరువాత ప్రతీ వెయ్యి జనాభాకు అదనంగా ఒక సభ్యుడు (20+1) |
| 3. | 1,00,00 నుండి 2,00,000 | 27 మంది, (1,00,000 జనాభా దాటిన తరువాత ప్రతి 15,000 జనాభాకు ఒక అదనపు సభ్యుడు) |
| 4. | 2,00,000 దాటి జనాభా ఉంటే | 33 మంది సభ్యులు, (2,00,000 జనాభా దాటిన ఉంటే తరువాత ప్రతి 20,000 జనాభాకు ఒక అదనపు సభ్యుడు. అయితే గరిష్ఠ సభ్యుల సంఖ్య 45కు దాటకూడదు.) |

### 7.5.1.2 ఎన్నికలు :

కౌన్సిల్ ఎన్నిక కొరకు పురపాలక సంఘాన్ని వార్డులుగా విభజిస్తారు. ప్రతివార్డులోని ప్రజలు ఒక సభ్యున్ని ఎన్నుకొంటారు.

### 7.5.1.3 పదవీరీత్యా సభ్యులు :

ఎన్నిక అయిన సభ్యులతో పాటు, పదవీరీత్యా సభ్యులు కూడా కౌన్సిల్లో ఉంటారు. పదవీరీత్యా సభ్యులు అంటే రాష్ట్ర శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఈ సభ్యులకు కౌన్సిల్లో ఓటు వేసే అధికారం కూడా ఉంటుంది.

a) పురపాలక సంఘం వార్డు లేదా వార్డులో కొంత భాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర శాసన సభ్యుడు,

b) పురపాలక సంఘం వార్డు లేదా వార్డులో కొంతభాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు సభ్యునికి కూడా కౌన్సిల్లో సభ్యత్వం ఉంటుంది.

c) పురపాలక సంఘంలో తన పేరును ఓటర్ల జాబితాలో నమోదు చేసుకొని, రాజ్యసభ సభ్యత్వాన్ని పొందిన పార్లమెంటు సభ్యుడు.

### 7.5.1.4 కో–ఆప్టెడ్ సభ్యులు :

పురపాలక కౌన్సిల్లో ప్రజలచే ఎన్నిక కాబడిన, పదవీరీత్యా సభ్యత్వాన్ని పొందిన వారితో పాటుగా పురపాలన గురించి ప్రత్యేక పరిజ్ఞానం, నిపుణత అనుభవాన్ని కలిగిన కొద్ది మంది వ్యక్తులను కూడా కో–ఆప్ట్ చేసుకోవడం జరుగుతుంది. ఈ సభ్యులను నగర పంచాయితీ అయితే ఒక్కరిని, పురపాలక సంఘం మూడు లక్షల జనాభా కంటే తక్కువ జనాభా కలిగి ఉంటే ఇద్దరిని, మూడులక్షల జనాభా దాటి ఉంటే ముగ్గురు సభ్యులను నియమించుకోవడం జరుగుతుంది. ఈ సభ్యులతో పాటుగా మైనారిటీ వర్గానికి చెందిన ఒకరిని పురపాలక సంఘం కౌన్సిల్లో సభ్యుడుగా నియమిస్తారు.

### 7.5.1.5 రిజర్వేషన్లు :

రాజ్యాంగ 74 వ సవరణ చట్టం ప్రకారం షెడ్యూలు కులాలు, తెగలకు వారి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించబడింది. వెనకబడిన వర్గాలకు కౌన్సిల్ మొత్తం సభ్యులలో 1/3 వంతు ప్రాతినిధ్యం కలిపించబడింది. రిజర్వేషన్ సభ్యులతోపాటు మొత్తం సభ్యులలో మూడింట ఒకవంతు సభ్యత్వాన్ని మహిళలకు రిజర్వేషన్ చేయడం జరిగింది.

### 7.5.1.6 పదవీకాలం :

పురపాలక సంఘం సభ్యులు, చైర్మన్ల పదవీకాలం ఐదు సంవత్సరాలు. సభ్యులు అనర్హుడు అని ప్రకటించే విషయంలో రాష్ట్ర శాసన సభ్యులకు వర్తించే నిబంధనలే పురపాలక సంఘం కౌన్సిల్ సభ్యులకు కూడా వర్తిస్తాయి. పరిమిత కుటుంబ వ్యవస్థను ప్రోత్సహించుటకు, ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ మంది పిల్లను కలిగిన వ్యక్తులు కౌన్సిల్ సభ్యత్వానికి పోటీ చేయుటకు అనర్హులు.

స్థానిక సంస్థల రద్దు క్లిష్టతరం చేయడం జరిగింది. మునిసిపల్ కౌన్సిల్ ను ఎందుకు రద్దు చేయకూడదో వివరించే మునిసిపల్ చైర్మనికి కల్పించడం జరిగింది. కౌన్సిల్ ను రద్దు చేసిన తరువాత ఆరు నెలల లోపల నూతన కౌన్సిలు తప్పక ఏర్పాటు చేయాలి. ఈ విధంగా నూతనంగా ఏర్పడిన కౌన్సిల్ పాత కౌన్సిల్ మిగిలిన కాలానికి అవకాశాన్ని మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తుంది. అంతేకానీ ఐదు సంవత్సరాల కాలపరిమితి కలిగి ఉండదు.

మునిసిపల్ కౌన్సిల్ పట్టణ పాలన బాధ్యత కలిగి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం 1965లో నిర్దేశించబడిన అధికారాలను, విధులను కౌన్సిల్ నిర్వహిస్తుంది. ఆ చట్టం లేదా ఇతర శాసనాల ద్వారా చైర్మన్ కు  లేదా కమీషనర్ కు సంక్రమించిన అధికారాలను, విధులను కౌన్సిల్ నిర్వహించుటకు వీలులేదు. ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టం 1965, షెడ్యూలు ఒకటిలోని నిబంధనల ప్రకారం కౌన్సిల్ నిబంధనలను రూపొందిస్తుంది. ఆ నిబంధనలు చట్టంలోని ఇతర అంశాలకు లేదా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నిబంధనలకు విరుద్ధంగా ఉండకూడదు.

### 7.5.1.7 అధికారాలు :

పురపాలక సంఘానికి ఇవ్వబడిన విధులను నిర్వహించే బాధ్యతను కౌన్సిల్ కలిగి ఉంటుంది. పురపాలక పాలన కౌన్సిల్ చేతిలో ఉంటుంది. ఈ కౌన్సిల్ పురపాలక చట్టం 1965లో నిర్దేశించిన అధికారాలను, విధులను నిర్వహిస్తుంది. కమీషనర్ సమర్పించిన విధానాలను, ప్రాజక్టులను, ఇతర పథకాలను ఆమోదించే బాధ్యత కౌన్సిల్ కి ఉంది. పట్టణ సమాజ ప్రయోజనాలకు ధర్మకర్తగా ఉంటూ కౌన్సిల్ పురపాలక సంఘానికి చెందిన అధికారుల పనిని పర్యవేక్షించి, అదుపు చేస్తుంది. వార్షిక పాలనా నివేదికను చర్చించేటప్పుడు పౌరపాలనకు సంబంధించిన వివిధ విభాగాల పని సామర్థ్యాన్ని సమీక్షిస్తుంది. ఈ సమీక్షలో తీవ్రమైన లోపాలు బయటపడితే సంబంధిత వ్యక్తులపై కౌన్సిల్ చర్య తీసుకుంటుంది. కౌన్సిల్ ఇతర అధికారాలు, విధులు క్రింద వివరించడం జరిగింది.

a) పురపాలక సంఘానికి చెందిన ఏ రికార్డునైనా తెప్పించుకొనవచ్చును.

b) ప్రత్యేకమైన విషయాన్ని పరశీలించుటకు కాని లేదా సలహాకొరకు కాని కమిటీని లేదా వ్యక్తిని నియమించవచ్చును.

c) విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, డ్రైనేజీ, షెడ్యూల్డు కులాలు, తెగల, వెనకబడిన వర్గాల, మహిళల, పిల్లల అభివృద్ధికి ఉద్దేశించబడిన కార్యక్రమాలను రూపొందించడం, సమీక్షించడం, పర్యవేక్షించుటకు కమీటీలను ఏర్పాటు చేస్తుంది. ఈ కమిటీలలో ముగ్గరికి తగ్గకుండా, ఎడుగురికి ఎక్కువకాకుండా కౌన్సిల్ నుండి ఎన్నికైన సభ్యులు ఉంటారు. ఈ కమిటీలలో మునిసిపల్ చైర్మన్, కమీషనర్ సభ్యులుగా ఉంటారు.

d) ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1వ తేది తరువాత అంతకు ముందు సంవత్సరానికి సంబంధించిన వార్షిక పాలనానివేధికను కమీషనర్ జిల్లా కలెక్టర్ ద్వారా డైరెక్టర్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కు అతనిద్వారా ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ నివేదికలో పురపాలక సంఘ పాలనా విషయాలను వివరిస్తారు.

e) రాబోవు సంవత్సరంలో వచ్చే ఆదాయం, వ్యయంతో కూడిన బడ్జెట్ను రూపొందించి, ఒక బడ్జెట్ కాపీని ప్రభుత్వానికి సమర్పించడం కూడా జరుగుతుంది.

## 7.5.2 కమిటీ పద్ధతి :

పురపాలక సంఘాల చట్టం కమిటీలను ఏర్పాటు చేసే వీలుకల్పిస్తుంది. మూడు లక్షల జనాభా దాటిన అన్ని పురపాలక సంఘాలలో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని 74వ రాజ్యాంగ సవరణ చట్టం పేర్కొంది. వార్డు కమిటీలతో పాటుగా చట్టబద్ధత కలిగిన మరో రెండు ఇతర కమిటీల ఏర్పాటుకు చట్టం వీలుకల్పించింది. ఈ కమిటీలు ఒకటి కాంట్రాక్టు కమిటీ, రెండు ప్యానల్ కమిటీ. కౌన్సిల్ ఏదైనా ప్రాముఖ్యత కలిగిన విషయాన్ని పరిక్షించుటకు కొన్ని నిబంధనలతో తాత్కాలిక కమిటీలను ఏర్పాటు చేసే అధికారాన్ని కలిగి ఉంటుంది. రాష్ట్రంలోని పురపాలక సంఘాలలో కమిటీ వ్యవస్థను క్రింది వివరిస్తుంది.

### 7.5.2.1 కాంట్రాక్టు కమిటీ :

ప్రతి పురపాలక సంఘం పనులను నిర్వహించడం, వస్తువులను సరఫరా చేయడం వంటి పనులను ఇతర సంస్థలకు కాంట్రాక్టుకు ఇస్తుంది. పురపాలక సంఘాల చట్టం సెక్షన్ 43 ప్రకారం కంట్రాక్టుల విషయంలో నిర్ణయాలను తీసుకొనుటకు కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కాంట్రాక్టు కమిటీలో మునిసిపల్ చైర్మన్, కమీషనర్, కౌన్సిల్ చేత ఎంపిక కాబడిన ముగ్గరికి తగ్గకుండా, ఏడుగురికి మించని సభ్యులు ఉంటారు. ఈ కమిటీ సమావేశాలకు మునిసిపల్ చైర్-పర్సన్ అధ్యక్షత వహిస్తాడు. ఈ కమిటీ కాలపరిమితి ఏర్పాటు చేసిన రోజునుండి ఒక్క సంవత్సరం. నిర్దేశింపబడిన విలువ లేదా డబ్బు పరిధి మించకుండా కౌన్సిల్ తరపున కాంట్రాక్టులు ఇచ్చుటకు ఈ కమిటీ అధికారాలను కలిగి ఉంటుంది. ఈ కమిటీ పురపాలనలో చెప్పుకోదగిన ప్రాభల్యాన్ని కలిగి ఉంటుంది.

### 7.5.2.2 ప్యానల్ కమిటీ :

ప్రతి పురపాలక సంఘం అనేక తరగతుల ఉద్యోగులను కలిగి ఉంటుంది. ఈ ఉద్యోగులలో కొందరిని రాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతరులను పురపాలక సంఘం అధ్యక్షుడు పేనల్ లేక నియమకాల కమిటీ సూచనల మేరకు నియమిస్తాడు.

పురపాలక సంఘాలలో నిర్దేశించిన మొత్తం కంటే ఎక్కువగా గరిష్ఠ జీతపు స్కేళ్లు కలిగిన పదవులన్నింటినీ ఈ కమిటీ తయారు చేసిన జాబితా నుండి నియమించాలని ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల చట్టం 1965 పేర్కొంటుంది. ఈ కమిటీలో పురపాలక సంఘం అధ్యక్షుడు, కమీషనర్, ఇందుకొరకు కౌన్సిల్ ఎన్నుకొన్న ముగ్గురికి తక్కువ కాని, ఏడు మందికి మించని సభ్యులు ఉంటారు.

### 7.5.2.3 వార్డు కమిటీలు :

భారత రాజ్యాంగ 74వ సవరణ చట్టానికి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టంలో వార్డు కమిటీల ఏర్పాటుకు వీలుకలిగించడం జరిగింది. మూడు లక్షలు, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన పురపాలక సంఘాలు ఈ కమిటీలను తప్పక ఏర్పాటు చేయవలయును. అంతకన్నా తక్కువ జనాభా కలిగిన చిన్న పురపాలక సంఘాలు, ఆ కమిటీలను ఏర్పాటు చేసుకొనే స్వేచ్ఛను మునిసిపల్ కమీషనర్, డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ విచక్షణకు ఇవ్వడం జరిగింది. పురపాలక సంఘాలలో ఐదు వార్డులకు తగ్గకుండా వార్డులుండే వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తారు. వార్డు కమిటీలను ఏర్పాటు చేసేటప్పుడు భౌగోళిక పరిస్థితులు, సౌకర్యాలను పరిగణలోకి తీసుకుంటారు. ప్రతీ వార్డు కమిటీ వార్డులనుండి కౌన్సిల్ కు ఎన్నిక కాబడిన సభ్యులతో కూడి ఉంటుంది. వార్డుల కమిటీ ఎన్నిక కాబడిన సభ్యులనుండి ఒకరిని చైర్మన్ గా ఎన్నుకుంటారు. చైర్మన్ పదవీకాలం అతను ఎన్నికైన తేదీ నుండి ఒక సంవత్సరం. అతను తిరిగి ఎన్నిక కావడానికి అర్హుడు. పురపాలక సంఘం అధికారులు వార్డుల కమిటీ సమావేశాలకు హాజరు కావచ్చును కానీ వారికి ఓటు హక్కు ఉండదు. ప్రతి వార్డు కమిటీ విధులు, పాత్ర విషయంలో ఒక చిన్న కౌన్సిల్ గా పనిచేయవలసి ఉంటుంది. వార్డుల కమిటీలకు ప్రధానంగా నిత్యం నిర్వహింపవలసిన విధులను అప్పచెప్పడం జరుగుతుంది. ఆ విధులు :

* పారిశుద్ధ్యం
* నీటి సరఫరా, పారిశుద్ధ్యం
* వీధి దీపాలు,
* రోడ్లు,
* మార్కెట్లు,
* ఉద్యానవనాలు, ఆటస్థలాలు,
* మునిసిపల్ పాఠశాల భవనాలు.

### 7.5.3 పురపాలక సంఘం చైర్–పర్సన్ :

పురపాలక సంఘం, చైర్–పర్సన్ (అధ్యక్షులు)ను పట్టణ ప్రథమ పౌరునిగా పరిగణిస్తారు. ఇతనిని పట్టణంలో అర్హత కలిగిన ఓటర్లు అందరూ ప్రత్యక్షంగా ఎన్నుకొంటారు. మునిసిపల్ చైర్మన్ పదవికి రిజర్వేషన్లు వర్తిస్తాయి. షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులవారికి కౌన్సిలర్స్ మాదిరిగానే రిజర్వేషన్ పద్ధతి ఉంటుంది. అయితే ఈ రిజర్వేషన్ విధానం రాష్ట్రస్థాయి ప్రాతిపాదికగా అమలు జరపబడుతుంది. రాష్ట్రస్థాయి జనాభా లెక్కల ప్రాతిపదికగా ఈ పదవి ఆయా వర్గాల వారికి కేటాయించడం జరుగుతుంది.

### 7.5.3.1 పదవీకాలం :

స్థానిక ప్రభుత్వ సంస్థలకు పార్టీల ఆధారంగా ఎన్నికలను నిర్వహిస్తారు. చైర్పర్సన్ పదవీకాలం ఐదు సంవత్సరాలు. కౌన్సిల్ జరిపే అన్ని సమావేశాలలో ఓటు చేసే అధికారాన్ని చైర్మన్ కలిగి ఉంటారు. చైర్పర్సన్ పదవి ఖాళీ అయినప్పుడు, నూతన చైర్పర్సన్ ఎన్నిక అయ్యేవరకు వైస్ చైర్మన్ విధులను నిర్వహిస్తాడు. నిర్దేశించబడిన గౌరవ వేతనం రవాణా ఖర్చులు తీసుకొనుటకు చైర్పర్సన్ అర్హతకలిగి ఉంటాడు. ప్రభుత్వం చట్టంలో పేర్కొన్న విధంగా వీరిని తొలగించడం లేదా సస్పెండ్ చేయవచ్చును. అయితే ఈ చర్య తీసుకొనే ముందు, వివరణ ఇచ్చుటకు వారికి అవకాశం ఇవ్వవలయును. చైర్మన్ పదవి ఏదైనా కారణాల వలన మధ్యలో ఖాళీ ఏర్పడితే, ఎన్నిక ద్వారా ఆపదవిని భర్తీ చేయవలయును. అయితే ఆ విధంగా ఎన్నిక అయిన నూతన చైర్మన్, మిగిలిన కాలానికి మాత్రమే ఆ పదవిని నిర్వహిస్తాడు.

### 7.5.3.2 అధికారాలు, విధులు :

పురపాలక పాలనలో చైర్పర్సన్ అధిక శక్తి వంతమైన ప్రభావాన్ని కలిగి ఉంటాడు. మునిసిపల్ చట్టం కల్పించిన చట్టబద్ధ అధికారాలే కాకుండా, మునిసిపల్ కౌన్సిల్ అధిపతిగా, పట్టణంలో ఒక ముఖ్య రాజకీయవేత్తగా పురపాలక పాలనను ప్రభావపరుస్తారు. ఇతను / ఈమె భిన్నమైన విధులను, చట్టం నిర్దేశించిన బాధ్యతలను నిర్వహిస్తారు. ఇతను/ఈమె నిర్వహించే విధుల పరిధి విశాలమైనది. కౌన్సిల్ సమావేశాలను నిర్వహించడం, ఉద్యోగాలను భర్తీచేయడం, అత్యవసర సమయంలో కొన్ని పనులను అమలు పరచడం, పురపాలక సంఘం నిర్వహించే పనులను, పురపాలక సిబ్బందిని పర్యవేక్షణ చేయడం వంటి వివిధ రకాల విధులను చైర్పర్సన్ నిర్వహిస్తారు.

### 7.5.3.3 శాసనాత్మక అధికారాలు :

పురపాలక సంఘంలో రాజకీయ కార్యనిర్వాహక అధిపతి హోదాలో అధ్యక్షుడు కౌన్సిల్ లో కార్యకలాపాలను నిర్వహించడంలో కొన్ని ముఖ్యమైన అధికారాలను కలిగి ఉంటాడు. కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటు చేసి వాటికి ఇతను అధ్యక్షత వహిస్తాడు. ఉపాధ్యక్షుని ఎన్నికకు ఏర్పాట్లు చేస్తాడు.

### 7.5.3.4 పాలన అధికారాలు :

పురపాలక సంఘం పాలన అధ్యక్షుని పేరుమీద జరుగుతుంది. కౌన్సిల్ కు ప్రభుత్వానికి మధ్య లేక కౌన్సిల్ కు శాఖాధిపతులకు మధ్య జరిగే అధికార ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ అధ్యక్షుని పేరుతో జరగాలని ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల చట్టం 1965 పేర్కొంటుంది. మునిసిపల్ పరిపాలన పై సాధారణ అజామాయిషీతో పాటు అధ్యక్షునికి పురపాలక సంస్థాపనపై కొన్ని అధికారాలు ఉన్నాయి. కమీషనర్ అతని ఆధ్వర్యంలో పనిచేస్తాడు. అధ్యక్షుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా కమీషనర్ కు చెందిన వార్షిక వ్యక్తిగత రహస్య నివేదికను మునిసిపల్ పాలన శాఖ తయారు చేస్తుంది. ప్యానల్ కమిటీ అధ్యక్షుని హోదాలో పురపాలక సంఘం నియమించిన అధికారులను సస్పెండు చేయడానికి, శిక్షార్హులను చేయడానికి లేక తొలగించడానికి అధ్యక్షునికి అధికారం కలదు.

### 7.5.3.5 అత్యవసర విధులు :

అత్యవసర పరిస్థితులలో కౌన్సిల్ అనుమతి అవసరమైన పనినైనా నిర్వహించవలసిన లేక తరువాత కౌన్సిల్

ఆమోదం పొందే పద్ధతిలో ఏ ఖర్చునైనా పెట్టవలసిందని ఉత్తర్వులిచ్చే అధికారం అధ్యక్షునికి ఉన్నది.

చైర్మన్ నిర్వహించే విధులలో ప్రధానమైనవి ఈ క్రింద పేర్కొనబడినవి :

1. వైస్-చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేస్తారు.
2. కౌన్సిల్ సమావేశాలను నిర్వహిస్తారు.
3. కౌన్సిల్ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.
4. ఏ తీర్మానం అయినా చట్టంలోని అంశాలకు విరుద్ధంగా ఉన్నా, లేదా కౌన్సిల్ అధికారులను అతిక్రమించినట్లు భావించినా ఆ తీర్మానాన్ని పునః సమీక్షించుటకు పంపవచ్చును.
5. ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం 1965 చైర్మన్కు ప్రత్యేకంగా నిర్దేశించిన, అప్పచెప్పిన అన్ని అధికారాలను, విధులను నిర్వహిస్తారు.
6. సాధారణంగా కౌన్సిల్ అంగీకారం పొంది అమలు పరచవలసిన ఏ పనిని లేదా చర్యను అత్యవసర సమయంలో కౌన్సిల్ అంగీకారం లేకుండానే నిర్ధేశించే అధికారం ఉంది. చైర్మన్ దృష్టిలో ప్రజల భద్రతకు అవసరానికి ఉద్దేశించబడినవిగా ఆ చర్యలు, పనులు ఉండాలి. పనులకు, చర్యలకు అయ్యే ఖర్చును మునిసిపల్ నిధులనుండి చెల్లిస్తారు. ఈ చర్యలను, పనులను, వాటిని అమలు పరచవలసిన కారణాలను వివరిస్తూ ఒక నివేదికను రూపొందించి తరువాత జరిగే కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ సమర్పిస్తారు.
7. కౌన్సిలు ప్రభుత్వానికి మరియు ఇతర శాఖాధిపతులకు మధ్య జరిగే అన్ని అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు చైర్మన్ పేరు మీదుగా జరుగుతుంది.
8. కౌన్సిల్ అధ్యక్షుని అధికారాన్ని అగౌరవపరచినా లేదా నియమాలను దూషించినా, మున్సిపల్ చట్టం బైలాసు, నిబంధనలను తరుచుగా అతిక్రమించిన, కౌన్సిల్ కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగా ఆటంకాలు కలిగించిన కౌన్సిలర్ను మూడు సమావేశాలకు మించకుండా సస్పెండ్ చేసే అధికారాన్ని కలిగి ఉంటాడు.
9. మున్సిపల్ ఉద్యోగులను సస్పెండ్ చేయడానికి తొలగించడానికి అధికారాన్ని కలిగి ఉంటాడు.

10 మునిసిపల్ చట్టంలోని సెక్షన్ 74 ప్రకారం ప్యానల్ కమిటీ ఆమోదించిన జాబితానుండి మునిసిపల్ ఉద్యోగులను నియామకం చేసే అధికారం కలిగి ఉన్నాడు.

11. పన్నులను వసూలు చేసే పురపాలక సంఘం సిబ్బందిని బదిలీ చేయుటకు మునిసిపల్ కమీషనర్ చైర్మన్తో సంప్రదించి ఆజ్ఞలను జారీచేస్తాడు.

### 7.5.3.6 ఆర్థిక అధికారాలు :

చైర్మన్ నిర్దేశింపబడిన స్కేలు ప్రకారం పురపాలక పాలనకు అగు అత్యవసర ఖర్చులను చేస్తాడు. అయితే ఈ

ఖర్చుల వివరాలను, కారణాలను తరువాత జరిగే కౌన్సిల్ సమావేశంలో నివేదిక రూపంలో వివరిస్తాడు. కౌన్సిల్ ఆమోదించని ఏ పద్దుకింద ఖర్చుచేయడానికి, లేదా కౌన్సిల్ నిషేదింపబడిన వ్యయాన్ని చేయుటకు చైర్మన్ కు అధికారంలేదు.

పురపాలక స్థాయిలో చైర్మన్ అధికారాలు, హోదా, స్థాయి, పాత్ర చాలా కీలకమైనది. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా చూసినట్టయితే పట్టణ ప్రభుత్వంలో పురపాలక సంఘం చైర్మన్ అధిక శక్తివంతమైన పాత్రను, ప్రభావాన్ని పోషిస్తున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం 1965, తరువాత చేసిన సవరణలు చైర్మన్ పదవిని పటిష్టపరచాయి. కార్యనిర్వాహక కమిటీని రద్దుపరచడం, మునిసిపల్ కమీషనర్ చైర్మన్ పర్యవేక్షణ క్రింద విధులను నిర్వహించడం వంటి మార్పులు చైర్మన్ పదవి హోదాను, స్థాయిని పెంచాయి. చైర్మన్ ప్రత్యక్షంగా ఎన్నుకోబడడం వలన ఆపదవి మరింత పటిష్ఠతను సంతరించుకొని, ప్రజల మద్దతును కలిగి కౌన్సిల్ అతని అధికారాన్ని ప్రశ్నించడానికి వీలులేనట్లుగా రూపొందింది.

### 7.5.4 కమీషనర్ :

పురపాలక సంఘంలో పనిచేస్తూ చైర్మన్కు, కౌన్సిల్కు సహాయపడుటకు రాష్ట్ర ప్రభుత్వం నియమించబడిన అధికారి మునిసిపల్ కమీషనరు, ఇతను రాష్ట్రప్రభుత్వ సర్వీసు అనగా ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కమీషనర్ల సర్వీసు, ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కమీషనర్ల సబార్డినేట్ సర్వీసుకు చెందిన వాడు. పురపాలక సంఘం ప్రభుత్వ కార్యనిర్వాహక అధిపతిగా తన విధులను, బాధ్యతలను నిర్వహించుటకు చాలినంత అధికారాలను కమీషనర్కు ఇవ్వడం జరిగింది.

పురపాలక సంఘం కార్య నిర్వాహణ అధిపతిగా కమీషనర్ అతిముఖ్యమైన పాత్రను పోషిస్తారు. కమీషనర్కు యిచ్చిన అధికారాలను జాగ్రత్తగా పరిశీలిస్తే అతని బాధ్యతలు అనేక రకాలుగా వున్నాయని తెలుస్తుంది. కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలను అతడు అమలు చేస్తాడు. కార్యనిర్వాహక శాఖ అధిపతిగా పురపాలక సంఘం అధికారులపై అజమాయిషీ చేస్తూ, వారిపై అదుపు కలిగి ఉంటాడు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీర్లు, ఆరోగ్య అధికారి, టౌన్ ప్లానింగ్ అధికారి వంటి మునిసిపల్ అధికార్లు అతని ఆధీనంలో లేకుండా, పురపాలక సంఘం అధ్యక్షునితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండేవారు. దీని ఫలితంగా అదుపు పరిమితంగా ఉండేది. కానీ 1971లో చేసిన సవరణల ప్రకారం ఈ అధికార్లను కమీషనర్ పర్యవేక్షణలోకి తెచ్చారు. పురపాలక సంఘానికి చెందిన బడ్జెట్ను తయారు చేయడం, ఆర్థిక వనరులను సమకూర్చడం, జమా ఖర్చులను నిర్వహించడం వంటి బాధ్యతలు కమీషనర్కు ఉన్నాయి. అందువల్ల పురపాలక సంఘస్థాయిలో ఆర్థిక వనరులను సమర్థవంతంగా నిర్వహించడానికి అతడు జవాబుదారీగా ఉంటాడు. ఇతడు పురపాలక సంఘ కార్యాలయం, పత్రాలకు బాధ్యత వహిస్తాడు, పురపాలక సంఘ కార్యకలాపాలను నిర్వహించడంలో అధ్యక్షునికి సహాయ, సహకారాలను అందజేస్తాడు.

కమీషనర్ అధికారాలు, విధులు క్రింద వివరించడం జరిగింది.

- పన్నులు, ఇతర విత్త వనరులను వసూలు చేయడం.
- రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షణలో మునిసిపల్ ఎన్నికలకు ఓటర్ల నమోదు,
- పురపాలక సంఘాన్ని వార్డులుగా విభజించుటకు ప్రతిపాదనలను రూపొందించడం.

* రాష్ట్ర ఎన్నికల పర్యవేక్షణలో చైర్మన్, సభ్యుల ఎన్నికను నిర్వహించడం.
* వైస్-చైర్మన్, కాంట్రాక్టు, ప్యానల్ కమిటీల సభ్యుల ఎంపికలో చైర్మనుకు సహాయపడడం.
* కౌన్సిల్, కమిటీల సమావేశాలకు హాజరు కావడం.
* అన్ని అభివృద్ధి పథకాలను అమలు పరచడం.
* పట్టణ పేదరిక నిర్మూలన పథకాలను అమలుపరచడం.
* డిమాండు రిజిస్టర్ జారీ చేయడం.
* పారిశుధ్యం, నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు మొదలైన పౌరసౌకర్యాలను నిర్వహించడం.
* మార్కెట్లు, జంతువధశాలలు, పార్కులు, ఆటస్థలాలను నిర్వహించడం.
* స్మశానవాటికలను నిర్వహించడం.
* కౌన్సిల్, కమిటీలు ఆమోదించిన తీర్మానాలను అమలు పరచుటకు చర్యలు చేపట్టడం.
* సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలను చేపట్టడం.
* పురపాలక కార్యలయాన్ని, రికార్డులను భద్రపరచడం.
* వార్షిక పాలనా నివేదికను తయారు చేయడం.
* అనధికార నిర్మాణాలను, ప్రకటన బోర్డులను, కబ్జాలను తొలగించడం, భవన నిర్మాణాలకు ఆమోదం జారీచేయడం,
* భవన నిర్మాణ లే అవుట్లను ఆమోదించడం.
* జనన, మరణాలను నమోదు చేసుకోవడం, జనన మరణ సర్టిఫికెట్లను జారీచేయడం.
* ఆస్థిపన్ను అంచనా వేయడం.
* బడ్జెట్ తయారు చేయడం.
* పన్నులు, ఫీజులు, అద్దెవిలువల నిర్ధారణకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేయడం.
* పన్నులను వసూలు చేయుటకు చర్యలు చేపట్టడం.
* అన్ని వినోద ప్రదేశాలను తనిఖీచేయడం.
* కల్తీ ఆహార నిరోధక చట్టానికి సంబంధించిన పనులను చూడటం.
* పన్నులు చెల్లించని, చట్టాన్ని అతిక్రమించిన వారిని విచారించి వారిపై చర్యలు చేపట్టడం.

మునిసిపల్ కమీషనరు విధినిర్వహణలో మునిసిపల్ ఇంజనీరు, మునిసిపల్ ఆరోగ్య అధికారి, టౌన్ ప్లానింగ్ అధికారి, రెవెన్యూ ఆఫీసరు, మేనేజరు, ఇతర సిబ్బంది సహాయపడుతారు.

## 7.6 రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ :

స్థానిక సంస్థల స్వయం ప్రతిపత్తిని, అవసరమైనంతమేరకు రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ, అదుపుతో సమన్వయపరచడం ఒక ముఖ్య విషయము. స్థానిక ప్రభుత్వాలు అందచేసే సేవలలో కనీసస్థాయి ప్రమాణాలను పాటించడం అవసరం. ఆ విధంగా జరిగేటట్లు పై స్థాయి ప్రభుత్వం చూడాలి. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు, రుణాల రూపంలో చెప్పుకోదగినంత ఆర్థిక సహాయాన్ని స్థానిక సంస్థలకు అందచేయాలి. ఈ నిధులను ఏ ప్రయోజనాల కొరకు ఉద్దేశించారో అందుకొరకే ఖర్చు అయ్యేటట్లు చూడవలసిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నది. అధికార దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉంది. ఈ విషయాలన్నింటి దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలపై నియంత్రణను కలిగి ఉండడం అవసరమౌతుంది. ఆంధ్రప్రదేశ్లోని పురపాలక సంఘాలపై రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రకాలైన నియంత్రణ పద్ధతులను కలిగి ఉన్నది. అవి :

* పురపాలక సంఘాల పాలనకు నియమ నిబంధనలు రూపొందించే అధికారం.
* పాలనా మరియు ఆడిట్ నియంత్రణ
* స్థానిక కౌన్సిల్ కార్యకలాపాలపై నియంత్రణ
* పురపాలక కౌన్సిల్ను రద్దుచేసే అధికారం

## 7.7 నూతన పోకడలు :

పట్టణ స్థానిక సంస్థలకు 74వ రాజ్యాంగ సవరణ రాజ్యాంగ హోదాను కల్పించింది. ఈ చట్టం అణగారిన వర్గాలకు, మహిళలకు పురపాలక సంఘ వ్యవస్థలో ప్రాతినిధ్యాన్ని కల్పించడం జరిగింది. ఈ చట్టం పురపాలక సంఘాల విధుల పరిధిని పెంచడంతోపాటుగా, వాటి ఆర్థిక వనరులను మెరుగు పరచడం ద్వారా వాటి సామర్థ్యాన్ని మెరుగుపరుచుటకు ఉద్దేశించింది. రాజ్యాంగ 74వ సవరణ చట్టం రూపొందించిన తరువాత పట్టణ స్థానిక సంస్థలను పటిష్టపరచుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివిధ రకాల సంస్కరణలను ప్రారంభించింది. ఈ సంస్కరణలలో పన్నుల సంస్కరణలు, ఆదాయ మార్గాలను మెరుగుపరచడం, ఎలక్ట్రానిక్ పాలనను ప్రవేశ పెట్టడం మొదలైనవి ముఖ్యమైన చర్యలు. భవిష్యత్ అవసరాలను ఎదుర్కొనుటకు ఈ చర్యలను పటిష్ఠపరచి, విస్తరించవలసిన అవసరం ఉన్నది. వికేంద్రీకరణ, ప్రజల స్థానిక సంస్థలను పటిష్ఠపరచుటకు చాలా ముఖ్యం. పురపాలక భాగస్వామ్యం, పారదర్శకత్వం, జవాబుదారీతనం స్వభావాన్ని కలిగిన కొన్ని సేవలను, మానవ, ఆర్థిక వనరుల పరిమితుల దృష్ట్యా ప్రైవేటీకరణ చేయవచ్చును.

రాష్ట్రంలో ముప్పై రెండు మొదటి తరగతి పట్టణాలు పేదల కొరకు ఆంధ్రప్రదేశ్ పట్టణ సేవల పథకాన్ని అమలుపరుస్తున్నాయి. ఈ పథకాన్ని బ్రిటీషు ప్రభుత్వం అంతర్జాతీయ అభివృద్ధి శాఖ పట్టణ ప్రాంతాలలో పేదరికాన్ని తగ్గించుటకు 750 కోట్ల రూపాయల నిధులను కేటాయించడం జరిగింది. ఈ పథకం ముఖ్య లక్ష్యాలు పురపాలక సామర్థ్యాన్ని మెరుగు పరచడం, పేదలు నివసించే ప్రాంతాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన మరియు పురపాలక నిర్ణయీకరణలో పౌరసమాజ భాగస్వామ్యాన్ని పటిష్టపరచడం. ప్రతీ పురపాలక సంఘం చురకైన భాగస్వామ్యంతో పేదరికాన్ని తగ్గించుటకు పురపాలక కార్యచరణ ప్రణాళికను తయారు చేయాలి. ప్రణాళికీకరణ,

అకౌంటింగ్ వంటి విత్త విషయాలు, ఆస్తుల నిర్వహణ, సంస్థాగత అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మొదలగు రంగాలలో వివిధ రకాల సంస్కరణలను చేపట్టడం జరుగుతున్నది. ఈ సంస్కరణల ఆధారంగా వాటి అనుభవాన్ని పరిశీలించి, సంస్కరణలను రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాలకు విస్తరింప చేయవచ్చును.

ఆంధ్రప్రదేశ్ పట్టణ జానాభాలో పెరుగుదలను కలిగిఉన్నది. 2020 నాటికి రాష్ట్ర జనాభాలో సగం జనాభా పట్టణ ప్రాంతాలలో నివశిస్తారని అంచనాలు తెలియచేస్తున్నాయి. ఈ పరిస్థితి కారణంగా పురపాలక సంఘాల సామర్థ్యాన్ని రాబోవు దశాబ్దాలలో ఎదురయ్యే అవసరాలను, సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొనుటకు మెరుగు పరచడం సత్వరం చర్యలు చేపట్టవలసిన అవసరం ఉన్నది.

## 7.8 నగరపాలక సంస్థల విధులు :

కార్పొరేషన్ నిర్వహించే విధులను రెండు తరగతులుగా విభజించవచ్చు. అవి :

1. ప్రాథమిక విధులు,

2. విచక్షణ విధులు.

కార్పొరేషన్ తప్పనిసరిగా నిర్వహించవలసిన విధులు ప్రాథమిక విధులని, కార్పొరేషన్ ఇష్టానుసారంగా ఎంపిక చేసుకొని వనరుల లభ్యతను బట్టి నిర్వహించే విధులు విచక్షణ విధులని అంటారు.

చట్టం 26 ప్రాథమిక విధుల జాబితాను ప్రకటించింది. నగర సరిహద్దులను నిర్ణయించడం లేదా మార్చడం, వీధులను శుభ్రపరచటం, వీధులకు పేర్లు పెట్టడం, మురికి కాలువలను శుభ్రపరచడం, నిర్మించడం, మరుగుదొడ్ల నిర్మాణం, పరిశుభ్రంగా ఉంచడం, వాణిజ్య కార్యక్రమాలను నియంత్రించడం, జనన, మరణ లెక్కలను నమోదు చేయడం, వీధులలో అతిక్రమణలను తొలగించడం, అంటువ్యాధులు సోకకుండా చర్యలు చేపట్టడం, ఆహ్లాదానికి ఉద్యానవనాలను, ఆట స్థలాలను ఏర్పాటు చేయడం మొదలైన విధులు ఈ జాబితాలో ఉన్నాయి.

ఈ చట్టం 40 విచక్షణాత్మక విధుల జాబితాను కూడా ప్రకటించింది. మానసిక, శారీరక వికలాంగులకు, రోగులకు సంస్థలను ఏర్పాటు చేసి నిర్వహించడం, ప్రసూతి గృహాల నిర్వహణ, స్విమ్మింగ్ పూల్స్, స్నానపు గదులను నిర్వహించడం, రహదారుల ప్రక్కన చెట్లను నాటడం, విశ్రాంతి గృహాలను నియంత్రించడం, విద్యాసంస్థలకు గ్రాంట్లు ఇవ్వడం, లైబ్రరీలకు, ఆర్ట్ గ్యాలరీలకు సహాయాన్ని అందించడం, అనాధలకు ఆశ్రయం కల్పించడం, పార్కింగ్ స్థలాలు కల్పించడం, ప్రజా భద్రతారోగ్యాన్ని అభివృద్ధి పరచుటకు చర్యలు చేపట్టడం మొదలైన అంశాలు ఈ జాబితాలో ఉన్నాయి. కార్పొరేషన్ పౌర సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించుటకు ఈ క్రింది విధులను చేపడుతున్నది.

* పరిసరాల పరిరక్షణ, వ్యర్థ పదార్థాల తొలగింపు
* మలేరియా నియంత్రణ,
* జంతు వధశాలలు, స్మశానవాటికలు నిర్వహించడం
* జనన, మరణాలను నమోదు, ఇతర ముఖ్యమైన గణాంకాలు రూపొందించడం
* కలుషిత ఆహారాన్ని నిరోధించడం,

* ఆరోగ్య భద్రతకు చర్యలు చేపట్టి అంటువ్యాధులను నిరోధించడం,
* చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలకు అవసరమైన సేవలను అందించడం,
* రోడ్లు, కల్వర్ట్స్, నాలాలు, ఫ్లయ్ ఓవర్స్ వంటి వంతెనలను నిర్మించడం,
* జన రద్దీని తొలగించుటకు, రవాణా సౌకర్యాలు ప్రజలకు కల్పించుటకు చర్యలు చేపట్టడం,
* వరద కాలువలు, డ్రైనేజీలను నియంత్రించడం,
* పార్కులను, ఆటస్థలాలను ఏర్పాటు చేయడం, చెట్లను నాటడం, వాననీరు సంరక్షణ,
* పట్టణ ప్రణాళికీకరణ–జోన్ల ఏర్పాటు, కట్టడాలను నియంత్రించడం,
* మురికివాడలను అభివృద్ధి పరచడం, సమాజాభివృద్ధికి చర్యలు చేపట్టడం,

దేశంలోని పట్టణ స్థానిక సంస్థలకు 74వ రాజ్యాంగ సవరణ చట్టంలోని 12వ షెడ్యూల్ కింద 18 విధులను కేటాయించింది. ఈ విధులను ఒకసారి పరిశీలిస్తే.

నీటి సరఫరా, అగ్నిమాపక సేవలను తప్పించి అన్ని విధులకు నగరపాలక సంస్థ బాధ్యత వహిస్తుంటుందని తెలుస్తుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు నీటి సరఫరాను, డైరెక్టరేట్ ఆఫ్ ఫైర్ సర్వీసులు అగ్నిమాపక సేవలను హైదరాబాద్ నగరానికి అందిస్తాయి. నగరపాలక సంస్థ మరియు ఇతర సంస్థలు ఉమ్మడిగా కొన్ని విధులు నిర్వహిస్తాయి. ఉదాహరణకు పట్టణ అడవుల పెంపకాన్ని హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ నగర అభివృద్ధి సంస్థ సంయుక్తంగా చేపడుతున్నాయి.

## 7.9 అధికారిక సంస్థలు :

మున్సిపల్ అధికారిక సంస్థలు, ఎన్నికల పద్ధతి, కార్పొరేషన్ విధులు, కమిటీ పద్ధతి, అధికారులు, ఆర్థిక వనరులు, పన్నుల విధానం, నియంత్రణ యంత్రాంగం మొదలైన వాటి గురించి హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1955 వివరిస్తుంది. నగరపాలనను నిర్వహించుటకు చట్టం క్రింది అధికారిక సంస్థల జాబితాను పేర్కొన్నది.

* మేయర్, ఎంపికైన, పదవిరీత్యా సభ్యులతో కూడిన కార్పొరేషన్
* వార్డు కమిటీల చైర్మన్లతో కూడిన స్థాయీ సంఘం
* మునిసిపల్ కమీషనర్
* వార్డు కమిటీలు.

నగర ప్రభుత్వ విధాన రూపకల్పన, అమలు విషయంలో ఈ సంస్థలు ముఖ్యపాత్రను పోషిస్తాయి. కార్పొరేషన్ స్థాయీ సంఘం విధాన రూపకల్పనపై దృష్టిని కేంద్రీకరిస్తే, కమీషనర్ కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాలను అమలుపరుస్తారు. అయితే ఆచరణలో ఈ విధులలో అతివ్యాప్తికి అవకాశం ఉన్నది. హైదరాబాద్ నగర పాలనలో వివిధ అధికారిక సంస్థల విధులను, అధికారాలను అధ్యయనం చేయడం, నగరపాలనలో వాటి పాత్రను అర్థం చేసుకొనుటకు ఉపయోగపడుతుంది. అందువలన ఈ సంస్థల వ్యవస్థీకరణను, పనిచేసే పద్ధతిని చర్చిద్దాం.

### 7.9.1 మేయరు :

నగర ప్రథమ పౌరుడు మేయరు. ఇతను హోదాను, గౌరవాన్ని కలిగి ఉంటాడు. నగర పాలనలో మేయరు పదవి లాంఛనప్రాయమైన ప్రాముఖ్యతను మాత్రమే కలిగి ఉంటుంది. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం నగర ఓటర్లు అందరూ ఐదు సంవత్సరాల కొరకు ప్రత్యేకంగా మేయరును ఎన్నుకొంటారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన వర్గాలు, మహిళా అభ్యర్థులకు మేయరు పదవిని చేపట్టే అవకాశాన్ని చట్టం కల్పిస్తుంది. రాష్ట్రంలోని మొత్తం ఏడు కార్పొరేషన్లలో గల జనాభా ప్రాతిపదికన రాష్ట్ర స్థాయిలో ఈ రిజర్వేషన్లను నిర్ధారించడం జరుగుతున్నది. మేయరు పదవిని తొలగించే పద్ధతి గురించి చట్టంలో వివరించలేదు. అయితే కార్పొరేషన్కు లిఖిత పూర్వకంగా నోటీసు ఇచ్చి మేయరు తన పదవికి రాజీనామాను చేయవచ్చు. కౌన్సిల్ సమావేశాలకు మేయరు అధ్యక్షత వహిస్తాడు. నగరాన్ని సందర్శించే ప్రముఖులకు, విదేశీ ప్రముఖులకు ఏర్పాటు చేసే పౌర సన్మాన కార్యక్రమాలకు మేయరు అధ్యక్షత వహించడం సంప్రదాయకంగా ఉన్నది. మేయరు పౌరులను కలుసుకొని వారి నుండి విజ్ఞాపన పత్రాలను స్వీకరించడం, నగరంలో చేపడుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించడం చేస్తాడు. ప్రతి నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయరు పదవిని కలిగి ఉంది. నగర కౌన్సిలర్స్ వారి నుండి ఒకరిని డిప్యూటీ మేయరుగా ఎన్నుకుంటారు. మేయరు లేని సమయంలో మేయరు బాధ్యతలను డిప్యూటీ మేయరు నిర్వహిస్తాడు. నగరపాలనలో మేయరు పాత్ర పరిమితమైనదిగా చెప్పాలి.

### 7.9.2 కార్పొరేషన్ కౌన్సిల్ :

ప్రజా ప్రాతినిధ్యం కలిగిన స్థానిక ప్రభుత్వంలో ఎన్నికైన సభ్యులతో కూడిన కౌన్సిల్కు అధిక ప్రాధాన్యత ఉన్నది. సమర్థవంతమైన, పటిష్టమైన నగరపాలనను అందించడం కొరకు విధాన నిర్ణయం చేసే సంస్థగా కౌన్సిల్ ముఖ్య బాధ్యత కలిగి ఉన్నది. పౌరుల సంతోషం, ఆరోగ్యంపై కార్పొరేషన్ చర్యలు ప్రభావం చూపుతుండడం వలన కౌన్సిల్ విధాన రూపకల్పనలో, వాటిని అమలుపరచడంలో కౌన్సిల్ పాత్ర ప్రత్యేకతను కలిగి ఉన్నది. పౌరులకు, ప్రజలకు దగ్గర సంబంధం కలిగి ఉండడం వలన పౌర పాలనలోని తప్పిదాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొని రావడానికి ఒక వేదికగా కౌన్సిల్ పనిచేస్తున్నది. ఇప్పుడు కార్పొరేషన్ కూర్పు, విధులు, పనిచేసే విధానాన్ని గూర్చి తెలుసుకుందాం.

**కార్పొరేషన్ కూర్పు :**

ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్లలో ఎన్నికైన సభ్యుల సంఖ్య భిన్నంగా ఉంటుంది. హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం 1955 ప్రకారం హైదరాబాద్ కార్పొరేషన్లో మొత్తం 100 మంది సభ్యులు. ఎన్నిక కొరకు నగరాన్ని వివిధ వార్డులుగా విభజిస్తారు. ప్రతివార్డు నుండి ఒక సభ్యుడు ఎన్నుకోబడతారు. కార్పొరేషన్కు ఒక వ్యక్తి ఎన్నిక కావడానికి ఏవార్డులోనైనా అతను తన పేరును నమోదు చేసుకొని ఉండాలి. అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలకు తగ్గకుండా ఉండాలి. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన వర్గాలు, మహిళలకు నిర్దేశించిన నియమాల ప్రకారం రిజర్వేషన్ కల్పించబడుతుంది. రాజ్యాంగ 74వ సవరణ చట్టం షెడ్యూల్డు కులాలు, తెగలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం, వెనుకబడిన వర్గాలకు మూడింట ఒక వంతు సభ్యుల సంఖ్యను రిజర్వేషన్ చేయడం జరిగింది. అన్ని వర్గాల నుండి మూడింట ఒకవంతు మహిళలకు రిజర్వేషన్ కల్పించడం జరిగింది.

**1) అనర్హతలు :**

కార్పొరేషన్కు ఎంపిక కావడానికి, ఎంపిక అయిన తరువాత సభ్యుడిగా కొనసాగడానికి వివిధ అనర్హతలను కూడా నిర్ధేశించడం జరిగింది. అవి :

a) ఇద్దరి కన్నా ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండడం,

b) దివాళా తీయడం

c) ప్రభుత్వంలో లాభదాయకమైన పదవిని కలిగి ఉండడం

వంటి లక్షణాలు కార్పొరేషన్ సభ్యుడిగా ఎన్నిక కావడానికి, పదవిలో కొనసాగడానికి అనర్హతలు.

రాజకీయ పార్టీల ప్రాతిపదికగా కార్పొరేషన్కు ఎన్నికలు జరుగుతాయి.

**2) పదవిరీత్యా సభ్యులు :**

ఎన్నికైన సభ్యులతో పాటుగా, పదవి రీత్యా క్రింది వ్యక్తులు కూడా కార్పొరేషన్లో సభ్యత్వాన్ని పొందుతారు.

1. కార్పొరేషన్ పరిధిలో గల వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర శాసనసభ్యులు,
2. కార్పొరేషన్ పరిధిలో గల వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ సభ్యులు,
3. మునిసిపల్ కార్పొరేషన్లో పేరును నమోదు చేసుకొని, రాజ్యసభ సభ్యుడుగా ఎంపికైనారు.

ఈ విధంగా తమ పదవి రీత్యా కార్పొరేషన్లో సభ్యత్వాన్ని పొందిన సభ్యులు ఎన్నికైన సభ్యులతో సమానమైన హోదాను కలిగి, ఓటు చేసే అధికారాన్ని కూడా కలిగి ఉంటారు.

**3) కో – ఆప్షన్ సభ్యులు :**

క్రింది పేర్కొన్న సభ్యులకు కూడా కార్పొరేషన్లో సభ్యత్వం లభిస్తుంది.

a) మునిసిపల్ పాలనలో అనుభవం, ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన ఐదు మంది వ్యక్తులు
b) మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకున్న మైనారిటీ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు.

పై విధంగా కో–ఆప్ట్ అయిన సభ్యులు కార్పొరేషన్ సమావేశాలు, చర్చలలో పాలు పంచుకోవచ్చును కాని వారికి ఓటు వేసే హక్కు ఉండదు. కార్పొరేషన్కు వివిధ రంగాలలో అనుభవాన్ని, నిపుణతను అందించుటకు వీరి సభ్యత్వం ఉపయోగపడుతుంది. కార్పొరేషన్ విధానాలను రూపొందించుటకు, నిర్ణాయాలను తీసుకొనుటకు ఇది ఎంతగానో సహాయపడుతుంది.

**4) కాలపరిమితి :**

కార్పొరేషన్ కాలపరిమితి ఐదు సంవత్సరాలు. రాజ్యాంగం 74వ సవరణ చట్టం ప్రకారం ఐదు సంవత్సరాల కాలపరిమితి పూర్తికావడానికి ముందుగా ఎన్నికలను జరిపించాలి. ఒకవేళ కార్పొరేషన్ రద్దు చేయబడితే రద్దు

చేయబడిన తేదీకి ఆరు నెలల లోపల ఎన్నికలను జరిపింపవలయును. ఈ విధమైన నిబంధన వలన రాష్ట్ర ప్రభుత్వానికి ఆరు నెలలకు మించి కార్పొరేషన్ రద్దు కాలాన్ని పొడగించుటకు అవకాశం లేదు. ఈవిధంగా రద్దు చేయబడిన కార్పొరేషన్కు ఎన్నిక జరిపిన తరువాత, కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ కేవలం రద్దు చేయబడిన కార్పొరేషన్ ఎంతకాలాన్ని మిగిలి ఉందో అంతకాలమే అధికారంలో ఉంటుంది. కాని, పూర్తి ఐదు సంవత్సరాల కాలం అధికారంలో కొనసాగదు.

ప్రాతినిధ్య సంస్థగా నగరపాలక సంస్థ తరచూ సమావేశమై నగర పాలన సమస్యలను చర్చిస్తుంది. ఇది చట్టం ప్రకారం ప్రతినెలలో రెండుసార్లు కార్పొరేషన్ తప్పక సమావేశం కావాలి. ఈ సమావేశానికి మేయరు ప్రదేశాన్ని సమయాన్ని నిర్దేశిస్తాడు. సాధారణంగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాలకు మేయరు అధ్యక్షత వహిస్తాడు. ఒకవేళ మేయరు హాజరు కాని పక్షంలో డిప్యూటీ మేయరు ఇతను కూడా హాజరు కాకపోతే స్థాయీ సంఘ ఛైర్మన్ కౌన్సిల్ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.

### 7.9.3 కార్పొరేషన్ అధికారాలు, విధులు :

నగరపాలక సంస్థ అధికారాలను శాసనసంబంధమైన, ఆర్థిక, పర్యవేక్షణ, పాలన మొదలైనవిగా వర్గీకరించ వచ్చును. వీటిని ఇప్పుడు వివరంగా పరిశీలిస్తాం.

**1) శాసన సంబంధమైన అధికారాలు, విధులు :**

క్రమబద్ధమైన నగరపాలన నిర్వహణ కోసం కార్పొరేషన్ బైలాసు, నియమాలను రూపొందించే అధికారాన్ని కలిగి ఉన్నది. ప్రత్యేకమైన, తాత్కాలికమైన కమిటీలను నియామకం చేస్తుంది. స్థాయీ సంఘం తీసుకున్న చర్యలకు సంబంధించి ముఖ్య అంశాలను కోరుతుంది. కమీషనరును ప్రణాళిక దస్తావేజులను సమర్పించమని అడిగే అధికారాన్ని కలిగి ఉన్నది. కమిటీల పనిని పర్యవేక్షించడం, కార్పొరేషన్ వివిధ కమిటీలకు సభ్యులను నియమించడం, అధికారాన్ని కలిగి ఉన్నది. తాత్కాలిక మరియు ప్రత్యేక కమిటీ చర్యలను నియంత్రించడం, ఆ కమిటీలు, కమిటీలుతీసుకున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని కోరడంతో పాటుగా అవి తీసుకున్న కొన్ని నిర్ణయాలను పునః సమీక్షించమని కోరడంలాంటి అధికారాలను నగరపాలక సంస్థ కౌన్సిల్ కలిగి ఉన్నది.

**2) ఆర్థిక సంబంధమైన విధులు :**

భవన నిర్మాణాలు, వాహనాలు, ప్రకటనలు మొదలైన వాటిపై పన్నులను విధించడం, పన్నులు, సుంకాల రేట్లను నిర్ణయించడం, కార్పొరేషన్ ఖర్చుకు నిధులను జారీచేయడం వంటి అధికారాలను కార్పొరేషన్ కలిగి ఉన్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులను పొందే అధికారాన్ని కలిగి ఉంటుంది. స్థాయీ సంఘం సమర్పించిన బడ్జెట్ అంచనాలను పరిశీలించి ఆ సంవత్సరం ఆదాయ వ్యయాలను సవరిస్తుంది. యాభై లక్షల అంచనాకు మించిన ఏదైనా పనులకు కార్పొరేషన్ ఆమోదం తెలిపి ఆమోదం కొరకు ప్రభుత్వానికి సమర్పిస్తుంది. స్థిర, చర ఆస్తులను కార్పొరేషన్ సముపార్జించుకొని, నిల్వ చేసుకొనవచ్చును. కౌన్సిల్ తన చర్యలలో నిధుల సేకరణ విషయంలోను, వివిధ పౌర సౌకర్యాల కొరకు నిధుల కేటాయింపు విషయంలోనూ కార్యనిర్వాహక శాఖ పనిని సమీక్షిస్తుంది. నగరంలోని పన్ను చెల్లింపుదారుల ప్రయోజనాలను కాపాడే బాధ్యతను కార్పొరేషన్ కలిగి

ఉండి, నగర ప్రభుత్వ ఆర్థిక వనరులను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉంటుంది. ఈ విషయంలో అప్పుడప్పుడు కార్యనిర్వాహక శాఖకు అవసరమైన ఉత్తర్వులను కార్పొరేషన్ జారీ చేస్తుంది.

### 3) పరిపాలక విధులు :

ప్రజాప్రానిధ్య ప్రభుత్వంలో కార్యనిర్వాహక శాఖ, ప్రజా ప్రతినిధులకు బాధ్యత వహించడం ఒక ప్రముఖ లక్షణంగా కనిపిస్తుంది. కార్పొరేషన్ కౌన్సిల్ వివిధ విషయాలపై పర్యవేక్షణ జరపడం, కార్యనిర్వాహక శాఖల అదుపు, వివిధ కమిటీల పనితీరును పర్యవేక్షించడం అనే బాధ్యతను కలిగి ఉంటుంది. క్రమబద్ధం చేయడం, అవసరమైన సమాచారాన్ని లభింపచేయమని కోరడం, కొన్ని సందర్భాలలో కమిటీల నిర్ణయాలను పునఃపరిశీలన చేయడం మొదలైన పద్ధతులలో కౌన్సిల్ వివిధ కమిటీలపై తన పర్యవేక్షణాధికారాన్ని అమలుచేస్తుంది.

కార్యనిర్వాహక శాఖపై పర్యవేక్షణ విషయంలో కౌన్సిలు అనేక మార్గాలు ఉన్నాయి. కమీషనర్ (అతడు రాష్ట్ర ప్రభుత్వం నుండి డిప్యూటేషన్ మీద వచ్చిన అధికారి అయినప్పటికీ) కార్పొరేషన్ పూర్తి సమయం పనిచేసే అధికారిగా వుంటాడు. కమీషనర్ నగరపాలక సంస్థకు చెందిన పత్రాలను, ఉత్తర ప్రత్యుత్తరాలను, ప్రణాళికను లేక నివేదికలను కౌన్సిల్ ముందు ఉంచుతాడు. నగరపాలక సంస్థ కార్యనిర్వాహక అధిపతిగా, అతడు కౌన్సిల్లో లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసి ఉంటుంది. ఏదైనా అత్యవసర పరిస్థితిలో తాను తీసుకున్న చర్యలను గూర్చి అతడు కౌన్సిలు కు తెలియపరచి దాని ఆమోదాన్ని పొందాలి. క్రింద కారణాల వల్ల కమీషనర్ను తొలగించవలసిందని కౌన్సిల్ కోరవచ్చు.

- మునిసిపల్ చట్టం క్రింద కలిగివున్న విధులను నిర్వహించడంలో వైఫల్యం చెందిన లేక అధికారాలను అతిక్రమించినా,
- కార్పొరేషన్ లేక స్థాయీ సంఘం, కార్పొరేషన్కు చెందిన ఏ ఇతర కమిటీ నిర్ణయాలనైనా అమలుచేయడానికి నిరాకరించినప్పుడు
- కార్పొరేషన్ నిర్ణయాలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినప్పుడు

కమీషనరు తొలగించివలసిందని కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించి, తదుపరి చర్యకై ఆ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపిచవచ్చు. పైన తెలిపిన విషయాల వల్ల కౌన్సిల్ అధికారాలను గూర్చి కొంతవరకు తెలుసుకోగలిగాము. కాని కౌన్సిల్ నిరంతరం సమావేశం జరపడం దానిలోని సభ్యుల సంఖ్య దృష్ట్యా వీలుకాకపోవచ్చు. అందువల్ల చాలా నగరాలలో నగరపాలనలో పరిపాలన బాధ్యతను వహించడానికి వివిధ కమిటీలను నియమిస్తారు.

## 7.10 కమీషనర్ :

నగర లేదా పట్టణ పాలనలో రాజకీయాలను పరిపాలనా వ్యవస్థనుండి వేరుచేయడం ప్రముఖ లక్షణంగా కనిపిస్తుంది. నగర పాలనా వ్యవస్థను రాజకీయాలు–పాలన ద్విభాగత్వం ఆధారంగా నిర్మితం చేయబడుతుంది. అందువలన పరిపాలనా విభాగాన్ని రాజకీయ విభాగపు ఒత్తిడులు, ప్రభావాల నుండి రక్షించడానికి సంస్థాగతమైన ఏర్పాటు చేయబడ్డాయి.

భారతదేశ నగర కార్పోరేషన్లలో మునిసిపల్ కమిషనర్లు రాష్ట్ర ప్రభుత్వం నుండి డిప్యూటేషన్ పై వచ్చిన అధికారులు. మునిసిపల్ కమిషనర్లలో ఎక్కువ మంది అఖిల భారత సర్వీసులకు చెందినవారు ఉంటారు. వాస్తవానికి ముంబాయి మునిసిపల్ కమీషనర్ అక్కడి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో సమాన హెూదాను కలిగి ఉంటాడు. ఈ అధికారి తన విధులను నిర్భయంగా నిర్వర్తించడానికి వీలుగా అతని సర్వీసు నిబంధనలను, జీతభత్యాలను, కాలపరిమితిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. సంక్షోభాలకు దూరంగా ఉండడానికి, వాటి నుంచి ఈ అధికారులను రక్షించడానికి అవసరమైన చట్టబద్ధమైన ఏర్పాట్లు ఉన్నాయి. అదే సమయంలో ఎన్నుకోబడిన కౌన్సిలు ఈ అధికారులు జవాబుదారి వహించే విధంగా కూడా చట్టబద్ధమైన ఏర్పాట్లు ఉన్నాయి. ఈ అధికారులను తొలగించమని కౌన్సిల్ కోరవచ్చును. మునిసిపల్ కమీషనరు తొలగించమని కోరే తీర్మానాన్ని కౌన్సిల్ సమావేశంలో అధిక సంఖ్యాకసభ్యులు ఆమోదించాలి. విధుల నిర్వహణలో వైఫల్యం, అసమర్థత కారణంగా కమీషనర్ను తొలగించవలసిందిగా కౌన్సిల్ కోరవచ్చు.

### 7.10.1 విధులు :

హైదరాబాద్ కార్పోరేషన్ చట్టం ప్రకారం కార్పోరేషన్ కార్యనిర్వాహణాధికారాలను కమీషనర్ నిర్వహిస్తాడు. ఈ చట్టం కమీషనర్ను నగరపాలక సంస్థ అధికారులలో ఒకరిగా గుర్తించింది. ఇతను విస్తృతమైన అధికారాలను కలిగి ఉన్నాడు. కమీషనర్ అధికారాలను పరిపాలనా సంబంధమైన, ఆర్థిక సంబంధమైన, ఎన్నికలకు చెందిన, సలహాపూర్వక అధికారాలుగా విభజించవచ్చును. ఇతని అధికారాలను గూర్చి సంగ్రహంగా తెలుసుకోవడం ద్వారా నగరపాలనలో అతని స్థానాన్ని అర్థం చేసుకోగలము.

### 1) పాలన విధులు :

కార్పోరేషన్ ముఖ్యకార్యనిర్వాహణాధికారిగా కార్పొరేషన్ కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను చేసే బాధ్యతను కలిగి ఉంటాడు. నగర ప్రభుత్వ పాలనా అధిపతిగా కౌన్సిల్ ఆమోదించిన విధానాలను అమలు పరచే బాధ్యతను కలిగి ఉంటాడు. నగర పాలన వ్యవస్థలో వివిధ బాధ్యతలను నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు కమీషనర్ పర్యవేక్షణ కింద ఉంటారు. కార్పొరేషన్ సమర్థవంతమైన పౌరపాలనకు కమీషనర్ బాధ్యత వహిస్తాడు. ఒక నిపుణత కలిగిన పరిపాలకుడుగా కార్పొరేషన్కు, కార్పోరేషన్ కమిటీలకు, స్థాయీ సంఘానికి కూడా సలహాలను ఇస్తాడు. ఈ విధంగా కార్పొరేషన్ కౌన్సిలు ఒక స్నేహితునిగా, తాత్వికునిగా, మార్గదర్శకునిగా కమీషనర్ పనిచేస్తాడు.

### 2) ఆర్థిక విధులు :

కమీషనర్ కార్పొరేషన్ బడ్జెట్ను తయారుచేసే బాధ్యతను కమీషనర్ కలిగి ఉంటాడు. బడ్జెట్ను తొలుత స్థాయి సంఘానికి నివేదిస్తాడు. స్థాయి సంఘం సూచనల తర్వాత దానిని కౌన్సిల్ ఆమోదానికి సమర్పిస్తారు. ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా నగర పాలక సంస్థ నిధులను సవ్యంగా ఉపయోగించడానికి, బడ్జెట్ అమలు చేయడంలో సాధ్యమైనంత పొదుపును, సామర్థ్యాన్ని సాధించడానికి మునిసిపల్ కమీషనర్ బాధ్యత వహిస్తాడు.

## 7.11 నగరపాలక సంస్థ – ఆదాయ వ్యయాలు :

నగరపాలక సంస్థలు తమ ఆదాయాన్ని పన్నులు, నిర్దేశించిన ఆదాయాలు వినియోగదారుని నుండి వసూలు చేసిన చార్జీలు, ఫీజులు వినియోగదారులకు సేవలద్వారా అందించే ఆదాయం, గ్రాంట్లు, సేకరించిన చందాలు, ఇతర ఆదాయాలు. నగర పాలక సంస్థకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఆస్థిపన్ను ప్రధానమైన ఆదాయమార్గం. వినోదం పన్ను, వృత్తిపన్ను ప్రధానమైన ఆదాయాలు. సిబ్బంది జీతాలు, కార్యక్రమ అమలుకు ఉద్దేశింపబడిన మౌలిక సదుపాయాల కల్పన మరియు కొనసాగింపునకు అయ్యే ఖర్చులు, పాలనాపరమైన వ్యయం మొదలైనవి వ్యయాలు.

## 7.12 సారాంశం :

స్థానిక ప్రభుత్వ సంస్థలు రెండు లక్ష్యాలను కలిగి ఉన్నాయి. అవి ఒకటి పట్టణ సమాజానికి ప్రాథమిక సేవలను అందించడం, రెండు అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్య ప్రక్రియను పటిష్టపరచడం. ప్రజాస్వామ్య శిక్షణ కేంద్రాలుగా ఈ సంస్థలను భావించడం జరుగుతున్నది. మారుతున్న అవసరాలకు అనుగుణంగా చాలా మార్లు పురపాలక సంఘాల చట్టాన్ని సవరించడం జరిగింది. రాజ్యాంగ 74వ సవరణ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పురపాలక సంఘాల చట్టంలో మార్పులు ప్రవేశ పెట్టడం రాష్ట్ర పట్టణ స్థానిక సంస్థలను పటిష్ట పరచడంలో ఒక ముఖ్యమైన చర్య. పురపాలక సంఘాల విధుల పరిధి గత కొన్ని సంవత్సరాలుగా విస్తరిస్తున్నది. ఈ సంస్థలు అభివృద్ధి విధులు ముఖ్యంగా పేదరిక నిర్మూలనా కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నాయి. రాజకీయ అధికారాన్ని వికేంద్రీకరించే ఉద్దేశంలో పెద్ద నగరాలలో వార్డుల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగింది. పురపాలక సంఘాలు పన్నులు, గ్రాంట్లు, ఋణాలు మొదలైన వివిధ మార్గాలద్వారా ఆదాయాన్ని పొందుతాయి. ఈ సంస్థల వ్యయంలో జీతాలు, మౌలిక సదుపాయాలను కల్పించి నిర్వహించడం ప్రధానమైనవి. పురపాలక సంఘాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పురపాలక ఆర్థిక వనరులను పటిష్టపరుచుటకు చర్యలు చేపడుతున్నాయి. స్థానిక సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగినఉన్నప్పటికీ వీటిపై రాష్ట్ర ప్రభుత్వం వివిధ మార్గాల ద్వారా నియంత్రణను చెలాయిస్తున్నాయి.

## 7.13 ముఖ్య పదకోశం :

1. **పట్టణ స్థానిక సంస్థలు :**

   ఇవి మధ్యస్థ జనాభాతో పట్టణం లేదా నగరాన్ని పాలించే చిన్న స్థానిక సంస్థలు.

2. **పుర పాలక సంఘం :**

   పురపాలక సంఘం లేదా మున్సిపాలిటీ, భారతదేశంలో పట్టణాన్ని పరిపాలించే పరిపాలనా యంత్రాంగం.

3. **నగర పాలక సంస్థ :**

   ఇది ఒక మిలియన్ కంటే ఎక్కువ జనాభా ఉన్న పట్టణ ప్రాంతాల పరిపాలనను నిర్వహిస్తుంది.

4. **జిల్లా ప్రణాళిక కమిటి :**

ప్రతి జిల్లాలో కమిటీ జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు రూపొందించిన ప్రణాళికలను ఏకీకృతం చేసి జిల్లా అభివృద్ధి ప్రణాళిక ముసాయిదాను రూపొందిస్తుంది.

5. **మున్సిపల్ చైర్మెన్ :**

కౌన్సిల్, ప్రభుత్వం, అధికారుల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు అన్ని చైర్-పర్సన్ పేరుతో జరుగుతాయి.

6. **మున్సిపల్ కమీషనర్ :**

భారతదేశంలోని ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ కు పరిపాలనాపరంగా మున్సిపల్ కమీషనర్ నేతృత్వం వహిస్తారు.

7. **74వ రాజ్యాంగ సవరణ చట్టం :**

దీని ద్వారా రాజ్యాంగంలో 12వ షెడ్యూల్ ను చేర్చారు. ఇది మున్సిపాలిటీలకి సంబంధించింది.

## 7.14 స్వీయ మదింపు ప్రశ్నలు :

1. పట్టణ స్థానిక ప్రభుత్వాలు – చారిత్రక నేపథ్యం గురించి వ్రాయండి.
2. ఆంధ్రప్రదేశ్లోని మున్సిపాలిటీల నిర్మాణం, విధులను వివరించండి.
3. నగరపాలక సంస్థ కమీషనర్ అధికారాలను, విధులను చర్చించండి.

## 7.15 ఉపయుక్త గ్రంథాలు :


1. యం. వెంకట రంగయ్య అండ్ యం. పట్టాభిరామ్ : లోకల్ గవర్నమెంట్ ఇన్ ఇండియా
2. యస్.ఆర్. మహేశ్వరి : లోకల్ గవర్నమెంట్ ఇన్ ఇండియా
3. టి. అప్పారావు : మునిసిపల్ కార్పొరేషన్స్ ఇన్ సౌత్ ఇండియా
4. పి. రామా రెడ్డి : మునిసిపల్ కార్పొరేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్
5. వై.వి. కృష్ణారావు అండ్ ఎ. బలరామ మూర్తి : ఆంధ్రప్రదేశ్ దర్శిని
6. వి. వెంకటరావు : ఎవల్యూషన్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఇన్ ఇండియా.
7. సి. రామా రెడ్డి : ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీస్ యాక్ట్, 1965


**డా. కె.వి.ఆర్. శ్రీనివాస్**

పాఠం - 8

# భారత రాజకీయాలపై భాష, మత, కుల మరియు ప్రాంతీయవాద ప్రభావము

## 8.0 లక్ష్యం :

భారత రాజకీయాలపై విభిన్న శక్తుల ప్రభావాన్ని పరిశీలించడం ఈ పాఠం లక్ష్యం. మన రాజకీయ వ్యవస్థపై భాష, మత, కుల, ప్రాంతీయ తత్వముల ప్రభావాన్ని తెలిపి, నివారణోపాయాలు సూచించడం.

## విషయసూచిక :


8.1 ఆర్థిక, సాంఘిక పరిణామాలు

8.2 భాషాతత్వం

8.3 మతతత్వం

8.4 కులతత్వం

8.5 ప్రాంతీయతత్వం

8.6 నివారణోపాయాలు

8.7 జాతీయ సమైక్యతా మండలి

8.8 సారాంశము

8.9 నమూనా ప్రశ్నలు

8.10 చదువదగిన గ్రంథాలు


## 8.1. ఆర్థిక, సాంఘిక పరిణామాలు :

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో పారిశ్రామికీకరణ చెప్పుకోదగినంతగా జరగలేదు. స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణకు ప్రాధాన్యత నిచ్చి, మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టారు. పారిశ్రామికీకరణ విద్య, రవాణా, సమాచారం, సాంకేతిక రంగాల్లో పలుమార్పులు తెచ్చింది.

వ్యవసాయ రంగంలో హరితవిప్లవం, ఎరువులు, ట్రాక్టర్లు, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల వినియోగం, కాలువ, నీటి పదుపాయాలు మొదలైనవి అనేక మార్పులు తీసుకువచ్చాయి. ఇవి మధ్య తరగతి కులాలను సంపన్న వర్గాలుగా మార్చడానికి ఉపయోగపడ్డాయి.

కుల, మత, ప్రాంత, స్త్రీ - పురుష తీవ్ర అసమానతలు ఏర్పడినాయి.

## 8.2. భాషాతత్వం :

భారత రాజకీయాలలో భాషావాదానికి చాలా ప్రాముఖ్యం ఉంది. బ్రిటిష్ పాలనా కాలంలో ఇంగ్లీష్ మనదేశ ప్రజలలో సమైక్య భావాన్ని పెంపొందించింది. ఆంగ్ల భాష పరభాష కాబట్టి దానిస్థానే భారతీయ భాషను ఒకదానిని అధికారభాషను చేయవలెనని తలంచినారు. రాజ్యాంగ పరిషత్ 343వ ప్రకరణం హిందీని అధికార భాషగా గుర్తించింది. అధికార కార్యకలాపాల కోసం ఇంగ్లీషు 15 సంవత్సరాల వరకు కొనసాగుతుందని ప్రకటించింది.

344వ ప్రకరణ ప్రకారం రాష్ట్రపతి ఒక అధికార భాషా సంఘాన్ని నియమించవచ్చు. ఇది దేశంలో వాడకంలో ఉన్న భాషలను పరిశీలించి, హిందీని క్రమేణా అధికార భాషగా రూపొందించడానికి, ఆంగ్ల భాష వాడకంపై విధించదగు పరిమితులు గూర్చి సిఫారస్‌లు చేయగలదు.

345వ ప్రకరణం రాష్ట్రాల్లో ఒక భాషను గాని ఒకటి కంటే ఎక్కువ అధికార భాషలను గాని గుర్తించవచ్చని పేర్కొన్నది. 346వ ప్రకరణ ననుసరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య లేదా రాష్ట్రాల మధ్య ఆంగ్లభాష వాడకంలో ఉండవచ్చు. ఒకవేళ రెండు అంతకన్నా ఎక్కువ రాష్ట్రాలు సమ్మతిస్తే హిందీని వాడుక భాషగా ఉపయోగించవచ్చు.

347వ ప్రకరణ ప్రకారం ఒక రాష్ట్రంలో అధిక సంఖ్యాకులు తాము వాడుతున్న భాషను అధికార భాషగా గుర్తించాలని రాష్ట్రపతికి నివేదిస్తే రాష్ట్రపతి దానిని అధికార భాషగా పరిగణించేందుకు తగిన ఆదేశాలు ఇవ్వవచ్చు.

348వ ప్రకరణ ప్రకారం సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టులలో, అధికారయుత న్యాయశాస్త్ర గ్రంథాలు, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లులు, రాజ్యాంగ సవరణలు, రాష్ట్రపతి, గవర్నర్లు జారీచేసే అత్యవసరపు చట్టాలు మొదలగునవి ఆంగ్లభాషలోనే ఉండవలె.

349వ ప్రకరణ ప్రకారం రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి 15 సంవత్సరాల్లో అధికారభాష సవరణ ప్రతిపాదనలు చేయరాదు.

350వ ప్రకరణ ప్రకారం ఒక వ్యక్తి తన బాధల నివారణకోసం కేంద్ర, రాష్ట్ర లేదా ఇతర అధికారులకు ఏ భాషలోనైనా విజ్ఞప్తి పత్రాన్ని సమర్పించవచ్చు. 350వ ప్రకరణ ప్రకారం ప్రతిరాష్ట్ర లేదా స్థానిక అల్ప సంఖ్యాకులు మాతృభాషలో ప్రాథమిక విద్య గరపడానికి తగు సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.

భాషా సమస్యపై దాదాపు ఏకగ్రీవంగా నిర్ణయం జరిగినప్పటికీ, హిందీయేతర రాష్ట్రాలకు మొదటి నుంచి కొన్ని అనుమానాలు లేకపోలేదు. అందువల్లనే కేంద్ర ప్రభుత్వం దీనిని అమలుపర్చడంలో ఇబ్బందుల నెదుర్కొన్నది. 1963లో పార్లమెంట్ అధికార భాషల చట్టాన్ని ఆమోదించింది. దీనిని 1967లో సవరించారు. దీనిని అనుసరించి హిందీని అధికార భాషగా అవలంబించని రాష్ట్రాల శాసనసభలు ఆంగ్లభాష కొనసాగించాలని తీర్మానించేటంతవరకున్నూ, పార్లమెంట్ ఉభయసభలు ఆ తీర్మానాన్ని ఆమోదించేటంతవరకూ అది కొనసాగుతూంది.

జాతీయ సమైక్యతను కాపాడటానికి రాష్ట్రాల విద్యాశాఖామంత్రులు త్రిభాషా సూత్రాన్ని రూపొందించారు.

1967లో తమిళనాడులో అధికారంలోకి వచ్చిన డి.యం.కె. హిందీని అధికార భాషగా ఆమోదించనని కేంద్రానికి తెల్పింది. 1986లో తమిళనాడు శాసనసభ చేసిన తీర్మానం ఆంగ్లాన్ని మాత్రమే అధికార భాషగా స్వీకరించాలని కేంద్రాన్ని కోరింది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు కూడా త్రిభాషా సూత్రాన్ని అమలుపరచలేదు.

సర్కారియా కమీషన్ కూడా త్రిభాషా సూత్రాన్ని అమలుపరచవలెనని సిఫారస్ చేసింది.

## 8.3 మతతత్వం :

ప్రపంచమంతటా మతం సమాజాలను సమైక్యపర్చడంలో గాని విచ్ఛిన్నం చేయడంలోగాని ముఖ్యభూమిక వహించింది. అది వేరుగా ఉన్న మనుషులను ఐక్యమొనర్చింది. అట్లే ఐక్యంగా ఉన్నవారిని విడదీసింది. భారతదేశ విభజన, రామజన్మభూమి వివాద సందర్భంలో మత మారణహోమం విదితమే.

భారత రాజ్యం లౌకికరాజ్యమైనా, సమాజం మాత్రం లౌకిక సమాజంగా ఇంకా పరివర్తన చెందలేదు. ఇందుకు మత ఛాందసవాదం అడ్డుపడుతోంది. ఈ మత ఛాందసవాదం ఈ క్రింది రూపాలలో వ్యక్తమవుతోంది.

### మత కలహాలు :

భారతదేశం అల్పసంఖ్యాకుల నిలయం గావడంలో, మతం సమస్య క్లిష్టమైనది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి తొమ్మిది వేలకు పైగా మత కల్లోలాలు సంభవించాయి. యదార్థానికి 1967 - 78 సంవత్సరాల మధ్య ప్రతి సంవత్సరం మతకలహాలు సంభవించాయి.

### శాఖా కలహాలు :

మత సంఘర్షణలే గాక శాఖా కలహాలూ లేకపోలేదు. ఉదాహరణకు షియా, సున్నీ సంఘర్షణకు లక్నో కేంద్రం కాన్పూరు, అమృతసర్‌లు కూడా శిక్కుల, నిరంకారీల సంఘర్షణ కేంద్రాలు. మేఘాలయ, త్రిపుర, మణిపూర్, మిజోరాంలలో కొండజాతుల వారికి, పల్లపు ప్రాంతాల వారికి సంఘర్షణ ఉంది.

### ప్రార్థనా మందిరాలను పడగొట్టటం, దహనం చేయుటం, బలవంతంగా ఆక్రమించడం :

ప్రార్థనా మందిరాలను పడగొట్టటం, దహనం చేయడం, బలవంతంగా ఆక్రమించడం మరొక వికృత చర్య. ఉదాహరణకు అరుణాచల్‌ప్రదేశ్‌లో కొన్ని చర్చిలను పడగొట్టారు. క్రైస్తవులను హింసించారు. 1979లో చర్చిలను శ్రీనగర్‌లో తగులబెట్టినారు. 1992 డిశంబరు 6న అయోధ్యలో బాబ్రీ మసీదును పడగొట్టడం మతోన్మాద చర్యకు పరాకాష్ఠయే. దేశ విభజన తర్వాత ఇంతటి ప్రాణ, ఆస్తినష్టం ఎన్నడూ జరగలేదు. ఇది లౌకిక వ్యవస్థకు మాయని మచ్చ అయింది.

### రాజకీయ కారణాలకు మతస్థలాలను దుర్వినియోగపర్చడం :

ప్రార్థనామందిరాలను రాజకీయ కారణాలకు ఉపయోగించడం మతతత్వపు మరియొక రూపం. దేవాలయాలు, గురుద్వారాలు, చర్చిలు, మసీదులు ఈ విధంగా రాజకీయ కార్యకలాపాలకు నిలయాలు కారాదు.

### భారతదేశంలో మతతత్వానికి ముఖ్యకారణాలు :

#### 1. చారిత్రక వారసత్వం :

మతతత్వానికి ముఖ్య కారణం చారిత్రక వారసత్వం. మనదేశంలో జాతీయోద్యమాభివృద్ధిని అణచి వేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం "విభజించి పాలించు" విధానాన్ని అవలంబించింది. అందుకు అల్పసంఖ్యాకులైన ముస్లింలను తమ సొంత విద్యా సంస్థలను నెలకొల్పుకోడానికి ప్రోత్సహించింది. 1906లో కరాచీలో ముస్లింలీగ్ అను రాజకీయ పార్టీని స్థాపించుకొన్నారు. 1909 చట్టం ప్రకారం ముస్లింలకు వేరే నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. చివరకు దేశ విభజనలో, లక్షలాది మంది హిందూ, ముస్లింలు మతకలహాలలో మరణించారు.

**2. మతపార్టీల, వ్యవస్థల ఉనికి :**

ముస్లింలీగ్, జమాయిత్-ఇ-ఇస్లామి, హిందూ మహాసభ, అకాలీదళ్ మొదలగు మతతత్వ పార్టీలు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, పతితపావన్ సంఘటన, విశ్వహిందూ పరిషత్ మొదలగు వ్యవస్థల ఉనికి కూడా మతతత్వానికి మరొక కారణమే. ఈ పక్షాలు మతతత్వాన్ని ప్రచారం చేసి, హింసను ప్రోత్సహించాయి.

బెనారస్ హిందూ యూనివర్సిటీ, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, అమృతసర్ ఖాల్సా కళాశాల, అనేక క్రైస్తవ కళాశాలలు కూడా మత దృక్పథాన్నే ప్రోత్సహిస్తాయి. ఇవి విద్యార్థులలో జాతీయ దృక్పథాన్ని గాక మత తత్వాన్ని వ్యాప్తి చేస్తాయి.

**3. మత మౌఢ్యం :**

హిందూ, ముస్లిం మతాలలో మతమౌఢ్య వాదులున్నారు. షాబాను వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు మతమౌఢ్య వాదులకు రుచించలేదు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వం కూడా వారికి తల ఒగ్గింది. అట్లే నరసింహారావు ప్రభుత్వం బాబ్రిమసీద్ పతనాన్ని నివారించలేకపోయింది. సల్మాన్ రష్డీ రచించిన 'సాతానిక్ వెర్సెస్' వివాద విషయంలో కూడా మతమౌఢ్యం వెర్రితలలు వేసింది.

ప్రార్థనా స్థలాలలో లౌడ్‌స్పీకర్లను వినియోగించడం సామాన్యమై పోయింది. ఇది ప్రజానీకానికి ఇబ్బంది కల్గించడమేగాక సాంఘిక ఉద్రిక్తతలకు తావునిచ్చింది.

భారతదేశంలో 1947లో ముస్లిం జనాభా 5.1 శాతం ఉండగా 1979లో 11.20 శాతం ఉన్నది. బంగ్లాదేశ్ నుంచి ముస్లింలు పశ్చిమ బెంగాల్, అస్సాం, ఉత్తర తూర్పు రాష్ట్రాలలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించడం, ముస్లింలు కుటుంబ నియంత్రణను పాటించకపోవడం, మత మార్పిడి మొదలగు కారణాల వలన భారతదేశంలో ముస్లిం జనాభా పెరిగింది.

కొన్నిసందర్భాలలో చట్టాన్ని అమలుపరచే ఏజన్సీ లేవి నిష్పాక్షికంగా వ్యవహరించడంలేదు. పోలీసులే అల్పసంఖ్యాకులపై దురాగతాలకు ఒడిగట్టిన సందర్భాలు ఉన్నాయి.

మతకలహాలను నివారించాలంటే - ప్రభుత్వ విధానాలలో తీవ్ర మార్పులు రావలసి ఉంటుంది. మతపరమైన రాజకీయ పక్షాలను, వ్యవస్థలను నిషేధించాలి. మతపరమైన అల్లరులను అదుపుచేసే బలగాలలో అల్పసంఖ్యాకులకు తగు రీతిలో ప్రాతినిధ్యం కల్పించాలి. అల్పసంఖ్యాకుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచవలె. 1988లో పార్లమెంట్ ఆమోదించిన చట్టప్రకారం మతాన్ని మతసంస్థలను రాజకీయ ప్రయోజనాలకు వినియోగించడాన్ని నిషేధించింది. ఇది సరియైన చర్యయే.

## 8.4. కులతత్వం :

భారత రాజకీయాలలో కులం ఇంకా ముఖ్యపాత్ర వహిస్తోంది. జాతీయ స్థాయిలో కంటే స్థానిక స్థాయిలో కులం అధిక పాత్ర వహిస్తోంది.

భారత సామాజిక వ్యవస్థ నిర్మాణం చాలావరకు కులవ్యవస్థ ప్రాతిపదిక, గుర్తింపుపై ఆధారపడి ఉంటుంది.

ప్రజాస్వామిక రాజకీయ విలువల, పద్ధతులకు అనుగుణంగా కులం సర్దుకుపోతూనే భారత ప్రజాస్వామిక వ్యవస్థలో కులం ఒక కేంద్ర అంశంగా ఉంటోందని ప్రొఫెసర్స్ రుడాల్ఫ్ చెప్పారు.

వయోజన ఓటింగ్‌ను ప్రవేశపెట్టడం వల్ల సాంఘికంగా, ఆర్థికంగా, అణగద్రొక్కబడిన వర్గాలు కూడా తమకు శక్తిగలదని గుర్తించాయి.

రాజకీయాలను ప్రభావితం చేసేది కులమొక్కటే కాదు. రాజకీయాలు సంఘీభావాన్ని అంతస్తుల మార్పును ప్రభావితం చేస్తాయి. ప్రొఫెసర్ మైకేల్ బ్రీచర్ అభిప్రాయాన్ని అనుసరించి, "కులం రాష్ట్ర స్థానిక రాజకీయాలలో ముఖ్యపాత్ర నిర్వహిస్తూ ఉండగా దేశస్థాయిలో రాజకీయాలలో దీని పాత్ర కొంచెంగానే ఉంది".

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో కులం ప్రబలమైన పాత్ర వహిస్తోంది. ఆంధ్ర రాజకీయాలు కమ్మ, రెడ్డి కులాల మధ్య పోరాటమే అని ప్రొఫెసర్ సెలిగ్ హారిసన్ అభిప్రాయం. ఇక్కడ కుల రాజకీయాల మరియొక ముఖ్య లక్షణం ప్రాంతీయ రాజకీయాలతో ముడిపడి ఉండటం. తెలంగాణా ఆంధ్రోందళనలు ఈ రాజకీయాల పర్యవసానాలే.

బీహార్ రాష్ట్రంలో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా శాసనసభ-మంత్రివర్గాలలో స్థానాలు పొందడానికి కాయస్థకులస్థులు పోటీపడుతున్నారు. మద్రాస్‌లో బ్రాహ్మణులకు బ్రహ్మణేతరులకు అధికారం కోసం పోటీ జరిగింది.

కాబట్టి రాష్ట్రాలలో ఆయా కులాలకు మధ్య పోటీయే మంత్రి పదవుల ఉద్యోగుల నియామకం మొదలగువాని పంపిణీలను నిర్ణయిస్తుంది.

రాజకీయాలలో కులం ప్రధానపాత్ర నిర్వహిస్తుందని చెప్పవచ్చు. కుల ప్రాతిపదికపై అభ్యర్థుల ఎంపిక, ఎన్నిక కూడా జరుగుతుంది కాబట్టి ఇది సమాజాభివృద్ధిని, దేశ సమైక్యతను కుంటుపరుస్తుంది.

## 8.5. ప్రాంతీయతత్వం :

ప్రాంతీయ తత్వం జాతీయ సమైక్యానికి ప్రబలమైన అవరోధమే. భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణం వలన ప్రాంతీయ తత్వం పెరిగిందని కొందరు భావించారు. ప్రాంతీయ తత్వం పెరిగిందని కొందరు భావించారు. ప్రాంతీయ తత్వం వివిధ రూపాలు ధరించింది. అవి :

1. భారత యూనియన్ నుంచి వేర్పాటును కోరడం. ఇందుకు ఉదాహరణగా ద్రవిడ మున్నేత్ర కజగాన్ని చెప్పవచ్చు. ద్రవిడ మున్నేత్ర కజగం కొంతకాలంపాటు ద్రవిడస్తాన్ నిర్మాణాన్ని డిమాండ్ చేసింది. నాగాలు కొందరు నాగాలాండ్ రాజ్య నిర్మాణాన్ని కోరుచున్నారు.
2. వేరే రాష్ట్రాన్ని ఏర్పాటు చేయమని కోరడం. 1956లో భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానంతరం ప్రత్యేక రాష్ట్రాల నిర్మాణం కోసం ఆందోళనలు సాగాయి.
3. అంతర్-రాష్ట్ర వివాదాలు : ఉదాహరణకు రాష్ట్రాలకు మధ్య సరిహద్దుల వివాదం, నదీ జలాల పంపిణీ వివాదాలు మొదలైనవి.

ఆర్థిక పారిశ్రామికాభివృద్ధి అన్ని ప్రాంతాలలో సమానంగా జరగకపోయినందువల్ల ప్రాంతీయ తత్వం పెరిగింది. వెనుకబడిన ప్రాంతాలలోని ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో, పరిశ్రమలను స్థాపించడంలో, ప్రాజెక్టుల నిర్మాణంలో కేంద్రం నిధులను అందించడంలో జరిగిన నిర్లక్ష్యాలకు గాను ఆందోళనలు సాగినాయని చెప్పవచ్చు.

## 8.6. నివారణోపాయాలు :

భారతదేశం పలు సమస్యలతో ఎదుర్కొంటున్నది. క్లుప్తంగా చెప్పాలంటే భాషా, మత, కుల, ప్రాంతీయ, వేర్పాటువాద తదితర సమస్యలు దేశాన్ని ముప్పిరి గొంటున్నాయి. నాయకత్వ సంక్షోభం ఉంది. రాజకీయ పక్షాలు, నాయకులు కుల, మత, భాషా వర్గాల్లోని భిన్నత్వాలను రెచ్చగొట్టే చర్యలకు పూనుకోరాదు. శాంతిభద్రతలకు హాని కల్గించే ఆందోళనలు, ప్రదర్శనలు, ఉద్యమాలు ప్రారంభించరాదు.

ఆయా ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించడానికి అనువుగా ప్రణాళికా విధానాన్ని రూపొందించడం అవసరం. అల్పసంఖ్యాక వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హామీని అమలుపర్చవలె. నిజానికి జాతీయ సమైక్యత సమస్యను ఒక్క భారతదేశమేగాక మూడో ప్రపంచదేశాలన్నీ ఎదుర్కొంటున్నాయి.

## 8.7. జాతీయ సమైక్యతా మండలి :

1961లో మొదటిసారిగా జాతీయ సమైక్యతా మండలిని ఏర్పాటు చేశారు. ఇందు 39 మంది సభ్యులుండినారు. ఇది రాజకీయ పార్టీలకు, పత్రికలకు, విద్యార్థులకు ప్రవర్తనా నియమావళిని రూపొందించింది. ఆ తర్వాత చైనాతో వచ్చిన యుద్ధ సమయంలో ప్రజలంతా ఒక త్రాటిపై నిలిచారు. దీనితో జాతీయ సమైక్యతా మండలి కార్యకలాపాలు తాత్కాలికంగా మరుగునపడ్డాయి.

1968లో జాతీయ సమైక్యతామండలి పునరుద్ధరించబడింది. ఇది 1969లో శ్రీనగర్‌లో సమావేశమైంది. అపుడు ఇందు 55 మంది సభ్యులుండినారు.

1980లో మరల జాతీయ సమైక్యతా మండలి పునరుద్ధరించబడింది. దీని చైర్మన్ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ. ఇందు 53 మంది సభ్యులుండినారు.

జాతీయ సమైక్యతా మండలి జాతీయ సమైక్యతా ప్రక్రియకు ఇంతవరకు దోహదపడలేదని చెప్పవలె.

జాతీయ సమైక్యతా మండలి పటిష్టవంతమైన పాత్ర నిర్వహించవలెనంటే, అది యదార్థంగా ప్రాతినిధ్య సంస్థయై, నిరంతర ప్రాతిపదికగా ఉండవలె.

## 8.8. సారాంశము :

స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో పారిశ్రామికీకరణ చెప్పుకోదగినంతగా జరగలేదు. స్వాతంత్ర్యానంతరం పారిశ్రామికీకరణకు ప్రాధాన్యతనిచ్చి, మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టారు. పారిశ్రామికీకరణ విద్య, రవాణా, సమాచారం, సాంకేతిక రంగాల్లో పలుమార్పులు తెచ్చింది. భారత రాజకీయాలలో భాషావాదానికి చాలా ప్రాముఖ్యం ఉంది. 1963లో పార్లమెంటు అధికార భాషల చట్టాన్ని ఆమోదించింది. దీనిని 1967లో సవరించారు. 1967లో తమిళనాడులో అధికారంలోకి వచ్చిన డి.యం.కె. హిందీని అధికార భాషగా ఆమోదించనని కేంద్రానికి తెల్పింది. 1986లో తమిళనాడు శాసనసభ చేసిన తీర్మానం ఆంగ్లాన్ని మాత్రమే అధికార భాషగా చేయాలని కేంద్రాన్ని కోరింది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాలు కూడా త్రిభాషా సూత్రాన్ని అమలుపరచలేదు. సర్కారియా కమీషన్ కూడా త్రిభాషా సూత్రాన్ని అమలుపరచవలెనని సిఫారసు చేసింది.

భారతరాజ్యం లౌకిక రాజ్యమైనా, సమాజం మాత్రం లౌకిక సమాజంగా ఇంకా పరివర్తన చెందలేదు. ఇందుకు మత ఛాందసవాదం అడ్డుపడుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి తొమ్మిది వేలకు పైగా మతకల్లోలాలు సంభవించాయి. ప్రార్థనా మందిరాలను పడగొట్టటం, దహనం చేయడం, బలవంతంగా ఆక్రమించడం మొదలయినవి మత ఛాందసవాదుల వికృత చర్యలు. దేవాలయాలు, గురుద్వారాలు, చర్చిలు, మసీదులు రాజకీయ కార్యకలాపాలకు నిలయాలు కారాదు. భారత రాజకీయాలలో కులం ఇంకా ముఖ్యపాత్ర వహిస్తోంది. భారత సామాజిక వ్యవస్థ నిర్మాణం చాలావరకు కులవ్యవస్థ ప్రాతిపదిక, గుర్తింపుపై ఆధారపడి ఉంటుంది. వయోజన ఓటింగును ప్రవేశపెట్టడం వల్ల సాంఘికంగా, ఆర్థికంగా, అట్టడుగున ఉన్న వర్గాలు కూడా తమకు శక్తిగలదని గుర్తించాయి.

ఆర్థిక పారిశ్రామికాభివృద్ధి అన్ని ప్రాంతాలలో సమానంగా జరగకపోయినందువలనే ప్రాంతీయతత్వం పెరిగింది. ప్రాంతీయతత్వం జాతీయ సమైక్యానికి ప్రబలమైన అవరోధమే. ద్రవిడమున్నేత్రకజగం కొంతకాలం పాటు ద్రవిడస్తాన్ నిర్మాణాన్ని డిమాండ్ చేసింది.

## 8.9. నమూనా ప్రశ్నలు :

1. భారత రాజకీయాలపై భాష, మత, కుల మరియు ప్రాంతీయవాద ప్రభావమును చర్చింపుము.
2. జాతీయ సమైక్యతకు గల అవరోధాలను చర్చించి పరిష్కార మార్గాలను సూచింపుము.

## లఘు ప్రశ్నలు :

1. జాతీయ సమైక్యతా మండలి
2. వేర్పాటువాదం

## 8.10. చదువదగిన గ్రంథాలు :

1. J.R. Siwach - Dynamics of Indian Govt. and Politics
2. J.C. Johari - Indian Govt. and Politics

- రాయిడి శేషయ్య

(1993లో స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్ కోర్సెస్ ప్రచురించిన పుస్తకం నుండి గ్రహించబడింది)

పాఠం - 9

# ఆర్థిక సంఘం

విషయసూచిక


9.0 లక్ష్యం

9.1 ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగ ప్రతిపత్తి

9.2 ఆర్థిక సంఘ విధులు

9.3 వివిధ ఆర్థిక సంఘాలు - వాటి సూచనలు

9.4 ఆర్థిక సంఘం - ఒక పరిశీలన

9.5 ఆర్థిక సంఘం - ప్రణాళికా సంఘం

9.6 మాదిరి ప్రశ్నలు

9.7 చదువదగిన గ్రంథాలు


## 9.0. లక్ష్యం :

ఈ పాఠంలో ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగ ప్రతిపత్తి, దాని నిర్మాణం, విధులు, వివిధ ఆర్థిక సంఘాలు చేసిన సూచనలు, ఆర్థిక సంఘం మరియు ప్రణాళికా సంఘానికి గల సంబంధం గురించి తెలుసుకుంటారు.

సమాఖ్యలో కేంద్ర రాష్ట్రాల మధ్య రాజకీయ, ఆర్థిక, పరిపాలనా అధికారాలు రాజ్యాంగ రీత్యా విభజింపబడి ఉంటాయనేది మనకు తెలిసిందే. ఇవి ఏ విధంగా ఉండాలనేది మన రాజ్యాంగంలో వివరింపబడింది. అయినప్పటికి వీటి విషయమై కేంద్ర - రాష్ట్రాల మధ్య తరచూ సమస్యలు తలెత్తుతూ ఉంటాయనేది కూడా మనకు విదితమే. దీనిని ఊహించే రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగ పరిధులకు లోబడి కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు సంబంధించిన స్వతంత్ర ప్రతిపత్తి గల ఆర్థిక సంఘ నిర్మాణానికి వీలు కల్పించారు.

## 9.1. ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగ ప్రతిపత్తి :

రాజ్యాంగములోని 280వ ప్రకరణననుసరించి, "రాజ్యాంగం అమలులోనికి వచ్చిన రెండు సం॥రాలు లోపుగా ఆ తర్వాత అయిదు సం॥రాల కొకసారి భారత రాష్ట్రపతి ఒక చైర్మన్ మరియు నలుగురు సభ్యులతో కూడిన ఆర్థిక సంఘాన్ని ఏర్పరచాలి".

ఆర్థిక సంఘ అధ్యక్షుడు, ఇతర సభ్యుల నియామకానికి చెందిన విధివిధానాలను రూపొందించే అధికారం రాజ్యాంగంలోని 280వ ప్రకరణ పార్లమెంటుకు అప్పగించింది. దీని ప్రకారం 1951లో ఆర్థిక సంఘ అధ్యక్షుడు, ఇతర సభ్యుల నియామకానికి కావలసిన అర్హతలు, సంఘం పనిచేసే తీరు నిర్దేశిస్తూ పార్లమెంటు ఒక చట్టాన్ని రూపొందించింది.

ప్రజా సంబంధాలలో నిష్ణాతులైన వారిని ఆర్థిక సంఘ అధ్యక్షుడిగా నియమించాలి. ఆర్థిక సంఘ సభ్యులుగా నియమింపబడటానికి ఈ క్రింది అర్హతలు అవసరం. ఎ) హైకోర్టు జడ్జీలుగా నియమింపబడటానికి అర్హులైనవారు, బి) ఆర్థిక లేదా ప్రభుత్వ విత్త వ్యవహారాలలో పరిజ్ఞానం కలవారు, సి) పరిపాలనలో విస్తృతానుభవం కలవారు.

పై పేర్కొన్న అర్హతలు ఆర్థిక సంఘం సజావుగా పనిచేయడానికి తోడ్పడతాయి. సభ్యుల కన్నా చైర్మన్ విస్తృత రంగాలలో అనుభవం కలవారైతే ఆర్థిక సంఘం పనితీరు మెరుగుగా ఉంటుంది.

కాని చైర్మన్ ప్రజా వ్యవహారాలలో నిష్ణాతులై ఉండాలని పేర్కొనడం వలన, కేంద్ర ప్రభుత్వం వారికి గల నైపుణ్యం, అనుభవాలను పరిగణనలోనికి తీసుకోకుండా కేవలం రాజకీయ పరంగానే చైర్మన్ మరియు సభ్యులను నియమించే అవకాశం ఏర్పడింది.

1,2 మరియు 5 ఆర్థిక సంఘాల అధ్యక్షులు కేంద్ర మంత్రులుగా పనిచేసి ఉన్నారు. నాల్గవ ఆర్థిక సంఘానికి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని అధ్యక్షునిగా నియమించారు. మూడవ ఆర్థిక సంఘానికి మాజీ కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను అధ్యక్షునిగా నియమించారు. కేంద్ర మంత్రులుగా పనిచేసిన వారికన్నా, రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులైతే ప్రజా వ్యవహారాలలో నిష్ణాతులై ఉండి, ఆర్థిక సంఘానికి మెరుగైన సేవలు అందించగలరని భావించడం జరిగింది. దీని ఆధారంగానే 6వ ఆర్థిక సంఘానికి బ్రహ్మానందరెడ్డిని అధ్యక్షునిగా నియమించడం జరిగింది. కాని ఈ సాంప్రదాయం ఎక్కువ కాలం కొనసాగలేదు. 7వ ఆర్థిక సంఘానికి సుప్రీంకోర్టు జడ్జి షెలాత్‌ను అధ్యక్షునిగా నియమించారు. కేంద్ర రాష్ట్రాల మధ్య ఏర్పడే స్పర్థలను తొలగించే తుది వేదిక సుప్రీంకోర్టు కాబట్టి, సుప్రీంకోర్టు జడ్జీలను ఆర్థిక సంఘ అధ్యక్షులుగా నియమించడం సరైనది కాదని భావించారు. 8వ ఆర్థిక సంఘానికి వై.బి. చవాన్‌ను అధ్యక్షునిగా నియమించారు. ఇతను మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి. కానీ మాజీ ముఖ్య మంత్రులైతే ఆర్థిక వ్యవహారాలపై సరియైన అవగాహన ఉండటానికి అవకాశం కలదనీ అభిప్రాయం కూడా కలదు. తొమ్మిదవ, పదవ, పదకొండవ ఆర్థిక సంఘాలకు వరుసగా సాల్వే, కె.సి. పంత్, ఎ.ఎమ్. ఖుస్రోలు అధ్యక్షులుగా పనిచేసారు. ప్రస్తుత ఆర్థిక సంఘ అధ్యక్షులు రంగరాజన్.

## 9.2. ఆర్థిక సంఘ విధులు :

రాజ్యాంగములోని 280(3) ప్రకరణ ననుసరించి ఈ క్రింది విధులు కలవు. ఎ) పన్నుల రూపేణా వచ్చిన ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్రాల మధ్య, వివిధ రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడం, బి) సంఘటిత నిధి నుండి రాష్ట్రాలకు గ్రాంట్లు ఇవ్వడానికి మార్గదర్శక సూత్రాలను నిర్ణయించడం, సి) రాజ్యాంగంలోని 278 మరియు 306 ప్రకరణల క్రింద ప్రత్యేకంగా పేర్కొనబడినట్లు, కేంద్ర ప్రభుత్వంలో ఏ రాష్ట్ర ప్రభుత్వానికైనా కుదిరిన ఒడంబడికలోని నియమనిబంధనలు కొనసాగింపు లేదా మార్పు గురించి సలహాలిచ్చుట, డి) ఆర్థిక పటిష్టతకు రాష్ట్రపతి సూచించిన ఇతర అంశాలను పరిశీలించడం.

ఆర్థిక సంఘ ఏర్పాటుకు ఒక సంవత్సరం ముందే కేంద్ర ఆర్థిక శాఖలోని సహాయ కార్యదర్శి హోదాకు తగ్గని అధికారి పర్యవేక్షణలో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఒక విభాగం ఏర్పాటు చేయబడుతుంది. కేంద్ర ఆర్థిక సంబంధాల విషయంలో ఏర్పడిన లేదా ఏర్పడబోయే సమస్యలను గుర్తించుట ఈ విభాగం పని. దీనిని కేంద్ర క్యాబినెట్ పరిశీలిస్తుంది. క్యాబినెట్ ఆమోదంతో ప్రత్యేక విభాగం రూపొందించిన నివేదిక ఆధారంగానే ఆర్థిక సంఘ నియమావళి రూపొందించబడి రాష్ట్రపతి ఆమోదానికి పంపుతారు. ఈ ప్రత్యేక విభాగం కొరకు నియమింపబడిన ప్రత్యేక అధికారి, ఆర్థిక సంఘ సభ్యకార్యదర్శిగా నియమింపబడతాడు.

రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికసంఘ నియమనిబంధనలను రూపొందించేటప్పుడు తమను సంప్రదించాలని భావిస్తున్నాయి. అందుచే ఆర్థిక సంఘ నియమ నిబంధనల రూపకల్పన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర చర్చల ద్వారా రూపొందించాలని భావించడం జరిగింది.

## 9.3 వివిధ ఆర్థిక సంఘాలు :

మొదటి ఆర్థిక సంఘం (1951 - 52) లో ఏర్పాటు చేయబడింది. ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 50% నుండి 55% కు పెంచారు. రాష్ట్రాల మధ్య వాటా 1951 జనాభాలెక్కల ప్రకారం 80% జనాభాని బట్టి, 20% ఆ రాష్ట్రాల నుండి వచ్చిన

ఆదాయ ప్రాతిపదికగా నిర్ణయించాలని సూచించారు. దీనిని మహారాష్ట్ర, బెంగాల్ వంటి రాష్ట్రాలు విమర్శించాయి. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ విషయంలో వెనుకబడిన రాష్ట్రాలు కూడా తమ అసంతృప్తిని వ్యక్తీకరించాయి. రాష్ట్రాల ఆదాయవనరులను పెంచవలసిన అవశ్యకతను, గ్రాంట్ల రూపంలో రాష్ట్రాలకు కేంద్రం సహాయం చేయదగిన పాత్రను ఈ సంఘం గుర్తించింది.

రెండవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 60% పెంచింది. రాష్ట్రాల మధ్య వాటా 90% జనాభా ప్రాతిపదికగా, 10% ఆ రాష్ట్రాల నుండి వచ్చిన ఆదాయ ప్రాతిపదికగా నిర్ణయించాలని సూచించారు. వాణిజ్య పన్నుల రాష్ట్రాల వాటాను 40% నుండి 25% కి తగ్గించాలని సూచించారు. అయితే 15%ని వాణిజ్య పన్నుల పరిధిని పెంచడం ద్వారా పూరించవచ్చునని తెలిపారు. తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తప్ప మిగతా రాష్ట్రాల ఆదాయాన్ని పెంచడానికి గ్రాంట్ల మొత్తాన్ని పెంచాలని సూచించారు. సంపద పన్నులో 99% రాష్ట్రాలకు కేటాయించి 1% కేంద్రం అట్టిపెట్టుకోవాలని సూచించారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చు ఋణాలు దీర్ఘకాలికంగా ఉండాలని భావించారు.

మొత్తం మీద పన్నులలో ఎక్కువ వాటాను కేటాయించడం, గ్రాంట్లను పెంచడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి సూచలను తోడ్పడ్డాయి.

మూడవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 66.6% పెంచింది. రాష్ట్రాల మధ్య విభజన 80% జనాభా ప్రాతిపదికగా, 20% ఆదాయ ప్రాతిపదికగా ఉండాలని సూచించింది. వాణిజ్య పన్నులో రాష్ట్రాల వాటాను 25% నుండి 20% తగ్గించింది. కానీ వాణిజ్య పన్ను విధించే వస్తువుల సంఖ్యను 8 నుండి 35కి పెంచింది. కమ్యూనికేషన్స్ అభివృద్ధిపైనే రాష్ట్రాల ప్రగతి ఆధారపడి ఉందని భావించి దానికై ప్రత్యేక గ్రాంటుకు సిఫారసు చేసింది. ఆర్థిక సంఘము మరియు ప్రణాళికా సంఘ విధులు ఒకే విధంగా ఉన్నాయి కాబట్టి, వీటి మధ్య సమన్వయం అవసరం అని ఈ సంఘం పేర్కొంది.

నాల్గవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 75% పెంచింది. రాష్ట్రాల ఆదాయపు పన్నులో 80% జనాభా ప్రాతిపదికగా, 20% ఆ రాష్ట్రాల నుండి వచ్చు ఆదాయ ప్రాతిపదికగా ఉండాలని సూచించింది. అభివృద్ధి, అభివృద్ధేతర రంగాలలో వ్యయం పెరగడం ద్వారా రాష్ట్రాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ఈ సంఘం గుర్తించింది. ఆర్థిక విధానాల రూప కల్పనలో కేంద్ర, రాష్ట్రాల మధ్య తరచు సమావేశాలు జరగాలని సూచించింది.

అయిదో ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 75% గానే ఉంచి, రాష్ట్రాల మధ్య పంపిణీ మాత్రం 90% జనాభా ప్రాతిపదికగాను, 10% వసూలు ప్రాతిపదికగాను ఉండాలని సూచించింది. రాష్ట్రాల వెనుకబాటు తనాన్ని గుర్తించడాన్ని, ఆయా రాష్ట్రాల తలసరి ఆదాయాన్ని కేంద్ర తలసరి ఆదాయంతో పోల్చి చూడాలని భావించారు. గ్రాంట్లను మంజూరు చేయడంలో రాష్ట్రాల ఆదాయ లోటును పరిగణనలోనికి తీసుకోవాలని సూచించారు. అయితే మిగులు ఆదాయం గల రాష్ట్రాలు దీనిని విమర్శిస్తూ, ఆర్థిక వ్యవహారాలు యాజమాన్యం సరిగ్గాలేని రాష్ట్రాలకు ఒక బహుమతిగా దీనిని అభివర్ణించాయి.

రాష్ట్రాలలో వనరుల అభివృద్ధికి అధిక వ్యవసాయ ఆదాయంపై పన్ను, బకాయిపడిన పన్నుల వసూలు, ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు మెరుగుపరచడం. నీటి పారుదల పథకాల నుండి ఆదాయం పొందడం మొదలైన సూచనలు చేసింది. ఈ విధంగా కేంద్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతినకుండాను, రాష్ట్రాలు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునే విధంగాను సూచనలు చేసింది.

ఆరవ ఆర్థిక సంఘం ఆదాయం పన్నులో రాష్ట్రాల వాటాను 80% పెంచింది. రాష్ట్రాల మధ్య పంపిణీ విధానాన్ని మార్చలేదు. రాష్ట్రాలకు నిధులను సమకూర్చడంలో వాటి వెనుకబాటుతనాన్ని పరిగణలోనికి తీసుకుంది. దేశంలో లభించే వనరుల జాతి మొత్తానికి చెందినవని, వాటిని అవసరమైన చోట వినియోగించవచ్చునని భావించింది. వెనుకబడిన ప్రాంతాలలో

సామాజిక, పరిపాలనా సేవలను మెరుగుపరచవలసిన అవశ్యకతను గుర్తించింది. గ్రాంట్లను మంజూరు చేయడంలో వాటి ఆర్థిక వ్యవహారాల యాజమాన్య దక్షతను, ఇతర పాలనా అంశాలను పరిగణలోనికి తీసుకుంది. ప్రకృతి వైపరీత్యాలు తరచు సంభవించే ప్రాంతాలలో వాటి నివారణకు సమగ్ర పథకాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని గుర్తించింది. రాష్ట్రాల ఆర్థిక అవసరాలను తీర్చడంలో కేంద్రం యొక్క అవశ్యకతను జాతీయ ఆర్థిక అభివృద్ధిలో తగ్గుదల కారణంగా పేర్కొంది. ఈ కాలంలో ప్రకృతి వైపరీత్యాలకు ఎక్కువగా గురైన రాష్ట్రాల మధ్య సంబంధాల మెరుగుకు ఈ సంఘం కృషి చేస్తుంది.

ఏడవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్నులో రాష్ట్రాల వాటాను 85%కు పెంచింది. ఆరవ కమీషన్‌తో పోలిస్తే రాష్ట్రాలకు కేటాయించిన నిధులను రెట్టింపు చేసింది. వాణిజ్య పన్నులో రాష్ట్రాల వాటాను 20% నుండి 40% కు పెంచింది. గ్రాంట్ల మొత్తాన్ని కూడా పెంచింది. రాష్ట్రాలకు కేటాయించే నిధులు పెరిగినా మద్యపాన నిషేధాన్ని ప్రవేశపెట్టడంతో రెవెన్యూ వసూలు తగ్గింది. దీనిలో 50% కేంద్రం పూడ్చాలని సూచించినా అది సరిపోలేదు. రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాయం లభించే వాటిగా భావించింది. కాని వాస్తవంలో అవి రాష్ట్రాలకు గుదిబండలుగా తయారయ్యాయి. ఎనిమిదవ ఆర్థిక సంఘం ఆదాయపు పన్ను పంపిణీలో వాటాను 85% గానే ఉంచింది. వాణిజ్య పన్నులో 45% ఆదాయాన్ని లోటు రాష్ట్రాలకు కేటాయించే విధంగా కొత్త సూచనలు చేసింది. అయినప్పటికి 25 రాష్ట్రాలలో 13 రాష్ట్రాలు లోటు బడ్జెట్‌నే కలిగి ఉన్నాయి.

పదవ (ప్రస్తుత) ఆర్థిక సంఘం కేంద్ర రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను పరిశీలించడానికి, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినపుడు తీసుకోవాల్సిన చర్యల గురించి పరిశీలించడానికి ఏర్పాటు చేయబడింది.

## 9.4 ఆర్థిక సంఘం - ఒక పరిశీలన :

ఆర్థిక సంఘ నిధులను మూడు తరగతులుగా వర్గీకరించవచ్చు. 1. రాష్ట్రపతి ఆజ్ఞల కనుగుణంగా చేయబడేవి, 2. పార్లమెంటు చట్టాలననుసరించి, 3. కార్యనిర్వాహక శాఖ ఆదేశాలననుసరించి నిర్వహింపబడేవి. 270 మరియు 275 (1) ప్రకరణల ననుసరించి ఆదాయపు పన్ను, గ్రాంట్ - ఇన్ - ఎయిడ్‌లు మొదలగునవి మొదటి తరగతికి చెందుతాయి. కేంద్ర వాణిజ్య పన్ను, సంపద పన్ను రెండో తరగతికి క్రిందకు వస్తాయి. మిగిలినవి మూడో తరగతికి చెందినవి.

వివిధ ఆర్థిక సంఘాల సూచనలను పరిశీలించినట్లయితే, పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్రాల వాటాను క్రమంగా పెంచుతూ వచ్చాయి. మన రాజ్యాంగంలో కొన్ని తప్పనిసరి కేటాయింపుగాను, మరికొన్ని ఐచ్ఛిక కేటాయింపులుగాను పేర్కొనటంలో సందిగ్దత ఏర్పడింది. ఉదాహరణకు ఆదాయపు పన్ను పంపకం గురించి పేర్కొన్నారు. కాని వివిధ రాష్ట్రాల మధ్య ఏవిధంగా పంపిణీ చేయాలో పేర్కొనలేదు. వాణిజ్యపు పన్ను పంపకంలో పరిస్థితి మరీ సందిగ్ధం. దీనిని తప్పనిసరి వనరుగా రాజ్యాంగం పేర్కొనలేదు. వాణిజ్య పన్నుల జాబితాలోనికి వచ్చే వనరుల జాబితా గురించి కూడా పేర్కొన లేదు. ఇది పూర్తిగా పార్లమెంటు నిర్ణయానికే వదిలి వేశారు. పూర్తిగా రాష్ట్రాలకు కేటాయించే వనరుల విషయంలో కూడా రాష్ట్రాల మధ్య వాటి పంపిణీ విషయమై సరియైన మార్గదర్శక సూత్రాలు లేవు.

ఆరిక బాధ్యతలు నిర్వహించుటకు ప్రత్యేక యంత్రాంగం లేదు. అయితే అయిదు సంవత్సరాలకు ఒకసారి ఏర్పడే సంఘం కాబట్టి ఆ సంఘం తన లక్ష్యాలను నెరవేర్చలేదు. ఆర్థిక సంఘాలు కూడా రాష్ట్రాలు నిధులను పెంచడానికి ఎక్కువగా పన్నుల పంపకంపైనే ఆధారపడ్డాయి. గ్రాంట్ల మంజూరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వలేదు. ప్రణాళికేతర నిధులను కేటాయించే అధికారం ఆర్థిక సంఘానికి లేకపోవడం కూడా ఆర్థిక సంఘ నిధులను పరిమితం చేస్తుంది. ఆదాయపు పన్ను పంపిణీలో జనాభాపై ఆధారపడటం కొంతవరకు సముచిత నిర్ణయమనే భావించాలి. అయితే రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లకు ప్రాధాన్యత ఇవ్వలేదు. పన్నుల ద్వారా పొందిన వాటాలు చాలక ఏర్పడిన లోటును పూరించడానికి ఒక ప్రత్యామ్నాయ సాధనాలుగానే గ్రాంట్లను పరిగణించాయి.

ఆర్థిక సంఘాలు నిర్దిష్టమైన పాత్ర నిర్వహించేక పోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. 1) ప్రణాళికా సంఘానికి ఆర్థిక సంఘానికి మధ్య స్పష్టంగా విధుల కేటాయింపు జరుగలేదు. అందుచే ఆర్థిక సంఘ పరిధి పరిమితమై ఎక్కువగా ప్రణాళికా సంఘంపై ఆధారపడవలసి వచ్చింది. 2) ప్రణాళికా సంఘం తాత్కాలిక ఏర్పాటు కావడంతో శాశ్వత యంత్రాంగం లేదు. అందుచే కేంద్ర రాష్ట్రాల మధ్య బదిలీ, పంపకాలపై సహేతుక విధానాన్ని రూపొందించలేక పోయింది. అందుచే దీనిని ఒక శాశ్వత సంఘంగా రూపొందించాలి.

## 9.5. ఆర్థిక సంఘం - ప్రణాళికా సంఘం :

సమాఖ్యలో కేంద్ర రాష్ట్రాల మధ్య తరచు ఏర్పడే ఆర్థిక సమస్యలకు పరిష్కార సూచనలు చేయుటకు రాజకీయేతర వాతావరణములో ఆర్థిక సంఘం వంటి ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థ అభిలషణీయం. అయితే వనరుల పంపిణీపై విస్తృత అధికారాలు గల ప్రణాళికా సంఘం ఏర్పాటు ఆర్థిక సంఘ లక్ష్యాన్ని విఫలం చేసింది. రాష్ట్ర బడ్జెట్‌లలోని ప్రణాళికేతర రంగాన్ని తొలగించడం, రాష్ట్రాల పన్నుల విధానాలపై పరిశీలనను పరిమితం చేయడం ద్వారా ఆర్థిక సంఘ పనితీరు నిర్వీర్యమైంది. అందువలన సమాఖ్య స్ఫూర్తిని నిలపడానికి ఆర్థిక సంఘ స్వతంత్ర్య ప్రతిప్రత్తిని పునరుద్ధరించడం అవసరం.

ఆర్థిక సంఘానికి, ప్రణాళికా సంఘానికి మధ్య అవి నిర్వహించాల్సిన పాత్ర స్పష్టంగా నిర్దేశింపబడినపుడే ఆర్థిక సంఘం రాజ్యాంగం పేర్కొన్న లక్ష్యాలను నెరవేర్చకలుగుతుంది. ప్రణాళికా సంఘం జాతీయ ఆర్థిక విధానాన్ని (రాష్ట్రాల ఆర్థిక విధులతో పాటు) రూపొందించడంలో తన పాత్రను కొనసాగించవచ్చు. ఆర్థిక సంఘం పన్నుల ద్వారా రాష్ట్రాలు వనరులు సేకరించుట, గ్రాంట్లు, లోనుల ద్వారా రాష్ట్రాల ప్రణాళికా, ప్రణాళికేతర అవసరాలను తీర్చుకొనుట వంటి వాటిని నిర్ణయించాలి. దీని కొరకై ప్రణాళికా సంఘం, ఆర్థిక సంఘాల మధ్య సమన్వయం తప్పనిసరి.

ఆర్థిక సంఘాన్ని ఒక శాశ్వత సంఘంగా రూపొందించి అవసరమైన పరిశోధన సిబ్బందిని సమకూర్చాలి. దీనికి కావలసిన గణాంక వివరాలను, పద్ధతులను రూపొందించుకోవాలి. అయితే భారత దేశ రాజ్యాంగం రూపొందింపబడిన ఇన్నేళ్లకు కూడా ఇటువంటి యంత్రాంగం రూపొందించలేదు.

## 9.6. మాదిరి ప్రశ్నలు

**వ్యాసరూప ప్రశ్నలు :** ఈ క్రింది వాటికి 5 పేజీలకు మించకుండా జవాబు వ్రాయుము

1. ఆర్థిక సంఘ నిర్మాణం మరియు దాని విధులను గూర్చి వ్రాయుము

**లఘువ్యాస ప్రశ్నలు :** ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించకుండా జవాబులు వ్రాయుము

1. ఆర్థిక సంఘానికి గల రాజ్యాంగబద్ధ హోదాను గూర్చి వ్రాయుము
2. ఆర్థిక సంఘ పనితీరును విశ్లేషించండి

ఈ క్రింది వాటికి 10 పంక్తులకు మించక జవాబు వ్రాయుము :

1. ప్రణాళికా సంఘం మరియు ఆర్థిక సంఘాల మధ్య గల సంబంధము

## 9.7. ఉపయుక్త గ్రంథాలు


1. Mishra B.R. : Indian Federal Finance
2. Avasthi & Maheswari : Public Administration
3. Kapoor & pant : Public finance


రచయిత : డా॥ కె. రఘునాథ్

పాఠం -10

# కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్

విషయసూచిక

10.0 లక్ష్యం
10.1 భారతదేశములో ఆడిట్ మరియు అకౌంటింగ్ కార్యాలయ వ్యవస్థాపరిణామము
10.2 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగ ప్రతిపత్తి
10.3 అధికారాలు - విధులు
10.4 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ - ఒక పరిశీలన
10.5 ముగింపు
మాదిరి ప్రశ్నలు
చదువదగిన గ్రంథాలు

## 10.0 లక్ష్యం :

ఈ పాఠంలో ఖాతాల తనిఖీ మరియు ఖాతాల నిర్వహణ వ్యవస్థ పరిణామము, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగ ప్రతిపత్తి, అతనికి గల అధికారాలు - విధులు, మొదలగు వాటిని గురించి మీరు తెలుసుకుంటారు.

## 10.1 భారతదేశములో ఆడిట్ మరియు అకౌంటింగ్ కార్యాలయ వ్యవస్థా పరిణామం :

ఖాతాల తనిఖీ మరియు ఖాతాల నిర్వహణ అంటే ఏమిటి ?

ఖాతాల నిర్వహణ అనగా ఆర్థికపరంగా జరిగే విషయాలను ఒక క్రమపద్ధతిలో రికార్డుచేసి భద్రపరచడం. ఆ అకౌంట్ల వివరాలను పరిశీలించి దానిలోని చట్ట వ్యతిరేక, అసంబద్ధ ఖర్చులను, ఇతర ఆర్థిక వ్యవహారాలను శాసన నిర్మాణశాఖకు తెలియజేసి, పాలనాపరంగా ఒక సంస్థ తన బాధ్యతలను సక్రమముగా నిర్వహించిందో లేదో తెలుపుటను ఆడిట్ అంటారు. ఆడిట్ అకౌంటింగ్ పూర్తి అయిన పిదప ప్రారంభమయ్యే చర్య.

పబ్లిక్ అకౌంట్స్ ఆడిట్ మొదట ప్రారంభించిన దేశం ఇంగ్లండ్. ఆడిట్‌కు 19వ శతాబ్దములో ప్రాధాన్యత లభించింది. ప్రభుత్వ విత్త వ్యవహారాలపై పార్లమెంటరీ అదుపు లేక అజమాయిషీలో భాగంగా ఆడిట్‌ను పేర్కొనవచ్చు. ఆడిటర్ కార్యనిర్వాహక శాఖతో సంబంధం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తూ, తన నివేదికను పార్లమెంటుకు సమర్పిస్తాడు.

భారతదేశములో ఆడిట్ మరియు అకౌంట్స్ శాఖ చాలా ముందుగానే ప్రారంభింపబడినది. అయితే 1919 మాంటేంగు - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలలో స్వతంత్ర ఆడిట్ వ్యవస్థ ఏర్పడినది. ఈ సంస్కరణల ననుసరించి ఆడిటర్ జనరల్ భారత వ్యవహారాల కార్యదర్శిచేత నియమింపబడి, బ్రిటిష్ రాజు లేదా రాణీ అభీష్టం ఉన్నంత వరకు కొనసాగుతాడు. ఇతను గవర్నర్ జనరల్ కౌన్సిల్ ద్వారా తన నివేదికను భారత వ్యవహారాల కార్యదర్శికి నివేదించాలి.

1935 భారత ప్రభుత్వ చట్టం ఆడిటర్ జనరల్ అధికారాల పరిధిని మరింత విస్తృత పరచినది. అతనికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడానికి, అతను పదవీ విరమణ చేసిన తరువాత ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదని నిషేధించినది. అతనని తొలగించాలంటే ఫెడరల్ కోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలో తొలగించాలి.

1950లో భారత రాజ్యాంగం ఆమోదింపబడిన తరువాత ఆడిట్ జనరల్ పదవిని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా పునర్వ్యవస్థీకరించారు. కొన్ని అంశాలలో అతని అధికారాలు మరింత విస్తృతంచేయబడ్డాయి.

1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం అప్పటి రాష్ట్రాలకు (బ్రిటిష్ పాలిత ప్రాంతములకు) స్వతంత్రంగా ఆడిటర్స్ నియమించుకునే అధికారం కలదు. అయితే దీనిని ఏ రాష్ట్రం ఉపయోగించలేదు. అయితే భారతరాజ్యాంగాన్ని అనుసరించి కేంద్ర - రాష్ట్రాల ఆర్థిక వ్యవహారాల తనిఖీకి ఒకే వ్యవస్థను ఏర్పరిచారు. అదే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ.

## 10.2. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగ ప్రతిపత్తి :

భారత రాజ్యాంగంలోని 149 నుండి 151 వరకు గల ప్రకరణముల ననుసరించి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ ఏర్పరచబడినది. అతను రాష్ట్రపతిచే నియమింపబడతాడు. సాధారణముగా కేంద్ర ప్రభుత్వంలో విస్తృత అనుభవం ఉన్న వ్యక్తిని ప్రధానమంత్రి సలహాపై రాష్ట్రపతి నియమిస్తాడు. అతను పదవి చేపట్టిన 6 సం॥లు లేదా 65 సం॥లు వయస్సు వచ్చు వరకు అధికారములో కొనసాగుతాడు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ హోదా, జీతభత్యాలు సుప్రీంకోర్టు జడ్జి హోదా, జీతభత్యాలతో సమానంగా ఉంటాయి. అతను రాజీనామా చేయాలంటే ముందుగా రాష్ట్రపతి నుండి అనుమతి పొందాలి. అతని సర్వీసు నిబంధనలను పార్లమెంటు రూపొందిస్తుంది. అతను అధికారములో ఉండగా అతనికి నష్టం కలుగునట్లు సర్వీసు నిబంధనలు, జీతభత్యాలు మార్చు చేయరాదు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ స్థానం చాలా ప్రాధాన్యత కలిగి ఉంది. అతను నిర్వహించవలసిన విధులు బాధ్యతలు అతనికి ఇతర సివిల్ సర్వీసు ఉద్యోగుల కన్నా ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. అతను నిర్భయముగాను, నిష్పక్షపాతముగాను పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో తన విధులను నిర్వహించడానికి గాను పదవీ విరమణ తరువాత ఎటువంటి ప్రభుత్వ పదవి చేపట్టరాదనే ఆంక్ష విధించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఏ విధముగా తొలగించవచ్చో అదే విధమైన పద్ధతిలో తొలగించవచ్చు. అనగా పార్లమెంటు రెండు సభలలోను చర్చ జరిపి, అధిక సంఖ్యాకుల ఆమోదం పొందిన తరువాత, సభకు హాజరైన వారిలో 2/3 వంతు సభ్యులు ఆమోదించి, రాష్ట్రపతి ఆమోదముద్ర పడితే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌ను తొలగించవచ్చు.

## 10.3. అధికారాలు - విధులు :

1947 భారతదేశ తాత్కాలిక రాజ్యాంగములో (ఆర్డర్‌లో) పేర్కొన్న కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అధికారాలు, విధులకు 1926లో చేయబడ్డ భారతప్రభుత్వ ఆడిట్ మరియు అకౌంట్స్ ఆర్డర్ ఆధారం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ భారతదేశములోను బయట జరిగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖాతాలు తనిఖీ చేస్తాడు. అకౌంట్స్‌లో చూపబడిన పద్దులు ఎంతవరకు చట్టబద్ధమైనవో, అవి ఎంతవరకు నిర్దేశింపబడిన నియమాలకు లోబడి ఖర్చు చేయబడినవో పరిశీలిస్తాడు.

అశోక్ చందా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ అధికారాలు, విధులకు విస్తృత అర్థాన్ని ఇచ్చాడు. ప్రభుత్వం చేసిన ఖర్చు కేవలం పార్లమెంటు అనుమతించిన మేరకు ఖర్చు చేయబడినదా అనేదే కాకుండా, ఆ ఖర్చు పొదుపుగాను, విజ్ఞతతోను,

విశ్వసనీయతతోను చేయబడిందా లేదా అనే దాని గురించి ఆయన సంతృప్తి పడవలసి ఉంటుంది. దీనిని బట్టి ఖాతాల నిర్వహణలో పేర్కొన్న ఖాతాల పరిశీలనేగాక, పరిధిని మించి వృథా ఖర్చు జరిగినదా, అసంబద్ధంగా ఖర్చు జరిగినదా అని పరిశీలించే విచక్షణాత్మక ఆడిట్‌గా రూపొంది, కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ అధికారాలను మరింత విస్తృతమైనాయని పేర్కొనవచ్చును. ఈ విధముగా ఆడిట్ అనేది కేవలం చట్టబద్ధమైనదేగాక, విచక్షణాత్మకమైనది అని కూడ స్పష్టమవుతుంది.

ఆర్థిక పాలన లేదా వ్యవహారాలలో రాజ్యాంగంలోను, చట్టాలలోను పొందుపరచబడిన న్యాయసూత్రాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ పరిరక్షిస్తాడు. ప్రభుత్వ ఆదాయవ్యయాలకు సంబంధించి చట్టబద్ధ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు నియమాలకు లోబడి చేయబడినవో లేదో పరిశీలిస్తాడు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ భారత సంఘటితనిధిని, కేంద్ర, రాష్ట్రాల జమా ఖర్చులను, ప్రభుత్వ ఖాతాలను పరిశీలిస్తాడు. వివిధ ప్రభుత్వ శాఖలు నిర్వహించే వర్తకం, లాభనష్టాల ఖాతాలు, బ్యాలన్స్ షీట్‌లను పరిశీలిస్తాడు. సంఘటిత నిధి ద్వారా సహాయం పొందే సంస్థల వ్యవహారాలను కూడ ఆడిట్ చేస్తాడు. దీనికొరకై ఏ కార్యాలయాన్నైనా తనిఖీ చేయుటానికి, వాటి అకౌంట్ పుస్తకాలు ఆడిట్ చేయడానికి, అవసరమైన సమాచారాన్ని పొందడానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు అధికారం కలదు. ఇతని అధికార పరిధి రహస్య సేవావిభాగానికి మాత్రం వర్తించదు. ఈ విభాగానికి సంబంధించిన ఖర్చులకై వివరణ కోరే అధికారం లేదు. కాని ఆ శాఖకు చెందిన ఒక బాధ్యతాయుత అధికారి నుండి పొందే నిరూపణ పత్రం ద్వారా అంచనాలను, ఆదాయ వ్యయాలను పరిగణనలోనికి తీసుకోవచ్చు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు సహాయ పడటానికి దేశవిదేశాలలో వంద క్షేత్రకార్యాలయాలు, 60,000 మందికి పైగా సిబ్బంది కలరు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన నివేదికను రాష్ట్రపతికి, రాష్ట్రప్రభుత్వాల నివేదికలను గవర్నర్లకు సమర్పిస్తాడు. వారు ఆయా చట్టసభలకు సమర్పిస్తారు.

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ద్వారా పార్లమెంటు కార్యనిర్వాహక వర్గంపై ఆర్థిక పాలనాపర నియంత్రణ చేస్తుంది. దీనికితోడు పార్లమెంటు ఆమోదం మేరకు ఖర్చు జరిగినది లేనిది తెలుసుకోవడానికి ప్రభుత్వ ఖాతాల సంఘం (పి.ఎ.సి.) కలదు. ప్రభుత్వ ఆదాయ వ్యయాలను పరిశీలించడం దాని విధి. ఈ ఖాతాలను పరిశీలించి ఆడిట్ నివేదిక రూపొందించేటప్పుడు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌తోపాటు ప్రభుత్వ ఖాతాల సంఘం కూడ సంతృప్తి చెందాలి.

ప్రభుత్వ కార్పోరేషన్లు, వ్యాపార సంస్థలు ఇతర ప్రణాళికా బద్ధ సంస్థల లాభనష్టాల గురించి ప్రభుత్వ ఖాతాల సంఘం పరిశీలన కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఆధారముగా జరుగుతుంది. ప్రభుత్వం చేసే ఖర్చులో మితవ్యయం పాటింపబడింది లేనిది, నైతిక విలువలు పాటించింది లేనిది పార్లమెంటు ఆమోదం మేరకే ఖర్చు జరిగిందా, లేదా మొదలగు వాటిని ప్రభుత్వ ఖాతాల సంఘం చేస్తుంది. టి.జి.బేల్స్ దృష్టిలో "ప్రభుత్వ ఖాతాల సంఘానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ హస్తం వంటివాడు". ఈ విధముగా ప్రభుత్వ ఖాతాల పర్యవేక్షణలో కంప్ట్రోలర్ అండ్ జనరల్ స్నేహితుడుగాను, మార్గదర్శిగాను, పని చేయును.

## 10.4 కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ - ఒక పరిశీలన :

పాల్. హెచ్. ఆపిల్‌బి భారత ఆడిట్‌ను తన రెండవ నివేదికలో తీవ్రంగా విమర్శించాడు. ఆడిట్ వ్యవస్థను వలసవాద వారసత్వముగా భావిస్తూ, మంచి పాలన ఎలా ఉండాలనే అవగాహన ఆడిటర్లకు ఉండదని పేర్కొన్నాడు. నిర్ణయాలు తీసుకొనుట, అమలుపరచుట వంటి వాటిల్లో ఏర్పడే స్తబ్ధతకు ఆడిటర్ జనరల్ వ్యవస్థే కారణమని ఆయన అభిప్రాయం. ఇతని అభిప్రాయములో కంప్ట్రోలర్ అండ్ ఆడిట్ సిబ్బంది పూర్తి ఆడిటింగ్ పిదప కనుగొనే సమస్యలు లేదా లోపాలపై, ఒక శాఖలో పనిచేసే డిప్యూటి

కార్యదర్శి ఎక్కువ అవగాహన కలిగి ఉంటాడు. ఆపిల్‌బి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థను రద్దు చేయవలసిందిగా సూచించాడు.

బహుశా అమెరికా పాలనా వ్యవస్థలో ఈ పదవికి అంతగా ప్రాధాన్యత లేకపోవడం ఆపిల్‌బి అభిప్రాయాలకు కారణం కావచ్చు. అయితే భారత పాలనా వ్యవస్థ బ్రిటిష్ వారసత్వంగా వచ్చినది. అందుచే మన పాలనా వ్యవస్థలో ఆడిటర్ జనరల్‌కు ఒక నిర్దిష్ట స్థానం కలదు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడడానికి ఆడిట్ తోడ్పడుతుంది. దేశ ఆర్థిక వ్యవహారాలలో ఆడిట్ అనేది "విశ్వసనీయతతో కాపలా కాచే శునకం"తో పోల్చవచ్చు. కాబట్టి ఈ వ్యవస్థను రద్దుచేయడం లేదా నిర్వీర్యం చేయడం సాధ్యం కాని పని.

భారతదేశములో చాలా కాలం వరకు ఆడిట్, ఎకౌంటింగ్ విధులు కలసి ఉన్నాయి. అది సిద్ధాంత రీత్యా సమంజసం కాదని 1924 మడ్డిమన్ కమిటీ మొదలుకొని అనేక కమీషన్‌లు పేర్కొన్నాయి. స్వతంత్ర భారతదేశములో మొదటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్‌గా పనిచేసిన నరహరిరావు ఎకౌంటింగ్ మరియు ఆడిట్ విధులు ఒకే వ్యవస్థలో ఉండటంలో గల అసంబద్ధతను ఎత్తి చూపారు.

దీనికి కారణము ఖర్చు చేసేవారు ఖర్చు ఏ విధముగా కొనసాగుతుందో తెలియజేసే ఖాతాలను నిర్వహించక, వాటిని వేరుగా ఆడిట్ శాఖ నిర్వహించటం, ఖర్చుచేసే వారికి బాధ్యతలు తెలియచేయక అసంబద్ధతకు దారితీస్తుంది. దీనిని సరిదిద్దాలనే ఆదాయవ్యయాలను నిర్వహించే పరిపాలనాశాఖలోనే దానికి తగిన ఎకౌంటింగ్ యంత్రాంగం ఉండాలని సూచించబడినది.

ఖాతాల నిర్వహణ కార్యనిర్వాహక విధి. ఆడిట్ పార్లమెంటు అర్థవిధి. అందుచే ఈ రెండు బాధ్యతాయుతమైన అధికారాలు ఒకే పరిధిలో ఉండుట పార్లమెంటుకుగాని, కార్యనిర్వాహక వర్గానికిగాని వాంఛనీయం కాదు. దీనిని వెల్బీ కమీషన్ ప్రభుత్వ దృష్టికి తెచ్చింది. ప్రభుత్వ ఖాతాల సంఘం కూడ ఈ రెండు విధులు వేరుగా నిర్వహింపబడాలని సూచించింది. వీటిని విభజించినట్లయితే ఆయా శాఖల మితవ్యయాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించడం మాత్రమే కాకుండా, ఒక స్వతంత్ర వ్యవస్థ ఆ ఖాతాలను పరిశీలించి వాటిలోని తప్పొప్పులను కప్పిపుచ్చడానికి వీలు లేకుండా జాగ్రత్త పడవచ్చు.

భారతదేశములో 1976 వరకు ఆడిట్ మరియు అకౌంటింగ్‌లను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ చేపట్టేవారు. 1976 తరువాత అకౌంట్స్‌ని నిర్వహించి, రూపొందించే బాధ్యతలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నుండి తొలగించారు. ఆడిటర్ జనరల్, కార్యనిర్వాహక వర్గం మధ్య సత్సంబంధాలు ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. కాని మనదేశంలో అవిచెప్పుకోదగినంత సామరస్యముగా లేవు. సాఫీగా పోయే పాలనలో ఖాతాల తనిఖీ 'బాధాకరమైన ముల్లుగా' భావించడం జరుగుతుంది. ప్రజాస్వామ్య దేశంలో ఆడిట్‌ను తప్పనిసరిగా కొనసాగించాల్సిన వ్యవస్థగా భావించాలని (ఒక ఆవశ్యక్లేశంగా) అశోక్ చందా పేర్కొన్నాడు. ప్రజాస్వామ్యం అర్థవంతంగా పనిచేయడానికి ఆడిట్‌ను నిర్వహించే ఒక స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థ అవసరమేగాని, అది కార్యనిర్వాహక శాఖ నిర్ణయాలు తీసుకోవడంలోను, పథకాలు అమలులోను అనవసర జాప్యానికి కారణం కాకూడదు.

## 10.5. ముగింపు :

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ పూర్తి స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయడానికి వీలుగా పదవీ విరమణ తరువాత ఎటువంటి లాభదాయకమైన ప్రభుత్వ ఉద్యోగం చేయరాదని పేర్కొనడం జరిగినది. అయితే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా పనిచేసిన అశోక్‌చందా 1960లో మూడవ ఆర్థిక సంఘ అధ్యక్షునిగా నియమించబడ్డాడు. ఇది కొంత విమర్శకు దారి తీసినది. దీనిపై ఆనాటి స్పీకర్, "లాభదాయకమైన పదవి కాకపోయినా, భారత ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండే పదవి కాబట్టి ఈ నియామకం గౌరవప్రదమైనది కాదని" వ్యాఖ్యానించాడు.

అందుచే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నియామక విషయంలోగాని, పదవీ విరమణ విధవగాని, వివాదరహితముగా మసలినపుడే ఈ వ్యవస్థ గౌరవం మరింత పెరుగుతుంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సిబ్బంది నియామకం విషయంలో కూడ, వారు కార్యనిర్వాహక శాఖపై ఆధారపడకుండా, వారి సిబ్బందిని వారే నియమించుకునే ఏర్పాటు కల్పించడం వలన కూడ ఆ వ్యవస్థ స్వతంత్ర్య ప్రతిపత్తిని కాపాడవచ్చు.

**మాదరి ప్రశ్నలు :**

**వ్యాసరూప ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 5 పేజీలకు మించక జవాబు వ్రాయుము.**

1. కంప్ట్రోలర్ జనరల్ వ్యవస్థానిర్మాణము, అతని అధికారాలు లేదా విధులను గూర్చి వ్రాయుము?
2. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థపై ఒక పరిశీలనాత్మక వ్యాసం వ్రాయండి?

**లఘువ్యాస ప్రశ్నలు : ఈ క్రింది ప్రశ్నలకు 60 పంక్తులకు మించకుండా జవాబు వ్రాయుము.**

1. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు గల రాజ్యాంగబద్ధ హోదాను గూర్చి వ్రాయుము ?

**ఉపయుక్త గ్రంథాలు :**


Mishra B.R. : Indian Federal Finance
Avasthi & Maheswari : Public Administration
Kapoor & Pant : Public Finance


**రచయిత : డా॥ కె. రఘునాథ్**

# పాఠము - 11

# కేంద్రీయ సతర్కత ఆయోగ్ (కేంద్ర నిఘా కమిషన్) (సెంట్రల్ విజిలెన్స్ కమిషన్)

**అధ్యయన లక్ష్యాలు :** ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణలు విచారణను గురించి తెలుసుకోవచ్చు. వివిధ భాగాలలో, సంస్థలలో అవినీతికి దారితీసే వైఫల్యాలు, మెరుగుదలలు, వివిధ నివారణ చర్యలు గురించి అధ్యయనం.

**పాఠ్యాంశ విషయ క్రమం :**


11.1 పరిచయం

11.2 కేంద్ర విజిలెన్స్ కమిషన్ వ్యవస్థీకరణ

11.3 కేంద్రవిజిలెన్స్ కమిషన్ విధులు

11.4 సివిసి వివరించిన అవినీతి రకాలు

11.5 కేంద్ర నిఘావిభాగం అవినీతిని అరికట్టె చర్యలు

- 11.5.1 ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- 11.5.2 ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లక్షణాలు
- 11.5.3 ఫెమాకేసుల దర్యాప్తు
- 11.5.4 మనీలాండరింగ్ నిరోధక చట్టం

11.6 సంతానం కమిటి

11.7 అవినీతిని అరికట్టడానికి మార్గాలు

11.8 విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

11.9 యాంటీ కరప్షన్ బ్యూరో


## 11.1 పరిచయం :

అభివృద్ధి చెందుతున్న దేశాలలో అవినీతి, అంచగొండితనం, విచ్చలవిడిగా, విస్తారంగా వ్యాప్తి చెందాయి. ప్రభుత్వం, పాలనపై, అభివృద్ధి కార్యక్రమాలపై ఖర్చు చేసే నిధులలో అధికభాగం అవినీతిపరుల చేతుల్లోకి పోతుందనే విమర్శలు మనం సర్వసాధారణంగా వింటూఉంటాం. పాలనావ్యవస్థలలో అవినీతి చర్యలను అరికట్టడానికి కేంద్రప్రభుత్వం అనేక చర్యలను చేపట్టి అందులో భాగంగానే కొన్ని ప్రత్యేక సంస్థలను ఏర్పాటుచేసింది. అలాంటి సంస్థలలో ముఖ్యమైనదే కేంద్రనిఘా విభాగం. పరిపాలనలో జరుగుతున్న అవినీతిని పరిశీలించడానికి భారత పార్లమెంట్ 1964వ సం॥లో సంతానం కమిటిని ఏర్పాటు చేసింది. ఈ కమిటి నివేదిక ఆధారంగానే కేంద్రప్రభుత్వం 1964లో కేంద్ర నిఘా విభాగాన్ని ఏర్పాటు

చేసింది.

## సంతానం కమిటీ నివేధికలోని ముఖ్యాంశాలు

## 11.2 కేంద్ర విజిలెన్స్ కమిషన్ వ్యవస్థీకరణ

కేంద్ర నిఘా విభాగ అధిపతి విజిలెన్స్ కమిషనర్ ఇతనిని భారత రాష్ట్రపతి నియమిస్తాడు. సి.వి.సి ఛైర్మన్ ఎన్నిక ప్రక్రియలో ప్రధానమంత్రి హెూమ్‌మినిస్టర్, ప్రతిపక్ష పార్టీ నాయకుడు సభ్యులుగా ఉంటారు. తొలగించె అధికారం కూడ రాష్ట్రపతికి కలదు.

65 సంవత్సరముల వయస్సుగాని, 6 సంవత్సరముల పదవీకాలం కానీ, ఈరెండింటిలో ఏది ముందు పూర్తయితే అంతవరకు విజిలెన్స్ కమిషనర్ పదవిలో కొనసాగుతారు. 1954 నుండి కమిషన్ ఏకసభ్య సంస్థగా ఏర్పాటు అయినది. 1964లో మొదటి ఛైర్మన్‌గా సంజేమ్‌కొఠారి నియమించబడినారు. ప్రస్తుతం సి.వి.సి చైర్మన్ శ్రీనివారరావు కొనసాగుచున్నారు. 1998 ఆగస్టునాటికి ముగ్గురు సభ్యులు (1.ఛైర్మన్, ఇద్దరు సభ్యులు) గల సంస్థగా రూపాంతరం చెందింది. 2003లో పార్లమెంట్ "కేంద్ర నిఘాచట్టం" 2003న ఆమోదించింది. ఈ సంస్థ విధి విధానాలను ప్రకటించింది.

కేంద్ర నిఘా విభాగపరిధిని అన్ని ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు ప్రభుత్వం ఆధీనంలోని కంపెనీలకు, ఢిల్లీ పాలనకు విస్తరింపచేశారు. అఖిలభారత సర్వీసులకు చెందిన అధికారులు, కేంద్రపప్రభుత్వానికి చెందిన కేంద్ర సర్వీసుల అధికారులు సి.వి.సి పరిధిలోకి వస్తారు.

కేంద్ర నిఘా విభాగం రాజ్యాంగబద్దమైన సంస్థకాదు. యిది పార్లమెంట్ ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటు చేయబడిన వ్యవస్థ.

## 11.3 కేంద్రవిజిలెన్స్ కమిషన్ విధులు:

కేంద్రనిఘా విభాగం అవినీతిని అరికట్టడంలో భాగంగా ఈ క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

1) కేంద్రప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన అవినీతి నిరోధక పనితీరును సమీక్షించి పర్యవేక్షించడం.

2) ఢిల్లీ ప్రత్యేక పోలీస్ విబాగం చేపట్టే అన్ని కర్యాకలాపాలలోని అవినీతి చర్యలపై అజమాయిషి చేయడం.

3) అఖిల భారత సర్వీసులకు చెందిన అధికారులపై వచ్చిన ఆరోపణలను పరిశీలించడం.

4) అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం, కేంద్ర నిఘా విభాగం, ఢిల్లీ ప్రత్యేక పోలీస్ వ్యవస్థపై కూడా నిఘా చర్యలు చేపట్టవచ్చు.

5) ప్రభుత్వశాఖలకు చెందిన కార్యకలాపాలలో ఏ అధికారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నా ఆరోపణలు వచ్చినా వాటిపై విచారణ చేపట్టే అధికారం కేంద్రనిఘా విభాగానికి ఉంది.

6) సి.బి.ఐ, డైరెక్టర్, లన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎంపికలోను చీఫ్ విజిలెన్స్ కమీషనర్ పాల్గొంటాడు.

7) ప్రతిసంత్సరము కేంద్ర విజిలెన్స్ కమిషన్ తాను చేపట్టిన కార్యకలాపాలపై నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది.

### 11.4 కేంద్రనిఘా విభాగం వివరించిన అవినీతి రకాలు :

1. తక్కువ ప్రమాణం గల నిలువలు, పనులను అంగీకరించడం.
2. ప్రజాధనాన్ని, ప్రజానిలువలను దుర్వినియోగం చేయడం.
3. ప్రభుత్వ ఉద్యోగులతో యితర వ్యక్తులు జరిపే ఆర్థిక సంబంధమైన వ్యవహారాలు
4. ప్రభుత్వ పనులు చేసే కాంట్రాక్టర్‌లు లేదా సంస్థల నుంచి అధికారులు, డబ్బు తీసుకోవడం.
5. కాంట్రాక్టర్‌ల పట్ల, సంస్థలపట్ల పక్షపాతం చూపించడం
6. ప్రమాణభత్యం, ఇంటిఅద్దె మొదలైన వాటిని తప్పుగా వసూలు చేయడం.
7. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉండటం
8. పూర్వానుమతి లేదా పూర్వ ప్రకటన లేకుండా స్థిరాస్తులు కొనుగోలు చేయడం.
9. అధికా హోదాను, అధికారాలను దుర్వినియోగపరచడం
10. సొంతపనులకోసం ప్రభుత్వ ఉద్యోగులను వాడటం
11. నియామకాలు, పదోన్నతులు, బదిలీలకు సంబందించిన చట్టవ్యతిరేకమైన ప్రతిఫలాలు తీసుకోవడం
12. నైతిక విలువలు పాటించకపోవడం
13. బహుమతులు స్వీకరించడం
14. వయస్సు, కులం, పుట్టుక మొదలైన వాటిగురించి తప్పుడు పత్రాలు సమర్పించడం.
15. ఆర్థిక లాభం కోసం ఆదాయపుపన్ను, ఆస్తిపన్ను మొదలైన వాటిని తక్కువ అంచనాలో చూపటం.
16. వాహనాలు కొనడానికి మంజూరు చేసిన రుణాలు దుర్వినియోగం.
17. నిర్వాసిత వ్యక్తుల నష్టపరిహారం చెల్లింపులో జాప్యం చేయడం.
18. నివేశ స్థలం కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన మోసాలు.
19. ప్రభుత్వ క్వార్టర్లను అనధికారంగా ఆక్రమించడం, అద్దెకివ్వడం.
20. దిగుమతి, ఎగుమతి లైసెన్స్‌ల జారీలో అక్రమాలు.

### 11.5 కేంద్ర నిఘా విభాగం అవినీతిని అరికట్టే చర్యలు :

కేంద్ర నిఘా విభాగం అవినీతిని అరికట్టడంలో భాగంలో క్రింది విధులను నిర్వర్తిస్తుంది.

ఎ) కేంద్రప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన అవినీతి నిరోధక పనితీరును సమీక్షించి పర్యవేక్షించడం.

బి) ఢిల్లీ ప్రత్యేక పోలీస్ విభాగం చేపట్టే అన్ని కార్యకలాపాలలోని అవినీతి చర్యలపై అజమాయిషి చేయడం

సి) అఖిలభారత సర్వీసులకు చెందిన అధికారులపై వచ్చిన ఆరోపణలను పరిశీలించడం

డి) అవినీతి నిరోధక చట్టం 1988 ప్రకారం, కేంద్ర నిఘా విభాగం, ఢిల్లీ ప్రత్యేక పోలీస్ వ్యవస్థ పై కూడా నిఘా చర్యలు చేపట్టవచ్చును.

ఇ) ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యకలాపాలలో ఏ అధికారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉన్నా, ఆరోపణలు వచ్చినా వాటిపై విచారణ చేపట్టే అధికారం కేంద్ర నిఘా విభాగానికి ఉంది.

ఎఫ్) సి.బి.ఐ డైరెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎంపికలోను చీఫ్ విజిలెన్స్ కమిషనర్ పాల్గొంటాడు.

జి) ప్రతీ సంవత్సరం కేంద్ర విజిలెన్స్ కమిషన్ తాను చేపట్టిన కార్యకలాపాలపై నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది.

### 11.5.1 ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ :

భారతదేశంలో ఆర్థిక చట్టాలను అమలుచేయడం మరియు ఆర్థికనేరాలను నిమంత్రించడం, విదేశీ మారక ద్రవ్యం నియంత్రణ చట్టం, 1947 వినిమయనియంత్రణ చట్టం యొక్క ఉల్లంఘనలను నిర్వహించడానికి మే 1, 1956 న డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎకనామిక్ ఎన్‌ఫోర్సుమెంట్ ను ఏర్పాటు చేయబడినది. దీనిప్రకారం న్యూఢిల్లీలొ కలదు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి.

ఆర్థిక వ్యవహారాల శాఖ నియంత్రణలో స్థాపించబడినప్పటికి, ఇది రెవిన్యూశాఖలో అంతర్భాగంగా కొనసాగుతూ, 1960 నుండి నియంత్రణ డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (E.D) అనేది రెండు కీలకమైన ఆర్థిక చట్టాలను అమలుచేసే ఒక ప్రత్యేక సంస్థ. అవి:

1. మనీలాండరింగ్ నిరోధక చట్టం (PMLA) 2002
2. ఫారిన్ ఎక్స్ఛేంచ్ మేనేజ్‌మెంట్‌యాక్ట్ (FEMA) 1999.

### 11.5.2 ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ యొక్క లక్షణాలు :

1) ప్రధానంగా ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ మరియు ఫైనాన్స్ మరియు ఎకనామిక్స్‌కు సంబంధించిన విషయాలను డీల్ చేస్తుంది.

2) E.D పారిన్ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్, మరియు ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్‌తో వ్యవహరిస్తుంది.

3. తన కార్యాలయాల పరిధిలో స్వంత కోర్టులు మరియు అప్పిలేట్ ట్రిబ్యునల్‌లను కలిగి ఉంది.

4) చట్టాలలోని నిబంధనలద్వారా విషయాలను తీర్పునిస్తుంది.

5) ప్రాధమిక ఆధికారాలలో మనీలాండరింగ్ ఆస్తులను అటాచ్‌చేయడం మరియు చట్టాల ప్రకారం నేరానికి పాల్పడినట్లు తేలిన వారిని విచారించడం.

6) ఆదాయపు పన్ను అధికారులకు మంజూరు చేసిన అన్ని దర్యాప్తు అధికారాలను వినియోగించుకునే అధికారం కలిగి ఉంటారు.

7) ITA (ఆదాయపు పన్ను చట్టం) లోని సెక్షన్ 131 కింద సబ్జెక్ట్‌లకు సంబంధించి చర్యను ప్రయత్నించినప్పుడు సివిల్ ప్రొసిజర్ కోడ్ 1908 ప్రకారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు సివిల్ కోర్టుకు సమానమైన అధికారాలు యివ్వబడినాయి.

8) మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 ప్రకారం ఒక దర్యాప్తు అధికారి వీటిని నిర్వహించవచ్చును.

* లాండర్డ్ డబ్బుతో కొనుగోలు చేసిని ఏదైనా ఆస్తిని అటాచ్ చేయడం.
* కొనుగోలు చేసిన ప్రాంతాన్ని, ఆస్తి రికార్డులను పరిశీలించడం.
* నిందితులను అరెస్టు చేయడం, సాక్షులను పిలిపించి, వారి వాంగ్మూలాలను నమోదు చేయడం.
* ఆస్తులను జప్తు చేయడానికి, లేదా స్తంభింపచేయడానికి అధికారం కలదు.
* ప్రాధమిక విచారణలో భాగంగా మరియు చట్టం దృష్టిలో వ్యక్తిని "నిందితుడు"గా మార్చదు. ఫలితంగా, సమన్ల జారీఒక వ్యక్తి కలకు హక్కులకు భంగం కలిగించదు. కనుక వారు దానిని కోర్టులో సవాలు చేయరు.

### 11.5.3 ఫెమా కేసుల దర్యాప్తు :

ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ అధికారులు ఫెరా మరియు ఫెమా కింద ఉల్లంఘనలను పరిశోదించి, తీర్పుయిస్తారు. ఫారిన్ ఎక్స్‌ంచ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (FEMA) కింద ఉల్లంఘలను ఎగుమతి ఆదాయాన్ని గ్రహించక పోవడం, విదేశీ మారకపు రాకెట్‌లు మరియు విదేశీ మారక ద్రవ్యాన్ని తిరిగి తీసుకురావడం వంటివి ఉండవచ్చును ఈ నిబంధనల ప్రకారం ఉల్లంఘిస్తే E.D ఆరెస్టు చేయడం, సెటిల్‌మెంట్ చేయడం లేదా మొత్తం కంటే మూడురెట్లు ఎక్కువ జరిమానా విధించడం ద్వారా శిక్షార్హులు.

### 11.5.4 మనీలాండరింగ్ నిరోధక చట్టం

మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (E.D) కి దోషిగా తేలిన నిందితుల ఆస్తులను అటాచ్ చేయడానికి లేదా స్వాధీనం చేసుకోవడానికి, ఆస్తులను స్తంభింపచేయడానికి అధికారం అప్పగించబడింది. ఆస్తులను అటాచ్ చేయడం అంటే ఆస్తిని మార్చడం, బదిలీచేయడం, లేదా ఆస్తిని తరలించడాన్ని నిషేధించడం.

భారతదేశం నుండి పారిపోయిన, పారీలో ఉన్న వారి కేసులను నిర్వహించడం E.D యొక్క ముఖ్యకర్తవ్యం. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ళ చట్టం 2018, దేశంలోని చట్టాన్ని తప్పించుకోకుండా మరియు న్యా వ్యవస్థను కాపాడుకోవడానికి దేశం యొక్క అధికార పరిధికి వెలువపల ఉండడాన్ని ఎంచుకునే ఆర్థిక నేరస్థులను నిషేదిస్తుంది. ఈ చట్టం ప్రకారం దోషలను కనిపెట్టడానికి మరియు అరెస్ట్ చేయడానికి భారత ప్రభుత్వానికి మరియు విదేశీ ప్రభుత్వాలకు సహకరించే అధికారం ఈడికి యివ్వబడింది.

**ప్రత్యేక కోర్టులు :**

మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 సెక్షన్ 4 ప్రకారం శిక్షార్హమైన నేరం విచారణ కోసం, కేంద్ర ప్రభుత్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని, సంప్రదించి, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ప్రత్యేక కోర్టు లేదా సెషన్ కోర్టులను నియమించింది. వీటిని "PMLA కోర్టు" అనికూడ అంటారు. PMLA కోర్టు ఆమోదించిన ఏదైనా ఉత్తర్వుపై ఏదైన అప్పీలను నేరుగా హైకోర్టులో అధికార పరిధిక పంపవచ్చు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం భాదితుడి ప్రాధమిక హక్కుపై నేరుగా భంగం కలిగించే ఏ సందర్భంలోనైనా చట్టం యొక్క సారాంశం నుండి వైదొలగకుండా ఉండటమే న్యాయ నిర్ణీత అధికారి కర్తవ్యం.

## 11.6 సంతానం కమిటి :

**భారతదేశంలో అవినీతి సంతానంకమిటి నివేదిక:**

అవినీతి అనేది నిజాయితీలేని లేదా నేపూరితమైన చర్యయొక్క ఒక రూపం. ఒక వ్యక్తి లేదా సంస్థ ద్వారా అధికారం అప్పగించబడి, తరచుగా అక్రమ ప్రయజనాలను పొందడాన్ని అవినీతి అంటారు. 1964లో సంతానం కమిటి నివేదికలో అవినీతికి 4 ప్రధాన కారణాలను గుర్తించింది. అవి:

1) రెగ్యులర్ ఫంక్షన్‌ల ద్వారా ప్రభుత్వం నిర్వహించగలిగే దానికంటే ఎక్కువగా ప్రభుత్వం తీసుకుంటుంది. ప్రభుత్వంలోని వివిధ వర్గాలకు చెందిన అధికారాల వినియోగంలో వ్యక్తిగత విచక్షణకు అవకాశం...మరియు పౌరులకు వారిద్దైనందిన వ్యవహాలలో ప్రాముఖ్యత కలిఇన వివిధ విషయాలతో వ్యవహరించడంలో గటిబిజిగా ఉండే విధానాలు.
2) మానవ వనరుల నిర్వహణ అనేది అన్ని సంస్థలకు సాధారణం మరియు రిక్రూట్‌మెంట్, ప్రమోషన్, బదిలీ మరియు పోస్టింగ్‌లకు సంబంధించిన ప్రక్రియలు తారుమారు మరియు అవినీతికి గురవుతాయి.
3) అన్ని పబ్లిక్ సర్వీస్ సెక్టార్‌లకు సాధారణం కానప్పటికి ప్రజలకు సేవలను అందించడం.
4) ప్రధానంగా పౌరులలో అవగాహన లేకపోవడం మరియు అసమర్ధమైన పిర్యాదుల పరిష్కార యంత్రాంగం కారణంగా చట్టాలు, నియమాలు మరియు నిబంధన అమలు కూడా అవినీతికి గురయ్యే అవకాశం ఉంది.

## 11.7 అవినీతిని అరికట్టడానికి మార్గాలు :

అమలులో ఉన్న నియమ నిబంధనలను పూర్తిగా సమీక్షించి వాటి ద్వారా నియమాల సరళీకరణను మరియు ప్రమాణికల వలన స్పష్టత మరియు జవాబుదారితనాన్ని మెరుగు పరుస్తుంది. తద్వారా వ్యక్తులు, వ్యవస్థన పట్ల విచక్షణ మరియు ఏక పక్షతను తొలగించి, అవినీతిని తగ్గించవచ్చు.

ఇ-ప్రొక్యూర్‌మెంట్‌లు, ఇ-చెల్లింపులు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి మరియు అవగాహన కల్పించడానికి వెబ్‌సైట్‌లు, పబ్లిక్ డీల్ చేసే ప్రదేశాలలో సిసిటివి, జిపిఎస్ ఎనేబుల్డ్ పరికరాలు / ఆర్.ఎఫ్.ఐ.డి లు,మోసాలను గుర్తించడానికి కంప్యూటర్ అఫెస్టెడ్ ఆడిట్ టెక్నికల్ మొదలైన సాంకేతికతను ఉపయోగించుకోవడం.

పారదర్శకత, జవాబుదారితనం, అవగాహన ప్రజలను మరియు ప్రభుత్వ అధికారాలను మధ్య సమాచార అంతరాన్ని తొలగిస్తుంది. తద్వారా అవినీతి తగ్గుతుంది.

సజావుగా పనిచేయడానికి, సమర్ధతకోసం, తప్పుగా ప్రవర్తించినప్పుడు సమర్ధవంతమైన కాలపరిమితితో కూడిన శిక్షాత్మక చర్యతోపాటు స్పష్టమైన జవాబుదారితనంతో కూడిన వ్యవస్థ అవసరం.

ప్రభుత్వ అధికారులకు తను విధలు మరియు భాద్యతలు ప్రవర్తనా నియమావళి నియమాలు, విధానాలు మొదలైన వాటిపై అవగాహన కల్పించాలి.

క్రమబద్ధమైన పర్యవేక్షణ, నియంత్రణ, సాధారణ తనిఖీలు ఆశ్యర్యకరమైన తనిఖీలు, ఆడిట్ మరియు సమీక్షలు అసహజమైన మరియు అవినీతి ప్రవర్తనపై చెక్ ఉంచుతాయి. దుష్ప్రవర్తనను ముందస్తుగా గుర్తించడం వలన నష్టాన్ని తిరిగి పొందడం మరియు తదుపరి నష్టాన్ని నియంత్రించడం సులభతరంకావచ్చు.

అనుకూలమైన పనివాతావరణం, నైతిక, విలువలను పెంపొదించడం ముఖ్యంగా యువతలో నైతిక ప్రవర్తనను పెంపొందించడం ముఖ్యమైన సాధనం.

సమగ్రత ఒప్పందం, ప్రభుత్వం / ప్రభుత్వశాఖ / కంపెని మొదలైనవాటి మధ్య వ్రాతపూర్వక ఒప్పందం, మరియు బిడ్డర్లందరూ లంచం, సిండికేట్ మొదలైన వాటికి దూరంగా ఉండేందకు అంగీకరిస్తున్నారు.

సి.వి.సి ద్వారా ప్రభుత్వరంగా సంస్థలు, ఆర్ధిక సంస్థలు, విభాగలు మరియు మంత్రిత్వశాఖల వార్షిక స్కోర్‌లు, ర్యాంకింగ్‌లను ప్రభుత్వ సంస్థల దీర్ఘకాలిక సామర్ధ్యం లాభదాయకత మరియు సుస్థిరతతో అనుసంధానించడం విజిలెన్స్‌కు సంబంధించిన ప్రధాన విధి.

భారతదేశం పారదర్శకత ప్రకారం 180 దేశాలలో 81వ స్థానంలో నిలిచింది. అవినీతి నిరోధక చట్ట సవరణ 2018, భారతదేశంలోని అవినీతి ముప్పును ఎదుర్కోవడానికి ప్రశంసనీయమైన సంస్థ. భారతదేశంలో అవినీతి అనేది బ్యూరోక్రసి, రాజకీయాలు మరియు నేరస్థుల మధ్య అనుబంధం యొక్క పర్యవసానం.

## 11.8 విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు:

అవినీతి అరికట్టడంలో, అవినీతికి వ్యతిరేకంగా పోరాటంలో సమిష్టిగా పాల్గొనడానికి మరియు దాని ఉనికి, కారణాలు, ముప్పుగురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి అన్ని వాటా దారులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరము అక్టోబర్ చివరి వారంలో విజిలెన్స్ అవేర్‌నస్ వారోత్సవాలు పాటించడం జరుగుతుంది. దీనిని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ నిర్వహిస్తుంది. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలోని

అన్ని విజిలెన్స్ కార్యకలాపాలను పర్యవేక్షించడం, పాలనలో దైహిక అభివృద్ధిని తీసుకువావడానికి వారి విజిలెన్స్ పనిని ప్లాన్ చేయడం, అమలు చేయడం మరియు సమీక్షించడంలో కేంద్రప్రభుత్వం మరియు దాని పరిధిలోని సంస్థల్లోని వివిధ అధికారులకు సలహా ఇస్తుంది. పారదర్శకత, జవాబుదారితనం, మరియు అవినీతి రహిత పాలనను సాధించె విధానం పట్ల సామాన్యులకు, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడానికి కూడ ప్రయత్నిస్తుంది.

"అభివృద్ధి చెందిన దేశంకోసం అవినీతి రహిత భారతదేశం" అనే థీమ్‌తో 2022 విజిలెన్స్ అవెర్‌నెస్ వీక్ 31 అక్టోబర్ నుండి నవంబర్ 6, 2022 వరకు నిర్వహించడినది "సమగ్రత ప్రతిజ్ఞతతో ప్రారంభమవుతుంది.

## 11.9 యాంటీ కరప్షన్ బ్యూరో :

అవినీతి నిరోధక చట్టము, 1988 ప్రకారం నేరాలకు పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులు మరియు ప్రవేట్ వ్యక్తులపై ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో అవినీతికి వ్యతిరేకంగా పోరాడడంలో ఈ ఏజన్సీ ప్రత్యేకత కలిగి ఉంది. ఇది 2 జనవరి 1964న స్థాపించబడినది. సీనియర్ ఐ.పి.యస్ అధికారి శ్రీ పెండ్యాల సీతీరామ ఆంజనేయులు ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక బ్యూరో ప్రస్తుత డైరెక్టర్ జనరల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నవంబర్ 8న సభ్యులకు యిచ్చిన 'సాధారణ' సమ్మతిని ఉపసంహరించుకుంది. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ (...........) రాష్ట్రంలోని సెర్చ్ మరియు ఆపరేషన్‌లను ప్రభుత్వానికి తెలియజేయకుండా ఎ.సి.బి ఏపిలో గొప్ప పాత్ర వహించవలసి ఉంది.

**సిబిఐ :**

సిబిఐ దర్యాప్తు యొక్క చట్టపరమైన అధికారాలు కేంద్రపాలిత ప్రాంతాల అధికారులకు అధికారాలు, విధులు, భాధ్యతలు అందిస్తుంది. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ సమ్మతికిలోబడి, దర్యాప్తుకోసం సి.బి.ఐ యొక్క అధికారాలను కేంద్రప్రభుత్వం ఏదైనా ప్రాంతానికి విస్తరించవచ్చు. సబ్-ఇన్‌స్పెక్టర్ స్థాయి లేదా అంతకంటే ఎక్కువ స్థాయి ఉన్న సి.బి.ఐ సభ్యులను పోలీస్ స్టేషన్‌లకు భాధ్యత వహించె అధికారులుగా పరిగణించవచ్చు. కేంద్రప్రభుత్వ నోటిఫికేషన్‌తో మాత్రమే సి.బి.ఐ దర్యాప్తు చేయవచ్చు 2022 మొత్తం 9 రాష్ట్రాలు ఆయా రాష్ట్రాల్లోని కేసులను దర్యాప్తు చేసేందుకు సిబి.ఐ కి సాధారణ సమ్మతిని ఉపసంహరించుక్ను మన ప్రధాన మంత్రి కార్యాలయం పేర్కొంది.

సి.బి.ఐ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ భారతదేశంలోని ప్రధాన దర్యాప్తు సంస్థ. ఇది మిస్ట్రీఆఫ్ పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ అండ్ పెన్సన్స్ అధికార పరిధిలో పనిచేస్తుంది. వాస్తవానికి అంచము మరియు ప్రభుత్వ అవినీతిని పరిశోధించడానికి 1965లో ఏర్పాటు చేయబడింది. బహుళరాష్ట్ర వ్యవస్థీకృత నేరాలు, బహుళ ఏజెన్సీలేదా అంతర్జాతీయ కేసులచే అమలు చేయబడిన కేంద్ర చట్టాల ఉల్లంఘనను పరిశోధించడానికి విస్తరించిన అధికార పరిధిని పొందింది. ఈ ఏజెన్సీ అనేక ఆర్థిక నేరాలు, ప్రత్యేక నేరాలు, అవినీతి కేసులు

మరియు యితర కేసులను దర్యాప్తు చేస్తుంది. సమాచార హక్కుచట్టంలోని నిబంధనల నుంచి సి.బి.ఐ కి మినహాయింపు ఉంది. సి.బి.ఐ అనేది ఇంటర్‌పోల్‌తో అనుసంధానం కోసం భారతదేశం యొక్క అధికారికంగా నియమించబడిన ఏకైక సంస్థ.

**ముగింపు:**

పరిపాలనలో జరుగుతున్న అవినీతిని, అలసత్వాన్ని, తగ్గించి, పాలకులలో, ఉద్యోగులలో జవాబుదారితనాన్ని పెంపొందించడానికి భారత ప్రభుత్వం నిష్పక్షపాతముగా, వ్యవస్థలు వాటి కార్యకలాపాలు కొనసాగించెందుకు అవకాశం కల్పించాలి దేశాభివృద్ధికి ప్రజాసంక్షేమానికి అవినీతి అనేది ఒక కలంకితము అవుతుంది.

References Books

1) తెలుగు అకాడమి బుక్స్ (our constitution Dr. Harati Dwarakarath)

2) J.C. Johari - Indian Constitution.

3) KA మంజూర్ Vs అసిస్టెంట్ డైరెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్

ప్రశ్నలు :

**I**

(1) కేంద్రవిజిలెన్స్ కమిషన్ వ్యవస్తీకరణ, విధులను తెలుపుము

(2) కేంద్ర నిఘా విభాగం వివరించిన వివిధ అవినీతి మార్గాలు ఏమి?

(3) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ యొక్క కార్యకలాపాలు తెలుపుము.

**II**

(1) సంతానం కమిటి

(2) విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు.

(3) అవినీతిని అరికట్టడానికి ఉన్న మార్గాలు తెలుపుము

పసుమర్తి అప్పారావు
లెక్చరర్
టి.జె.పి.యస్ కాలేజ్
గుంటూరు.

**పాఠం - 12**

# లోక్‌పాల్ లోకాయుక్త

**లక్ష్యం:-** ఈ పాఠం చదివిన తరువాత కేంద్రస్థాయిలో జరిగే అవినీతిని అరికట్టటానికి లోక్ పాల్ వ్యవస్థ ఏర్పాటు చేశారు, అది ఏ విధంగా తన విధులను నిర్వహిస్తుంది మరియు రాష్ట్ర స్థాయిలో లోకాయుక్త అధికారాలు, విధులు నిర్వహిస్తుందో తెలుసుకోవచ్చు.

12.1 పరిచయం

12.2 చారిత్రక నేపథ్యం

12.3 లోక్‌పాల్, లోకాయుక్త చట్టంలోని ముఖ్యాంశాలు

12.4 ఛైర్‌పర్సన్ లేదా సభ్యులు అర్హతలు

12.5 ఛైర్‌పర్సన్, సభ్యుల ఎంపిక

12.6 పదవీకాలం

12.7 జీత భత్యాలు

12.8 అధికారాలు - విధులు

12.9 లోకాయుక్త

12.10 లోకాయుక్త వ్యవస్థ లక్షణాలు

12.11 లోకాయుక్తా నియామకం - పదవీకాలం

12.12 ముగింపు

12.13 మాదిరి ప్రశ్నలు

12.14 చదవదగిన పుస్తకాలు

## 13.1 పరిచయం :

A Lokpal means [Saskrit - Lokapala -- Defender of prepare (or) people's Friend.ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజలకు పలురకాల సేవలందించడంతోపాటు, ప్రభుత్వ రంగాల్లో జరిగే అవినీతి కార్యకలాపాలను నియంత్రించడానికి విజిలెన్స్ కమీషన్లను ఏర్పాటు చేశాయి. అయితే రాజకీయ అవినీతి నిర్మూలనకు ఇంతవరకు కేంద్రస్థాయిలో ఎటువంటి ఏర్పాటు చేయలేదు. ఈ కర్తవ్య నిర్వహణకు స్కాండినేవియా దేశాల్లో (స్వీడన్, డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే) ఏర్పాటు చేసిన 'అంబుడ్స్‌మన్ (Ombudsman)' లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసి పౌరకేశ నివారణకు కేంద్రస్థాయిలో లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటుకు 1959 నుండి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికి నేటి వరకు ఒక నిర్దిష్ట రూపం దాల్చలేదు.

## 12.2 చారిత్రక నేపథ్యం :

మొదటిసారిగా 1959లో ఆనాటి కేంద్ర ఆర్థికమంత్రి సి.డి. దేశముఖ్ లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు మొదటిసారిగా ప్రతిపాదన చేశాడు.

డా. రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు అత్యున్నత స్థాయిలో ఉన్నవారిపై అవినీతి ఆరోపణలను విచారించడానికి లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూకు సూచించాడు. లక్ష్మీమాల్ సింఘ్వి అనే పార్లమెంట్ సభ్యుడు 1963లో లోక్‌పాల్ అనే పదానికి నామకరణం చేశాడు.

1964లో సంతానం అధ్యక్షతన ఏర్పరచబడిన అవినీతిపై కమిటీ కేంద్రస్థాయిలో లోక్‌పాల్, రాష్ట్రస్థాయిల్లో లోకాయుక్తను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.

1966లో మొరార్జీదేశాయ్ అధ్యక్షతన మొదటి పాలనా సంస్కరణ కమిటీ లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.

ఈ నేపథ్యంలో 1968లో మొట్టమొదటి సారిగా లోక్‌పాల్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కాని 1970లో లోక్‌సభ రద్దు కావడంతో ఆ బిల్లు వెలుగు చూడలేదు. ఆ తర్వాత 1971, 1977, 1985, 1989, 1996, 1998, 2001 వరకు 8 సార్లు మరియు 2004, 2008, 2010 సంవత్సరాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టినా రాజకీయనాయకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో చట్టరూపం సంతరించుకోలేకపోయింది.

లోక్‌పాల్, లోకాయుక్త బిల్లు (2011)ను, 22 డిసెంబరు 2011న లోక్‌సభలో ప్రవేశపెట్టగా 27 డిసెంబరు 2011న లోక్‌సభ ఆమోదించింది. 29 డిసెంబరు 2011న రాజ్యసభలో ఈ బిల్లు ప్రవేశపెట్టబడినది. బిల్లుపై రాజ్యసభలో సుదీర్ఘమైన చర్చ జరిగింది. ఈ చర్చ అర్ధరాత్రి వరకు కొనసాగడంతో సమయాభావం వలన బిల్లుపై ఓటింగ్ జరగలేదు. 21 మే 2012న రాజ్యసభలోని సెలక్ట్ కమిటీకి ఈ బిల్లు నివేదించబడినది. లోక్‌పాల్ లోకాయుక్త బిల్లుకు సవరణలు చేయబడి, 16 డిసెంబరు 2013న రాజ్యసభలో ప్రవేశపెట్టబడింది. దీనిని రాజ్యసభ 17 డిసెంబరు 2013న ఆమోదించింది. లోక్ సభ ఈ బిల్లును తిరిగి 18 డిసెంబరు 2013న ఆమోదించింది. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 1 జనవరి 2014న లోక్‌పాల్ లోకాయుక్త బిల్లు 2013కు ఆమోదం తెలపడంతో చట్టరూపంలో అమల్లోకి వచ్చింది.

## 13.3 లోక్‌పాల్, లోకాయుక్త చట్టంలోని ముఖ్యాంశాలు

ఈ చట్టం భారతదేశమంతటికీ వర్తిస్తుంది. అంతేకాకుండా భారతదేశంతో పాటు విదేశాలలో నివసించే భారత పబ్లిక్ సర్వెంట్లందరికీ వర్తిస్తుంది.

ఈ చట్టం అమలులోకి వస్తే లోక్‌పాల్ అనే వ్యవస్థ ఏర్పాటు చేయబడుతుంది. లోక్‌పాల్ నందు ఒక ఛైర్‌పర్సన్ ఉంటాడు. సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధానన్యాయమూర్తి గాని లేదా మాజీ ప్రధానన్యాయమూర్తి గాని, లేదా సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి గాని, మాజీ న్యాయమూర్తి గాని లేదా ఒక నిష్ణాతుడైన వ్యక్తి గా నియమించబడతాడు.

- 8 మందికి మించకుండా సభ్యులు ఉంటారు. ఈ సభ్యులలో కనీసం 50% సభ్యులు న్యాయ వ్యవహారాల నిపుణులు అయి ఉండాలి. అంతేకాకుండా కనీసం 50% సభ్యులు షెడ్యూల్డ్ కులాలకు, తెగలకు, వెనుకబడిన తరగతులకు చెందినవారై ఉండాలి. వీరిలో ఒకరు మహిళ అయి ఉండాలి.
- న్యాయసభ్యునిగా నియమింపబడే వ్యక్తి సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా మాజీ న్యాయమూర్తి గాని (లేదా) హైకోర్టు ప్రస్తుత లేదా మాజీ ప్రధానన్యాయమూర్తి గాని అయి ఉండాలి.

- ఇతర సభ్యులుగా నియమించబడే వ్యక్తులు అవినీతి వ్యతిరేక విధానం, ప్రభుత్వపాలన, విజిలెన్స్, ఆర్థిక (బీమా, బ్యాంకింగ్), న్యాయ మరియు నిర్వహణ రంగాల వంటివానిలో 25 సంవత్సరాలకంటే తక్కువ కాకుండా నైపుణ్యం, ప్రత్యేక పరిజ్ఞానం కలిగి ఉండి అత్యంత సమగ్రతాభావం కలిగిన వ్యక్తులు అయి ఉండాలి.

## 12.4 ఛైర్‌పర్సన్ లేదా సభ్యులు అర్హతలు :

- పార్లమెంట్ సభ్యుడు లేదా రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంత శాసనసభలలో సభ్యుడై ఉండరాదు.
- ఎటువంటి అనైతిక కార్యకలాపాల చేత గాని శిక్ష విధింపబడి ఉండరాదు.
- పదవీ బాధ్యతలు చేపట్టేనాటికి 45 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగి ఉండరాదు.
- పంచాయతీ లేదా మునిసిపాలిటీ సభ్యుడై ఉండరాదు.
- కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం నుండి తొలగింపబడినవారై ఉండరాదు. అంతేకాకుండా ఎటువంటి లాభదాయకమైన ఆదాయాన్నిచ్చే పదవిలో ఉండరాదు. ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం కలిగి ఉండరాదు. ఎటువంటి వ్యాపారాన్ని లేదా వృత్తిని చేస్తూ ఉండరాదు. ఒకవేళ వీటిలో ఏదైనా పనిచేస్తూ ఉంటే పదవీ బాధ్యతలు చేపట్టే ముందుగా దానిని వదిలివేయాలి.

## 12.5 ఛైర్‌పర్సన్, సభ్యుల ఎంపిక :

ఛైర్‌పర్సన్ మరియు సభ్యులు క్రిందివారితో కూడిన ఒక ఎంపిక కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్రపతిచే నియమింపబడతారు.

ఎంపిక కమిటీ చైర్మన్ - ప్రధానమంత్రి.

సభ్యులు - లోక్‌సభ స్పీకరు.

- లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు
- భారత ప్రధానన్యాయమూర్తి లేదా అతనిచే నామినేట్ చేయబడిన ఒక సుప్రీంకోర్టు న్యాయమూర్తి.
- రాష్ట్రపతి నామినేట్ చేసిన ఒక విశిష్ట న్యాయ నిపుణుడు -

ఎంపిక కమిటీ ఛైర్‌పర్సన్ లేదా సభ్యుల నియామకంలో సెర్చ్ కమిటీ సహాయం పొందవచ్చు. సెర్చి కమిటీ కొందరి పేర్లను ఎంపిక కమిటీకి సూచిస్తుంది. ఆ పేర్లలో నుండి కొందరిని ఎంపిక కమిటీ నిర్ణయిస్తుంది. సెర్చ్ కమిటీలో అవినీతి వ్యతిరేక విధానం, ప్రభుత్వపాలన, విజిలెన్స్, విధాననిర్ణయం, ఆర్థికరంగం వంటి రంగాలలో నైపుణ్యం, ప్రత్యేక అనుభవం కలిగిన కనీసం 7 మంది సభ్యులు ఉంటారు. సెర్చ్ కమిటీలోని సభ్యులలో 50%నికి తగ్గకుండా సభ్యులు షెడ్యూల్డ్ కులాలు, తెగలకు, OBCలకు, మహిళలకు చెందినవారై ఉండాలి..

## 12.6 పదవీ కాలం :

లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ మరియు సభ్యులు ఎంపిక కమిటీ సిఫారసు మేరకు రాష్ట్రపతిచే నియమించబడతారు (Appointed by the President by warrant under his hand and seal). వీరి పదవీకాలం 5 సంవత్సరాలు లేదా 70 ఏళ్ళ వయసు, ఈ రెండింటిలో ఏది ముందు పూర్తవుతుందో అంతకాలం పదవిలో కొనసాగుతారు. వీరి పదవీకాలం ముగిసే 3 నెలల ముందుగానే

రాష్ట్రపతి వీరి స్థానాన్ని భర్తీచేసేందుకు చర్యలు చేపడతాడు. ఛైర్పర్సన్ లేదా సభ్యులు పదవీకాలం పూర్తయిన తర్వాత తిరిగి నియమింపబడేందుకు అనర్హులు. అయితే సభ్యులు ఎవరైనా తమ పదవీకాలం ఇంకా మిగిలి ఉంటే 'ఛైర్‌పర్సన్ గా నియమింపబడవచ్చు. సభ్యునిగా, ఛైర్‌పర్సన్ గా కలిపి పనిచేసిన మొత్తం కాలం 5 సంవత్సరాలు మించరాదు.

ఛైర్‌పర్సన్ లేదా సభ్యులుగా పనిచేసిన వ్యక్తులు ఎటువంటి రాయబార పదవికి గాని, కేంద్రపాలిత ప్రాంత పాలకుని పదవికి గాని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఎటువంటి ఆదాయాన్నిచ్చే పదవికి గాని అనర్హులౌతారు. అంతేకాకుండా 5 సంవత్సరాలపాటు రాష్ట్రపతి పదవికి గాని, ఉపరాష్ట్రపతి పదవికి గాని, పార్లమెంట్ సభ్యత్వానికి లేదా శాసన సభ్యత్వానికి జరిగే ఎన్నికలలో గాని మునిసిపాలిటీ, లేదా పంచాయతీ సభ్యత్వానికి గాని పోటీ చేయడానికి అనర్హులు.

## 12.7 జీతభత్యాలు :

లోక్‌పాల్‌కు సంబంధించిన అన్ని పాలనాపరమైన ఖర్చులు, ఛైర్‌పర్సన్, సభ్యుల, ఉద్యోగుల జీతభత్యాలు భారత సంఘటిత నిధి నుండి చెల్లించబడతాయి. లోక్‌పాల్‌కు సొంత దర్యాప్తు విభాగంతోపాటు, సొంత ప్రాసిక్యూషన్ విభాగం కూడా ఉంటుంది. లోక్‌పాల్ ఛైర్‌పర్సన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో. సమానమైన వేతనం చెల్లించబడుతుంది. సభ్యులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల జీతానికి సమానమైన వేతనం చెల్లించబడుతుంది. ఛైర్‌పర్సన్ జీతం రూ.2,80,000/-లు సభ్యుల జీతం రూ.2,50,000/-లు.

## 12.8 అధికారాలు - విధులు :

ప్రధానమంత్రిపై అవినీతి ఆరోపణలకు సంబంధించి లోక్‌పాల్ విచారణ జరుపవలసిన సందర్భంలో ఛైర్‌పర్సన్‌తో సహా అందరు సభ్యులూ ఆ విచారణను ప్రారంభించేందుకు అనుమతించాలి మరియు మొత్తం సభ్యులలో 3/4 వంతు మంది సభ్యులు ఆ విచారణను జరిపేందుకు ఆమోదించాలి. ప్రధానమంత్రిపై చేయబడిన అవినీతి ఆరోపణలు అంతర్జాతీయ సంబంధాలు, దేశ బాహ్య మరియు అంతరంగిక భద్రత, ప్రజాశ్రేయస్సు, అణుశక్తి మరియు అంతరిక్ష రంగానికి సంబంధించినవైతే అటువంటి ఆరోపణలపై లోక్‌పాల్ ఎటువంటి విచారణ జరుపదు.

- ఒకవేళ ప్రధానమంత్రి పై ఏదైనా ఆరోపణపై విచారణ జరుపవలసి వస్తే అటువంటి విచారణ మొత్తాన్ని అతిరహస్యంగా చేయవలెను. ఒకవేళ ప్రధానమంత్రిపై వచ్చిన ఫిర్యాదును లోక్‌పాల్ తోసిపుచ్చవలెనని భావించినట్లయితే దానికి సంబంధించిన రికార్డులను ప్రచురించకుండా మరెవరికీ అందకుండా చేయాలి. కేంద్రప్రభుత్వ మంత్రులు, ప్రస్తుత, మాజీ పార్లమెంట్ సభ్యులు కూడా లోక్‌పాల్ పరిధిలోకి వస్తారు. అయితే పార్లమెంట్లో నివేదించిన అంశాలపై గానీ, అక్కడ ఓటింగ్ జరిగిన అంశాలపైగానీ లోక్‌పాల్‌కు అధికారం ఉండదు.
- కొన్ని కేసులకు సంబంధించి లోక్‌పాల్, సివిల్ కోర్టు కలిగి ఉండే అధికారాలను కలిగి ఉంటుంది.
- ప్రాథమిక విచారణార్థం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలోని ఏ అధికారి లేదా ఏ సంస్థ లేదా ఏ దర్యాప్తు సంస్థ సేవలనైనా వినియోగించుకోవచ్చు,
- విచారణార్థం ఎటువంటి డాక్యుమెంటునైనా, అఫిడవిట్లనైనా లోక్‌పాల్ పరిశీలించే అధికారాన్ని కలిగి ఉంటుంది. దర్యాప్తు 60 రోజుల్లో, విచారణ 6 నెలల్లో ముగించాలి.
- CBIతో సహా మరే ఇతర దర్యాప్తు సంస్థకైనా లోక్‌పాల్ ద్వారా నిర్దేశించబడిన కేసులకు సంబంధించి ఆయా సంస్థలపై పర్యవేక్షణాధికారం ఉంటుంది.

- CBI డైరెక్టర్‌గా ఎంపికయ్యే అధికారి పేరును ప్రధానమంత్రి నేతృత్వంలోని ఒక అత్యున్నత బృందం సిఫారసు చేస్తుంది.

- లోక్‌పాల్ నిర్దేశించిన కేసును దర్యాప్తు చేస్తున్న CBI అధికారుల బదిలీ లోక్‌పాల్ ఆమోదం మేరకే జరగాలి. లోక్‌పాల్ చట్టం క్రింద గాని లేదా అవినీతి నిరోధక చట్టం (1988) క్రింద గాని నమోదు చేయబడిన కేసుల విచారణ, తీర్పు కొరకు లోక్‌పాల్ సిఫారసు మేరకు ప్రత్యేక కోర్టులను కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ప్రత్యేక కోర్టులు కేసు విచారణను నమోదైన తేదీ నుండి 1 సంవత్సరంలోపు పూర్తిచేసి తీర్పు వెలువరించాలి. ఒకవేళ ఒక సంవత్సరం దాటితే దానికిగల కారణాలను లిఖితపూర్వకంగా రికార్డు చేసి, కేసును మరొక 3 నెలలు పొడిగించవచ్చు. ఇలాగే మరో మూడు నెలలు పొడిగిస్తూ కూడా పోవచ్చు. అయితే కేసు నమోదైన రోజునుండి తీర్పు వెలువరించడం గరిష్ఠంగా రెండు సంవత్సరాల కాలపరిమితిలోపే పూర్తి చేయాలి.

- అవినీతి నిరోధక చట్టం-1988 పరిధిలోకి వచ్చే గ్రూప్-ఏ, బీ, సీ, డీ తరగతుల్లోని ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ నిధులతో నడుస్తున్న, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న సంస్థల ఉద్యోగులు అందరూ కూడా లోక్‌పాల్ పరిధిలోకి వస్తారు. అయితే.. గ్రూప్-ఏ, బీ తరగతులు అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలు దర్యాప్తు తర్వాత లోక్‌పాల్‌కు వస్తాయి. గ్రూప్-సీ, డీ ఉద్యోగులపై ఆరోపణలను చీఫ్ విజిలెన్స్ కమీషనర్ దర్యాప్తు CVC చేసి, లోక్‌పాల్‌కు నివేదిస్తారు. నిజాయితీ, నిబద్ధత గల ప్రభుత్వోద్యోగులకు తగినంత భద్రత ఉంటుంది.

- ప్రభుత్వం నిధులు అందించే సొసైటీలు, ట్రస్టులు, సంఘాలు లోక్‌పాల్ పరిధిలోకి వస్తాయి. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్సీఆర్ఏ) కింద విదేశాల నుంచి ఏటా రూ.10 లక్షలకు మించి నిధులు అందుకునే అన్ని సంస్థలూ దీని పరిధిలో ఉంటాయి. ప్రార్థనాస్థలాల నిర్మాణాలకు, మతపరమైన కార్యక్రమాలకు, సేవా కార్యక్రమాలకు సంబంధించిన ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు లోక్‌పాల్ పరిధిలోకి రావు.

- విచారణ పెండింగ్‌లో ఉన్నా కూడా అవినీతిమార్గాల్లో సంపాదించిన ఆస్తుల అటాచ్‌మెంట్, జప్తుకు కూడా అవకాశముంటుంది. ఈ చట్టం కింద దోషులుగా నిర్ధారితులైన వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. తప్పుడు ఫిర్యాదులు చేసినట్లయితే ఏడాది వరకూ జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించటం జరుగుతుంది. లోక్‌పాల్ ఛైర్‌పర్సన్ లేదా సభ్యులపై వచ్చే అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులపై లోక్‌పాల్ విచారణ జరుపదు. ఎవరైనా లోక్‌పాల్ సభ్యుడు/సభ్యురాలిపై కనీసం 100 మంది పార్లమెంటు సభ్యులు సంతకాలు చేసి పిటిషన్ సమర్పించినట్లయితే రాష్ట్రపతి సూచన మేరకు సుప్రీంకోర్టు సదరు సభ్యుడు/సభ్యురాలిపై విచారణ చేపట్టవచ్చు. లోక్‌పాల్ సభ్యుడిని/సభ్యురాలిని సుప్రీంకోర్టు సిఫారసు లేదా మధ్యంతర ఉత్తర్వు మేరకు రాష్ట్రపతి సస్పెండ్ చేయవచ్చు. ఎవరైనా లోక్‌పాల్ సభ్యుడు/సభ్యురాలిపై సుప్రీంకోర్టు విచారణ అనంతరం సదరు సభ్యుడు/సభ్యురాలిని రాష్ట్రపతి తొలగించవచ్చు.

- న్యాయవ్యవస్థపై విచారణ చేసే అధికారం లోక్‌పాల్‌కు ఉండదు.

- లోక్‌పాల్, లోకాయుక్త బిల్లు 2013 చట్టరూపంలో అమలులోనికి వచ్చిన తేదీ నుండి ఏడాదిలోపు అన్ని రాష్ట్రాలు తమ రాష్ట్రంలో తగిన చట్టాన్ని రూపొందించి లోకాయుక్తను ఏర్పాటు చేసుకోవాలి.

**SPECIALNOTE :** CBI ని స్వతంత్ర ప్రతిపత్తిగల సంస్థగా మార్చాలని సుప్రీంకోర్టు 1998లో వినీత్ నారాయణ్ కేసులో తీర్పునిచ్చింది. ఇటీవల సుప్రీంకోర్టు CBI గురించి ప్రస్తావిస్తూ వినీత్ నారాయణ్ కేసు తీర్పు వెలువడి 15 సంవత్సరాలు అయినప్పటికీ CBI పై గల రాజకీయ ప్రభావం దాని నిష్పాక్షికతను దెబ్బతీస్తూనే ఉందంటూ కీలక వ్యాఖ్యలు చేసింది.

## 12.9 లోకాయుక్త

రాష్ట్ర పాలనాయంత్రాంగ ప్రముఖులు మరియు ఉన్నత ఉద్యోగుల అధికార దుర్వినియోగాన్ని అరికట్టేందుకు - 1966 "అంబుడ్స్‌మన్" వంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించిన మొదటి పాలనా సంస్కరణ సంఘ సిఫారసుల మేరకు రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటు చేయబడినది. రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఆయా రాష్ట్రప్రభుత్వాలు లోకాయుక్త చట్టాన్ని రూపొందించి అమలులోకి తెచ్చాయి. అయితే అన్ని రాష్ట్రాల లోనూ లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటుచేయబడలేదు. ప్రస్తుతం మనదేశంలోని 19 రాష్ట్రాలలో లోకాయుక్త వ్యవస్థ పనిచేస్తోంది. దేశంలో మొదటిసారిగా ఒరిస్సా 1970లో లోకాయుక్త చట్టాన్ని రూపొందించినప్పటికీ అది 1983లో అమలులోనికి వచ్చింది. కాని 1971లో మహారాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే ప్రథమంగా లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటుచేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో లోకాయుక్త, ఉపలోకాయుక్త చట్టం (1983) 1 నవంబర్, 1983 నుండి అమల్లోకి వచ్చింది. 15 నవంబర్, 1983 నుండి లోకాయుక్త వ్యవస్థ పనిచేస్తోంది.

## 12.10 లోకాయుక్త వ్యవస్థ లక్షణాలు

(1) కార్యనిర్వాహక వ్యవస్థ నియంత్రణలో లేకుండా స్వతంత్రంగా పనిచేస్తుంది.

(2) ఒక పద్ధతి ప్రకారం గిరి గీసుకుని కాకుండా అనుకూల విధానాలతో, సులభరీతిలో ఫిర్యాదులు చేసేందుకు అందుబాటులో ఉండటం.

(3) దాదాపు ఉచితంగా మరియు వేగవంతమైన సేవలను పౌరులకు అందించడం.

## 12.11 లోకాయుక్త నియామకం - పదవీకాలం

- హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తిని లేదా మాజీ న్యాయమూర్తిని లోకాయుక్తగా గవర్నర్ నియమిస్తాడు.
- లోకాయుక్త ఎంపిక కమిటీలో ముఖ్యమంత్రిని, మంత్రిమండలిని, ప్రతిపక్ష నాయకున్ని, అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించిన తర్వాత గవర్నర్ లోకాయుక్త నియామకం జరిపి అతనిచేత ప్రమాణస్వీకారం చేయిస్తాడు.
- జిల్లా న్యాయమూర్తిని ఉపలోకాయుక్తగా నియమిస్తాడు.
- పదవీకాలం 5 సంవత్సరాలు. వీరు తిరిగి ఈ పదవులు పొందడానికి అనర్హులు.
- లోకాయుక్తకు సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఉంటాయి.
- లోకాయుక్త పాలనాధిపతి రిజిస్ట్రార్, ప్రత్యేక ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హోదాలో విచారణ సంచాలకుడు ఉంటాడు. ఈయనకు సహాయకులుగా నలుగురు ఉపసంచాలకులు, ముగ్గురు విచారణాధి కారులు, నలుగురు పోలీస్ కానిస్టేబుల్స్ మరియు ఇద్దరు జవానులు ఉంటారు.

## 12.12 లోకాయుక్త పరిధిలోకి వచ్చే అంశాలు

- ప్రభుత్వ అధికార దుర్వినియోగం
- ప్రభుత్వ ఉద్యోగి అవినీతి కార్యకలాపాలు
- బాధితులెవరైనా ఈ వ్యవస్థ దృష్టికి తమ అభియోగాలను తేవచ్చు. అప్లికేషనుతోపాటు రూ.150 డి.డి. జతపర్చాలి.
- 6 ఏళ్ల లోపు జరిగిన సంఘటనలకు సంబంధించి మాత్రమే ఫిర్యాదులను స్వీకరిస్తుంది.

- తనంతట తానుగా కూడా చొరవ తీసుకుని విచారణ జరపవచ్చు. గవర్నర్ ఆదేశాల మేరకు కూడా విచారణ జరపవచ్చు.

- ప్రస్తుత మాజీ మంత్రులు, శాసనసభ్యులు, జిల్లాపరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, మున్సిపాలిటీల ఛైర్మన్లు, స్థానిక సంస్థల నిర్వహణ అధ్యక్షులు, సంచాలకులు, సహకారసంఘం అధ్యక్షులు, విశ్వవిద్యాలయాలు, ఉపకులపతి, రిజిస్ట్రార్, ప్రభుత్వోద్యోగులు దీని పరిధిలోకి వస్తారు.

- లోకాయుక్త ఫిర్యాదులను విచారించి, నివేదిక తయారుచేసి, నిందితుడు పనిచేసే శాఖాధికారికి తగిన సిఫారసులు చేస్తుంది. సంబంధిత అధికారి మూడునెలల్లోపు తగిన చర్యలు తీసుకుని ఆ సమాచారాన్ని లోకాయుక్తకు తెలియచేయాలి. అలాకాకుండా సంబంధిత శాఖ నివేదిక అమలుకు విముఖత చూపితే, దానిపై లోకాయుక్త ప్రత్యేక నివేదికను గవర్నరుకు సమర్పిస్తుంది. గవర్నరు దానిని శాసనసభలో ప్రవేశపెడతారు.

- ప్రస్తుతం దేశంలో లోకాయుక్త పనిచేస్తున్న రాష్ట్రాలు - ఆంధ్రప్రదేశ్, అసోం, బీహార్, ఛత్తీస్గఢ్, ఢిల్లీ, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్.

- ఒడిషా, పంజాబ్ లలో లోకాయుక్తను లోక్‌పాల్‌గా పిలుస్తారు. ఛత్తీస్‌గడ్‌లో లోకాయుక్తను లోక్‌ఆయోగ్ గా పిలుస్తారు.

- ఇటీవల గోవా రాష్ట్రంలో నూతనంగా లోకాయుక్త ఏర్పాటు చేయబడినది. సుప్రీంకోర్టు మాజీ న్యాయ మూర్తి జస్టిస్ B. సుదర్శన్‌రెడ్డి 16 మార్చి, 2013న గోవా మొదటి లోకాయుక్తగా గవర్నర్ బి.వి. వాంఛూ ఎదుట ప్రమాణస్వీకారం చేశారు.

- ఆంధ్రప్రదేశ్లో లోకాయుక్తగా జస్టిస్ B. సుభాషణ్ రెడ్డి 12 అక్టోబర్, 2012న నియమితులయ్యారు. ఈయన 5 సంవత్సరాలపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

- ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త ఇటీవలి కాలంలో అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక ఫిర్యాదులను త్వరితగతిన విచారించి తగిన తీర్పులను వెలువరిస్తోంది.

- కర్ణాటక లోకాయుక్తగా 2006 నుండి 2011 వరకు విధులు నిర్వర్తించిన జస్టిస్ N. సంతోష్ హెగ్డే అక్రమ గనుల త్రవ్వకానికి సంబంధించి సమర్థవంతంగా నివేదికలు సమర్పించారు. తద్వారా కర్ణాటకలో ప్రజాధనాన్ని కాపాడేందుకు, అక్రమ త్రవ్వకాల నిషేధానికి ఉత్తర్వులు వెలువడినవి.

- బూట్ల పేరుతో కోట్లు కొల్లగొట్టారు... D.G.P. కార్యాలయంలో మరోసారి అక్రమాలకు రంగం సిద్ధం''. శీర్షికన 10 అక్టోబర్, 2010న ఒక దినపత్రిక ప్రచురించిన పరిశోధనాత్మక కథనాన్ని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ S. ఆనందరెడ్డి సుమోటోగా విచారణకు స్వీకరించారు. దీనికి బాధ్యులైన ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ అధిపతి అయిన సీనియర్ I.P.S. అధికారిపై, పాలనాధికారిపై చర్యలు తీసుకోవాలని లోకాయుక్త రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని ఆదేశించారు. అక్రమార్కులపై తీసుకున్న చర్యలను వివరిస్తూ 18 జులై 2011 లోగా నివేదిక సమర్పించాలని లోకాయుక్త తన ఉత్తర్వులలో స్పష్టం చేశారు.

- లోకాయుక్త నియామకంలో గవర్నర్ మంత్రిమండలి సలహాను పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2011 గుజరాత్ లోకాయుక్తగా జస్టిస్ A. R. మెహతాను గవర్నర్ కమలా బేణీవాల్ నియమించడంలో తమను సంప్రదించలేదని గుజరాత్ ప్రభుత్వం సుప్రీంలో వాదించింది. అయితే గవర్నర్ గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించారని, ప్రధానన్యాయమూర్తి ఈ విషయంలో పూర్తి సమాచారాన్ని ముఖ్యమంత్రికి అందించి, ఆయన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే గవర్నర్ కమలా బేణీవాల్ లోకాయుక్తను నియమించారని, కాబట్టి ఈ నియామకం సరైనదేనని, రాష్ట్రప్రభుత్వం లోకాయుక్తకు సహకరించాలని సుప్రీంకోర్టు సూచించింది.

- క్రికెట్‌బాల్ వాహనానికి తగిలిందన్న కారణంతో హైద్రాబాదు పోలీసులు ఓ బాలుడిని చితకబాదిన కేసుకు సంబంధించి ప్రసారమాధ్యమాల ద్వారా తెలుసుకున్న లోకాయుక్త "సుమోటో"గా కేసును స్వీకరించి నిజాలను తెలుసుకొనేందుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముజమిల్ అనే బాలుడి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో సమీక్షించారు. ముజమిల్‌పై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుళ్ళపై విచారణ చేపట్ట నున్నట్లు లోకాయుక్త విచారణాధికారి B. సర్సింహారెడ్డి తెలిపారు. బాధ్యులపై శాఖాపరమైన చర్యలు. తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియచేస్తామని ఆయన వివరించారు.

**NOTE :** అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటుచేసిన రాష్ట్ర తొలి విశ్వవిద్యాలయం "తెలంగాణ విశ్వవిద్యాలయం".

- ఢిల్లీ కేబినెట్ జన్ లోక్‌పాల్ బిల్లును 3 ఫిబ్రవరి 2014న ఆమోదించింది. 13-16 ఫిబ్రవరి వరకు జరిగే ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలలో ఈ బిల్లును ఆమోదించాలని కేజీవాల్ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కాంగ్రెస్, B.J.P కి చెందిన 42 మంది సభ్యులు బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టే తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. జన్ లోక్‌పాల్ బిల్లుపై జరిగిన పరిణామాలతో కేజ్రివాల్ పదవికి రాజీనామా చేశారు.

### ముగింపు :

ప్రపంచంలోని చాలా ప్రజాస్వామ్య దేశాలు లోక్‌పాల్ మరియు లోకాయుక్త వంటి అంబుడ్స్‌మన్ (Ombudsman) వ్యవస్థలను ఏర్పాటు చేసి రాజకీయ నాయకులు మీద నమ్మకం కలిగే విధంగా విధానాలు రూపొందించి ప్రజాస్వామ్య వ్యవస్థలను బలపరుస్తున్నారు. అయితే అభివృద్ధి చెందుతున్న భారతదేశం లాంటి ప్రజాస్వామ్య దేశాలు స్వాతంత్ర్యం వచ్చిన 70సం.లు వరకు కూడా ఇటువంటి వ్యవస్థలను ఏర్పాటు చేయటంలో వెనకఅడుగు వేస్తున్నారు. కాని కొంత మంది మేధావులు మరియు ప్రజల నుండి వ్యతిరేకత వస్తుందన్న భయంతో 2015 సంవత్సరంలో ఇండియాలో లోక్‌పాల్ ఏర్పాటు చేయటం ఒక శుభపరిణామంగా చెప్పవచ్చు.

## 12.13 ప్రశ్నలు :

1. లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు చారిత్రక నేపథ్యాన్ని వివరింపుము.
2. లోక్‌పాల్ వ్యవస్థ ఏర్పాటు మరియు అధికారాలు, విధులు వివరింపుము.
3. లోకాయుక్త వ్యవస్థ ఏర్పాటు అధికారాలు, విధులు వివరింపుము.
4. లోక్‌పాల్ మరియు లోకాయుక్త వ్యవస్థల అమలులో ఎదురయ్యే సమస్యలు వివరింపుము.

## 12.14 చదువదగిన పుస్తకాలు :


1) D.D. Basu - Introduction to the Constitution of India.
2) Granville Austin - The Indian Constitution Cornerstone of a Nation
3) P.M. Bakshi - The Constitution of India
4) H.R. Khanna - Making of India's Constitution.



రచయిత

**డా॥ కె.వి.ఆర్. శ్రీనివాస్**

రాజనీతి శాస్త్ర విభాగం, A.N.U.